ఓం

శ్రీ వేదాన్త బాల బోధము





మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారు
శ్రీవ్యాసాశ్రమము ఏర్పేడు, చిత్తూరు జిల్లా.

శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభ (81) - సిరిసిల్ల లో
తే 3, 4, 5 మార్చి 2007.

ఓమ్

శ్రీ వేదాన్త బాల బోధము

(మూలము అరవము)

ఆన్ధ్రానువాదకులు:
ఉ.పా. కృష్ణయ్యగారు

ప్రకాశకులు :-
శ్రీవ్యాసాశ్రమము
2002

ప్రథమముద్రణ	1946 సం॥	1000 ప్రతులు
ద్వితీయ ముద్రణ	1979 సం॥	1000 ప్రతులు
తృతీయ ముద్రణ	2002 సం॥	1000 ప్రతులు
	మొత్తం	3000

వెల రూ.- 50-00

వెలయువారు:
మేనేజరు - శ్రీ వ్యాసాశ్రమము.
వ్యాసాశ్రమం పోస్టు, (మార్గము) ఏర్పేడు.
చిత్తూరు జిల్లా. (ఆంధ్రప్రదేశ్)-517621.

ముద్రణ :
శ్రీ పారాశర్య ప్రెస్. శ్రీ వ్యాసాశ్రమము.

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ
వ్యాహరన్మామనుస్మరన్ ।

యః ప్రయాతి త్యజన్దేహం
సయాతి పరమాంగతిమ్ ॥

విషయానుక్రమణిక

మొదటి యుపదేశము

గ్రంథముయొక్క నాలుగు అనుబంధముల వర్ణనము

ప్రసంగము	విషయము	పుట.
1.	గ్రంథమంగళము	1
2.	నాలుగు అనుబంధముల వర్ణనము	1
3.	అధికారివర్ణనము	8
4.	నాలుగు సాధనముల పేర్లు	12
5.	వివేకలక్షణము	12
6.	వైరాగ్యలక్షణము	13
7.	షట్సంపత్తుల పేర్లు	14
8.	శమదమముల లక్షణములు	14
9.	ఉపరతి తితిక్షల లక్షణములు	16
10.	సమాధాన శ్రద్ధల లక్షణములు	16
11.	ముముక్షుత్వపు లక్షణము	19
12.	అధికారియందు కర్తవ్యమును గుర్తించుట	20
13.	గురులక్షణము	20
14.	సంబంధ వర్ణనము	21
15.	విషయ వర్ణనము	23
16.	ప్రయోజన వర్ణనము	29

రెండవ యుపదేశము

సామాన్య ప్రశ్నోత్తరముల వర్ణనము

17.	గురుశిష్య సంవాదప్రసంగము	34
18.	శిష్యుడు మోక్షసాధనమును ప్రశ్నించుట	34
19.	గురువు మోక్షసాధనపు ఉత్తరము చెప్పుట	34
20.	మోక్షసాధనమగు జ్ఞానముయొక్క హేతువగు విచారస్వరూప వర్ణనము	36

మూడవ వర్ణనము

21.	ఆత్మ, ఈశ్వరుడు, సృష్టి అనువాని ప్రశ్నోత్తరములు	37
22.	గురువు ఆత్మస్వరూపముయొక్క ఉత్తరము చెప్పుట	37
23.	శిష్యుడు ఈశ్వరుని ప్రశ్నించుట	37
24.	గురువుగారు ఈశ్వరుని నిశ్చయించుట	38
25.	ఈశ్వరుని సృష్టిక్రమము	40
26.	మాయనుండి తన్మాత్రయు, సూక్ష్మప్రపంచమును గలుగుట	40
27.	భూతముల పంచీకరణము; దానినుండి స్థూలదృష్టి కలుగుట	41
28.	మహత్తత్త్వముయొక్క క్రమసృష్టియందు శంక, సమాధానము	43
29.	సమష్టి వ్యష్టి సృష్టియు, విశేషణ ఉపాధియు;	46
30.	విశేషణమును ఉపాధియు పొందుటలు	47
31.	ఆత్మ (కూటస్థుని) యందు విశేషణమును ఉపాధియు పొందుట	48
32.	ఒకే ప్రపంచమునకు విశేషణమును ఉపాధియును	48
33.	జగత్తుయొక్క అధ్యాస (మిథ్యయగు) రూపము	49
34.	జగత్తు నివృత్తియొక్క ఉపాయమునకు ప్రశ్న	60
35.	రెండు విధముల నివృత్తిలక్షణము	61
36.	జగత్తుయొక్క నివృత్తి ఉపాయవర్ణనము	62
37.	బ్రహ్మాత్మ స్వరూప వర్ణనము	62

నాల్గవ యుపదేశము

బ్రహ్మాత్మైక్య సామాన్య నిరూపణము

38.	బ్రహ్మాత్మైక్య విషయశంక	64
39.	గురువుచెప్పిన బ్రహ్మమునందు జీవత్వపు సంభవము	64
40.	జీవస్వరూప వర్ణనము	64
41.	ఉపాధిని విడుచుటచే జీవుని బ్రహ్మత్వము	65
42.	జ్ఞానరూప వర్ణనము	65

ఐదవ యుపదేశము

దేహత్రయ ఆత్మవివేచన వర్ణనము.

43. శిష్యునిచే దేహత్రయాత్మ వివేచనపు ప్రశ్న 66
44. పై ప్రశ్నకు గురువుగారి యుత్తరము 67
45. స్థూలదేహముతో ఆత్మకు గలభేదము 67
46. స్థూలదేహముయొక్క స్వరూపము 70
47. లింగదేహపు స్వరూపము 81
48. లింగదేహముతో ఆత్మకు గల భేదము 82
49. కారణదేహపు స్వరూపమును దాని అనాత్మత్వమును 84

ఆఱవ యుపదేశము

అవస్థాత్రయ ఆత్మవివేచనము

50. శిష్యుడు మూడవస్థలనుగూర్చి ప్రశ్నించుట 86
51. గురువుచే మూడవస్థల పేర్లును వాని అనాత్మత్వమును చెప్పబడుట 87
52. జాగ్రదవస్థా వర్ణనము 87
53. పద్నాలుగు త్రిపుటుల వర్ణనము 89
54. జాగ్రదవస్థయొక్క సామగ్రి 90
55. జాగ్రత్తకంటె ఆత్మయొక్క భేదము 91
56. స్వప్నావస్థయొక్క వర్ణనము 91
57. స్వప్నపు సామగ్రి 92
58. స్వప్నముకంటె ఆత్మకు గల భేదము 92
59. సుషుప్తి అవస్థ వర్ణనము 92
60. సుషుప్తి సామగ్రి 92
61. సుషుప్తికంటె ఆత్మకు గల భేదము 93

ఏడవ యుపదేశము

పంచకోశ ఆత్మవివేచనము

62. శిష్యునిచే పంచకోశములు ప్రశ్నింపబడుట 94
63. గురువుగారు పంచకోశముల పేర్లును రూపమును ఆత్మభేదమును చెప్పుట 94
64. ఆత్మయొక్క విశేషణము 101

ఎనిమిదవ యుపదేశము

మహావాక్యార్థ నిరూపణము.

65. శిష్యునిచే తత్త్వంపదార్థములును వాని అభేదమును ప్రశ్నింపబడుట 103
66. తత్పదార్థ వర్ణనము 103
67. త్వంపదార్థ వర్ణనము 104
68. తత్త్వం పదముల లక్ష్యార్థముల ఏకత్వము 106
69. తత్త్వం పదార్థములకు ఒకదాని కొకటికి గల అన్వయము 106
70. సకలశాస్త్రములసారము (నిష్ప్రపంచ సత్యబ్రహ్మాత్మల ఏకత్వము) 107
71. బ్రహ్మముయొక్క సత్యత్వపు నిరూపణము 108
72. జగత్తుయొక్క మిథ్యాత్వపు నిరూపణము 109
73. తత్త్వంపదార్థ శోధనము, ఐక్యము, సర్వాత్మత్వము 111
74. వేదాంత లక్షణావళి 115
75. గురూపదేశపు సమాప్తి 134
76. వైరాగ్యము, బోధము, ఉపరతి అనువాని హేతువు, స్వరూపము, ఫలము, అవధి 145
77. మోహజిత్తుకథ 147
78. ధీరురాలగు పతివ్రతా వృత్తాంతము 152
79. ఉదారుడు, శూరుడు, విరక్తుడు జ్ఞాని అనువారి ఆశ లేమి 154
80. శిష్యుడు గురూపదేశమును దృఢముగా గ్రహించుట 155

తొమ్మిదవ యుపదేశము

శిష్యుడు తన అనుభవమును బయలుపఱచుట, ఇంటికి పోవుట, సన్న్యాసయోగమును చేకొనుట, అనువాని చెప్పుటతో గ్రంథసమాప్తి పొందుట

81. శిష్యుడు గురూపదేశమును అనువదించుట 156
82. శిష్యుడు తనయనుభవమును చెప్పుట 156
83. గురువునందు తనకంటె వేఱుకాని బ్రహ్మత్వము 157
84. శిష్యుని కృతకృత్యత్వమును, ప్రాప్తప్రాప్యత్వమును 157

85. కృతకృత్యత్వ ప్రాప్తప్రాప్యత్వములచే తృప్తుడయిన శిష్యునిమాటలు 159
86. జ్ఞానముచే హృదయము మొదలగు మూడు గ్రంథుల నివృత్తి 162
87. జీవన్ముక్తియొక్క స్థితి 172
88. మాయ సత్య, అనిర్వచనీయ, తుచ్ఛ అను భేదములచే
మూడు రూపము లగుట 172
89. పరమార్థతను జెప్పుట 174
90. జాగ్రత్‌పదార్థములందు మిథ్యాత్వము 175
91. జ్ఞానికి మూడు దేహములందును జ్వరము లేమి 175
92. ఆత్మయొక్క అకర్తృత్వ, అభోక్తృత్వముల జ్ఞానముయొక్క
గొప్పతనమును; జ్ఞానియొక్క యథేష్టాచరణమున (ఇష్ట
ప్రకారము ప్రవర్తించుట) శంక, సమాధానములు 177
93. నిత్యనివృత్తమగు జగత్తుయొక్క నివృత్తి 182
94. జ్ఞానమునకు పిమ్మట ముందుచేసిన వివేకము వ్యర్థ మగుట 182
95. శిష్యుడు ముందు చెప్పిన అనువాదముతో దనస్థితిని జెప్పుట 183
96. గురుశాస్త్ర ఉపదేశముచే స్వరూపము ప్రకట మగుట 185
97. జ్ఞానమునందు సూర్యుని రూపకము 186
98. జీవునికి ఈశ్వరునితో సంవాదము 188
99. హరి యగు నతడు "దాసోఽహం" అను దానిలో "దా" అను
దానిని అపహరించుట 189
100. అమానియగు జ్ఞానియొక్క బలము 190
101. అహంకారము బుద్ధిం జూచి చెప్పుచున్నది 191
102. బోధముయొక్క ఉపాయ (వైరాగ్య)ము కొఱకు రాజు
యొక్క రూపకము 192
103. ఆత్మబుద్ధుల పతిపత్నీత్వపు రూపకము చెప్పుట 193
104. ఆత్మయొక్క చిద్రూపత్వముయొక్క అనుభవము 193
105. శిష్యుడు మేల్కొనుట సమాధియొక్క ప్రపంచపు ప్రకాశము,
ప్రకాశాభావముల చెప్పుట 194
106. బోధ ఉదయముచేత అవివేకముచే కల్పింపబడిన జగత్తును
గురువును శ్రుతియు నిజముగా కనబడకుండుట 194

107. గీతయందు చెప్పబడిన గుణాతీతుని లక్షణము 195
108. బ్రహ్మముయొక్క స్వయంప్రకాశత్వము 195
109. ఇద్దఱు పండితుల నాలుగు ప్రశ్నోత్తరములు 196
110. కల్పితముయొక్క వాస్తవత్వము కనబడుట 198
111. తత్త్వం పదార్థశోధనమును దాని ఐక్యమును 199
112. ఆత్మయొక్క ప్రకాశరూపత్వము 201
113. ఆత్మయొక్క పరమానందరూపత్వము 201
114. అనేకమతములు చెప్పుటలో శ్రుతిసిద్ధ మయిన ఆత్మ 202
115. మాయయొక్క ఆశ్చర్యరూపత్వము 202
116. జగత్తుయొక్క ఇంద్రజాలత్వము 202
117. ఈశ్వరుడు, గురువు, ఆత్మ-అనువాని ఏకత్వము 203
118. ఈశ్వరుని అభేదముగా భావించుట 203
119. జ్ఞానమందు గురువు, శాస్త్రము, శిష్యుడు-వీరియొక్క
అనుభవము అనువానింగూర్చిన అపేక్ష 206
120. చేసిన మేలు చంపుట (కృతఘ్నత) యను దోషనివృత్తికొఱకు
ఈశ్వరుడు, గురువు, వేదాంతము-వీనియొక్క భక్తి 207
121. శిష్యుడు కృతార్థతతో తనయింటికి బోవుట 208
122. శిష్యుడు ఉత్తమప్రారబ్ధముచే వైరాగ్య పూర్వకముగా
సన్న్యాసము నంగీకరించుట 211
123. హఠయోగమును, మూడువిధములగు రాజయోగమును
సంక్షేపముగా జెప్పుట 211
124. యోగాభ్యాసపు ఫలమును విధితో శరీరము పడుట 221
125. గ్రంథముయొక్క ఫలమగు మోక్షమును జెప్పుట 221

శ్రీబాలబోధానుక్రమణిక ముగిసెను.

శ్రీవ్యాసాశ్రమ సంస్థాపకులు



బ్రహ్మీభూత మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారు

నివేదన

చరాచర సుఖాభిలాషి మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారు తిరుపతి శ్రీకాళహస్తి క్షేత్రాల మధ్య ఏర్పేడు నందిపర్వతం వద్ద శ్రీవ్యాసభగవానుని పేర ఆశ్రమాన్ని నిర్మించడం తెలుగువారి అదృష్టఫల మనక తప్పదు. 1926లో ఈ ఆశ్రమ నిర్మాణం జరిగింది. అప్పటినుండి ఎన్నో లోకోద్ధారక కార్యక్రమాలు వ్యాసాశ్రమంద్వారా నిర్వహింపబడిన విషయం భక్తలోకానికి విదితమే.

శ్రీవారు స్వయంగా శుష్కవేదాంత తమోభాస్కరం మొదలైన 57 గ్రంథాలను రచించారు. పునర్ముద్రణలో లేని ఛాందోగ్యం, బృహదారణ్యకం మొదలైన వ్యాఖ్యానంతో గూడిన ఉద్గ్రంథాలను ముద్రింపజేశారు. ప్రముఖ పండితులచేత సంస్కృతమునుండి మరియు ఇతర భాషలనుండి పలు వేదాంతగ్రంథాలను తెనుగులోకి అనువదింపజేసి ప్రచురించారు. ఈవిధంగా ఆధ్యాత్మిక గ్రంథ ప్రచురణద్వారా శ్రీవారు కావించిన లోకసేవ అత్యద్భుతం.

వేదాంత బాలబోధము అన్న ఈ గ్రంథం వేదాంతతత్త్వాన్ని బాలురకు అర్థమయ్యేటట్లు వివరిస్తున్నది. తమిళంలో ఉండిన ఈ గ్రంథాన్ని శ్రీకృష్ణయ్యగారి ద్వారా అనువదింపజేసి మొదటిసారిగా 1946లో శ్రీవారు ప్రచురింపజేశారు. 1979లో అది పునర్ముద్రణ పొందింది. ఇది తృతీయముద్రణ.

ఇటీవలనే శ్రీవ్యాసాశ్రమ వజ్రోత్సవ శుభసందర్భంలో శ్రీవారు రచించిన 57 గ్రంథాలను "శ్రీమలయాళ సద్గురు గ్రంథావళి" అన్నపేరుతో 10వేల పుటలకు విస్తరించిన 20 సంపుటాలుగా ముద్రించడం అయింది. లోకానుగ్రహకాంక్షతో గురుదేవులు నాడు ముద్రించియుండిన యితర గ్రంథాలనుకూడ యిలా ప్రచురించి భక్తులకు అందజేయ గలిగినందులకు మేమెంతయో సంతోషించు చున్నాము.

శ్రీవ్యాసాశ్రమము — ఇట్లు
23-09-2002 — ప్రకాశకులు

పీఠిక

ఈ "వేదాన్త బాలబోధ"మను గ్రంథము ఈ యుపాధి చిన్నకాలమున జదివి యుండెను. దీనిలోగల విషయములు గ్రహించి యుండిన విచారసాగరము, వృత్తి ప్రభాకరము, అద్వైతసిద్ధి మొదలగు ఉన్నతగ్రంథములలో గల భావములను పదములను సులభముగా అవగాహనము జేసుకొనవచ్చును. అందువలన దీనిని తమిళ (ద్రావిడ) భాషలోనుండి యాంధ్రీకరించిన బాగుండునని తలంపు గలిగియుండెను. అరవములోను, తెనుగులోను పాండిత్యము లేనిచో ఇది సాధ్యమగుపని కాదని తలంచియుండగా ఆశ్రమభక్తులు, ద్రవిడాంధ్ర పండితు లున్ను, వర్తమానమున గుడియాత్తము హైస్కూలులో తెలుగు పండితులుగా నుండు ఉపాధ్యాయుడు కృష్ణయ్యగారు చాల భక్తశ్రద్ధలతో తెనుగున కనువదించి యిచ్చిరి. ఇది వేదాన్త తత్త్వాభిలాషులకు మిక్కిలి యుపయోగపడునని తలంచియే అచ్చు వేయించడమైనది. వేదాన్తవిషయమై హిందీలోను, అరవములోను నుండునన్ని గ్రంథములు తెనుగులో లేవనియే చెప్పవచ్చును. దీనినిబట్టి యాలోచించిన నాంధ్రదేశమున వేదాంత బ్రహ్మనిష్ఠులు పైజెప్పిన దేశములలో నుండునట్లు ఉండకపోవుటయే కారణమని తోచుచున్నది. ప్రస్తుతము పర్యాలోచించిన హిందూస్థానీ, మహారాష్ట్ర, బంగాళ, తమిళదేశములలో గల సాధువుల, సన్న్యాసుల, యోగుల, భక్తుల మఠములు, ఆశ్రమములును ఈదేశములో లేవనియే తోచుచున్నవి. అట్టి కొఱత యిప్పుడిప్పుడు శ్రీరామకృష్ణ మఠమువారియొక్కయు, శ్రీరమణమహర్షి సంఘమువారియొక్కయు, శ్రీ అరవిందయోగి వారిభక్తుల యొక్కయు శిష్య ప్రశిష్యుల యభివృద్ధివలనను గృహాశ్రమములలోను పై జెప్పిన వారలలో సంబంధించిన యనేకులు జిజ్ఞాసువులు, ముముక్షువులును, సాధనపరులును ఏర్పడుటవలనను పై జెప్పిన కొఱత నివృత్తి యగుచున్నది. ఇది యెంతో సంతోషకరము.

మఱియు శ్రీ గాంధీగారియొక్కయు, తదనుయాయుల యొక్కయు నిర్మలమగు సుబోధములవలనను; సత్య, శాంత, దయాదు లభివృద్ధి

పొందుటవలనను; వారి శుద్ధాహారవిహార పవిత్రతవలనను; గీతాపారాయణాదుల వలనను; అన్నిటికన్న ముఖ్యకారణమగు జాతిపిశాచము నుచ్చాటన జేయుట వలనను; సర్వజనసోదరభావ మభివృద్ధిలోనికి వచ్చుటవలనను; ఉన్నతాశయ ముదయ మగుటవలనను పై జెప్పిన కారణము శమించి పోవుచున్నదని సంతసింపదగిన విషయమే.

అరుణోదయము కాగానే చీకటి నశించి యన్నివస్తువులును గనపడునటుల ఈ యాంధ్రదేశమునకున్ను భాగ్యోదయ మగుచున్నది యని తలంపు గలిగి మిక్కిలి యానంద మావిర్భవించుచున్నది. సూర్యు డుదయించునప్పుడు మరల జెప్పవలయునా! అట్టిస్థితియు పుణ్యకాలమున్ను పరమ మహర్షుల కరుణచేత త్వరలో గలుగుగాక! జనులారా! ఆత్మవికాసమున కరుణోదయమైనది. చీకటంతయు నశించినదని చెప్పవచ్చును. అదిగో జ్ఞానభాస్కరోదయ మగుచున్నది. ఇక భయపడనక్కరలేదు. ధీరులు గండు! శూరులు గండు! మంచి సాధకులు గండు! అంతియే చాలును.

మానవుల హృదయము శుద్ధమై బుద్ధి వికసించునప్పుడు జ్ఞాన విజ్ఞానముల వలన వికసించి వచ్చినందుచేతనే జీవరాసులలో కరుణయు, నిమ్నజాతులలో దయయు నావిర్భవించినవి. ఈ రెండింటికిన్ని కారణము శ్రీగాంధీగారి యొక్కయు, తదనుయాయులయొక్కయు పావన ధర్మోపదేశమే యగుచున్నది. కావుననే శాస్త్రములయందు 'అహింసా పరమో ధర్మః' అనియు 'కారుణ్యం పరమం తపః' అనియు ఉద్ఘోషింపబడినది. 'జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే'' అని శ్రీకృష్ణభగవానులు భగవద్గీతయందు ఉపదేశించిరి.

లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు. ఓమ్ తత్సత్.

ఇట్లు మీచరాచర సుఖాభిలాషి

శ్రీమలయాళస్వామి

శ్రీ మలయాళ స్వాముల స్తోత్రము

-: పంచరత్నములు :-

పుణ్యనిలయంబు నేర్పేడు పురమునందు
వెలయు వ్యాసాశ్రమాధిపు ల్విమలమతులు
శమదమాదిక షడ్గుణైశ్వర్యయుతులు
శ్రీ మలయాళసద్గురు జేరికొలుతు. 1

సిరుల కిరవగు నేర్పేడు పురవరమున
నాశ్రితుల గావ నెంతయు నవతరించి
నట్టి శంకరు డననొప్పు నమలమూర్తి
శ్రీ మలయాళస్వాముల చేరి కొలుతు. 2

పరమగు నేర్పేడ్పురమున
తిరముగ సంసారజలధి దీర్పనుగలమై
వరగు మలయాళస్వాముల
వరపదకమలముల కిడుదు వందనశతముల్. 3

చెప్ప జింతింపజాలని శ్రేష్ఠ మగుచు
దివిరి చిన్మాత్రమయి గుణాతీత మగుచు
వరలు సద్గురు మలయాళస్వామి వారి
పదయుగంబుల బ్రార్థించి ప్రస్తుతింతు. 4

ఆశ్రయించెడు జనుల యజ్ఞానములను
దొలగజేయుచు సుజ్ఞాన మలవఱచియు
నెల్లరకు కల్పకంబయి నిష్టపూర్తి
వరలు మలయాళస్వామికి వందనములు. 5



पंडित पीतांबर पुरुषोत्तमजी॥

॥ ॐ तत्सद्ब्रह्मणे नमः ॥

श्रोत्रिय ब्रह्मनिष्ठ गुरु पंडित श्रीपीतांबरजीकृत

बालबोधिनीटीका व टिप्पण तथा संशोधित सार्थक टिप्पणसहित

'अद्वैत वेदान्त'

॥ श्री बालबोध ॥

ॐ श्री शंकराचार्य ॐ

శ్రీ గణేశాయ నమః

వేదాన్త బాలబోధము

మొదటి యుపదేశము

1. మంగళము.

2. నాలుగు అనుబంధముల వర్ణనము.

గ్రంథకర్త మందబుద్ధుల హితముకొఱకు శ్రీబాలబోధమను గ్రంథమును జేయ నారంభించువాడై మొట్టమొదట అద్వితీయ (2వదిలేని) ఆనందరూప బ్రహ్మముయొక్క యథార్థస్వరూప స్మరణరూప (జ్ఞాపకరూప*) మంగళమును జెప్పుచున్నాడు.

అద్వితీయ మపార మానందమగుచు
వేవిధంబగు దుఃఖంబు లేనియదియ
ఉత్తమాచార్యవరులచే నుడువబడుచు
నిశ్చయదృఢానుభవమగు నెఱుకచేత
జ్ఞానవాంఛలు పొందుటకైన దగును.

అర్థము:- ఏది అద్వితీయమును, అనంతమును, సుఖరూపమును నగుచున్నదో యది, యేవిధమగు దుఃఖమునులేని స్వభావముగల వస్తువే

*1. విఘ్నధ్వంసమున కనుకూలమగు వ్యాపారమును మంగళమందురు. విఘ్నమనగా గ్రంథసమాప్తికి ప్రతిబంధకముగా నుండు పాపము, దాని ధ్వంసము అనగా నివృత్తి. అందులో అనుకూలమైనది. ఉపయోగముగల వ్యాపారమనగా మనోవాక్కాయంబులక్రియ. అది మంగళ మనబడును. ఆమంగళము గ్రంథకర్తమనస్సు మొదలగువానిచే చేయబడినదై గ్రంథసమాప్తి నిర్విఘ్నత్వమునకు హేతువగుచున్నది. అయినను గ్రంథకర్తయందుగల నాస్తికత్వముయొక్క భ్రాంతివీడి జిజ్ఞాసువులు గ్రంథమందు ప్రవర్తించుటకొఱకు గ్రంథప్రథమమునను మధ్యమందును అంత్యమందును మంగళము రచింపవలెనని శిష్యుల కుపదేశించుటకొఱకు శిష్టజనుల ఆచారానుసారము (పెద్దలు వర్తించినరీతి) పొందగలిగిన మంగళము ఏదియో యది గ్రంథమందు వ్రాయదగినది యగును. ఆ మంగళము వస్తునిర్దేశరూపము. ఆశీర్వాదరూపము, నమస్కారరూపమను భేదములచే మూడు విధములు. వాని అవాంతరభేదము లిరువదియేడు. వానిలో నిచ్చట నిర్గుణవస్తు నిర్దేశరూప మంగళము వ్రాయబడియున్నది.

(బ్రహ్మమే) ఉత్తమోత్తముడగు ఆచార్యుడు బోధించు సత్యమగు ఉపదేశము చేతను నిశ్చయమగు దృఢానుభవముచేతను జ్ఞానవాంఛగల వారిచే బొందుటకైన దగును.

ఇచట సజాతీయ విజాతీయ స్వగత భేదము లేనిదానిని అద్వితీయ మందురు.

1. సజాతీయ భేదమన - సమానజాతిలోగల భేదము: ఎట్లన బ్రాహ్మణునికి వేఱొక బ్రాహ్మణునితో గలభేదము.

2. అన్యజాతులవారితో గలభేదము విజాతీయభేదము. ఎట్లన బ్రాహ్మణునకు శూద్రాదులతో గలభేదము విజాతీయభేదము.

3. తన అవయవములలో గలభేదము స్వగతభేదము: ఎట్లన బ్రాహ్మణునికి తన అవయవములగు కాళ్లు, చేతలు, తల మొదలగు నవయవములందు గలభేదము స్వగతభేదము అనబడును.

1. అన్నిటికి తానే తానగు (స్వరూపమగు) పరబ్రహ్మము ఒక్కటియై యుండుటచే దానికి సజాతీయమగు వేరుబ్రహ్మము లేదు. బ్రహ్మ చేతనము నందు గనబడు అంతర్యామి, సూత్రాత్మ, విరాట్‌బ్రహ్మ; విష్ణు, శివ అను ఆరంభ భేదములు ఉపాధిభేదముచే నయినవి, స్వరూపముచే గాదు, కాన బ్రహ్మమొక్కటి యే. దేనిచే నొక్కటియో దానిచే నది సజాతీయభేదము లేనిదగును.

2. బ్రహ్మచేతనమునకు వేరైన జడప్రపంచము బ్రహ్మమునకంటె విజాతీయమై కానబడుచున్నది. అది సత్యమైనచో బ్రహ్మమందు విజాతీయభేదము సంభవించును. బ్రహ్మమునకంటె వేరైన జడప్రపంచమన్ననో సత్యము గానిది. అయినను త్రాటియందు పామువలెను, అద్దమందు నగర ప్రతిబింబమువలెను స్వప్నప్రపంచమువలెను బ్రహ్మమందు కల్పింపబడిన దగుటచే మిథ్యయగును. ఏది మిథ్యయగు వస్తువో యది వాస్తవ మగు అధిష్ఠానమునకు వేరుగాదు. కావున బ్రహ్మము విజాతీయభేదము లేనిదగును.

3. బ్రహ్మము నిర్విశేష (విలక్షణత లేని) ఏకరసమై యుండుటంబట్టి దానికి అవయవములు లేవు. సత్తు, చిత్తు, ఆనందము మొదలైనవి బ్రహ్మముయొక్క ధర్మములు. బ్రహ్మముయొక్క అవయవములు గావు అయిన నవి చందనము యొక్క రుచి, వాసన, శీతము అను గుణములను పోలునవి; పుష్పముయొక్క స్పర్శము, రూపము, రసము, గంధము అను గుణములవంటివి, అగ్నియొక్క దాహము, ప్రకాశము అను గుణములను పోలునవి బ్రహ్మముయొక్క స్వరూపమగును. విచారించి చూడగా పరస్పరము బ్రహ్మమునకంటె వేరుగాదు. కావున నవియు బ్రహ్మముయొక్క స్వరూపమే యగును. దేనిచే నవి బ్రహ్మముయొక్క స్వరూపమో దానిచే బ్రహ్మము నిరవయవము. ఇందుచేతనే వానిచేనైన స్వగతభేదమును బ్రహ్మమునందు లేదు. కావున బ్రహ్మము స్వగతభేదమును లేనిదగును.

ఈకారణములచే బ్రహ్మము సజాతీయ, విజాతీయ, స్వగతభేదములు లేనిదగుచున్నది; అందువలన అద్వైత మగును.

బ్రహ్మము దేశకాల వస్తువుల భేదములచే నయిన త్రివిధమగు *2 పారము

---

*2 పారము అంతము పరిచ్ఛేదము అను నీమూడును ఒక్కదానికే పేళ్ళగును. వానిలో అత్యంతాభావమునకు (ఏమియు లేనిదానికి) ప్రతియోగిత ఏదియో యది దేశపరిచ్ఛేద మనబడును. పృథివిమాత్రమందుండు గంధగుణమునకు జలము మొదలగు వానియందు అత్యంతాభావ మున్నది. దానికి ప్రతియోగి గంధగుణ మగును. దానియందు దాని ప్రతియోగిత యున్నది. అది దేశ పరిచ్ఛేద మగును. కావున గంధగుణము ఏకదేశ మందుండునదిగా నుండుటంబట్టి దేశపరిచ్ఛేదము గలదగును.

ప్రాగభావ ప్రధ్వంసాభావముల ప్రతియోగిత ఎయ్యదియో యది కాలపరిచ్ఛేద మనబడును. మన్నుయొక్క కార్యమగు ఘటముయొక్క ఉత్పత్తికి పూర్వము ప్రాగభావమును, ఘటముయొక్క నాశమునకు వెనుక ప్రధ్వంసాభావమును నున్నవి. ప్రతియోగి ఘటము. దానియందు (ఘటమునందు) ప్రాగభావప్రధ్వంసా భావముల ప్రతియోగిత యున్నది. అదియే కాలపరిచ్ఛేద మగును. కావున ఘటము ఉత్పత్తినాశము కలదగుటచే కాలపరిచ్ఛేదము గలదగును.

అన్యోన్యాభావముయొక్క ప్రతియోగిత వస్తుపరిచ్ఛేద మనబడును. ఘటపటముల కొకటికొకటికి గల భేదమగు అన్యోన్యాభావము ఏదియో యద్దానికి ప్రతియోగి ఘటమును పటమును నగును. వానిలో దాని ప్రతియోగిత యున్నది. అది వస్తుపరిచ్ఛేద మగును. ఆ భేదము గల ఘటపటముల వస్తుపరిచ్ఛేదము గలవి యగును.

(అంతము) లేనిది యనెదరు. అపార మనెదరు. మూడువిధము లగు నంతము లేనిది.

1. ఏవస్తువు అన్నిచోట్ల వ్యాపింపక ఏదేని నొకచోట నుండున దగుచున్నదో దానికి దేశముచే నంతము గల్గుచున్నది. కుండ, అంతటను వ్యాపింపక యేదో ఒకచోట నుండునది గావుననే యది దేశమువలన నంతము గలదగుచున్నది.

బ్రహ్మమేదో ఒకచోట నుండునది కాదు. అంతట వ్యాపించి యుండునది. అన్ని చోట్లున్ను బ్రహ్మమున మాయచే గల్పింపబడిన వగును. కావుననే బ్రహ్మమున కుపదేశముచే నంతము లేదు.

2. ఏవస్తువు పుట్టుటకు ముందును, నాశనమునకు వెనుకయును, లేకయుండున దగునో యది కాలముచే నంతము గలదగును. మొట్టమొదటి వస్తువులు పుట్టుటకు పూర్వమును గిట్టుటకు వెనుకయును లేక యున్నవి. కావున నవి కాలమువలన నంతము గలవగును.

బ్రహ్మము చావుపుట్టుకలు లేనిది గావున నిత్యమగును. దేనిచే నిత్యమో దానినే నది కాలమువలన నంతము గలది కానేరదు.

3. ఏవస్తువునకు అన్యవస్తువుతో భేదము ఉన్నదో యది వస్తువుచే నంతము గలదగుచున్నది. ఘటమునకు వస్త్రముతోడ భేదముండుటంబట్టి ఘటమునకు వస్త్రమను వస్తువుచే నంతము చెప్పబడియున్నది.

బ్రహ్మమునందు జడచేతనములగు సర్వవస్తువులును కల్పింపబడినవి. ఏది దేనియందు కల్పింపబడినదో అది దానిస్వరూపమే యగును. మట్టియందు గల్పింపబడిన ఘటము మట్టిస్వరూపమును, బంగారముచే కల్పింపబడిన కుండలము మొదలగునవి బంగారుస్వరూపములే యగును. దానివలెనే సకలవస్తువులును బ్రహ్మమందు కల్పితములు గావున నవి బ్రహ్మస్వరూప మగును. ఇందుచేతనే బ్రహ్మము సర్వాత్మ యగును. బ్రహ్మము సర్వాత్మ మయముగా నుండుటవలన బ్రహ్మమునకు ఒక్కవస్తువుతోను భేదము లేదు. ఎందుచే బ్రహ్మమందు ఒక్కవస్తువుతోను భేదము గలుగదో దానిచే బ్రహ్మమునకు

నొకవస్తువుచేతను నంతము లేదు.

వీనిచే పరబ్రహ్మము దేశకాల వస్తువులచేనైన నంతము లేని దగును. కావుననే అపారము.

ఎక్కువప్రేమకు నేది విషయమో ఇది సుఖమనబడును. దానినే యానంద మందురు. బ్రహ్మము చీమ మొదలు బ్రహ్మపర్యంతముగల సకల ప్రాణులకును నాశించు విషయము లుండుటచే ఇచ్ఛమఱపులగు నిమిత్తములచే నేకాగ్రమగు చిత్తమునందు తన ప్రతిబింబమగు విషయానందమును నిచ్చునదిగను, అన్నిటికిని ప్రత్యగాత్మగా నుండునది యగును. కావుననే యది యెక్కువ ప్రేమకు విషయ (చోటు) మగును. ఇందుచేతనే సుఖరూప మగును.

ఇచ్చట మునుపు చెప్పబడిన ప్రతిబింబమగు విషయసుఖమునకన్న, దానిసాధనమగు గంధము పుష్పము స్త్రీమున్నగు వానికన్నను ప్రియము కలుగుటచే నవియు ప్రియమునకు విషయము లగును. దీనివలననే యవి ప్రియములగు వానిలో స్వరూపసుఖముయొక్క లక్షణముయొక్క అతివ్యాప్తి కలుగునను శంక కలుగును.

దానిని దీర్చుట కొఱకు నా సుఖము దుఃఖసంబంధము లేనిదందురు. ఏ దుఃఖమును లేనిస్వభావము గలది యది యని చెప్పిరి.

1. ముందుచెప్పిన విషయసుఖమును దానిసాధనమును అనంత దుఃఖము లచే మూయబడియున్నవి గావున దుఃఖ సంబంధము గలవిగా నున్నవి. ఈ స్వరూప సుఖమన్ననో అట్టిది కానేరదు. అయినను దుఃఖమును దాని సాధనమును నైన వీటి కల్పితమునకు నధిష్ఠానమై యుండుటచే కల్పిత సర్పముయొక్క సంబంధము లేని రజ్జువువలె అది దుఃఖసంబంధము లేనిదగును. కాబట్టి విషయసుఖమునకున్ను దాని సాధనములకున్ను విలక్షణమై యుండుటచే స్వరూపసుఖమునకు వాటియందు అతివ్యాప్తి కాజాలదు.

2. లేక విషయసుఖముయొక్క సాధనములు తామే ప్రీతికి విషయములు కావు; అయినను విషయసుఖమునకు హేతువు లగుటవలన ప్రీతికి విషయము

లగుచున్నవి. కావున నవి ప్రియమనబడుచున్నవి. విషయసుఖ మేదియో పరమ ప్రీతికి విషయము కానేరదు. అయితే ప్రీతిమాత్రమునకు విషయమగును. కావున ప్రియతర మనబడుచున్నది. స్వరూపసుఖములో, పరమప్రీతికి విషయమగుటచే ప్రియతర మనబడుచున్నది. కావున విషయసుఖముకన్నను దానిసాధనముకన్నను, స్వరూపసుఖముయొక్క లక్షణమునకు అతివ్యాప్తి లేదు. (ప్రీతి, ప్రియము, ప్రేమ ఒకవస్తువు పేళ్లు).

ఇట సుఖమను పదము సత్తు చిత్తు మొదలగు వానికి *3. ఉపలక్షణ మగును. ఉత్తమగురువు అనుటవలన బ్రహ్మనిష్ఠయు శాస్త్రజ్ఞానము గలవాడు అనునది చేకొనబడుచున్నది. సందేహ విపరీతములు లేని దృఢాపరోక్షజ్ఞాన మనుభవ మందురు. సత్యదృఢానుభవమే యెఱుక యనిరి.

ఇట బ్రహ్మము సర్వాత్మమై యుండుటచే దానికి నే ననుపదముయొక్క అర్థమగు ప్రత్యగాత్మతో గొంచెమైనను భేదము లేదు. కావున "నేను సర్వాత్మ యగు బ్రహ్మ" మను నీ గూఢాభిప్రాయము అర్థముచే నెఱుగబడుచున్నది. (గూఢము-రహస్యము) ఇదియే వస్తునిర్దేశరూప మంగళ మగును. దీనిచే నిట బ్రహ్మాత్మైక్యము అను నీగ్రంథవిషయము సామాన్యముగా సూచింపబడినది.

ఇక పై పద్యముయొక్క మొదటిసగముచే జిజ్ఞాసువులకు గ్రంథమునందు ప్రవృత్తి కలుగుటకొఱకు సర్వదుఃఖముల నివృత్తియు పరమానంద ప్రాప్తియు నగు గ్రంథముయొక్క ప్రయోజనమును సూచించువాడై వస్తునిర్దేశరూప మంగళమును సమాప్తి చేసి రెండవ సగముచే గురుభక్తి జ్ఞానమునకు సాధన

---

*3. లక్ష్యముయొక్క యేకదేశమందుండి లక్ష్యమును పూర్తిగ దెలిపించున దేదియో యది ఉపలక్షణ మనబడును. లేక అజహల్లక్షణ (వాచ్యార్థము విడువక దాని సంబంధము గల అధిక అర్థము దెలుపు లక్షణ) అర్థమును దెలుపునది యేదియో యది ఉపలక్షణ మనబడును. ఆ యుపలక్షణముచే దెలుపబడు అర్థ మేదియో యది ఉపలక్షిత మనబడుచున్నది. కాకము దేవదత్తుని ఇల్లు అనుచోట నున్నది. కాకము ఇంటియేకదేశ మందుండి యింటి నంతయు దెలిపించునదియైయున్నది. కావున నది ఉపలక్షణ మగును. లేక ఇట సుఖమను పదము ఏదియో యది అజహల్లక్షణ (విడువని లక్షణ)చే సత్తు చిత్తు మొదలగు అధిక అర్థమును దెలిపించునదియై యుండుటచే వానికి (సత్తు, చిత్తు మొదలగు వానికి) ఉపలక్షణ మగును.

మగుటను సూచించువాడై గురుభక్తిపూర్వకముగ గ్రంథారంభ ప్రతిజ్ఞను చేయుచున్నాడు:-

సకలదు:ఖంబులుం దీర సరస మందు
మహితమానందమదియ మంగళము నగును,
గురువరుపదంబుల నుతించి ధర రచింతు,
బాలబోధంబు బాలురు దెలియునట్లు

అవిద్యయు దానికార్యమునగు సకల అనర్థములును లేని చోటు గలదగు విరోధములేని యానందరూపబ్రహ్మమే (విష్ణు మొదలగు సర్వదేవతలకు అధిష్ఠానమై యుండుటంబట్టి) చెప్పబడు మంగళరూపమయిన దగు బ్రహ్మోపదేశము చేయదగిన కృపానిధి యయిన ఆచార్యుని పాదపద్మములను శిరము నందుంచి (సంస్కృతగ్రంథములను తక్కిన గొప్ప తెలుగు గ్రంథములను నేర నశక్తులగు మందబుద్ధులగు) బాలు రెఱుంగునట్లు బాలబోధమను గ్రంథమును జెప్పుచున్నాను.

వృక్షముయొక్క వేరునందు జలము పోయుటవలన వృక్షపుశాఖలు మొదలగు సకలాంగంబులును దృప్తిబొందుచున్నవి. ప్రాణమునకు ఆహార మొసంగుటచే సకల ఇంద్రియములకును తృప్తి కలుగుచున్నది. అట్లు బ్రహ్మమును స్మరించుటచే సకల దేవతల స్మరణయు కలుగుచున్నది.

గురుభక్తి, జ్ఞానమునకు ముఖ్యసాధన మనునది యిచ్చట సూచింపబడినది.

2. ఇంటికి నాల్గుపాదములును లేక యుండిన నాయిల్లు నిలువని యట్లు సకలగ్రంథములకును నాల్గు అనుబంధములును లేకయుండిన గ్రంథము పూర్తిగలది కానేరదు. వానిని దెలిసిననే గాని వివేకులకు గ్రంథమందు ప్రవృత్తి గలుగనేరదు. కాన గ్రంథారంభమున నాల్గు అనుబంధములును అవశ్యము చెప్పవలసినవి యగును. ఈగ్రంథము వేదాంతముయొక్క ప్రకరణమై యుండుటచే వేదాంతమున కేవి యనుబంధములో యవియే దీనికి నగును. అట్లయినను జిజ్ఞాసువులు తెలియుటకొఱకు నాల్గు అనుబంధములను

సంగ్రహించి చెప్పవలసిన దగును. ఆ యనుబంధముల నిప్పుడు ప్రయోజన పూర్వకముగా జెప్పుచున్నాము.

అధికారి, సంబంధము, విషయము ప్రయోజన మను నీ నాలుగింటికిని అనుబంధ మనిపేరు (తన్ను దెలిసిన పిమ్మట ముముక్షువును గ్రంథముతో బొందించునది యేదియో యది అనుబంధ మనబడుచున్నది) ఈ నాలు గనుబంధములను దెలిసిననేగాని వివేకికి గ్రంథమందు ప్రవృత్తి కలుగనేరదు. ఈ నాలు గనుబంధముల నెఱిగి వివేకి యగువాడు గ్రంథమును జూచును. కావున నీ నాల్గనుబంధములను గ్రంథారంభమం దవశ్యము చెప్పదగిన దగును.

3. అధికారి వర్ణనము.

స్థూలదేహమందు వాతము, పిత్తము, కఫము అను మూడుదోషము లున్నవి. దానిం బోకార్చు నిమిత్తము ధన్వంతరి మొదలగువారు ఆయుర్వేదమును రచించియున్నారు. దానివలెనే అంతఃకరణము నందును 1. మలము, 2. విక్షేపము, 3. అజ్ఞాన మను మూడుదోషము లున్నవి. వానిని బోగొట్టు నిమిత్తము కర్మకాండము, ఉపాసనాకాండము, జ్ఞానకాండమను మూడు కాండములతో గూడిన నాలుగు వేదములను పరమేశ్వరుడు రచించియున్నాడు.

1. మల మనునది పాపమున కయినది. ఆ పాపము జన్మాంతరములందు చేసిన అశుభకర్మముచే గలిగిన అధర్మము. అపూర్వము అదృష్టమను పేళ్ళతో గూడిన సంస్కార (వాసనా) రూపమయి యుండుటచే అతిశయ (అధిక) సూక్ష్మముగా నున్నది. కావున ప్రత్యక్షముగ చూచుటకు కానబడదు. ఐనను అశుభవాసన మూలముగ దాని యనుమానము గలుగుచున్నది.

ఏ పురుషునకు నిషిద్ధకర్మములచేత నైనను విషయములచే నైనను ఇచ్ఛ కలుగుచున్నదో వాని చిత్తమందు అశుభవాసన యున్నది. ఇందుచేతనే వాడు మలదోషముతో గూడిన వాడని తెలియబడుచున్నది: కావున నిష్కామకర్మము నైనను సర్వజీవులయందును దయ నైనను, లేక ఈశ్వరనామ పఠనము మొదలగువాని నైనను జేయవలయును. ఏలయన నిష్కామకర్మముచే నైనను

సర్వభూతముల యందుంచు కరుణచే నైనను ఈశ్వరనామోచ్చారణచే నైనను మలదోషము నివృత్తి యగుచున్నది. వానిలో ఈశ్వరనామమును 4* క్రమప్రకార ముచ్చరించుటేదియో యది పాపము. విక్షేపము, చంచలత అను రెండువిధములగు మలమును నాశము చేయునదియై యున్నది. తక్కిన కర్మము మొదలగునవి - పాపరూపమగు మలమునుమాత్రము నాశముచేయు నవియై యున్నవి.

2. చిత్తముయొక్క చంచలతకు విక్షేపమని పేరు. ఎవనిచిత్తము వేదాంత శ్రవణము మొదలగువాని యందైనను, లేక మహావాక్యార్థమగు స్వస్వరూప మందైనను స్థిరముగాక అన్యవిషయములందు తిరుగుచున్నదో వానిచిత్తము చంచల మగును. ఇందువలననే యాపురుషుడు విక్షేపదోషముతో గూడినవాడని తెలియవలయును. 1. కాబట్టివాడు ఈశ్వర నామోచ్చారణము, లేక *5 అజపా

4*. ఇట ఈశ్వర నామమును జపించు క్రమము 1. సాధువులనింద, 2. అసత్పురుషులవద్ద నామముయొక్క వైభవము చెప్పుట, 3. శివవిష్ణువుల (దానిచే నుపలక్షింప బడిన గణేశ, సూర్య, దేవి అనువాటి) యందు భేదబుద్ధి, 4. వేదవాక్యములందు అశ్రద్ధ (విశ్వాసహీనత) 5. శాస్త్రవచనములందు అశ్రద్ధ, 6. గురువాక్యములందు అశ్రద్ధ, 7. ఈశ్వరనామ మాహాత్మ్యమందు అర్థవాదభ్రమ (యజ్ఞముయొక్క కంబము ఆదిత్యుడట అనునట్టి స్తుతిని తెలిపించుటయను మైకము) 8. నామము సర్వపాపములను బోగొట్టునను బుద్ధిచే నిషిద్ధకర్మల నాచరించుట, 9. గొప్పపుణ్యమును గలిగించునది నామము అను బుద్ధిచే విహితకర్మము చేయక విడచుట, 10. అన్యధర్మములతో నామము సమమగు ననుట - ఈపదియు నామముయొక్క అపరాధములు.

ఈ యపరాధములు పదింటిని విడిచి (1) ప్రాతఃకాలము (2) మధ్యాహ్నకాలము (3) సాయంకాలము (4) మధ్యరాత్రికాలము - అను నీనాల్గుకాలములందును విభజించి, లక్ష మార్లైనను, దానికెక్కువగా నైనను ఈశ్వరనామము నుచ్చరించి దానియందు చిత్తవృత్తిని నిలుపవలెను. ఇది ఈశ్వరనామమును జపించు సామాన్యక్రమము. దీని విశేషక్రమము గురుముఖమున తెలియదగినది.

*5. సోఽహమ్మను మంత్రమును అజపామంత్రములేక అజపాగాయత్రి యనుదురు. దీని జపమును అజపాజప మందురు. దీనిని నాల్గవ టిప్పణిలో జెప్పినట్లు జపించుటయు చిత్తశుద్ధికి హేతువగును. లేక చాలాకాలమువరకు జపించుచుండిన ఎప్పుడు వృత్తి అంతర్ముఖ మగుచున్నదో, యప్పుడు శ్వాసము బైటవచ్చునపుడు సకారము (సో అనుదాని)ను శ్వాసము
cont...

మంత్రోచ్చారణము, ఈశ్వరమూర్తిధ్యానము, లేక నిర్గుణ బ్రహ్మమును చింతించుటయును అను నీ మొదలగు ఉపాసనలను జేయవలయును. ఏలన ఉపాసనచేత చిత్తముయొక్క ఏకాగ్రత గలిగి విక్షేపదోషముయొక్క నివృత్తి కలుగుచున్నది.

2. లేక శరీరము, వాక్కు, మనస్సు ధనమనువానిచే ఈశ్వరునియందు బుద్ధి గలుగునట్లు చేయబడు బన్ధము లేని *6. గురుసేవ యేదియో దానిచే కర్మోపాసనలు లేకయే చిత్తశుద్ధియు, ఏకాగ్రతయు గలుగుచున్నవి.

లోపల ప్రవేశించునపుడు హకారమును (హం అనుదాని) ధ్యానించవలెను. ఇది అజపాగాయత్రి యగును. దీనికి ముఖ్యముగా నివృత్తిపరుడగు సన్న్యాసియే అధికారి. ఇది సోపాధికధ్యానము. దీనియందుండి సకారహకారములను హల్లుల నెత్తివేయగా మిగిలిన ఓం అను అక్షర మేదియో దాని ఉపాసన నిరుపాధిక మగును, సోऽహం ఓం అను రెండు పదములకును అర్థము. ప్రత్యగాత్మమున కభిన్నమైన బ్రహ్మము ఒక్కటియే. అది శుద్ధమైన దగుటచే నిరుపాధిక మగును. ఎనను ఓమను నక్షరమునందు సకారహకారమను ఉపాధుల చేరికచో సోऽహం అనుపదము కలుగుచున్నది. అది సోపాధిక మనబడుచున్నది. ఓంకారముయొక్క ఉపాసనక్రమము ఓంకారమను గ్రంథమందును, అట్లే స్వబోధసుధాకర మందును విస్తారముగా వ్రాయబడియున్నది. దానిని దెలియగోరువారు అందు జూడదగినది.

6*. ఇట ఇది రహస్యము:- ఈశ్వరసేవచేనైన పుణ్యముయొక్క యుత్పత్తి మూలమున అదృష్ట ఫలప్రాప్తి కలుగుచున్నది. ఈశ్వరబుద్ధిచే జేయబడిన గురుసేవచే పైజెప్పిన అదృష్టఫలప్రాప్తియు, గురువు ప్రసన్నతయు దాని మూలమున ఉపదేశరూపమగు దృష్ట (ప్రత్యక్ష) ఫలప్రాప్తియు గలుగుచున్నది. ఆ (గురు) సేవ శరీరము, మనస్సు, వాక్కు, ధనమను వాటి నర్పణము చేయుట గలుగుచున్నది.

గురునాజ్ఞను పరిపాలించుట శరీరార్పణము. గురువు నందీశ్వరభావమును అతనిరూపమును ధ్యానించుటయు మనస్సుయొక్క అర్పణము. గురువును నిందింపక స్తుతించుట వాగర్పణము. గృహస్థుడగు గురువునందు సకల ధనము నర్పణము చేయుట లేక సన్న్యాసియైన గురువు ప్రసాదముకొఱకు సర్వధనమును విడుచుట (ధనార్పణము). దయగల యొకానొక గురువు పైజెప్పిన సేవలేకయే ప్రసన్నుడై ఉపదేశము చేసినను చిత్తశుద్ధి గల అధికారికి శుభము గలుగును. వానిలో శరీరము, వాక్కు, ధనము - అనువాని యర్పణరూప గురుసేవచే మలదోష నివృత్తియు; మనస్సుయొక్క అర్పణరూప గురుసేవచే విక్షేపదోష నివృత్తియు గలుగుచున్నవి.

(3) లేక యెవనికి మందజిజ్ఞాసవలనను (జ్ఞాన ఆశ వలనను) *7 వేదాంతశ్రవణముచే నైనను అభ్యాసముచేనైనను ప్రీతిపూర్వకముగా పరబ్రహ్మమునందు ప్రవృత్తి గలుగుచున్నదో వానికి కర్మోపాసనలు లేకయే చిత్తశుద్ధియు ఏకాగ్రతయు కలుగుచున్నవి. ఎలయన "శ్రద్ధ భక్తి గురుసేవ అనువానితో వేదాంతమును వినుటవలన ప్రతిదినమును 80 కృచ్ఛ్రచాంద్రాయణ ములయొక్క ఫలము కలుగుచున్నది." అనుటవలన పాపమగు మలము నివృత్తి యగుటతో చిత్తశుద్ధియు గలుగుచున్నది. దీర్ఘకాలము నిత్యము నెడతెగక ఆశతో వేదాంతశ్రవణాభ్యాసముచే దృష్టాంతము, ఇతిహాసము మొదలగువానిచే నాటకమును జూచుటవలన నెట్లు వినోదము కలుగుచున్నదో యట్లు బుద్ధికి వినోదము కలుగుచున్నది, ఇందుచే విక్షేపమగు మలముయొక్క నివృత్తి పూర్వకమగు చిత్తముయొక్క యేకాగ్రత కలుగుచున్నది యనుట అభిప్రాయము.

3. బ్రహ్మమగు ఆత్మను నేను దెలిసికొనలేదను *8 వ్యవహారమునకు ఏది హేతువో యది *9 అజ్ఞానము. ఎవని చిత్తమునందిట్లు కనబడుట

7*. ఇట ఇది రహస్య మగును:- ఎవనికి దృఢజ్ఞానము గలిగియున్నదో వానికి జేయవలసిన దొకటియు లేదు. ఎవనికి తీవ్రజిజ్ఞాస (జ్ఞానమున ఆశ గలిగియున్నదో లేక మందజ్ఞానము గలిగియున్నదో వానిచే శ్రవణాదులు చేయదగిన వగును. కర్మోపాసన చేయవలసినది లేదు. ఏ సుబుద్ధికి మందజిజ్ఞాసచే వేదాంతశ్రవణమున ప్రవృత్తి కలుగుచున్నదో వానిచేతను శ్రవణము చేయదగును. ఎవనికి మందజిజ్ఞాస యుండియు వేదాంతశ్రవణమున ప్రవృత్తి కలుగలేదో వానిచే నిష్కామకర్మయు ఉపాసనయు చేయదగిన వగును. ఎవనికి వైరాగ్యలేశము లేమింజేసి మందజిజ్ఞాసయు లేదో వానికి సకామకర్మోపాసనలు చేయదగిన వగును.

*8. చెప్పుటను కనబడుటను వ్యవహార మందురు.

*9. ఆవరణశక్తి విక్షేపణశక్తులు గల అనాది అనిర్వచనీయ భావరూపము అజ్ఞానపదార్థ మగును. బ్రహ్మమును ఆత్మను కప్పియుంచుట ఆవరణ మగును. ఇట్టిశక్తి ఆవరణశక్తి యగును. ప్రపంచమును, దానిజ్ఞానమును విక్షేపమగును. దానిని గలిగించు సామర్థ్య మేదియో యది విక్షేపశక్తి యగును. ఉత్పత్తిలేని దానిని అనాది యందురు. ఘటము మొదలగు కార్యముల ప్రాగభావమును బోలె అజ్ఞానమునకు ఉత్పత్తి లేదు. కాన యది (అజ్ఞానము) అనాది యగును. సత్తు అసత్తునకు విలక్షణమై (బాధించదగిన స్వరూపము గలదిగా) ఉండుటచే అజ్ఞానము

cont...

కలుగుచున్నదో వాడజ్ఞాని. వానికి తత్త్వజ్ఞానమును సంపాదించుట తగినదగును. ఏలన తత్త్వజ్ఞానముచేత అజ్ఞానము నివర్తించుచున్నది. తక్కిన సాధనములచేత నివర్తించుట లేదు. అయితే యాతత్త్వజ్ఞానము అధికారికి దొరకును. ఆయధికారి యెవడన:- ఎవని కీజన్మమందైనను, జన్మాంతర మందైనను చేసిన నిష్కామకర్మ, ఉపాసనలచేత మల విక్షేపదోషములు నాశమై మూడవది యగు అజ్ఞానదోషము మిగిలి యున్నదో, వివేకము మొదలగు నాల్గుసాధనములు గలవో - యాపురుషుడు ఈగ్రంథమునకును, ఈగ్రంథ విచారమూలకముగ ఆత్మజ్ఞానమునకును, ఆత్మ జ్ఞానమూలకముగ మోక్షమునకును అధికారి యగును.

4. నాలుగు సాధనముల పేళ్ళు

మొదటిది వివేకము; రెండవది విరాగము; మూడవది షట్సంపత్తి; దీనిని జిజ్ఞాసు వగువాడు ధరించి నాల్గవదగు ముముక్షుతను ఆశించును. ఇవి నాల్గుసాధనములు అగును.

5. వివేకలక్షణము (1)

ఆత్మ నిత్యమును (అవినాశియును), క్రియ లేనిదియును (అచలమును) నయియున్నది. జగము అనిత్యమును (వినాశియు), చలమై (క్రియ గలదై) యున్నది - అని తెలిసికొని పాలు నీరు వేరుచేయు హంసమువలె సారమైన ఆత్మను అసారమైన అనాత్మను దృఢముగా విచారింపవలెను (వేరుచేయ నేర్వవలెను). అదియే వివేకము - ఇట్లు మనస్సున నిశ్చయము చేయుము.

సంశయము:- వివేకకాలమందు "జగము అనిత్యము అనగా మిథ్యఅని యెప్పుడు తెలియబడెనో, అప్పుడు మరల ప్రపంచబంధముకొఱకు గల ఉత్తర

అనిర్వచనీయ మగును. దీనినే మిథ్య యందురు. ఉన్నది యను వ్యవహారమునకు నేది హేతువో యది భావరూప మగును. ఎందుచే అజ్ఞానము జగమునకు ఉపాదాన మగుటచే ఉన్నది యను వ్యవహారమునకు హేతు వగుచున్నదో దానిచే నది భావరూప మగును. అనిర్వచనీయమై యుండి ఏది భావరూపమై యున్నదో యది అనిర్వచనీయ భావరూప మనబడును. ఈయజ్ఞానమునే కారణదేహము, అవిద్య మొదలగు పేళ్ళచే చెప్పుచున్నారు.

(వెనుకటి) సాధనములతో గూడిన జ్ఞానమున కేమి ప్రయోజన మున్నది?

సమాధానము:- వివేకకాలమున శాస్త్రముచేతను, యుక్తిచేతను, పరోక్షముగ జగత్తును మిథ్య యని తెలిసికొన్నప్పుడును, అపరోక్షముగ మిథ్య యని తెలిసికొన లేదు. కావున ప్రపంచ అపరోక్షబాధముకొఱకు ఉత్తరసాధనముతో గూడిన జ్ఞానముచే ప్రయోజనము కలుగుచున్నది.

6. వై రా గ్య ల క్ష ణ ము.(2)

"అర్జునా! బ్రహ్మలోకము మొదలు సర్వలోకములును పునరావృత్తి (తిరిగివచ్చుట) గలవని" భగవానుని వాక్యముండుటం జేసి, ఈ లోకము మొదలు బ్రహ్మలోకము పర్యంతమగు సకలలోకముల భోగమును, ప్రమాణయుక్తులచేత తన చిత్తమందు అనిత్య మని యెఱింగి వానిని కాకి మలమువలె చిత్తము నందుండి విడిచిపెట్టవలెను. ఇట్లు దోషదృష్టిచేత ఇహలోక పరలోక భోగములపై ఆశను విడుచుట ఏదియో యది వైరాగ్యమని తనబుద్ధియందు తలంపుము.

ఇట కాకిమలమును జేకొనున దేదియో యది మలముయొక్క మల రూపము నుండుటం బట్టి మిక్కిలి విసుగు(దోషదృష్టి) విషయమగు ననుదానిని గుర్తించుట కొఱకగును.

ఇట ఇదివిశేషము:- విడచిన యిచ్ఛకు, లేక యిచ్ఛ లేకుండుటకు వైరాగ్యమని పేరగును. ఆ వైరాగ్యము (1) యతమానము (2) వ్యతిరేకి (3) ఏకేంద్రియము (4) వశీకారమను బేదములచే నాల్గు విధములు

1. మందవిరాగమునకు యతమాన మనిపేరు.

2. నాకులియొక్క (ముంగిస పారలిన మూలిక) ఆశ్రయముచేత, సర్పముతో యుద్ధము చేయు నకులము (ముంగిస) వలె సత్సంగముయొక్క ఆశ్రయముచే దుర్గుణముల విడుచుటయందును సద్గుణముల చేకొనుట యందును గలుగు ఉత్సాహ మేదియో యది వ్యతిరేక మగును.

3. ఇంద్రియములను అణచుటయగు దమమునకు ఏకేంద్రియ మనిపేరు.

4. మనస్సు నిగ్రహమగు శమమునకు వశీకారవైరాగ్య మనిపేరు. అందు వశీకారవైరాగ్యము 1. మందము 3. తీవ్రము 3. తీవ్రతరము - అని మూడు విధములు.

1. పుత్రుడు, ద్రవ్యము మొదలగువాని నాశముచే "ఛీ! యిదేమి సంసారము" అని కలుగు క్షణికబుద్ధివృత్తి మందవైరాగ్యము.

2. ఈలోకములోని పుత్రుడు మొదలగు సంబంధమగు సుఖమందిచ్ఛ లేని దేదియో యది తీవ్ర వైరాగ్య మగును.

3. పునరావృత్తి గలవని తెలిసి సర్వలోకముల యిచ్ఛను విడుచుట తీవ్రతర వైరాగ్య మగును. వానిలో జ్ఞానమునకు కారణమై యున్న తీవ్రతరమును ముముక్షు వగువాడు *10 సంపాదింపవలెను.

7.షట్సంపత్తుల పేళ్ళు:- (3)

శమము, దమము, ఉపరతి, తితిక్ష, సమాధానము, విశ్వాసము (శ్రద్ధ)- అను నీ యారింటిని పండితులు షట్సంపత్తి యందురు.

8. శమ దమముల లక్షణము (1-2)

1. విషయవాసన బలముచే ఉన్మత్తమగు మనస్సను ఏనుగు ఏదియో, దానిని విషయములలో అత్యంత దోషదృష్టి రూపమగు అంకుశముచే జయించుట (స్వాధీనము చేసికొనుట) శమము అని తెలియునది.

2. శబ్దము మొదలగు నైదు విషయముల రూపమగు మార్గమందు ప్రీతి గల యింద్రియముల సముదాయరూపమగు గుఱ్ఱము లేవియో, వానిని విషయము

---

*10. మందతీవ్రవైరాగ్యములందును ఇహలోకపరలోకముల యిచ్ఛ అంతర్గతమై (అణగి) యున్నది. అది జ్ఞానముయొక్క ప్రతిబంధక మగును. తీవ్రతర వైరాగ్యమందు ఇహపరలోకముల యాశయను ప్రతిబంధకము లేదు. కావున నది జ్ఞానమునకు సాధన మైనదై యుండుటవలన జిజ్ఞాసు వగువాడు దానిని సంపాదించుట యుచిత మగును.

లందు దోషదృష్టిపూర్వకముగా శాస్త్రచింతనాదిరూప జాటిచే జయించుట దమ మని తెలియదగినది.

ఇట, ఇది రహస్యము:- శరీరము రథము, దానికి ఇంద్రియములు గుఱ్ఱములు, మనస్సు కళ్ళెము, బుద్ధి సారథి, ఆ రథమందుండు ఆత్మ రథికుడు.

(1) ఏరథికుని బుద్ధి యను సారథి, ప్రమాదముచే మఱచినవాడై యున్నాడో వాని యింద్రియములగు గుఱ్ఱములు కుమార్గమందు (చెడు త్రోవయందు) బోవుచున్నవి. ఆ రథికుని నరకము మొదలగు దుఃఖరూపమగు గోతియందు త్రోయుచున్నవి.

(2) ఏరథికుని బుద్ధియగు సారథి అప్రమాది (మఱుపు లేనివాడై) యైయున్నాడో, వాని యింద్రియములగు గుఱ్ఱములు సన్మార్గమందు పోవుచున్నవి. ఆ రథికుని స్వర్గము మొదలగు రూపమగు, లేక మోక్షరూప మగు నింట చేర్చుచున్నవి.

ఎందుచేత నిట్లున్నదో, దానిచే ముముక్షువునకు తనబుద్ధిరూప సారథి ఇష్టప్రకారము నడచుట, ఇష్టప్రకారము మాట్లాడుట, ఇష్టప్రకారము భుజించుట అనుప్రమాదమును బోకార్చి దానిమూలమున ఇంద్రియములను గుఱ్ఱములను సన్మార్గమున బొందించుట తగినదగును.

ఇట బుద్ధి యగు సారథిని వశము చేయుట- శమము, ఇంద్రియములగు గుఱ్ఱములను వశముచేయుట-దమము నగును. కావున సారథి అధీనమున గుఱ్ఱములును, గుఱ్ఱముల అధీనమున సారథియు నుండునట్లు బుద్ధికిని ఇంద్రియములకును నొకదానికొకటి అధీనత యున్నది. కావున ముందు చెప్పిన శమదమములు ఒకదానికొకటి సాపేక్షమగును. ఇట్లు *11 షట్సంపత్తి పూర్తిగ నొకదానికొకటి సాపేక్షకత గలదగుటచే నొకసాధనముగా తలంపబడి యున్నవని తెలియదగినది.

---

*11. షట్సంపత్తియగు సమాధులు ఒకదానికొకటి తోడగుటను. విచారసాగరము మొదటి తరంగము టిప్పణిలో జూడుము.

9. ఉపరతి తితిక్షల లక్షణములు. (3-4)

3. (ఇల్లు ఇల్లాలు పుత్రుడు ధనము మొదలుగా మునుపే చిక్కినవగు విషయములందు దోషదృష్టిచే మలమందైనను, వాంతియందైనను నిచ్చ లేకయుండుటవలె; ఇచ్ఛ లేకయుండుట వైరాగ్య మగును. ఈవైరాగ్యము కలిగిన పిమ్మట ముందుండు విషయముల విడుదల యగు సన్న్యాసము కలుగు చున్నది.) ఆవైరాగ్యముకు విలక్షణమై ముందు విడువబడి మరల వచ్చి చేరునట్టి విషయములు విడిచిన మలమువలె నైనను, వాంతివలె నైనను త్యాగముచేయుట (అంగీకరించక యుండుట) అనగా మరల దానియందు ఇష్టము కలుగక యుండుట యేదియో దానిని వైరాగ్యముయొక్క ఫలమగు ఉపరతి యందురు.

4. శ్రవణాదులను సాధించునపుడు, వానికి విరోధము అగు శీతము, ఉష్ణము (ఆకలిదప్పులు, సుఖదుఃఖములు, లాభనష్టములు) మున్నగు ద్వంద్వధర్మముల సహించుటను సాధువులు తితిక్ష యందురు.

ముందు చెప్పబడిన తితిక్షను విడచి ద్వంద్వధర్మముల విడుచుటయందు తత్పరుడై యుండు ముముక్షువునకు వేదాంతశ్రవణము మున్నగు వానియందు వ్యవధానము (అంతరాయము=మఱచుట) కలుగును. కావున తితిక్షయున్ను శ్రవణమున కుపయోగముగా నుండుటచే శ్రవణమునకు సాధనమైన దగును. ఇట్లు తక్కిన వివేకము మొదలగునవియు శ్రవణమునకు సాధనములని తెలియునది.

10. సమాధాన శ్రద్ధల లక్షణము (5-6)

5. బ్రహ్మమగు లక్ష్యమందు చిత్తము ఏకాగ్రముగా (తత్పరముగా) నుండుటను సమాధాన మందురు.

6. వేదాంతశాస్త్ర వచనమందును, గురువాక్యమందును గలుగు విశ్వాసము (ఆస్తిక్యము=నమ్మిక) ఏదియో యది శ్రద్ధ యగును. పూర్వము ఉపాసనచే గలుగు చిత్తైకాగ్రత ఏదియో యది సగుణబ్రహ్మమందైనను లేక దానిని దెలుపు (గుర్తించు)

ప్రతిమ మొదలగు వానియందైనను గలుగునది యగును. ఇట చెప్పిన చిత్తైకాగ్రత, నిర్గుణబ్రహ్మమందు చిత్తము తత్పర మగుట యగును. ఇవి వాని భేదములు?

ఇట షట్సంపత్తులమధ్య క్రమను కడపట చెప్పుటలో అభిప్రాయము ఇది: వృక్షపుఫల మేదియో యది యంతమందు (కడపట) కలుగుచున్నది. కావున వృక్షమందు సర్వాంగములలో ఫలము శ్రేష్ఠమగును. ఇందుచేతనే అది ముఖ్యమైనది యాయెను. అట్లు జ్ఞానముయొక్క సాధనములగు వివేకము, వైరాగ్యము, శమము మొదలగున వన్నిటియందును శ్రద్ధ శ్రేష్ఠ మగును. ఇందుచే నది ముఖ్యమైనది. కావున, నది కడపట చెప్పబడియున్నది.

ఫలముయొక్క యుత్పత్తికి పిమ్మట ఫలపరిపాకావస్థ కలుగునట్లు శ్రద్ధయుత్పత్తికి పిమ్మట ముముక్షుత్వము కలుగుచున్నది. కావున ముముక్షుత్వము, శ్రద్ధయను ఫలముయొక్క పరిపాకావస్థ యగును. ఇందుచేతనే యది శ్రద్ధకు వెనుక చెప్పబడినది.

ఇట ఇది రహస్యము:- శాస్త్రము, గురువు మున్నగువాని వాక్యములందు కలుగు శ్రద్ధ యనునది, ఈశ్వరుడు గురువు మొదలగువారి యందలి భక్తి లేక కలుగదు. ఎవని చిత్తమున మొదట ఈశ్వరుడు, గురువు, తక్కిన ఋషులు, మునులు బ్రహ్మనిష్ఠులున్ను - వీరియందు పూజ్యులను (పూజింపదగిన వారను) బుద్ధి(ప్రీతిరూపమగు) భక్తి గలుగుచున్నదో; వానికే వేదము మొదలగు శాస్త్రములందును గురువు మొదలగువారి వాక్యములందును భక్త్యనుసారముగా (ఎట్లు భక్తియో అట్లు) శ్రద్ధ కలుగుచున్నది.

కావున భక్తి యనునది జ్ఞానమునకును, జ్ఞానముయొక్క సర్వసాధనముల కును ముఖ్యకారణ మగుచున్నది. ఇందుచేతనే శ్రద్ధ *12. భక్తిపూర్వకముగా నుండుటచే సర్వసాధనములందును ముఖ్యమగు సాధనము నగును.

ఇచ్చట ఇది రూపకము:-

---

*12. ఇచ్చట "భక్తి పూర్వకమను" పదమునకు భక్తియను విత్తుతో కూడినదని యర్థము.

1. మోక్షసాధనముల సంపత్తి (పొందుట) వృక్ష మగును.

2. దానికొఱకు నిష్కామకర్మ మొదలగు ప్రయత్నములచే జేయబడిన శుద్ధచిత్తము నేల యగును.

3. ఈశ్వరుడు, గురువు మొదలగు వారిపై భక్తి విత్తన మగును.

4. మందవివేకము మొలక యగును.

5. దృఢవివేకము అడగుమ్రాను(బోదె).

6. వివిధమగు వైరాగ్యము శాఖలగును.

7. శమము మొదలగు నైదు సాధనములు పుష్పముల గుత్తులు.

8. గురువాక్య శ్రవణము దానిమీద కలుగు *13 మగవృక్షపు సంయోగ మగును.

9. *14 శ్రవణ మనన నిదిధ్యాసనములు మొదలగు నన్యసాధనములు ఆ పండ్ల సంపత్తగును

10. శ్రద్ధ పండ్లగును.

11. ముముక్షుత్వము పండ్ల పరిపాకదశ యగును.

12. జ్ఞానము ఆ పండ్లరస మగును.

13. ఆపండునందును నిష్ప్రయోజనమగు భక్తియను బీజమున్నది.

---

*13. నిష్ఫల వృక్షమును మగవృక్షమనియు, సఫల వృక్షమును ఆడు వృక్షమనియు చెప్పుదురు. ఆరిపెల్లి, త్రాటి మొదలగు కొన్ని ఆడు వృక్షములమీద ఎప్పుడు మగవృక్షముల లేక దానిపుష్పముల సంయోగము కలుగుచున్నదో అప్పుడు అవి ఫలించుచున్నవి. ఇది లోక ప్రసిద్ధము.

*14. శ్రవణము - జలము విడుచుట, మననము - సంశయము మొదలగు కలుపు తీయుట, నిదిధ్యాసనము - కావలి, వానిచే భేదవాది - పామర పురుషుడు కామము- మొదలగు పశుపక్షులనుండి కాపాడుట, పదార్థశోధన ఎండినశాఖ మొదలగు చెత్తలను తీయుటయగును. ఈ మొదలగునవి కల్పింపదగినవి.

ఆ పండుయొక్క జ్ఞానమను రసమేదియో యది శ్రద్ధ యను పండుయొక్క యధీనమగును. ఏలయన ముందుచెప్పిన శ్రద్ధయను పండు ఎండిపోయిన, జ్ఞానమనురసమును ఎండును, గాన జ్ఞానమను రసము శ్రద్ధ యను పండుయొక్క యధీన మగును.

ఆపండును *15 భుజించుట మూలమున *16 దాని రసమున్ను కడుపున నెలకొనును. కావున జీవించి యుండుదనుక విద్వాంసుల చిత్తమున శాస్త్ర గురువాక్యములచే నిశ్చయింపబడిన యర్థమునందు స్వభావమగు శ్రద్ధ యుండును. అంతదనుక జ్ఞాననిష్ఠయు నుండును.

ఆపండును అనభిజ్ఞుడు (జ్ఞానము లేనివాడు) అగు పురుషుడు భక్తి యను రుచిగల విత్తుయొక్క యపేక్షతో భక్షించుచున్నాడు. వానికి అధికరుచి కలుగుట లేదు. అభిజ్ఞ (జ్ఞానముగల) పురుషుడు భక్తి యను విత్తుతోను, జ్ఞానమగు రసము తోను నాపండును భుజించుచున్నాడు. వానిచే దాని అధికరుచి ననుభవించు చున్నది.

ఈ విధముచే ముందు చెప్పిన శ్రద్ధయను ఫలమునకు జీవన్ముక్తి రుచి యగును. విదేహముక్తి, దానిచేనైన ఆకలిని నివర్తించుట తృప్తి యగును.

11. ముముక్షుత్వముయొక్క లక్షణము (4)

ఆకలి గల పురుషుడెట్లు అన్నమును ఆశించుచున్నాడో; అట్లు మోక్షము యొక్క తీవ్రమయిన యిచ్ఛ యేదియో - దానిని పండితులును, సద్గుణులగు మునిశ్రేష్ఠులును (సన్న్యాసులగు ఆచార్యులు) ముముక్షుత్వమని చెప్పుదురు.

చెప్పబడిన ముముక్షుత్వము, సర్వసాధనములకు ముందుగా మంద రూపముగా కలుగుచున్నది. ఏలయన, "ప్రయోజన మనుద్దిశ్య నమందోఽపి ప్రవర్తతే" ప్రయోజనము నుద్దేశింపక మందుడును ప్రవర్తించుట లేదు - అను

*15. విచారముచేత - ధారణమూలముగా, అనగా తాత్పర్యముచే నిశ్చయింపబడిన నిష్ఠమూలముగా.

*16. శాస్త్రగురువాక్యములచే నిశ్చయింపబడిన పరమార్థమగు అద్వైత, అర్థమందు.

న్యాయముచే మోక్షమగు ఫలముయొక్క యిచ్ఛలేక, నిష్కామకర్మ మొదలగు సాధనము లందు నొకనికిని ప్రవృత్తి కలుగనేరదు. కాబట్టి మంద ముముక్షుత్వము సకల సాధనములకు మొదట కలుగుచున్నది. అయిన నది తీవ్రముగా లేదు.

తక్కిన సాధనములు సిద్ధించిన పిమ్మట తీవ్రముముక్షుత్వము కలుగుచున్నది. అదియే, గురువును శరణుపొందుట యనునది ముందుగల శ్రవణము మొదలగు వెనుకటి సాధనముల ప్రవృత్తికి హేతు వగుచున్నది.

12. అధికారియందు కర్తవ్యమును గుర్తించుట

ఇట్లు చెప్పబడిన అధికారి యెవడో వాడు సద్గురువు చరణములందు తలవంచి *17 విధిప్రకారము శరణుజొచ్చును.

"తద్విజ్ఞానార్థం సద్గురుమేవాభిగచ్ఛేత్సమిత్పాణిః
శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం ।"
శాన్తో దాన్తస్తితిక్షుః శ్రద్ధాన్వితః సమాహితో
భూత్వాఽఽత్మన్యేవాత్మానం పశ్యేత్ ॥

ఆబ్రహ్మమును దెలిసికొనుటకొఱకు అయ్యధికారి, సమిత్పాణియై (పత్ర పుష్ప ఫలాదులు గైకొన్నవాడై), శాంతము (శమము) గలవాడై, దమము తితిక్ష శ్రద్ధ గలవాడై, సమాధానముతో గూడినవాడై; శ్రోత్రియుడును (శ్రుతిదెలిసినవాడు), బ్రహ్మనిష్ఠుడును నైన గురువునే పొంది బ్రహ్మమయిన యాత్మయందే కూటస్థుడం త్మను ఏకరూపముగా జూచునుగాత" అను శ్రుతిచేత.

13. గురులక్షణము

1. బ్రహ్మనిష్ఠా మార్గముయొక్క అనుభవము గలవాడై, మార్గమును జూపు పురుషునివలె బ్రహ్మమునందు నిష్ఠ గలవాడై.

*17. ఇచ్చట గురువును శరణుపొందు విధమును దెలుపు శాస్త్రవచనము విధి యనబడును. ఈ "విధిప్రకారము" అను శబ్దముయొక్క అర్థము దానివలె నగును. (దాని ననుసరించి) గురువును శరణుచొచ్చు క్రమముపై రెండవ ఉపదేశమున 17 వ విషయమున వ్రాయబడెను.

2. శ్రోత్రియుడై (మార్గముయొక్క గుఱుతులను దెలిసి, మార్గమును జూపు పురుషునివలె శ్రుతుల అర్థమును దెలిసినవాడై.)

శరణుపొందిన • శిష్యునకు మార్గమును జూపు పురుషునివలె అద్వైత బ్రహ్మమును నుపదేశించు వాడెవడో అతడే శ్రీమంతుడగు బ్రహ్మవిద్య యగు లక్ష్మినిగల గురుదేవు డగును.

కావున శరణుబొందిన శిష్యుడు, ఆ గురువునకు నెప్పుడును సేవ చేయవలెను.

జ్ఞానమునకు పూర్వము చేయు ఈశ్వర, గురు, వేదాంత, శాస్త్రముల సేవయైనది జ్ఞానము సిద్ధించుట కొరకగును. జ్ఞానము కలిగిన పిమ్మట చేయునట్టి నీ మూటియొక్కసేవచే, మేలును మఱచుట అనుదోషము పోవుటకొఱకగును. ఈయభిప్రాయముచేతనే ఇచ్చట ఎప్పుడును సేవచేయవలయు ననునది చెప్పబడినది.

14. సంబంధ వర్ణనము (2)

ఈగ్రంథము బ్రహ్మముయొక్క ప్రతిపాదకము (బ్రహ్మమును చెప్పునదియు) ను, బ్రహ్మ మీగ్రంథముచే ప్రతిపాద్యమును (చెప్పబడునదియు) నగును.

ఈరెంటికిని నొకదానికొకటి ప్రతిపాద్య ప్రతిపాదక భావరూప సంబంధము ప్రసిద్ధముగా నున్నది.

1. ప్రతిపాదనము చేయున దేదియో యది ప్రతిపాదక మనబడును. ఈగ్రంథము బ్రహ్మమును ప్రతిపాదనము చేయునదియై యుండుటచే ప్రతిపాదక మగును.

2. ఏది ప్రతిపాదనము చేయబడుచున్నదో యది ప్రతిపాద్య మనబడును. బ్రహ్మము ఈగ్రంథముచే ప్రదిపాదనము చేయబడుటచే ప్రతిపాద్య మగును.

ఇది మొదలగు మరియు ననేకవిధ సంబంధములను చెప్పుదురు. వానిని విస్తరించుననను భయముచే వ్రాయక విడిచితిని.

ఇచ్చట సంబంధమగు అనుబంధమును కల్పించుటకు ఇది ప్రయోజన మగును. ఏవస్తువునకు దేనితో సంబంధ మున్నదో, యా వస్తువునకు దానియం దుపయోగ మున్నది. కుమ్మరి మొదలగువారికి కుండతో సంబంధ మున్నది. అందుచేవారు ఘటమునం దుపయోగపడుచున్నారు. ఏవస్తువునకు దేనితో సంబంధము లేక యున్నదో, యావస్తువునకు దానియందు ఉపయోగము కలుగుట లేదు. నేత్రమునకు వాయువుతోను, ఆకాశముతోను సంబంధము లేదు. కావున నేత్రమునకు వాయువునందును ఆకాశమునందును ఉపయోగము కలుగుట లేదు. అట్లు గ్రంథమునకును బ్రహ్మమునకును పరస్పరము (ఒకటికొకటి) సంబంధము లేకున్న గ్రంథమునకు బ్రహ్మమందును బ్రహ్మమునకు గ్రంథమందును ఏయొక్క యుపయోగమును సిద్ధింపదు. కావున, పరస్పర ముపయోగము పరస్పరమందు నిశ్చయించుటకొఱకు వానిసంబంధము కల్పింపబడియున్నది. ఇట్లు తక్కిన సంబంధము లందును దెలిసికొందురు గాత! తండ్రికి పుత్రుడు జన్యుడగుటచే పితకు తన జన్యమైన పుత్రునితో జన్యతా సంబంధ మున్నది. అట్లు గ్రంథమునకు, బ్రహ్మము ప్రతిపాద్యమై యుండుటం జేసి గ్రంథమునకు తన ప్రతిపాద్యమైన బ్రహ్మముతో ప్రతిపాద్యతా సంబంధ మున్నది. పుత్రునికి పిత జనకుడై యుండుటచే పుత్రునికి తన జనకుడైన పితతో జనకతా సంబంధ మున్నది. అట్లే బ్రహ్మమునకు గ్రంథము ప్రతిపాదక మగును; అందుచే బ్రహ్మమునకు తన ప్రతిపాదకమైన గ్రంథముతో ప్రతిపాదకతా సంబంధ మున్నది.

ఎట్లు పితకు పుత్రునికి నొకరికొకరికి జన్యజనకతా రూపసంబంధ మున్నదో అట్లు గ్రంథమునకును బ్రహ్మమునకును నొకదానికొకటి ప్రతిపాద్య ప్రతిపాదకతా రూపసంబంధ మున్న దనునది సిద్ధించినది.

15. విషయవర్ణనము(3)

జీవబ్రహ్మైక్యము, ఈగ్రంథమునకు విషయ మగునని పండితులు వేద మను సముద్రమును చిలికి నిశ్చయించియున్నారు.

ఇచ్చట "జీవుడు" అను శబ్దముచే జీవనపదమునకు లక్ష్యార్థమైన కూటస్థ ఆత్మ యను జీవసాక్షిచే కొనబడుచున్నది.

ఇచ్చట ఇది శంకా సమాధానములగు విశేషఅర్థ మగును.

శంక:- బ్రహ్మాత్మైక్యము ఈగ్రంథమునకు విషయమని చెప్పినది పొసగదు. ఏలననగా సకలశరీరము లందును ఆత్మ యొకటియై యుండెనేని దానికి, ఏకమైన బ్రహ్మముతో నైక్యము సంభవించును. ఎందుచే సకల శరీరములందును ఆత్మ యొకటిగాక అనేకములై యున్ననో, అందుచే దానికి ఏకమగు బ్రహ్మముతో నైక్యము పొసగదు.

సమా:- సర్వశరీరములందును ఆత్మ అనేకములై యున్నది అను అర్థమందు ఒక్క *18 ప్రయాణము నుండదు.

1. అజ్ఞానులకు ఇంద్రియమగు ప్రత్యక్షప్రమాణముచే *19 భేదము కనబడుచున్నదో, యాభేదస్ఫురితము, దేహమును విషయముచేయున దగును. ఆత్మను విషయముచేయునది కాదు, ఏలయన ఆత్మశ్రుతికి వేరైన ప్రత్యక్షము మొదలగు ప్రమాణములకు విషయము కానిదై యుండుటచే.

---

*18. యథార్థ అనుభవమును ప్రమయందురు. ప్రమయొక్క కరణమును ప్రమాణమందురు. ఆప్రమాణము:- ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము, అర్థాపత్తి, అనుపలబ్ధి అను భేదములచే నారువిధము లగును.

*19. అన్యోన్యాభావమును భేదమందురు. ఒకదానియందొకటి లేకయుండుట అన్యోన్యాభావ మందురు. ఘటమందు పటాభావమును, పటమందు ఘటముయొక్క అభావమును వాని అన్యోన్యాభావ మగును. అదియే వాని భేద మగును. ఆ భేదము సజాతీయ భేదము, విజాతీయభేదము, స్వగతభేదమని మూడువిధములు. అది ఈగ్రంథముయొక్క మొదటి పదార్థమందు ఉదాహరణముతో వ్రాయబడియున్నది.

కావున సకలశరీరములయందును ఆత్మ వేరువేరు కాదు. అయిన ననేకఘటము లందుండు ఆకాశము వలె సర్వశరీరములందును ఆత్మ యొక్కటియే యగును. అందుచే దానికి ఒక్కటియైన బ్రహ్మముతో నది యైక్యము పొందును.

శంక:- "ఆత్మ వేరువేరనుటలో నొక్క ప్రమాణమున్ను లేదు - అని (సిద్ధాంతియైన) తాము చెప్పినది పొసగదు. ఏలయన ఆత్మ వేరువేరను అర్థము నందు ప్రత్యక్షాది ప్రమాణము లన్నియు ఇట్లు (ఈవిధముగా) సిద్ధించుచున్నవి.

౧. ఎక్కడెక్కడ అహం ప్రత్యయముయొక్క (నే నను వృత్తియొక్క భేదమున్నదో అక్కడక్కడ ఆత్మకు భేదమున్నది).

(అ) ఎందుచేత ఒక్కొక్క దేహమునందును "నేను బ్రాహ్మణుడను, నేను క్షత్రియుడను" అను నీవిధముగా అహంప్రత్యయముయొక్క భేదము ప్రత్యక్షముగా గనబడుచున్నదో.

(ఆ) సర్వదేహము లందును ఆత్మ యొక్కటియై యుండునేని 'నీవు' "నేను" 'ఇది' అని నీ మున్నగు వ్యవహారములకు లోపము కలుగును. దానివలన ఆత్మయొక్క భేదమునందు *20 ప్రత్యక్షప్రమాణ మున్నది.

౨. ఎందుచే ఆత్మకు భేదము లేకయుండిన "నీవు, నేను, ఇది" అను మున్నగు వ్యవహారము సిద్ధింపదో, అందుచేత వ్యవహారసిద్ధి భేదము లేక సంభవింపక పోవుటవలన ఆత్మయొక్క భేదమందు *21. అర్థాపత్తి ప్రమాణమున్ను సిద్ధించుచున్నది.

---

*20 ప్రత్యక్షప్రమయొక్క కరణము (సాధనరూప పంచేంద్రియములు) ప్రత్యక్ష ప్రమాణ మనబడును.

*21 ఒక పుష్టిగల పురుషుడు పగటియందు భుజించుట లేదు. అచ్చట రాత్రిభోజనము లేక పుష్టి (లావు) సంభవింపదను జ్ఞానముచేత రాత్రి భుజించునను కల్పన కలుగుచున్నది. ఇచ్చట భోజనము లేక పుష్టి సంభవింపదను జ్ఞానము అర్థాపత్తిప్రమాణము. అజ్ఞానముచే గలుగు రాత్రిభోజనపు కల్పన యేదియో యది అర్థాపత్తిప్రమ యగును. దీనికి అనేక భేదము లున్నవి.

3. (1) ఆత్మ యేదియో యది యొక్కొక్క శరీరమునందును భిన్నభిన్న మగును. శరీరరూపవ్యక్తులు భిన్నములుగా నుండుటచే, గోవు (ఆవు) మొదలగు పశువులవలె,

(2) ఆత్మ యేదియో యది ఒక్కొక్క శరీరమునందును భిన్నభిన్నముగానే యున్నది. ఒక్కొక్క శరీరమందును అహం ప్రత్యయముయొక్క భేదముండుట వలన, ఘటాదులను వలె నవి మొదలయిన *22 అనుమాన ప్రమాణములును ఆత్మయొక్క భేదమందు సిద్ధించుచున్నవి.

4.(1) "అతిథి దేవుడు, గంధర్వుడు, మనుష్యుడు, పితృదేవత, అసురుడు"- అని యీలాగున దేవతలు మొదలగు వారి భేదము ప్రతిపాదించు శ్రుతులును,

(2) "దేవుడు, దానవుడు, గంధర్వుడు, యక్షుడు, రాక్షసుడు, కిన్నరుడు"- అను మొదలగు పురాణవచనములును, ఆత్మభేదమందు *23. ప్రమాణము లగును.

5. సిద్ధాంతీ! తామెప్పుడు ఆత్మైక్యమును అంగీకరించుచున్నారో అప్పుడు మీయొక్క వేదాంత సిద్ధాంతమునందు, సుఖము, దుఃఖము మొదలగు వానికి వ్యవస్థ సిద్ధింపదు. ఏలన,

(అ) ఒకడు దుఃఖి లేక సుఖియైన అందఱు దుఃఖులు లేక సుఖులు అగుదురు.

(ఆ) ఆత్మకు ఏకత్వ ముండిన సకలజనులు సర్వజ్ఞు లగుదురు. అందుచే

---

*22. లింగముయొక్క జ్ఞానముచే గలుగుజ్ఞానము అనుమితిప్రమ యగును. దానిసాధనమగు లింగముయొక్క జ్ఞానమేదియో యది అనుమానప్రమాణము. పర్వతమందుండు పొగయును అగ్నియొక్క లింగము గలది. దాని (లింగపు) ప్రత్యక్షజ్ఞానముచే నీకొండ అగ్నికలదియను నిశ్చయమైన పరోక్షజ్ఞానము గలుగుచున్నది. అట పొగజ్ఞానము అనుమానప్రమాణము. దానిచే గలుగు అగ్నిజ్ఞానము అనుమితిప్రమ. దీని విశేషక్రమము వృత్తిరత్నావళియందు వ్రాయబడి యున్నది.

*23. శాబ్దప్రమయొక్క కరణమయిన శబ్దప్రమాణ మగును.

విధినిషేధరూపము లగు శాస్త్రములు వ్యర్థ మగును. సర్వజ్ఞులను బట్టి విధి నిషేధములు లేకపోవుటవలన,

(ఇ) ఒకడు బంధము గలవాడైన యెడల అందఱు బద్ధు లగుదురు. లేక యొకడు ముక్తుడైనచో నందఱు ముక్తు లగుదురు.

కావున ఆత్మ అనేక మనునది ప్రమాణసిద్ధ మగుచున్నది.

సమా:- ప్రతివాది ఆత్మ అనేక మనుటలో నీవు చెప్పిన ప్రత్యక్షము మొదలగు ప్రమాణములు సంభవింపవు. ఏలయన

1. వ్యాప్తియొక్క వ్యభిచారమువలన ప్రత్యక్షప్రమాణము సిద్ధింపక పోవుటవలన

(అ) "ఎక్కడెక్కడ అహంప్రత్యయముయొక్క భేదమున్నదో అక్కడక్కడ ఆత్మకు భేదమున్నది" అను నియమ(కూడ గలుగు) మగు వ్యాప్తి యేదియో యది వ్యభిచారమును (వేఱగుటను) బొందుచున్నది. నేను శిశువు, నేను కుమారుడు, నేను యువకుడ, నేను వృద్ధుడ నని యీలాగు శిశుత్వము మొదలగు అవస్థల భేదములచే అహంప్రత్యయమునకు భేదమున్నను శిశుత్వము మొదలగు అవస్థలు గల అహంప్రత్యయార్థమగు ఆత్మకు భేదము కానబడకుండుటచేతను; ఆత్మకు భేదముండిన బాల్యావస్థ మొదలు వృద్ధావస్థవఱకు చేసిన కార్యముల జ్ఞాపకము సంభవింపక పోవుటవలనను, ఆత్మయొక్క భేదమందు ప్రత్యక్ష ప్రమాణము సిద్ధింపదు.

(ఆ) ఎట్లు ఒకేశరీరమందు అవయవముల భేదములను నాశ్రయించి తల,కాలు, చేతులు అను మొదలగు వ్యవహారములు కలుగుచున్నవో; అట్లు శరీరము లన్నిటియందును ఆత్మ యొక్కటియై యుండియు, శరీరభేదమును నాశ్రయించి "నీవు, నేను, ఇది" అను మొదలగు వ్యవహారములు సిద్ధించుచున్నవి.

౨. ఆ వ్యవహారము ఆత్మభేదమును అపేక్షించుట లేదు. ఇట్లు వ్యవహారము సిద్ధింపగానే ఆత్మభేదము, లేకవ్యవహారము సంభవింప దనుట లేదు. కావున

ఆత్మభేదమందు **అర్థాపత్తి** ప్రమాణమున్ను సిద్ధింపలేదు.

3\. శరీరమగు వ్యక్తులభేదముచేతను, అహంప్రత్యయముయొక్క భేదముచేతను ఆత్మకును భేద మున్నదను అనుమానప్రమాణమున్ను సిద్ధింపదు. ఏలయన స్థూల, సూక్ష్మ, కారణమను మూడు దేహములకును; జాగ్రత్స్వప్న దేహములకును భేదముండియు అహం ప్రత్యయముయొక్క అర్థమగు ఆత్మకు భేదము లేనందున,

౪.(౧) ముందు చెప్పిన శ్రుతి ఆత్మోపాధియగు దేవాది దేహముల భేదమును జెప్పుచున్నది; ఆత్మభేదమును గాదు. ఎందుకన సకలదేహములందును చైతన్యము ఏకరూపముగా నుండుటచే ఆత్మకు భేదము సంభవింపదు, కావున ముందు చెప్పిన శ్రుతి శరీరభేదమును ప్రతిపాదించుటయందు తాత్పర్యము గలది యగును. ఆత్మభేదమును ప్రతిపాదించుటయందు తాత్పర్యము గలదికాదు అనునది సిద్ధించుచున్నది. అట్లే,

(2) ముందు చెప్పిన పురాణవచనమును దెలిసికొనునది.

4. (1) ప్రతివాదీ! ఆత్మాభేదమైతే సుఖదుఃఖములు మొదలగువాని వ్యవస్థ సిద్ధింపదని నీవు చెప్పినదియు పొసగదు. ఏలయన ఆసుఖదుఃఖముల వ్యవస్థ ప్రారబ్ధకర్మముల అధీనమై యుండుటచేతను, ఒకేదేహమున కర్మభేదముచే సుఖదుఃఖములు మొదలగువాటి *24 విచిత్రస్వభావము కనబడుటచేతను, సుఖ

---

*24. ఇచ్చట ఇది రహస్యము:- ఒక దేహములోనో ఆత్మయొకటే, ఒప్పుకోవలసినదే యగును. అట్లే పాదమందు కలుగు బాధను శరీరమంతయు అనుభవించుట లేదు. పాదమందుమాత్ర మనుభవించుచున్నాడు. దానివలె శిరమునందు కలుగు సుఖమును శరీరమంతటియుం దనుభవించుట లేదు. శిరమునందుమాత్ర మనుభవించుచున్నాడు. ఎప్పుడు ఒక దేహమందును కర్మభేదముచే సుఖదుఃఖముల విలక్షణతానుభవము కలుగుచున్నదో, అప్పుడు భిన్న భిన్న శరీరముల కర్మభేదముచే సుఖదుఃఖముల విచిత్రానుభవము కలుగుచున్న దనుటలో చెప్పవలసిన దేమున్నది? ఇది కైముత్యక న్యాయము. ఇట్లు చెప్పుటచే సర్వశరీరము లందును ఎప్పుడు ఆత్మ ఒక్కటియై యున్నదో అప్పుడు ఒకశరీరక్రియ సకలశరీరము లందును కలుగవలయునను శంకకు సమాధాన మగుచున్నది. ఏలయన, ఎప్పుడు ఒకేశరీరమందు

(cont...)

దు:ఖములు పుణ్యాపాపముల కార్యమై యుండుటచేతను, వానికి భేద ముండుటచేతను చిదాభాసునితో గూడిన అంత:కరణమగు భోక్తయొక్క భేద ముండుటవలనను, సుఖము దు:ఖము మొదలగువాని వ్యవస్థ సంభవించుచున్నది.

(2) ప్రతివాదీ! ఆత్మ ఒక్కటియే అయిన సకలజనులును సర్వజ్ఞు లగుదురు, అందుచే విధినిషేధ రూపశాస్త్రములు వ్యర్థము లగును అని నీవు చెప్పినదియు పొసగదు, ఎందుకనగా,

ఎక్కడను ఎప్పుడును ఆత్మయే యెఱుగునది యైనను ఉండి ఆయా దేహములు ఆయా బుద్ధిని గొనియే యెఱుగుచున్నవి. ఎందువలన దేహభేదముచే, బుద్ధిభేదము నియమితమై యున్నదో అందుచే నొక్కొక్క దేహమందును జ్ఞానముయొక్క భేదమున్నది. లేక యెందుచేత, వస్తువు తెలియబడుచున్నదో అట్టి బుద్ధివృత్తియైన జ్ఞానము పరిచ్ఛిన్న మగును, కావున నేత్రమునకువలె తనసంబంధము గల వస్తుమాత్రమును ప్రకాశింపజేయు బుద్ధివృత్తికి సకలపదార్థములతో సంబంధము పొసగుట లేదు. దానికన్ని పదార్థములతోను సంబంధముండిన యెడల సర్వజనులును సర్వజ్ఞు లగుదురు. ఎందుచే బుద్ధివృత్తికి సకలపదార్థములతోను సంబంధము లేదో అందుచే సకలజనులకు సర్వజ్ఞత్వము సిద్ధించుట లేదు.

లేక శబ్దముయొక్క ఉత్పత్తికి హేతువైన వ్యాపకమైన ఆకాశ మేదియో దానికెచ్చటను భేరిమర్దళము మొదలగువానితో సంబంధ మున్నను ఎచ్చట దండము మున్నగు వానిచే భేరి మున్నగువానికి తాడనము (కొట్టుట) కలుగు చున్నదో, అచ్చోటనే శబ్దముయొక్క ఉత్పత్తి కలుగుచున్నది. మరి ఎచ్చటను కలుగుటలేదు. దానివలెనే ఏకమైన పరిపూర్ణ ఆత్మయొక్క జ్ఞానముగూడ ఎచ్చట బుద్ధివృత్తికి పదార్థముతో సంబంధము కలుగుచున్నదో! అచ్చోటనే ఉదయించు

శ్రోత్రము, త్వక్కు మొదలగు ఇంద్రియముల క్రియ భిన్నభిన్న మగుచున్నదో, ఒకదానిక్రియ వేఱొకదానిచే గాకపోవుచున్నదో, ఇట్లు క్రియయొక్క విలక్షణత యున్నదో, యప్పుడు భిన్న భిన్న శరీరముల, క్రియయొక్క విలక్షణతనము కలుగుచున్న దనుటలో నేమి చెప్పవలసియున్నది?

చున్నది. తక్కినచోటుల ఉదయించుట లేదు. కాబట్టి బుద్ధివృత్తులు అనేకములై యుండుట చేతను అవ్యాపకముగా నుండుటచేతను సకలజనులకు సర్వజ్ఞత్వము సంభవింప దనునది సిద్ధించినది.

అల్పజ్ఞ జనులయొక్క ప్రవృత్తినివృత్తులకు హేతువగు విధినిషేధరూపమగు శాస్త్రములు ప్రయోజనము కలవియే యగును.

(3) ప్రాణులకు సర్వజ్ఞత్వము లేకుండుటచే, వేదాంతశ్రవణ జన్యజ్ఞానముచే, ప్రత్యగభిన్న పరబ్రహ్మమును స్వస్వరూపముగ ఎవడు *25 ఎఱుగుచున్నాడో, వానికే ముక్తి కలుగుచున్నది. తక్కినవానికి కలుగుట లేదు. అందుచే బంధమోక్షముల వ్యవస్థయు పొందుచున్నది. ఈవిధముచేతనే ఆత్మయొక్క ఐక్యమునందు ముందుచెప్పిన దోషములకు అవకాశము లేదు. కావున బ్రహ్మ, ఆత్మ, ఐక్యమగు (బ్రహ్మాత్మైక్య) మగు నీ గ్రంథముయొక్క విషయ మేదియో యది యనేకయుక్తి ప్రమాణములచే సిద్ధమగుచున్నది.

16. ప్రయోజన వర్ణనము. (4)

అవిద్యయు, దాని కార్యమగు స్థూలసూక్ష్మ ప్రపంచమును, దాని ధర్మమగు జననమరణములు మొదలగు సంసారము నగునవన్నియు దుఃఖమునకు

---

*25. ఇచ్చట ఎవడనునది అంతఃకరణమునందు చేతనవు ప్రతిబింబుడైన చిదాభాసుడు. అయిన (1) బ్రహ్మమైన ఆత్మను నేనెఱుగను అను నజ్ఞానమును (2) ఆత్మలేదు, కనబడుటలేదు అను రెండువిధముల ఆవరణమును (3) స్థూలసూక్ష్మ ప్రపంచముతో గూడిన చిదాభాసుడను వాని ధర్మములగు పుట్టుక మొదలగునవి, ఆకలి మొదలగునవి, చూచుట మొదలగునవి, కర్తృత్వము మొదలగునవి- అనునవియు, వాని అవస్థలగు జాగ్రత్త మున్నగునవియు; వాని జ్ఞానమునగు- ఈమొదలగు సంసారమగు విక్షేపమును, (4)"బ్రహ్మమున్నది" అను పరోక్షజ్ఞానమున్ను, (5) నిష్ప్రపంచమగు బ్రహ్మమునను అపరోక్షజ్ఞానమును, (6) అధిష్ఠానబ్రహ్మమగు నాయందు పరమార్థసత్తున్ను ప్రపంచమునకు మూడుకాలములందును అత్యంతాభావ మున్నది. వ్యావహారిక లేక ప్రాతిభాసికసత్తచేత కనబడుచున్న ప్రపంచమునకు మిథ్యాత్వ మున్నది అను నిశ్చయమైన విక్షేపనాశమును(7) పరమానందమగు బ్రహ్మభావప్రాప్తిచే అత్యంతహర్ష (సంతోష) మయిన నీయేడు అవస్థలును చిదాభాసుని దగును. వానిలో నజ్ఞాన మున్నది. కావున నదియును చిదాభాసుని అవస్థ యగును.

హేతువులై యుండుటచే ననర్థ మనబడును. వాని అత్యంతనివృత్తియు పరమానందమునైన బ్రహ్మ మేదియో దాని ప్రాప్తియే ఈగ్రంథమునకు పరమప్రయోజన (ఫల) మగును.

౨. ఆ పరమప్రయోజనమునకు సాక్షాత్సాధన మయిన, దృఢజ్ఞాన మేదియో యది ఈగ్రంథమునకు, అవాంతర ప్రయోజన మనబడుచున్నది.

(౧)ఏ ఫల ప్రాప్తియొక్క యిచ్ఛ పురుషునికి కలుగుచున్నదో యది పరమప్రయోజన మగును.

(౨)పరమప్రయోజనమునకు సాధన మేదియో యది యవాంతర ప్రయోజన మగును.

ఇచ్చట నిది సంశయము:- సర్వానర్థముల నివృత్తియును, పరమానంద ప్రాప్తియునైన మోక్ష మేదియో, యది జ్ఞానముచేత జన్యమా? (కలిగినదా?) లేక అజన్యమా? జన్యమనిన, మోక్షమునకు అనిత్యత్వము కలుగును. అజన్యమనిన జ్ఞానము లేకయే సకలపురుషులును ముక్తులు గావలెను. కావున సాధనమగు జ్ఞానమును సంపాదించుట వ్యర్థ మగును.

సమా:- వ్యావహారిక రజ్జువు నందుండు ప్రతిభాసిక సత్త గల సర్పమేదియో, దానికి తన యధిష్ఠానమగు రజ్జువునందు, పారమార్థికసత్త యొక్కయు లేక వ్యావహారికసత్త యొక్కయు మూడుకాలములందును, నే యత్యంతా భావ మున్నదో, యది యా సర్పముయొక్క నిత్యనివృత్తి యగును. అదియే విషయరూపనివృత్తి యనియు జెప్పబడును. ముందు చెప్పిన నిత్యనివృత్తిరూప ప్రాతిభాసిక సర్పమేదియో యది నిత్యనివృత్తి యనబడును. తన యధిష్ఠానమగు రజ్జువుయొక్క యపరోక్షజ్ఞానము గలిగిన వెనుక "రజ్జువునందు సర్పమునకు మూడుకాలములందును అత్యంతాభావము, లేక మిథ్యాత్వ మున్నది" అనురూపమునకు ముందే సిద్ధించిన, విషయీరూప నిత్యనివృత్తియొక్క నిశ్చయమైనచో ఏ పాతము కలుగుచున్నదో, యాబాధచే పరమార్థ సత్తనైనను, లేక వ్యవహారసత్తచే నైనను సర్పముయొక్క మూడుకాలములందును లేనిదానిని,

విషయము చేయునదిగాను ప్రాతిభాసికసత్తగాను, సర్పముయొక్క మిథ్యాత్వ మును విషయము చేయునదిగా నున్నది.

ఆ నిశ్చయ స్వరూపమయిన వృత్తిజ్ఞానమైన బాధయే నిత్యనివృత్తమయిన సర్పముయొక్క నివృత్తిరూపముగా నున్నది. అదియే విషయిరూప నివృత్తియనియు జెప్పబడును. ఇట్లు నిత్యనివృత్త మయిన సర్పనివృత్తి కలుగుచున్నది. దానివలె సృష్టి దృష్టి (మూడుసత్తలు గల) వాదముయొక్క క్రమమున వ్యావహారిక సత్తను గలదియు దృష్టి సృష్టి (రెండుసత్తలు గల) వాదముయొక్క క్రమమయిన ప్రాతిభాసిక సత్తను గలదియునైన సర్వానర్థరూపమైన అజ్ఞానమును, దానికార్యము నయిన ప్రపంచ మేదియో యది పరమార్థ సత్తనుగల బ్రహ్మమునందు అధ్యస్తమై యున్నది. కావున దానికి తన అధిష్ఠానమగు బ్రహ్మమునందు శ్రుతియుక్తుల చేతను, విద్వాంసుల అనుభవముచేతను నిశ్చయింపబడిన పరమార్థసత్తచే మూడుకాలము లందును ప్రపంచముయొక్క అత్యంతాభావ మున్నది. అది యా ప్రపంచ నిత్యనివృత్తి యగును. అదియే విషయరూపనివృత్తి యనియు జెప్పబడును.

ముందు చెప్పిన నిత్యనివృత్తిగల వ్యావహారిక, లేక ప్రాతిభాసిక ప్రపంచ మేదియో, యది నిత్యనివృత్త మనబడును. అధిష్ఠానమగు బ్రహ్మముయొక్క దృఢఅపరోక్ష జ్ఞానమునకు పిమ్మట "బ్రహ్మమునందు ప్రపంచమునకు మూడు కాలము లందును అత్యంతాభావము, లేక మిథ్యాత్వ మున్నది" యను రూపము గలది యగు, మునుపే సిద్ధించియుండు, విషయరూపమగు నిత్యనివృత్తియొక్క నిశ్చయమైనచో ఏ బాధ కలుగుచున్నదో యా బాధము పరమార్థసత్తచే ప్రపంచము యొక్క మూడు కాలములలో లేకుండుటను విషయము చేయునట్లును, వ్యావహారిక లేక, ప్రాతిభాసిక సత్తచే ప్రపంచముయొక్క మిథ్యాత్వమును విషయము చేయునదిగా నున్నది. ఆ నిశ్చయ స్వరూపమయిన వృత్తిజ్ఞానమగు బాధయే నిత్యనివృత్తి ప్రపంచనివృత్తిరూప మగును. అదియే విషయరూప నివృత్తి యనియు జెప్పబడుచున్నది.

ఇచ్చట ఇది వివేక మగును:- విషయ, విషయీ భేదముచే నివృత్తి రెండు విధములుగా నున్నది. ఘటమునువలె నైనను, లేక రూపమువలె నైనను,

ప్రకాశముయొక్క మునుపే సిద్ధించియుండు నివృత్తి యేదియో, యది విషయరూప నివృత్తి యనబడును. ఇట్లు అధిష్ఠానజ్ఞానముచే మునుపే సిద్ధించియుండు ప్రపంచమునకు, మూడు కాలములు లేకుండుట లేక, మిథ్యాత్వ మున్నది. దీపమును వలెనైనను లేక నేత్రమును వలెనైనను, మునుపే సిద్ధించియుండు విషయరూపమగు నివృత్తిని ప్రకాశింపజేయు వృత్తిజ్ఞాన మేదియో యది విషయి రూప నివృత్తి యనబడును. ఇట్లు పూర్వసిద్ధ నిత్యనివృత్తియొక్క నిశ్చయ జ్ఞాన మయినచో బాధ యున్నది. ఈవిధములచే అనర్థపు విషయరూప నివృత్తి యేదియో, యది జ్ఞానమునకు మునుపే సిద్ధించి యుండుటచే నిత్య మగును. దానిచే మోక్షముయొక్క మొదటి యంశము అనిత్య మగునను ప్రసంగము లేదు. విషయిరూప నివృత్తియయిన వృత్తి జ్ఞానమేదియో యది అధిష్ఠాన జ్ఞానముచే గలిగిన దగును. అందుచే సకల పురుషులకును మోక్షప్రథమాంశ ప్రాప్తిప్రసంగము లేదు.

ఇంటియందు పూడ్చి యుంచియుండు నిధి నిత్యప్రాప్తమై యున్నను ఎంతదనుక తెలియబడక యున్నదో యంతదనుక పొందబడక యుండునట్లున్నది. పిమ్మట ఎప్పుడొక యాప్త (నిజము చెప్పెడు) పురుషుని యుపదేశముచే, నానిధిజ్ఞానము కలుగుచున్నదో అప్పుడు దొరకినట్లగుచున్నది. ఈవిధముచేతనే యిది నిత్యప్రాప్తియొక్క ప్రాప్తియగును. అట్లు పరమానంద రూపబ్రహ్మము అహం ప్రత్యయమునకు (అహంవృత్తి అహంశబ్దములకు) విషయమయి యుండుటచే నెచ్చటను కనబడుచున్నది. అందుచే నది సర్వాత్మక మగును. (అన్నిటి స్వరూప మగును) ఇందుచేతనే నిత్యప్రాప్తి స్వరూప మయినను ఎంతదనుక నెఱుగబడక యున్నదో, యంతదనుక పొందజాలని దానివలె కనబడుచున్నది. పిమ్మట ఎప్పుడు శాస్త్ర గురు ఉపదేశములచే "నేను బ్రహ్మము" అను దృఢ నిశ్చయమయిన తత్త్వజ్ఞానము కలుగుచున్నదో అప్పుడు "పరమానంద రూపమగు బ్రహ్మము నేను" అని ప్రాప్తి కలుగుచున్నది. అందుచే నిది నిత్యప్రాప్త బ్రహ్మము యొక్క ప్రాప్తి యగును.

ఇచ్చట నున్ను విషయ విషయీ బేధములచే ప్రాప్తి రెండువిధములై

యున్నది:- ౧ మునుపే సిద్ధించి యున్నదియు సమీపమందుండునదియు నైన అజ్ఞాత (తెలియబడని) వస్తుప్రాప్తి యేదియో యది విషయరూపప్రాప్తి యగును. అజ్ఞాన కాలమందున్న ముందు చెప్పిన నిధిప్రాప్తియు, జ్ఞానదశ యందున్న సర్వాత్మయగు బ్రహ్మముయొక్క ప్రాప్తియును విషయ రూపప్రాప్తి యగును.

౨. మునుపే సిద్ధించియున్న వస్తుజ్ఞాన మయిన ప్రాప్తి యేదియో యది విషయీరూప ప్రాప్తి యగును. పైజెప్పిన నిధిజ్ఞానమగు ప్రాప్తియును, బ్రహ్మముయొక్క జ్ఞానమగు ప్రాప్తియును, విషయీరూపప్రాప్తి యగును. దీనినే నిత్యప్రాప్త ప్రాప్తియనియు జెప్పుదురు. ఈవిధముగా బ్రహ్మప్రాప్తియగు రెండవ అంశమునకును జ్ఞానముచే గలుగబడుట లేనందున, అనిత్యతను పొందుట లేదు. దాని జ్ఞానమగు ప్రాప్తిజన్యమై యుండుటచే సకల పురుషులకును బ్రహ్మప్రాప్తి లేనందున సాధనజ్ఞానము వ్యర్థమగుట లేదు. అదిగాక బ్రహ్మప్రాప్తి యగు మోక్షముయొక్క రెండవ అంశమునకు ముందు చెప్పిన నిత్యనివృత్తి భిన్నము కాదు, అందుచే మోక్షమందు ద్వైతాపత్తియు (మోక్షము రెండగుటయు) లేదు. ఇచ్చట నొకవిశేష మున్నది. అది గ్రంథవిస్తర భీతిచే వ్రాయబడలేదు.

అధికారి మొదలగు నాల్గు అనుబంధముల విశేషములను
జెప్పునదియైన మొదటి యుపదేశము సమాప్తము.

రెండవ యుపదేశము

17. గురుశిష్య సంవాద ప్రసంగ పూర్వకమయిన సామాన్య ప్రశ్నోత్తరము.

సంసారమగు దావానలమను నడవిని గాల్చు, అగ్నిచే తపింపజేయబడిన యొకానొక పురుషుడు ముందు చెప్పిన నాల్గు సాధనములతో గూడిన వాడై నీరులేక బాధపడు చేపవలె, బంధమగు సంసారమునుండి ముక్తుడు కాగోరు చున్నాడు, ఆ పురుషుడు, సద్గురువును శరణు పొంది, పురుషుని ప్రేరేపించు (నడిపించు) ప్రమాణరూప శాస్త్రమగు విధిని ననుసరించి, గురుపాదములకు నమస్కరించి మనస్సును ఏకాగ్రముచేసి (ఒక్కటిగాజేసి) గురువును జూచి మోక్షసాధనమును అడుగుచున్నాడు.

ఇచ్చట విధిని ననుసరించి యను వాక్యమునకు అర్థము క్రింద గనందగును. అధికారియగు పురుషుడు ఉపసదనమునకు దగిన పదార్థములను చేతగొని, గురువునొద్దకు జని సాష్టాంగ నమస్కారము చేసి "దేవా! నాకు ఉపదేశము చేయుదురుగాక" అని నుచ్చరించి, ఇతడే నాకాశ్రయమని నమ్మికతో నతనియందు గురుభావము చేయవలయును. ఇది గురువును శరణుచొచ్చు విధియగు శాస్త్రము. దీనినే ఉపసత్తి యని చెప్పుదురు.

18. శిష్యుడు అడుగుచున్నాడు.

కృపానిధియగు గురుదేవా! మోక్షము ఏసాధనమువలన కలుగును? దీనిని తాము కృపచేసి చెప్పవలయును. ఎందుచే, నేను సంసారమగు దావాగ్ని తాపముచే దుఃఖి యగుచున్నానో అప్రాప్తబ్రహ్మమయిన వస్తువును బొందు నిచ్చచే, దీనుడనై యున్నానో అజ్ఞానియై స్వయముగా నేమియు నెఱుగని వాడనునై తమ్మె శరణుబొందితిని. కావున తాము కృపచేసి గంగా జల శీతలమునకు సమమైన శాంతము గల్గు నుపాయమును చెప్పవలయును.

19. గురువు చెప్పుచున్నాడు.

శిష్యా! బ్రహ్మాత్మైక్య జ్ఞానముచే మోక్షము కలుగుచున్నది. ఏలయన,

జ్ఞానాదేవతు, కైవల్యమ్=జ్ఞానముచేతనే కైవల్యము (మోక్షము) కలుగుచున్నది." "దేవం జ్ఞాత్వా సర్వపాశాపహానిః"=దైవమును (ఆత్మను) ఎఱుగుటచే సకల పాశముల హాని కలుగుచున్నది.

"తమేవ విదిత్వాఽతి మృత్యుమేతి నాన్యః పంథా విద్యతేఽయనాయ"= ఆ పరమాత్మను, తెలిసికొనియే సంసారమగు మృత్యువును దాటుచున్నాడు, మోక్షమును పొందుటకు వేఱుమార్గము లేదు" అను నీ మొదలగు శ్రుతులచే దృశ్యమై యుండుటచే మిథ్యయగు నహంకారాది ప్రపంచరూప బంధమునకు, అధిష్ఠానజ్ఞానమను మేల్కొలుపుచే, స్వప్నమునుండి మేల్కొనుటచే నివృత్తి యగుట వలె, నివృత్తి సంభవించుచున్నది. అదియుగాక, ఆత్మయై యుండుటచే, నిత్యప్రాప్త మయిన బ్రహ్మమేదియో; దానిప్రాప్తజ్ఞానముచే సంభవించుచున్నదను నీమొదలైన యుక్తులచేతను, జ్ఞానముచేతను మోక్షము సంభవించుచున్నది. ఆ జ్ఞానము పై చెప్పబడు విచారముచేతనే కలుగును. ఏలయన యాజ్ఞవల్క్యమునియగు నతడు చెప్పుచున్నాడు:-

"ఆత్మావాఽరేద్రష్టవ్యశ్శ్రోతవ్యోమన్తవ్యోనిదిధ్యాసితవ్యః॥= మైత్రేయీ! ఆత్మ నిశ్చయముగ జూడదగిన దగును." ఏయే సాధనములచే ననిన "శ్రవణము చేయదగిన దగును. మననము చేయదగిన దగును; నిదిధ్యాసనము చేయదగిన దగును" అను నీ మొదలగు శ్రుతులచేతను,

"ఘృతమివ పయసి నిగూఢం భూతే భూతే చ వసతి విజ్ఞానమ్ ।
సతతం మంథయితవ్యం మనసా మంథానభూతేన ॥

పాలునందు నేయివలె ఒక్కొక్క భూతమునందును విజ్ఞాన మున్నది. అది, శుద్ధమనస్సను కవ్వముచే విచారమను చిలుకుటకు విషయమై యున్నది." అను దేవీభాగవత వాక్యముచేతను,

పరోక్షజ్ఞాన మశ్రద్ధాం ప్రతిబధ్నాతి నేతరత్ ।
అవిచారోఽపరోక్షస్య జ్ఞానస్య ప్రతిబంధకః ॥

పరోక్షజ్ఞానము అశ్రద్ధను ప్రతిబంధించుచున్నది. వేఱుదానిని కాదు, అవిచారము, అపరోక్షజ్ఞాన ప్రతిబంధక మగును" అను పంచదశియందున్న ధ్యానదీపికవాక్యముచేతను; విచారముచే, రజ్జు మొదలగువాని జ్ఞానము కలుగుట వలె, విచారముచే అపరోక్షజ్ఞానము కలుగుట ప్రసిద్ధముగా నుండుటచేతను బ్రహ్మముయొక్క యథార్థదృఢ అపరోక్షజ్ఞానమున్ను శ్రవణాదిరూప విచారముచే గలుగుచున్నది. కాబట్టి జ్ఞానము లేక ఈమోక్షమునకు, విచారము లేక ఈజ్ఞానమునకున్ను వేరు ఉపాయము లేదు. కావున ఇప్పుడు జ్ఞానమూలక మోక్షమునకు హేతువుగా నుండు ఆ విచారమును నీవు విందువుగాక.

20. విచారస్వరూప వర్ణనము

నేను ఎవరు? జగత్తుఏది? ఈశ్వరుడు ఎవరు? అనువిచారముచే తత్కాలము, జన్మము మొదలగు సంసారము నష్టమగుచున్నది.

ఈ మూడువస్తువుల విచార మేదియో యది ఉత్తమము. ఏలయన,

"అవిచార కృతో బంధో విచారేణ నివర్తతే ।
తస్మాజ్జీవపరాత్మానౌ సర్వదైవ విచారయేత్ "

"అవిచారముచే నైనబంధము విచారముచే నివర్తి యగుచున్నది. కావున జీవుని, పరమాత్మను ఎప్పుడును విచారింపవలెను." అను పంచదశియందుండు, నాటకదీపిక వాక్యముచేతను,

కోఽహం కథమిదం జాతం కో వా కర్తాఽస్య విద్యతే ।
ఉపాదానం కిమస్తీహ విచారః సోఽయమీదృశః ॥

నేనెవరు? ఈ ప్రపంచమేది? దీనికి కర్త యెవరు? దీనికి ఉపాదాన మేది? అను అది యిది ఈవిధవిచారము" అను అపరోక్షానుభూతి వాక్యముచేతను, ఉపాధియయిన జగమును, బ్రహ్మమును, ఆత్మను విచారించుట ఉత్తమ మగును. అల్పశ్రమ గల జ్ఞానమునకు హేతువగుటవలన, ఇచ్చట "నేను" అనుపదముచే, అహంశబ్దముయొక్క వాచ్యార్థమగు జీవుడును లక్ష్యార్థమగు "కూటస్థ" ఆత్మయు

చేకొనబడుచున్నవి. "ఈశ్వర" శబ్దముచే, నద్దానికి (ఈశ్వరత్వమునకు) అధిష్ఠానమగు బ్రహ్మము అను "తత్" పదలక్ష్యార్థమును జేకొనబడుచున్నది.

గురుశిష్యసంవాదమగు సామాన్య ప్రశ్నోత్తరమును జెప్పునది యను రెండవ యుపదేశము ముగిసినది.

మూడవ యుపదేశము.

21. ఆత్మ, ఈశ్వరుడు, సృష్టి- అనువాని విషయమగు ప్రశ్నోత్తరము.

దేవా! శ్రుతియగు వేదము ప్రకారము నేనెవడను అనుదానిని జెప్పవల యును. దేవదత్తుడు మొదలగు పేళ్ళు, బ్రాహ్మణాది వర్ణములు, బ్రహ్మచారి మొదలగు ఆశ్రమములు అను నీ ధర్మములతో కూడిన శరీరము నేనని నాకు గనబడుచున్నది.

ఇచ్చట "శరీరము" అనుపదముచే మూడుశరీరములును, "పేరు" మొదలగు శబ్దములచే మూడుశరీరముల ధర్మములును జేకొనబడును.

22 శ్రీ గురువు చెప్పుచున్నారు:

శిష్యా! పేరు, వర్ణము, ఆశ్రమము వీనివలన ఉపలక్షింపబడిన మూడుశరీరముల ధర్మములు, వీనితోగూడిన మూడుశరీరములను వీనికి నీవు నిశ్చయముగా అతీతముగా నున్నావు. (వేఱుగా నున్నావు) కావున సత్తు చిత్తు ఆనందరూపమగు 'త్వం' పదలక్ష్యార్థము ఆత్మయే యని నీవు నిశ్చయింపుము.

23. శిష్యుడు ప్రశ్నించుచున్నాడు.

1. గురువా! జగమునకు కర్తయగు నీశ్వరుడెవడు? 2. ఈతని నిజరూపమేది? దీనిని (ఈశ్వరుని, అతని నిజరూపమును క్రమముగా జగమునకు కర్తగాను తానుగను) ఎఱిగి భ్రాంతిమయమగు (భ్రాంతిరూపమగు కార్యముతో గూడిన) అజ్ఞానమను కూపము నష్టమగు రీతిని జెప్పవలయును.

శిష్యుడిట్లు రెండుప్రశ్నలను వేసెను.

24. శ్రీ గురువు చెప్పుచున్నారు.

ఇప్పుడు పై జెప్పిన రెండుప్రశ్నలకును ఉత్తరము చెప్పుచున్నాడు:-

దేనిని సమష్టిరూపమగు నీశ్వరుని కారణశరీర మందురో, దేని యంశభూతమగు వ్యష్టి అజ్ఞానము, జీవుల కారణశరీరమై యున్నదో యాసమష్టి యజ్ఞానమగు *26 మాయాశక్తితో గూడిన సచ్చిదానంద బ్రహ్మ మేదియో యది జగమునకు కర్తయగు నీశ్వరు డగును. ఆ ఈశ్వరుడు ఎచ్చటను పరిపూర్ణుడు. అతనికి వందనములు చేయుము.

ఇచ్చట "పూర్ణ" డను నీశ్వరుని విశేషణ మేదియో యది తక్కిన సర్వజ్ఞత్వము మొదలగు ధర్మముల ఉపలక్షణ (సూచక) మగును. కావున ఆయీశ్వరుడు పరిపూర్ణుడును, సర్వజ్ఞుడును, సర్వశక్తిమంతుడును సమర్థుడును, స్వతంత్రుడును, పరోక్షుడును, నిత్యముక్తుడును నగును. మరియు "పూర్ణ" డనుపదముచే నిరపేక్ష వ్యాపకబ్రహ్మమగు నీశ్వరుని నిజరూపము గూఢాభిప్రాయముచే చెప్పబడినది.

ఇచ్చట వందనరూపమగు భక్తి యేదియో దానితో తక్కిన శ్రవణము కీర్తనము మొదలగు ఎనిమిది విధభక్తిని చేకొనవలయును. కాబట్టి ఈశ్వరుడు శ్రవణము. కీర్తనము, స్మరణము, పాదసేవనము, అర్చనము(పూజనము) వందనము, దాసభావము, సఖిభావము (స్నేహము), ఆత్మ నివేదనము (దేహాదిక మన్నిటిని సమర్పించుట)-అను తొమ్మిది విధములగు భక్తికిని విషయము కాదగినవాడు.

శిష్యుడడుగుచున్నాడు:-

కవిజనులకు రాజగు సద్గురుదేవా! జీవునకు ఉపాధియగు వ్యష్టి దేహాదులకు వేఱయియుండు ఆత్మను ఈశ్వరుని స్వరూపమును నేను *27 నిశ్చయము

---

*26. ఇచ్చట ఇది అవచ్ఛేదవాదప్రకారము ఈశ్వరుని లక్షణము చెప్పబడినది. ఆభాసవాదప్రకారము చిదాభాసునితో గూడిన మాయాశక్తిని జేకొనవలయు ననునది విశేషము.

చేసితిని. ఇప్పుడు తాము ఈశ్వరుని దేహాదులను జెప్పుదురుగాక. దానిచే వాటికి వేఱగు నాయొక్క బ్రహ్మస్వరూప మేదియో యది తెలియబడవలయును.

శ్రీ గురువు చెప్పుచున్నారు:

శిష్యుడా! ఈశ్వరుని దేహాదులు ఏవియో వాటివిచారమును నాయొద్ద వినుదువుగాక. వాటి జ్ఞానముచే ఈశ్వరుని నిశ్చయము గలుగును.

1. జగత్తుయొక్క ఉత్పత్తి స్థితి విలయమను నీమూడును ఈశ్వరుని యవస్థ లగును.

2. విరాట్టు, సూత్రాత్మ, అవ్యాకృతము (మాయ) అను నీ మూడును ఈశ్వరుని దేహము లగును.

3. సత్త్వాది మూడుగుణములు వస్తువు లగును. అనగా కుమ్మరికి మన్ను సామగ్రి యగుటవలె జగముయొక్క సృష్టిసామగ్రు లగును.

4. కులాలునికి భూమి మొదలగునవి చోటగునట్లు మాయ ఈశ్వరునికి చోటగునని తెలియుము.

5. వైశ్వానరుడు, హిరణ్యగర్భుడు, ఈశ్వరుడు (అంతర్యామి) అను నీ ముగ్గురు ఈశ్వరత్వమునకు ఉపాధి యయిన మూడు దేహములకును క్రమముగా అభిమాను లగుదురు.

6. "ఏకముగా నుండు నేను అనేకరూపము లగుదును" అను నీ క్షణము (చూపు) మొదలు జీవరూపముగా వ్యష్టిశరీరమందు ప్రవేశించు పర్యంతమగు సృష్టి ఏదియో యది ఈశ్వరుని కార్య మగును.

7. సర్వజ్ఞత్వము మొదలగునవి ఈశ్వరుని ధర్మము లగును. కావున ముందు చెప్పిన సామగ్రులతో గూడిన మాయయును, మాయయందు

---

*27. సంక్షేపముగా నీయుపదేశముయొక్క 23వ ప్రసంగమువఱకు నిశ్చయము చెప్పబడినది. విశేషముగా పై ఐదవది మొదలు ఏడవ యుపదేశమువఱకు అది (ఆత్మ) నిశ్చయము చేయదగిన దగును.

ప్రతిబింబించిన చిదాభానుడును, దానితో గూడిన బ్రహ్మచేతనమును ఈశ్వర పదమునకు వాచ్యార్థ మగును.

ఈయన్ని సామగ్రులతో (సాధనము) గూడిన మాయను, చిదాభాసునిన్ని మిథ్యాత్వబుద్ధిచే విడిచి, మిగిలిన బ్రహ్మచేతనము ఏదియో యది ఈశ్వర పదమునకు లక్ష్యార్థ మగును. ఇదియే ఈశ్వరుని నిజరూప మగును. ఇది ముందు గూఢాభిప్రాయమున నడిగిన రెండవప్రశ్నమున కుత్తర మగును.

25. శిష్యుడు అడుగుచున్నాడు.

స్వామీ! ఈశ్వరుడు ఏసృష్టివిషయ మయిన జగత్తును కలిగించెనో, అది యేక్రమమున కలిగెను? ఎన్నివిధములు? ఆసృష్టికి (ఉత్పత్తికి) విషయమయి కనబడుచుండు జగము మిథ్యయా? లేక సత్యమా? ఈయభిప్రాయమును నాకు జెప్పవలెను. (ఈమూడుప్రశ్నలు శిష్యునిచే జేయబడినవి.)

26. గురువు చెప్పుచున్నారు.

ఈవిధముగా ముందు 24వ ప్రసంగమువఱకు ఈశ్వరుని స్వరూపమును జెప్పి యిప్పుడాతనిచే నయిన సృష్టిక్రమమును జెప్పుచున్నాడుః-

జీవుల కర్మఫలభోగము కొఱకు "ఏకముగా నున్న నేను అనేక మగుదును" అనురీతి ఈశ్వరునకు ఇచ్ఛ కలిగెను. అప్పుడు ఈశ్వరత్వమునకు ఉపాధియై యున్న మాయయొక్క కార్యమునకు వ్యతిరిక్తమగు క్షోభము కలుగు క్రమముగా సర్వప్రపంచ సముదాయమును కలిగెను.

ఆ ప్రపంచోత్పత్తి క్రమ మీక్రిందివిధముః- అవ్యక్తము, అక్షరము, అజ్ఞానము, ప్రధానము, శక్తి, మూడుగుణముల సామ్యావస్థయగు ప్రకృతి - యనునివి మొదలయిన పేళ్ళచే బ్రసిద్ధముగా నుండు మాయయందుండి *28. మాయావిశిష్ట (మాయతోగూడిన) చేతనమగు ఈశ్వరుని యిచ్ఛచే సమష్టిబుద్ధి యగు మహత్తత్త్వము కలిగెను. ఆమహత్త్వము 1. రాజసము 2. సాత్త్వికము, 3. తామస

*28. ఇచ్చట మాయ యను శబ్దముచే అసూయయందుండు చిదాభానుడును చేకొనబడును

మను భేదములచే మూడు విధములగు అహంకారమును కలిగించెను.

1. రాజసాహంకారమునుండి శ్రోత్రము (చెవి), త్వక్కు (తోలు), చక్షువు (కన్ను), జిహ్వ (నాలుక), ఘ్రాణము (ముక్కు) - అను నీయైదు జ్ఞానేంద్రియములును; వాక్కు పాణి, పాదము, ఉపస్థ, గుదము - అనునైదు కర్మేంద్రియములును గలిగెను. ఏలయన ఇంద్రియములు విషయముతోను, క్రియతోను, ప్రవర్తించుట యగు రజోగుణ స్వభావము కలవిగా నుండుటచే-

2. సాత్త్వికాహంకారమునుండి అంతఃకరణశబ్దమునకు వాచ్యమగు మనస్సు, దిక్కు, వాయువు, సూర్యుడు, వరణుడు, అశ్వినీకుమారులు అనునైదు జ్ఞానేంద్రియముల దేవతలును; అగ్ని, ఇంద్రుడు, వామనుడు, ప్రజాపతి, యముడు- అనునైదు కర్మేంద్రియముల దేవతలును, మనస్సు దేవతయగు చంద్రుడును గలిగిరి.

లేక మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారమను భేదములచే మనస్సను శబ్దమునకు వాచ్యార్థమయిన, అంతఃకరణము నాల్గువిధము లగును. వానిలో మనస్సునకు దేవత చంద్రుడు, బుద్ధికి దేవత బ్రహ్మ, చిత్తమునకు దేవత వాసుదేవుడు, అహంకారమునకు దేవత రుద్రుడు, వీరందఱు సాత్త్వికాహంకార మున నుండి గలిగినవారేని యెఱుగుము. ఏలయన, అంతఃకరణములును, దేవతలును ప్రకాశరూపసాత్త్విక స్వభావము గలవారుగా నుండుటవలన.

3. తామసాహంకారమునుండి శబ్దము మొదలగు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధ మను) ఐదు తన్మాత్రలు గలిగినవి. దీనినే సూక్ష్మపంచభూతమనియు అపంచీకృత పంచభూతమనియు జెప్పుదురు.

ఈ వఱకుగలిగిన సృష్టి యేదియో యది మొత్తము నొక్కటి చేసి సూత్రాత్మయనియు, హిరణ్యగర్భుడనియు జెప్పుదురు. అది ఈశ్వరుని సమష్టిలింగశరీరమగును. దానియందేకదా! పదునేడు తత్త్వరూపములగు జీవుల వ్యష్టిలింగములు అణగియున్నవి.

27. ఆ పంచతన్మాత్ర లయిన సూక్ష్మభూతములకు పంచీకరణము గలిగి

పంచీకృత పంచమహాభూతము లయినవి.

పంచీకరణము - ఆకాశము మొదలగు సూక్ష్మభూతములనుండి ఒక్కొక్కటిని రెండేసి భాగములు చేయ, నవి పది యగుచున్నవి. వాటిలోనుండి ఐదు అర్ధ అర్ధభాగముల చేరికను విడిచి తక్కిన యయిదుభాగములనుండి ఒక్కొక్కటి నాలుగేసిగా చేయబడెను. ఆనాల్గుభాగములును నిలిపిపెట్టబడిన దానిదాని అర్ధఅర్ధ భాగములను విడిచి తక్కినభూతముల నాలుగు అర్ధఅర్ధ భాగములలో జేర్పబడెను. అందుచే నొక్కొక్కభూతమును ఐదైదువిధము లాయెను.

ఒక్కొక్క సేరు కొలత గల గోధుమలు, బియ్యము, పెసలు, ఉద్దులు, సెనగలు అనునైదు విధముల అన్నమును అర్ధఅర్ధ భాగముచేయ పది అర్ధ సేరు లగును. వానిలో ఐదు అర్ధసేర్లు ఉన్నట్లే నిలిపిపెట్టి తక్కిన ఐదున్ను నాలుగేసి భాగములు చేయబడెను. ఆ నాల్గు భాగములును దాని దాని అర్ధసేర్లను విడిచి తక్కిన అన్నముల అర్ధసేర్లతో చేర్చబడెను. అట్లు చేర్చబడగా నొక్కొక్క యన్నమును ఐదు ఐదు విధము లాయెను. అట్లు ఒక్కొక్క భూతమున్ను ముందు చెప్పినట్లు ఐదు ఐదు విధము లాయెను.

ఈవిధముగా సూక్ష్మపంచభూతములకు ఈశ్వరుని ఇచ్ఛచే నొకదానికొకటి కలిగిన సంయోగమును (కలియుటను) శాస్త్రములందు పంచీకరణ మందురు. ఏభూతములకు పంచీకరణము కలిగినదో వాటిని పంచీకృత భూతము లందురు. వాటినే స్థూలభూతము లనియు చెప్పుదురు.

౧. ఆ పంచీకృత పంచభూతములందుండి యొకదాని కొకటి చేరుటవలన బ్రహ్మాణ్డము కలిగెను.

౨. బ్రహ్మాండమందు జీవులవాసము కొఱకు పృథివికి క్రిందుండు అతలము, వితలము, సుతలము, తలాతలము, రసాతలము, మహాతలము, పాతాళమను నేడును; పృథివికి పైనున్న భూలోకము, భువర్లోకము, స్వర్లోకము, మహర్లోకము, జనోలోకము, తపోలోకము, (సత్య) బ్రహ్మ లోకమను నేడును

నైన పదునాలుగు లోకములును గలిగెను.

3. వానియందు దేవతలు, మనుష్యులు మొదలగు జరాయుజ శరీరములును, పక్షులు మొదలగు అండజశరీరములును, వృక్షములు మొదలగు ఉద్భిజ్జశరీరములును, పేను మొదలగు స్వేదజశరీరములును నగు నాల్గు విధములగు యోని స్థూలశరీరములకు భోగాయతనము (భోగించుటకు చోటు) కలిగెను. ఆయా లోకములందు నాయా శరీరములకు నుపయుక్తములగు భోగసాధనమగు అన్నము మొదలగు భోగ్యపదార్థములును గలిగెను.

28. తైత్తిరీయ ఉపనిషత్తునందుండు "బ్రహ్మమగు ఆత్మయందుండి ఆకాశము కలిగెను. ఆకాశమునందుండి వాయువు గలిగెను. వాయువునుండి తేజస్సు కలిగెను. తేజస్సునందుండి జలము కలిగెను. జలమునందుండి పృథివి కలిగెను. పృథివియందు ఓషధు (అన్నపు వృక్షము)లు కలిగెను. ఓషధులందుండి అన్నము కలిగెను. అన్నమునందుండి వీర్యము మూలముగా పురుషుడు గలిగెను." మొదలయిన వాక్యములచే మొదట ఆకాశము ఆపై క్రమముగా పంచభూతములు కలిగెను.

ఆయా పంచీకృత భూతములనుండి ప్రాణము మొదలగు క్రమముగా సమష్టియగు లింగశరీరము కలిగెను. పిమ్మట పంచీకృతమగు నాభూతము లందుండి బ్రహ్మాండము కలిగెను. ఆ బ్రహ్మాండము విరాట్టు శరీర మనబడును. ఆబ్రహ్మాండమందు దాని యభిమానియగు వైరాజ పురుషుడు నెలకొనియున్నాడు. అది యే వైశ్వానరుడను పేరుతో ప్రసిద్ధమయిన దగును. అదియే క్షీరసాగరమున శయనించు శ్రీమన్నారాయణుడను పేరుగల అంతర్యామియొక్క లీలావిగ్రహ మగును. దాని నాభికమలమందు వైరాజపురుషుని భోగవిగ్రహమగు నాలుగు ముఖములు గల బ్రహ్మ కలిగియున్నాడు. అతనివద్దనుండి సమయానుసారముగా తక్కిన జీవుల ఆవిర్భావము కలిగెను. ఇది ప్రక్రియ యగును.

అందుచే ముందు మహత్తత్త్వముయొక్క క్రమముగా జెప్పిన సృష్టి విరుద్ధ మగుచున్నది. అయిన నిచ్చట మహత్తత్త్వము మొదలగువాని క్రమముగా ఏసృష్టి

చెప్పబడియున్నదో; అది జ్ఞానశక్తి గల మహత్తత్త్వమునకు సమముగా చిత్తపు ఆవిర్భావ పూర్వకముగా అహంకారము కలుగుచున్నది. ఆ అహంకారము లేచుట వలన పంచభూతములు ఇంద్రియము మొదలగువాటి చెప్పుటయు, కనబడుటయు నగు వ్యవహారము కలుగుచున్నది అను అనుభవము ననుసరించి చెప్పబడి యున్నది.

విచారదృష్టితో జూచునప్పుడు వేదమునందొక చోట క్రమము లేకయు నొకచోట క్రమముగను, ఒకచోట తేజస్సు మొదలగు మూడు భూతముల నుండియు, ఒకచోట ఆకాశము మొదలగు పంచభూతములనుండియు, ఒకచోట మహత్తత్త్వము మొదలగువాని నుండియు క్రమముగా సృష్టి చెప్పబడియున్నది.

ఈ యన్ని వాక్యములకు నొకే యర్థమును చెప్పుటలో విరోధము కనబడుచున్నది. కాబట్టి ఈయన్ని వాక్యములకు ఆయా విధములచేతను ముముక్షువులకు సృష్ట్యారోప మూలకముగా దాని యపవాదమును జేసి జగముయొక్క మిథ్యాత్వ నిశ్చయ పూర్వకముగా అద్వైత తత్త్వము నుపదేశించుట యందు తాత్పర్య మగును.

అదియునుగాక ప్రపంచము సత్యమగు నేని సకల వేదవాక్యములున్ను దానిని ఒకే విధముగా నిరూపించును. అట్లు నిరూపించలేదు. కావున ప్రపంచము మిథ్యయే యగును. ఇట్లు సర్వ వేదవాక్యములకును దాత్పర్యము నిశ్చయింప బడియున్నది. ఈ యర్థము ప్రసంగమువలన నిరూపించబడినది.

ఇచ్చట పంచీకృతభూతము మొదలు స్థూలదేహ పర్యంతమునైన ప్రపంచ మేదియో యది యంతయు జేరి విరాట్టనబడుచున్నాడు. ఆవిరాట్టు ఈశ్వరుని సమష్టిరూప స్థూలదేహ మగును. ఇది మొదటి ప్రశ్నమున కుత్తర మగును.

29. **ఇట్లు ఈశ్వరుండగు** కర్తయగు నతడు జగత్తును సృష్టించెను. ఆసృష్టి సమష్టి వ్యష్టి భేదములచే రెండు విధములని తెలియునది, సమష్టిని ఈశ్వరుని ఉపాధియనియు వ్యష్టిని జీవుని ఉపాధియనియు నెఱుంగునది.

వనమును బోలియైనను, జలాశయ(తటాక)మును బోలియైనను, గోత్వము

మొదలగు జాతులవలె నైనను, తన మొత్తము శరీరమువలె నైనను అనేక పదార్థములు ఒకబుద్ధికి విషయమగుట యేదియో యది సమష్టి యనబడును. ఒక్కొక్క వృక్షమునువలె నైనను, ఒక్కొక్క నీటిబొట్టునువలె నైనను, ఒక్కొక్క వ్యక్తిని (ఆవు మొదలగు రూపములను) వలె నైనను, దన శరీరమందున్న క్రిములు మొదలగు వాని యొక్కొక్క దేహమునువలె నైనను అనేక బుద్ధులకు విషయ మగుట యేదియో యది వ్యష్టి యనబడును.

వానిలో సమష్టి కారణ శరీరమును, సమష్టి సూక్ష్మ శరీరమును, సమష్టి స్థూలశరీరమును ఈశ్వరుని ఉపాధులు అగును. వ్యష్టి కారణదేహమును, వ్యష్టి సూక్ష్మ దేహమును, వ్యష్టి స్థూలదేహమున్ను జీవుల ఉపాధు లగును.

ఇచ్చట విశేషణమే వ్యావర్తకత్వము ననుసరించి ఉపాధికి సమముగా నుండుటచే ఉపాధి శబ్దముచే చెప్పబడియున్నది.

తనకు ఆశ్రయమగు వస్తురూపమందు దేని ప్రవేశము కలిగియున్నదో అట్టి వ్యావర్తక వస్తువేదియో యది విశేషణమని చెప్పబడుచున్నది.

౧. అది ఘటమునకు నీలవర్ణము విశేషణ మగుటను వలెను;

౧. కేవలము త్రాసునందు తూచబడిన బంగారమునకు లక్క విశేషణ మగుట వలెను;

3. ధనము లేని వ్యాపార పురుషునికి భాగము గల వేరు ధనము గల పురుషుడు విశేషణమగుటవలె నగును. ఏలయన నీ మూడును దేనివలన తనకాశ్రయమగు వస్తువు స్వరూపమునందు ప్రవేశించి వ్యావర్తకమయి (తక్కినవానినుండి వేఱుచేసి తెలిపించునవియయి) యున్నవో వానివలన అవి విశేషము లనబడుచున్నవి.

(౧) ఘటమందలి నీలవర్ణము ఘట స్వరూపమందు కలిసి, నీలఘటమును తక్కిన పసుపు మొదలగు ఘటములనుండి వేఱుచేసి, తెలిపించునదిగా నున్నది. కావున నది విశేషణ మగును.

(౨) లక్క యేదియో యది జలమునకు వెలుపల తూచబడినదై, భూషణ స్వరూపమునందు భారమై, కలిసియే తక్కిన భారము లేనిదగు పెద్ద ఆభరణముల నుండి దానిని వేఱుచేసి తెలిపించునదియై యున్నది. కావున నది భూషణమునకు విశేషణ మగును.

(3) ధనము గల *29. భాగముగల పురుషుడును వ్యాపారవిషయమగు వస్తువునందు అభిమానమూలముగ ప్రవేశమును బొంది తక్కినభాగము లేనివారినుండి తనతో భాగము గలవాడగు ధనము లేని పురుషుని వేఱుచేసి తెలిపించువాడై యున్నాడు. కావున నాతడతనికి విశేషణ మగుచున్నాడు.

తనయాశ్రమ స్వరూపమందు దేనికి ప్రవేశము లేదో యట్టి వ్యాకర్తక వస్తువు ఉపాధి యనబడుచున్నది.

౧. అది ఘటము ఘటాకాశమునకు ఉపాధి యగుటవలెను;

౧. జలమందు త్రాసుచే తూచబడిన ఆభరణమునకు లక్క ఉపాధి యగునట్లును;

3. వ్యాపారపురుషుడు కార్యము కొఱకుంచియుండు పనివాడెవడో వాడు వానికి ఉపాధి యగునట్లుగాను అగును.

ఏలయన నీమూడును దేనిచే దమ యాశ్రయ స్వరూపమందు ప్రవేశింపక వ్యావర్తకముగా నున్నవో దానిచే నవి యుపాధు లగుచున్నవి.

(౧) ఘటమేదియో యది ఘటావచ్ఛిన్న ఆకాశ మాత్రమందు ఘటాకాశ వ్యవహారమును చూచుటచే ఘటాకాశ స్వరూపమున బ్రవేశము నొందక ఘటాకాశమును మఠాకాశము మొదలగు వానినుండి వేఱుచేసి తెలిపించునది గా నున్నది. కావున నది దాని యుపాధి యగును.

(౨) లక్క యేదియో యది జలమందు త్రాసుచే దూచబడిన ఆభరణ

*29. ఇచ్చట భాగము గలవాడు పనివాడు అనువారి దృష్టాంత మేదియో యది స్థూలబుద్ధి గల జిజ్ఞాసులకొఱకు చెప్పబడినది.

మందు భారముగా బ్రవేశమును బొందక దానిని తక్కిన లక్కలేని ఆభరణముల నుండి వేఱుచేసి తెలిపించునదియై యున్నది. కావున నది దానియుపాధి యగును.

(3) కింకరుడు (పనివాడు) ఎవడోవాడు అభిమానము మూలముగా నా వ్యాపారి స్వరూపమందు బ్రవేశమును బొందక తనకాశ్రయము లేని పురుషుల నుండి యా యాశ్రయరూపమగు వ్యాపారిని వేఱుచేసి తెలిపించువాడై యున్నాడు కావున వాడు ఉపాధి యగుచున్నాడు.

విశేషణమునకు ఆశ్రయమయిన విశేషణము గల వస్తువేదియో యది విశిష్ట మనబడును. ఉపాధికి ఆశ్రయ మయిన ఉపాధిగల వస్తువేదియో యది ఉపహిత మనబడును.

30. అవివేకి దృష్టిచే సర్వజ్ఞత్వము మొదలగు ధర్మములతో గూడిన సమష్టి స్థూల సూక్ష్మ కారణ ప్రపంచమునకు చేతనపు స్వరూపమందు తాదాత్మ్య సంబంధమగు ప్రవేశము కనబడుచున్నది. ఆ ప్రపంచము కూటస్థచేతనము, జీవచేతనము మొదలగు వానినుండి ఆ ఈశ్వరభావముగా కనబడిన చేతనమును వేఱుచేసి తెలుపునదియై యున్నది. కాన ఆ ప్రపంచముచే కల్పింపబడిన తాదాత్మ్యసంబంధము గలదియు క్రమముగా వైశ్వానరుడు, హిరణ్యగర్భుడు అంతర్యామియను పేళ్లచే ప్రసిద్ధి బొందినదియునగు బ్రహ్మమైన ఈశ్వరచేతన మేదియో దానికి ముందు చెప్పిన మూడు విధముల సమష్టి ప్రపంచము విశేషణ మగును.

వివేకదృష్టిచే సమష్టి స్థూల సూక్ష్మ కారణ ప్రపంచమునకు చేతన స్వరూపమందు తాదాత్మ్యసంబంధమయిన ప్రవేశము కనబడుట లేదు. అయితే అసంగత్వమే కనబడుచున్నది. ఆ ప్రపంచము ఈశ్వరచేతనము, జీవచేతనము మొదలగు వానినుండియును ముందు చెప్పిన ప్రపంచమయిన ఉపాధికి ఆశ్రయరూపమగు చేతనమాత్రమును వేఱుచేసి తెలుపునదిగా నున్నది. కాబట్టి యాప్రపంచము ముందు చెప్పిన ప్రపంచమునకు అధిష్ఠానరూప ఈశ్వర సాక్షియగు బ్రహ్మచేతనపు ఉపాధి యగును.

31. దానివలె అవివేకియొక్క దృష్టిచే కర్తృత్వము, భోక్తృత్వము, సుఖిత్వము, దుఃఖిత్వము, జీవత్వము, సంసారిత్వము, అల్పజ్ఞత్వము మొదలగు ధర్మములతో గూడిన వ్యష్టి స్థూల సూక్ష్మ కారణప్రపంచమునకు తన యధిష్ఠాన సంబంధమయిన కూటస్థ చేతన స్వరూపమునందు కల్పిత తాదాత్మ్య సంబంధమయిన ప్రవేశము కనబడుచున్నది. ఆ ప్రపంచము బ్రహ్మచేతనము, ఈశ్వరచేతనము మొదలగు వానినుండి తన యాశ్రయభూతమయిన చేతనమును వేఱుచేసి తెలుపునదిగా నున్నది. కనుక విశ్వ తైజస ప్రాజ్ఞులను పేర్లచే ప్రసిద్ధమయిన స్థూలము మొదలగు వ్యష్టి ప్రపంచముతో తాదాత్మ్యము గల కూటస్థచేతనమను సంసారియగు జీవుడేదియో దానికి ముందుచెప్పిన మూడువిధములగు వ్యష్టిప్రపంచము విశేషణ మనబడుచున్నది.

వివేకియొక్క దృష్టిచే ధర్మములతో గూడిన వ్యష్టి స్థూల సూక్ష్మ కారణ ప్రపంచమునకు అధిష్ఠాన కూటస్థ చేతనమందు తాదాత్మ్య సంబంధమయిన ప్రవేశము కనబడుటలేదు. అయితే అసంగత్వమే కనబడుచున్నది. ఆ ప్రపంచము ఈశ్వరచేతనము మొదలగు వానినుండి ఆముందు చెప్పిన మూడువిధములైన వ్యష్టి ప్రపంచమునకు అధిష్ఠానమయిన జీవసాక్షియగు కూటస్థచేతనమును వేఱుచేసి తెలిపించునదై యున్నది. కావున అది యా జీవసాక్షికి ఉపాధి యనబడుచున్నది.

32. ఒకప్రపంచమే చేతనమందు ఈశ్వరభావ జీవభావములకు విశేషణ మును అధిష్ఠానరూపమగు బ్రహ్మభావ సాక్షి భావములకు ఉపాధియు నగును.

ఒకకొలత యే జలమునకు బైటతూచు సమయమున భారఅతిశయము కనబడుటచేతను, గొప్పఆభరణమునుండి దానిని వేఱుపరచి తెలిపించునదియై యుండుటవలనను, విశేషణమును జలమందు దూచుకాలపు భారము అధికముగా లేనందునను, తక్కిన వానినుండి వేఱుచేసి తెలిపించునదిగా నున్నందునను ఉపాధిగా నున్నది. ఆభరణమునందలి భారముయొక్క ఆధిక్యమును తక్కువయు; దానిప్రవేశమును, అప్రవేశమును నగును.

లేక దండ మొక్కటియే నడచునప్పుడు తానున్న పురుషునివలె నడచు

కార్యమును గలదిగా నుండుటవలనను తక్కిన దండము లేని పురుషులనుండి వానిని వేఱుచేసి తెలుపునదిగా నుండుటచే దండిపురుషునికి విశేషణమును, భోజనకాలమున పురుషునివలె తాను భోజనక్రియ లేనిదిగా నుండుటచేతను; తక్కిన దండములేని పురుషులనుండి యాదండము గల పురుషుని వేఱుచేసి తెలిపించునదై యుండుటవలనను ఉపాధియు నగుచున్నది. ఇచ్చట తనయాశ్రయ క్రియతో గూడియుండుటయు, గూడకుండుటయునే; క్రమముగా దానిప్రవేశ మును, అప్రవేశమును నగును.

దానివలె ఒకప్రపంచమే అవివేకిదృష్టిచే భ్రాంతిరూపమగు ప్రపంచమున కును, చేతనమునకును గల తాదాత్మ్య సంబంధముచే గనబడుచున్నది. ఈశ్వర భావ జీవభావములకు విశేషణమును, వివేకియొక్క దృష్టిచే గనబడుచున్న అధిష్ఠానమగు బ్రహ్మభావ సాక్షిభావములకు ఉపాధియు నగుచున్నది. ఇది రెండవప్రశ్నమునకు ఉత్తర మగును.

33. ఇప్పుడు "జగత్తు మిథ్యయా, లేక సత్యమా?" యని ముందు చెప్పిన మూడవ ప్రశ్నమునకు ఉత్తరము చెప్పుచున్నాడు- ఆ ముందు చెప్పిన జగత్తు స్వప్నప్రపంచము శుక్తిరజతము, త్రాటియందు పాము - అనువానికి సమానముగా మిథ్యగా (బాధింపదగిన స్వరూపము గలదిగా) నుండుటచే సత్తసత్తులగు విలక్షణ మనిర్వచనీయ మగునని తెలియదగినది. ఒకకాలమందున్నది సత్త (మూడు కాలములందును బాధింపబడనిది) కానేరదు.

దీని తాత్పర్యమిది:- ముందు చూచిన మిథ్య, లేక సత్యమయిన అధ్యాసము నకు సజాతీయమగు వస్తువేదియో దానిజ్ఞానముచే గలిగిన సంస్కారముతో గూడిన పురుషు డయిన ద్రష్టయొక్క దృష్టిచే *30. నిద్రాదోషముచే నైనను లేక యేదేనొక మందాంధకారము *31. మొదలగు *32. వేఱుప్రతిబంధములచే నైనను

---

*30. ఇది స్వప్నమునకు నిమిత్తము. *31. ఇచ్చట మొదలగు అనుపదముచే లోభము భయము మొదలగు ప్రమాత (అంతఃకరణ) దోషమును; తిమిరము, పిత్తము, కామాల మొదలగు నేత్రరూప ప్రమాణదోషమును, అధఃస్థమునకు (సర్పమునకును, రజతమునకును) సమానరూపముగల ప్రమేయ (అధిష్ఠాన) దోషమున్ను చేకొనబడుచున్నవి. *32. ఈ మూడు
(cont...)

*33. జాగ్రత్తపదార్థమగు, లేక శుక్తియయిన లేక రజ్జువయిన అధిష్ఠానము *34. విశేషరూపముగా గనబడదు. *35. సామాన్య (ఇదియను) రూపముచే గనబడుటచే *36. నిద్రకాలమందు, శరీరమందుండు లేక *37. నేత్రము మొదలగువాని మూలముగా వృత్తిబయటపోయి శరీరమునకు వెలుపల శుక్తి లేక రజ్జువగు దేశమందుండు ఇది యనురూప మయిన అంతఃకరణ వృత్తిచే ఉపహిత(ఆవరింప బడిన) సాక్షి చైతన్యమునకు ఆశ్రితమయిన *38 మూలావిద్యాకార్యమయిన *39. స్థూలవిద్యయొక్క తమోగుణ అంశపరిణామ మయిన స్వప్నప్రపంచమును కల్పితరజతమును, కల్పితసర్పమును *40. సత్తసత్తులకు విలక్షణమయిన దోషములున్ను సర్పదృష్టాంతమునకు రజతదృష్టాంతమునకును నిమిత్తకారణము లగును.

*33. జాగ్రత్తపదార్థము ఒకవేదాంతపక్షముచే స్వప్నమునకు అధిష్ఠాన మగును,

*34. దృష్టాంతమున ఇవి జాగ్రత్తపదార్థములు, ఇది రజ్జు ఇది శుక్తి యనునవి అధిష్ఠానపు విశేషరూప మగును. దేని అప్రతీతి (కనబడని) చే అధ్యాసము కలుగుచున్నదో, దేని ప్రతీతిచే (కనబడుటచే) అధ్యాసము కలుగక నివృత్తి యగుచున్నదో యది అధిష్ఠాన విశేషరూప మనబడును. దానిని అధ్యాస అధిష్ఠానమనియు జెప్పుదురు. దాని అప్రతీతిరూపమే అధ్యాసమునకు ఉపాదానకారణ మయిన అవిద్య యగును.

*35. వర్తమానకాలమునకు పురోదేశముతో (ముందుచోటుతో) గల సంబంధము ఇదియను పదమునకు అర్థమగును. అది మందాంధకారము మొదలగు స్థలముల "ఇది యొకటి" అనురూపము గలదగును. ఆ యిది యనుట దృష్టాంతమయిన రజ్జు మొదలగు వాని సామాన్యరూప మగును. దీనిప్రతీతి (కనబడుట) లేక ఎందుచే అధ్యాసము కలుగుటలేదో దానిచే నిది అధ్యాస ఆధార మగును. దేని ప్రతీతిచే అధ్యాసము కలుగుచున్నదో, దేని అప్రతీతిచే అధ్యాసము కలుగుటలేదో, భ్రాంతికాలమందు "ఇది సర్పము" అని ఆరోపింపబడిన వస్తువుతో నేది కనబడుచున్నదో, భ్రాంతి తీరిన కాలమందును "ఇదిరజ్జు" వని యేది కనబడుచున్నదో- యది అధిష్ఠాన సామాన్యరూప మగును. దానినే అధ్యాస ఆధార మనియు జెప్పుదురు.

*36. ఇది స్వప్నదృష్టాంతముకొఱకు జెప్పబడినది.

*37. ఇది శుక్తి, రజ్జు దృష్టాంతముల కొఱకు జెప్పబడినది.

*38. శుద్ధచేతనమును ఆవరణము చేయు అవిద్యయొక్క

*39. ఘటాది ఉపాధులచే అవిచ్ఛిన్న చేతనమును ఆవరణము చేయు అవిద్యయొక్క.

*40. మూడుకాలములందును బాధ గలుగని దానిని సత్తు అందురు. దాని విలక్షణ

(cont...)

అనిర్వచనీయమయి యుత్పత్తి యగుచున్నది.

అదే నిమిత్తముచే అదేసమయమందు అదే అవిద్యయొక్క సత్త్వ గుణపరిణామ మయినవాని జ్ఞానమును సత్తసత్తులయొక్క విలక్షణ అనిర్వచనీయముగానే ఉత్పత్తి యగుచున్నది.

క్రమముగా *41. జాగ్రత్ ప్రపంచము *42. శుక్తి *43. రజ్జువు అనువాటి జ్ఞానముచే, వృత్తిమూలకముగా *44. వానితో అనేక రూపమయిన సాక్షియగు అధిష్ఠానజ్ఞానముచే, ఒకేకాలమందు రెండును నివృత్తి యగుచున్నవి.

వీటిచే అనిర్వచనీయ (అధ్యాసరూప) స్వప్నప్రపంచము మొదలగు వాని

మని చెప్పుటచే బాధిత మగునది చేకొనబడుచున్నది. వంధ్యా (గొడ్రాలు) పుత్రుని, కుందేలు కొమ్మునుబోలె స్వరూపము లేనిదానిని అసత్తందురు. దాని విలక్షణమని చెప్పుటచే స్వరూపము గలది చేకొనబడుచున్నది. వీనిచే బాధ యోగ్యస్వరూపము గలది సత్త సత్తు, విలక్షణము (అనిర్వచనీయము) అనుపదమునకు అర్థమగును. దీనినే మిథ్యయనియు చెప్పుదురు. స్వప్నము మొదలగు ప్రపంచము దేనిచే అధిష్ఠాన జ్ఞానముచే బాధిత మనునదియు స్వరూపము గలదిగా నున్నదో దానిచే సత్త సత్తులకు విలక్షణ మగును.

*41. జాగ్రత్ ప్రపంచమువలన ఉపహితచేతనము.

*42. శుక్తి, ఉపహితచేతనము

*43. రజ్జు ఉపహితచేతనము.

*44. ఇచ్చట ఇది అభిప్రాయ మగును:- జాగ్రత్ ప్రపంచము, శుక్తి రజ్జు అనువానిచే ఉపహిత (హద్దుచేయబడిన) చేతనము విషయచేతన మనబడును. ఆకారణముచేతను, దానివృత్తిచేతను ఉపహితమైన చేతనము సాక్షి యనబడును. ఈరెండు చేతనములకును ఘటాకాశ మఠాకాశములవలె, స్వరూపముగా భేదము లేదు. అయితే ముందు చెప్పిన ఉపాధులచే నయిన మాటమాత్రము భేదము గలదు. ఎప్పుడు జాగ్రత్త మొదలయిన కాలముల జాగ్రత్ప్రపంచరూప, లేక శుక్తిరూప లేక రజ్జురూప అంతఃకరణముయొక్క వృత్తి కలుగుచున్నదో, అప్పుడు రెండు ఉపాధులును; ఒకచోటు నందుండుటచే బాహ్యావిషయ చేతనమునకును, అంతరసాక్షి చేతనమునకును అభేదము చెప్పబడుచున్నది కావున జాగ్రత్ ప్రపంచ జ్ఞానరూపవృత్తిచే, దానిచే ఉపహితమయిన విషయచైతన్య ఆవరణము భంగ మగుచున్నది. అదియే, దానితో అభిన్నమయిన సాక్షిచేతన, ఆవరణభంగము. దానిచే స్వప్నము మొదలగు విషయముల నివృత్తియును వానిజ్ఞానముయొక్క నివృత్తియు గలుగుచున్నవి.

ప్రతీతియును జెప్పుటయు నయిన వ్యవహార మేదియో యది సిద్ధాంతమున సమ్మతింపబడిన *45. అనిర్వచనీయఖ్యాతి యనబడుచున్నది. ఎట్లు ముందు చెప్పిన దృష్టాంత మున్నదో *46 అట్లే *47. వర్తమాన (జరుగు) కాలమందును, భావికాలమందును గనబడుచున్న మిథ్యయగు అహంకారాది ప్రపంచ మేదియో దాని ముందుముందు అనుభవింపబడినదైన దాని సజాతీయ మిథ్య యయిన

*45. శూన్యవాది-రజ్జుదేశమునందైనను పుట్ట మొదలగు చోటులందైననుగల అసత్తైన (స్వరూపములేని) సర్పము ఏదియో, దాని చెప్పుటయు, కనబడుటయు నయిన వ్యవహారము రజ్జు దేశమందు కలుగుచున్నదని అసత్ఖ్యాతిని చేకొనుచున్నారు. అది యసంగత మగును, ఏలయన వంధ్యా (గొడ్రాలు) పుత్రునివలె, అసత్తయిన సర్పము మొదలగువాని ప్రతీతి అవిద్య మొదలగు కారణములు లేక సంభవింపక పోవుటవల్ల. (1) క్షణిక విజ్ఞానవాది:- రజ్జు దేశమందయినను, వేఱుచోటులందైనను ఏసర్పము కనబడుచున్నదో, యది బుద్ధికి వెలిగా లేదు. అయితే క్షణిక విజ్ఞానమయబుద్ధి రూప ఆత్మ యేదియో యది సర్పాకారముగా కనబడుచున్నది. అని ఆత్మఖ్యాతి చేకొనుచున్నాడు. అదియును అసంగతమే యగును:- ఏలయన, ఈవిధముగానే క్షణమునకు పైబడిన కాలమువఱకు సర్పము కనబడుట సంభవింపనందున *45. (2) నైయాయికుడు పుట్ట మొదలగు చోటులందుండు సర్పజ్ఞానము చక్షువునం దుండు దోషపు బలముచే నెదుటనుండు రజ్జుదేశమందు కలుగుచున్నదని. అన్యథాఖ్యాతి చేకొనుచున్నాడు. ఆదియు అసంగతమే. ఏలయన, ఇట్లయిన మధ్యచోటులందు గలవృక్షములు మనుష్యులు మొదలగు వస్తువుల జ్ఞానమున్ను దోషబలముచే కలుగుటచే, (3) సాంఖ్య ప్రభాకరమతముల ననుసరించువారు:- రజ్జుప్రదేశమున "ఇది సర్పము" అనునిచ్చట రెండు జ్ఞానములు కలుగుచున్నవి. వానిలో "ఇది" అనునది రజ్జువుయొక్క ఇదియనునంశము ప్రత్యక్ష జ్ఞానమగును. "సర్పము అనునది ముందు కనిన సర్పస్మృతిజ్ఞానము. ఈరెండుజ్ఞానముల అవివేకరూప ఆఖ్యాతి గలదని చేకొనుచున్నారు. అదియును అసంగత మగును. ఏలయన బుద్ధిదేశమందు సర్పస్మృతి గలదేని ఎదుటనుండు రజ్జుప్రదేశమున సర్పమునుజూచి తిరిగిపరుగెత్తుట, సంభవింపకపోవుటచే, (4) అద్వైతసిద్ధాంతమందు:- రజ్జు ప్రదేశమందు అవిద్య మొదలగు దోషబలముచే, ననిర్వచనీయ (మిథ్యయగు) సర్పమును దానిజ్ఞానమును ఉత్పత్తి యగుచున్నవి. పిమ్మట అదిష్ఠానజ్ఞానముచే, వాని నివృత్తి కలుగుచున్నది. ఈవిధముగా ననిర్వచనీయఖ్యాతి అంగీకరింపబడియున్నది. వానిక్రమముపైన సంగ్రహముగా వ్రాయబడినది.

*46. ఇక నిటనుండి ప్రపంచమిథ్యాత్వమును జెప్పుచున్నాడు. *47. ఇట ప్రపంచమునకు విత్తును వృక్షమునువలె ప్రవాహరూపమగు అనాదిత్వము సూచింపబడియున్నది

అహంకారము మొదలగు ప్రపంచజ్ఞానముచే తోచిన సంస్కారముతో గూడిన సకల అవివేకి జీవరూపద్రష్టయొక్క దృష్టిచే పూర్వకాలపు సకల జీవులయొక్క *48 అదృష్టమును అవివేకము మొదలగు దోషమునగు నిమిత్తముచే నేను చేతనరూపముగా నున్నాను. లేక నిత్యముక్తుడనై యున్నాను లేక పరిపూర్ణుడనై యున్నాను"- అను నట్టి చేతనానంద నిత్యముక్తత్వము మొదలగు అధిష్ఠాన విశేషణరూప *49. అప్రీతి (అజ్ఞానము) కలుగుచున్నది. "నేనున్నాను, లేక ఇది యున్నది" అనునట్టి అధిష్ఠాన సామాన్య స్వరూప *50. ప్రతీతి కలుగుచున్నది.

దానిచే అజ్ఞాన మున్నది తెలియుచున్నది అని బ్రహ్మముయొక్క సత్తాస్ఫూర్తిచే సిద్ధ మగుటచే స్వయమను బ్రహ్మ మేదియో దాని యాశ్రితముగా

---

*48. అదృష్ట మనునది ప్రారబ్ధ మగును. ఇట నిది రహస్యము:- నిరుపాధిక అజ్ఞానజన్యము, సోపాధిక అజ్ఞానజన్యము అను భేదములచే భ్రాంతి రెండువిధములు. విలక్షణ (తనసమకాలపర్యంతము కార్యమును నిలుపుటయగు) నిమిత్తకారణము, ఇట ఉపాధి యనబడుచున్నది. అదిగాక కేవల అజ్ఞానముచే దోచుభ్రాంతి నిరుపాధిక భ్రాంతి యగును. అది రజ్జు సర్పము, శుక్తిరజతము, మొదలగువాని భ్రాంతి యగును. విలక్షణమగు నిమిత్తకారణరూప ఉపాధితో గూడిన అజ్ఞానజన్యభ్రాంతి, సోపాధికభ్రాంతి యగును. ఎట్లు ప్రకాశఅంధకారముల సంబంధరూప ఉపాధితో గూడిన, అజ్ఞానముచే దోచునట్టి, ఆకాశ నీలత్వ భ్రాంతి యున్నదో, ఎట్లు బింబసన్నిధిరూప ఉపాధితో గూడిన అద్దపు అజ్ఞానముచే దోచిన ప్రతిబింబపు భ్రాంతి యున్నదో, అట్లే జీవులకు అదృష్టరూప ఉపాధితోగూడిన మూలజ్ఞానము చేదోచిన ప్రపంచభ్రాంతి యున్నది. అది ముందు చెప్పిన ఉపాధితో గూడిన అజ్ఞానముచే. దోచునదిగా నుండుటచే సోపాధిక భ్రాంతి యగును. నిరుపాధిక భ్రాంతియొక్క పాతితానువృత్తి (పాతమయిన పిమ్మట కనబడుట) కలుగుట లేదు. ఏలయన ఉపాధినిశ్చయము లేనందున, దానినాశమును, పాతమును నయిన రెండు నుండుటచే సోపాధిక భ్రాంతియొక్క పాతితాను వృత్తి కలుగుచున్నది. ఏలయన మిథ్యాత్వనిశ్చయరూపపాతము కలిగియు, ఉపాధియొక్క స్థితివరకు స్వరూప అప్రతీతిరూప నాశము లేనందున.

*49. ఇదియే మూల అవిద్య యగును.

*50. చేతన ఆనందము మొదలగు వానివలె సత్తును (బ్రహ్మస్వరూపము) అగును. అయినను కలుగని వస్తువును కలిగించు సామర్థ్యము గల అవిద్యయొక్క గొప్పతనముచే సత్తుయొక్క ప్రతీతి కలుగుచున్నది. కావున ఉపచారమునే అఖండైకరస బ్రహ్మమందు సామాన్య విశేషభావము చెప్పబడుచున్నది.

నుండుటచే "స్వాశ్రయము" అనంబడుటయు, "నేను బ్రహ్మము నెఱుగ" నని తానగు బ్రహ్మమును నావరణము చేయుటచే "స్వవిషయమును" "నేనజ్ఞాని" యను నభిమానము చేయుటచే *51. జీవుని ఆశ్రయించుటనగు నీవిధ మగునది మూలావిద్య యగును. దీనిని మూలప్రకృతి యనియు మహామాయ యనియు జెప్పుదురు. దానియందు కార్యమున కెదురుముఖమగు స్వభావరూప క్షోభము కలిగి యాయవిద్య తమోగుణాంశ పరిణామమగు సదసద్విలక్షణ అనిర్వచనీయ సమష్టిరూప స్థూల సూక్ష్మప్రపంచము *52. క్రమముగా నైనను *53. క్రమము లేక యైనను కలుగుచున్నది.

---

*51. ఏవిధముగా పెట్టెయందుంచబడిన ధనము "నేను ధనము గలవాడను" అని అభిమానించుటచే బురుషుని నాశ్రయముగా చెప్పబడుచున్నదో యావిధముగానే యవిద్య జీవుని యాశ్రయ మగును. ఇట "జీవుడు" అనుపదముచే సకలజీవులును, 'అవిద్య' యనుపదముచే సమష్టి అవిద్యయు చేకొనబడును.

*52. ఇది సృష్టిదృష్టివాద వ్యావహారిక పక్షప్రకారము చెప్పబడియున్నది. ముందుగ సృష్టి (ప్రపంచ ఉత్పత్తి) కలిగియుండి పిమ్మట కాలాంతరమందు దృష్టి అనగా దాని జ్ఞానమున కలుగు ననువాగమును (చెప్పుటను) వేదాంతశాస్త్రమందు సృష్టిదృష్టివాద మందురు. దీనినే వ్యావహారిక పక్షమనియు చెప్పుదురు. దీనియందు మూడు సత్తల అంగీకార మున్నది. పరమార్థసత్త, వ్యవహారసత్త, ప్రతిభాససత్త అను భేదములచే సత్త మూడువిధము లగును. ఎట్లు- అర్జునుడు సన్న్యాసియై సుభద్రను (కృష్ణుని చెల్లెలిని) పాణిగ్రహణము చేసెను అనుకథ మహాభారతమందు ప్రసిద్ధము. దానిని నటులు నటించుచున్నారు. అప్పుడు దానిని జూపెడు జనులు వానియందు (సన్న్యాసియైన నటునియందు "వీడు అర్జునుడు కపటసన్న్యాసియై యున్నాడు" అని) అర్జునత్వ సన్న్యాసిత్వముల ఆరోపణను చేయుచున్నారు. అట నటత్వము పరమార్థ సత్తును బోలియున్నది. దానియందు ఆరోపింపబడిన అర్జునత్వము వ్యవహారికసత్తను బోలియున్నది. దానియందు ఆరోపితమయిన సన్న్యాసిత్వము ప్రాతిభాసికసత్తను బోలియున్నది. దానియందు నటుని పరమార్థసత్తనో కల్పితము లేనిది యగును. అర్జునత్వము సన్న్యాసిత్వములవలె వ్యావహారికసత్తకును ప్రాతిభాసికసత్తకును క్రమముగా దీర్ఘ కాలముండుట అల్పకాలముండుట కనబడుచున్నవి. ఐనను కల్పితత్వము రెంటియందును సమానము అగును. కావున రెండు సత్తవాదములు ముఖ్యమైనను త్రిసత్తవాదపు ప్రకారముగురించి అనేక జిజ్ఞాసువులకు తత్త్వబోధము గలదు. అందుచేతను అద్వైతసిద్ధాంతమునకు హానిలేదు. దేనికి మూడు కాలములయందు బాధ కలుగుట లేదో దానికి పరమార్థసత్త గలదు. దానివంటిది చేతన మగును. దేనికి బ్రహ్మజ్ఞానము లేక బాధ కలుగుట లేదో, బ్రహ్మజ్ఞానముచే దేనికి
(cont...)

*54 అదే నిమిత్తముచేత *55 కాలాంతర మందైనను *56 అదే కాలమందైనను ముందు చెప్పిన అవిద్య సత్త్వగుణపరిణామ మయిన *57 అకారణ వృత్తిరూప లేక *58 అవిద్యావృత్తిరూప దానిజ్ఞానమున కుత్పత్తి కలుగుచున్నది. ఈవిధప్రపంచమును దానిజ్ఞానమును అవిద్యచే కల్పితమగును. దీనిచే కార్యాధ్యాసము సిద్ధించుచున్నది.

అధిష్ఠానమందును వేఱయిన సత్తాస్ఫూర్తి కనబడుటలేదో దానికి వ్యావహారికసత్త గలదు. ఈవిధమైనది ఆకాశము మొదలగు ప్రపంచమును మాయయును నగును. దేనికి బ్రహ్మజ్ఞానము లేకయే రజ్జు మొదలుగువాని జ్ఞానముచే బాధ కలుగుచున్నదో, దాని ప్రతిబాససత్త గలదు. ఈవిధమగునవి రజ్జుసర్పము మొదలగునవి యగును.

*53. ఇది దృష్టిసృష్టివాదము చొప్పున చెప్పబడినది. దృష్టి యనునది జ్ఞానము. దాని సమకాలమున సృష్టిని (ప్రపంచపు ఉత్పత్తిని) చెప్పుట దృష్టిసృష్టివాద మనబడును. కావున పరమార్థసత్త ప్రతిభాససత్తయను భేదమచే రెండుసత్తల అంగీకారము గలదు. వానిలో చేతనమునకు పరమార్థసత్తయు సకలప్రపంచమునకు ప్రతిభాససత్తయును గలదు. దానిలో జాగ్రత్ ప్రపంచము సంవాది (మణియొక్క ప్రభయందు మణియొక్క భ్రమవలె సఫలప్రవృత్తిని కలుగజేయు) భ్రమ యగును. స్వప్నప్రపంచము విసంవాది దీపప్రభయందు మణియొక్క (రత్నముయొక్క) భ్రమవలె నిష్ఫలప్రవృత్తిని గలుగజేయు భ్రమ యగును. ఇంతటి వ్యత్యాసము లున్నవి.

*54. అదృష్టము మొదలగు నిమిత్తముచే *55. ఇది మూడుసత్తలవాదము చొప్పున చెప్పబడినది. *56. ఇది రెండుసత్తల వాదముప్రకారము చెప్పబడినది. *57. ఇది మూడుసత్తలవాదము ప్రకారము చెప్పబడినది. *58. ఇది రెండుసత్తలవాదము ప్రకారము చెప్పబడినది.

ఈపక్షమందు జాగ్రత్ స్వప్నముల పదార్థములకు ముందు (53వ టిప్పణమున) చెప్పిన విలక్షణమునకంటె వేఱువిలక్షణతనము (వేఱుపాటు) లేదు. అయితే సకల పదార్థములును ప్రాతిబాసికములును సాక్షిభానులు నగును. ప్రమాతృభాసికములు కావు. అవిద్యయొక్క వృత్తివలన నైనను లేక కేవలము మనస్సుయొక్క వృత్తివలన నయినను దేనిని సాక్షి (వెల్లడి) ప్రకాశింపజేయుచున్నదో యది సాక్షిభాస్యము ప్రాతిభాసికము జీవదృష్టి యనబడుచున్నది. ఇంద్రియమూలకముగ అంతఃకరణవృత్తిచే దేనిని సాక్షి ప్రకాశించునటుల తెలుపుచున్నదో యది ప్రమాతృభాస్యము, వ్యావహారికము, ఈశ్వరసృష్టి యనబడుచున్నది.

తనప్రకాశముకొఱకు వేఱుప్రకాశముయొక్క అపేక్ష లేనిదై యుండుటవలన తన్ను తక్కినవానిని నిర్వహించు దీపమువలెను. సాంఖ్యులు మొదలగు వారు అభిప్రాయానుసారముగా *59 తన్నును తక్కిన వానిని నిర్వహించు స్వప్రకాశాత్మను బోలియును, నైయాయికుడు కొనియుండు తన్నును, తక్కిన వానిని నిర్వహించు ఘటపటముల అన్యోన్యాభావరూప భేదమును *60. భేదించునది తానే యగు భేదమువలెను, ముందుచెప్పిన కార్యాధ్యాసముయొక్క కారణమయిన మూలావిద్య యేదియో యది తననున్ను తక్కినవానిని నిర్వాహము చేయునదిగా నుండుటవలన శుద్ధచేతనరూప అధిష్ఠానమున తనకల్పితమునకు అధ్యాసమునకు కారణము తానే యగును.

ఆ సామాన్యచేతనము దారువునందుండు సామాన్య అగ్నిని పోలును. సుషుప్తియందుండు అవిద్య ఆశ్రయమయిన తానైన చేతనమువలెను దానికి (అవిద్యకు) *61 విరోధి కానేరదు. అయితే సత్తాస్ఫూర్తివలన దానికి సాధన

*59. సాంఖ్యప్రభాకరుని మతమందును, కొందఱు ఉపాసకుల మతమందును తన్నును తన్ను సంబంధించియుండు దేహము మొదలగు సకలవస్తువులను ఆత్మ ప్రకాశింప జేయుచున్నది. కావున ఆత్మ స్వప్రకాశ మగునని చేకొనుచున్నాడు. అద్వైతసిద్ధాంతమందు దనప్రకాశమందు తనతో సకల ప్రకాశముల అపేక్ష లేనిదియై అన్నిటిని ప్రకాశింపించు చుండునదిగా నుండుటవలన ఆత్మ స్వప్రకాశ మగునని చేకొనియున్నారు. ఇది భేదమగును.

*60. నైయాయికుని మతమందుః- ఎట్లు ఘటపటముల భేదించునది (భేదము చేయునది) ఆరెంటిభేదమో; అట్లు భేదమునకు ఘటము మొదలగు వానితో నుండు భేదమేదియో యా తనభేదమును ఘటము మొదలగు వానిని భేదించునదియును తానగు నొకే భేదమే యగును అని చేకొనియున్నారు. ఇచ్చట తానే క్రియయొక్క కర్తయును దానే క్రియయొక్క కర్మము (విషయము) ఉండుటవలన ఆత్మాశ్రయరూపదోషము కలుగుచున్నది. ఆ యాత్మాశ్రయము వారికి దూషణరూపము కాదు. అయితే భూషణ రూపమగును. ఈలాగుననే ఆసిద్ధాంతమందును తన అధ్యాసమందు అవిద్య తానే కారణ మగునని చేకొనబడియున్నది. ఇట ఆత్మాశ్రయ రూపదోషము గలదు. అదియును దూషణరూపము గాదు. భూషణరూప మగును.

*61. సామాన్యచేతనము అజ్ఞాన ఆశ్రయమును విషయమును నగు ననుమాట "నేను (బ్రహ్మమునకు వేఱయిన ప్రత్యగాత్మ) అజ్ఞాని, బ్రహ్మము నెఱుగను" అను అనుభవము

(cont...)

మగును, కావున కారణాధ్యాసమును బొందుచున్నది. ముందుచెప్పిన కార్యాధ్యాసమును బొందుచున్నది. ముందు చెప్పిన కార్యాధ్యాసము 1. అర్థాధ్యాసము 2. జ్ఞానాధ్యాసము అను భేదములచే రెండువిధము లగును.

3. సర్పము మొదలగు విషయములందు భ్రాంతి యేదియో యది యర్థాధ్యాస మనబడుచున్నది. అదియే అన్యోన్యాధ్యాసము నగును.

4. ముందుచెప్పిన సర్పము మొదలగు విషయముల జ్ఞానభ్రాంతి యేదియో యది జ్ఞానాధ్యాస మనబడుచున్నది. వానిలో పరోక్షము అపరోక్షము అని జ్ఞానాధ్యాసమునకు రెండు భేదము లున్నవి. అర్థాధ్యాసమునను *62 అనేక భేదములు గలవు. ఇట ఇది విశేష మగును:-

---

చేనైనను లేక సుషుప్తియందుండు చేతన అజ్ఞానముల అవిరోధ అనుభవముచే నైనను సిద్ధించుచున్నది. కావున స్వప్రకాశ చైతన్యమునందు అజ్ఞాన మెచ్చటనుండి కలుగును? అది లేక ఆవరణమెట్లు కలుగును? అది లేక జననము మొదలగు సంసారరూపవిక్షేప మెట్లు గలుగును? అది లేక దానిని బాధించు జ్ఞానమున్ను దానిసాధనముల బోధించు శాస్త్రములును నిష్ఫలము లగునను నీ మొదలగు కుతర్కసమూహములను ముందు చెప్పిన స్వానుభవరూప ప్రబలప్రమాణము మ్రింగుచున్నది. వీనిచే సామాన్యచేతనము అజ్ఞానమునకు విరోధి కానేరదు. అయితే వృత్తిచేగూడిన చేతనము లేక చేతనముతో గూడిన వృత్తి అజ్ఞానమునకు విరోధి యగును. ఎట్లు కాష్ఠమును (కట్టెను) చిలుకుటచే బయటికివచ్చి వత్తియందుండు అగ్ని యంధకారమునకు విరోధి యగునో యట్లు అదియును విరోధి యగును. వానియందును ఏవిషయ ఆహారముగా వృత్తి గలుగుచున్నదో ఆవిషయమునందుండు అజ్ఞానమునకు ఆ విశేషచేతనము (వృత్తితోగూడిన చేతనము) విరోధి యగును. తక్కినదానికి విరోధి కానేరదు. ఎట్లు ఘటరూపవృత్తితో గూడిన చేతనముచే, ఘటఅజ్ఞానమునకు నాశము కలుగుచున్నదో, పటఅజ్ఞానమునకు నాశము కలుగుట లేదో, అట్లు బ్రహ్మాకారవృత్తితో గూడిన చేతనమువలన బ్రహ్మముయొక్క అజ్ఞాననాశము కలుగుచున్నది. తక్కినవానియొక్క అజ్ఞాననాశము కలుగుట లేదు. ఇది వివేకము.

*62. కేవల సంబంధాధ్యాసము (సంసర్గాధ్యాసము) సంబంధముతో గూడిన సంబంధి అధ్యాసము (సంసర్గ సహిత స్వరూపాధ్యాసము. అదియే అన్యతరాధ్యాస మగును) అనుభేదముచే అర్థాధ్యాసము రెండువిధము లగును. వానిలో సంబంధసహిత సంబంధి అధ్యాసమును కేవల ధర్మాధ్యాసము, ధర్మసహిత ధర్మి అధ్యాసము అను భేదములచే నిరుతెఅగులు ముందు

(cont...)

1. అజ్ఞానము, అహంకారము(అంతఃకరణము) దానిధర్మము ఇంద్రియము, ఇంద్రియముయొక్క ధర్మము, దేహము, దేహధర్మము అను నీ మొదలగు అనాత్మకును వానిని ప్రకాశింపించు *63. ఆత్మకును కాంచిన ఇనుపముక్క యందు ఇనుమునకును అగ్నికిని గల తాదాత్మ్యమువలె తాదాత్మ్యము గలదు అది అధ్యాసముయొక్క స్వరూప మగును.

2. అధిష్ఠాన విశేషరూప అజ్ఞానము అధ్యాసమున కుపాదాన *64 కారణ మగును.

(1) సజాతీయ వస్తువుయొక్క జ్ఞానముచేత గలిగిన సంస్కారము.

(2) లోభము భయము, మొదలగు *65 ప్రమాత (అంతఃకరణ) దోషము.

(3) పిత్తము కామాల మొదలగు *66 ప్రమాణ (నేత్రము మొదలగు

చెప్పిన రెండు అధ్యాసములయందును ఆత్మయొక్క తాదాత్మ్యసంబంధ అధ్యాసము అవశ్యము కలుగుచున్నది. కావున అన్యోన్యాధ్యాస మన్ననో యీరెండు అధ్యాసములయందును అనున్యూతముగా (లో చేరికగా) నున్నది. అన్యతరాధ్యాస మన్ననో అన్యోన్యాధ్యాసయొక్క ఏకదేశ (ఒకయంశ) అనగా స్వరూపాధ్యాస రూపముగా నుండుటచే దీనియందైనను లేక సంబంధి అధ్యాసమందైనను అణగును. అయితే అనాత్మయందు (ఆరోపితమందు) సత్యఆత్మ (అధిష్ఠాన) కేవలసంసర్గాధ్యాసము కలుగుచున్నది. స్వరూపాధ్యాసము కలుగుట లేదు. ఆత్మయందు (ఆరోపము లేని దానియందు) మిథ్య యయిన అనాత్మయొక్క సంబంధసహిత సంబంధియొక్క (సంసర్గ సహిత స్వరూపముయొక్క) అధ్యాస కలుగుచున్నదనుట నిశ్చయము.

*63. రజ్జువుయొక్క సంబంధము సర్పమందు అధ్యస్త మగును. సర్పసంబంధసహిత స్వరూపము రజ్జువందు అధ్యస్తము. ఇట్లా రెంటికిని పరస్పర అధ్యాసరూప తాదాత్మ్యము గలదు. అట్లే ఆకల్పిత ఆత్మయొక్క సంబంధము అనాత్మయందు అధ్యస్తము. కల్పితఅనాత్మ సంబంధముతో గూడి స్వరూపము ఆత్మయందు అధ్యస్త మగును. ఈవిధముగా ఆత్మానాత్మలకు కాచిన ఇనుమును బోలి పరస్పరాధ్యాసరూప తాదాత్మ్యము గలదు. ఎక్కడను (అన్ని అధ్యాసలందును) అధిష్ఠాన ఆరోపితములకు ఈవిధము తాదాత్మ్యము గలుగుచున్న దనునది యభిప్రాయము.

*64. ఉత్పత్తిస్థితిలయముల కారణము. *65. ఆత్మయందు అనాత్మ అధ్యాసయందు జీవుల అదృష్టరూప ప్రమాతృదోషము గలదు. *66. ఆత్మయందు అనాత్మ అధ్యాసయందు (cont...)

ఇంద్రియముల) దోషము

(4) మూవలయ (ముక్కోణ) రూపతయు తళ తళ మెఱుపువలె మొదలగు సాదృశ్యరూప *67 ప్రమేయ ప్రమాణముచేత నెఱుగదగిన అధిష్ఠానదోషము.

(5) అధిష్ఠానము *68 ఇదంతయును *69 సత్తమయమునగు సామాన్య రూపజ్ఞానమను నీయైదును అధ్యాసనిమిత్త కారణము లగును.

3. పుత్రులు మొదలగు వారియందు గల యాత్మభ్రాంతి అధ్యాస అవధి యగును.

4. జననమరణములు మొదలగు సంసారము అధ్యాసయొక్క *70. ఫలమగును. ప్రత్యగభిన్న అంతరాత్మకంటె వేఱుకాని బ్రహ్మరూప అధిష్ఠానజ్ఞానముచేత గారణముతో గూడిన ప్రపంచమును, దానిజ్ఞానమును నైన వీని *71. మిథ్యాత్వ నిశ్చయము, లేక *72. మూడుకాలములు లేని నిశ్చయమను నిష్పత్తి కలుగుచున్నది.

ఏవిధమున పదుగురు పురుషులకు, రజ్జురూప అధిష్ఠాన అవిద్యచే దండము, సర్పము, హారము, మ్రానివేరు, జలధార, భూమిపగులు అనునట్టి మొదలగు విలక్షణభ్రాంతి కలుగుచున్నది; లేక, అందఱికి ఒకే సర్పభ్రాంతి కలుగుచున్నది. అయితే ఎవ్వరికి రజ్జురూప అధిష్ఠానజ్ఞానము కలుగుచున్నదో, వానిదృష్టివలన, తనసాక్షి యాశ్రితమయిన, అవిద్యాంశ తిరస్కారముచేత నైనను, నాశముచే నైనను, భ్రాంతినివృత్తి కలుగుచున్నది. అధిష్ఠానజ్ఞానము లేని అన్యపురుషుల దృష్టిచే,

---

తానే పొందిన ప్రమాణరూప ఆత్మయందు గల అవిద్య యేదియో యది ప్రమాణదోష మగును. *67. ఆత్మయందు అనాత్మ అధ్యాసయందు ఆత్మయందుగల నిరపేక్షత, అనాత్మయందును సాపేక్షత గలదు. కావున ఆరోప్యము (అనాత్మ)తో అధిష్ఠానమునకు సాదృశ్యము గలదు. అది ప్రమేయదోషము అగును. *68. ఇది రజ్జువు మొదలగు దృష్టాంతముల కొఱకు చెప్పబడినది. *69. ఇది బ్రహ్మరూప దార్ష్టాంతముకొఱకు చెప్పబడినది. *70. రజ్జుసర్పము మొదలగు అధ్యాసకు భయము, అదురుట మొదలగునవి ప్రయోజనము లగును. *71. ఇది వ్యవహారసత్తవలన లేక ప్రతిభాససత్తవలన బాధలక్షణ మగును.

*72. ఇది పరమార్థసత్తగా బాధలక్షణ మగును.

అవిద్యతోగూడిన భ్రాంతి ఎట్లో యట్లు (ఉన్నరూపమున) నెలకొనుచున్నది.

ఆవిధముననే, సకలపురుషులకు అధిష్ఠానబ్రహ్మ అవిద్యచే దేవతలు మనుష్యులు మొదలగు భేదములచే పరస్పరము *73 విలక్షణముగా నైనను, లేక *74, సమానముగా నైనను అధ్యస్తముగా ప్రపంచమును దానిజ్ఞానమును గలుగుచున్నవి. అయితే ఎవనికి ప్రత్యగభిన్న బ్రహ్మరూప, అధిష్ఠాన అపరోక్ష జ్ఞానము కలుగుచున్నదో వానిదృష్టిచే కారణసహితప్రపంచము, దానిజ్ఞానము అనువాని నివృత్తి కలుగుచున్నది. అధిష్ఠానజ్ఞానము లేని, అన్యపురుషులదృష్టిచే కారణముతో గూడిన ప్రపంచమును, దానిజ్ఞానమును ఉన్నరీతిగనే *75 అనాదిరూపముగా నెలకొనియున్నవి. ఇది మూడవప్రశ్నమున కుత్తర మగును.

34. శిష్యుడు అడుగుచున్నాడు:- భగవానుడా! ఏవిధముగా భయంకరమగు స్వప్నము కనబడుచున్నదో, అది మిథ్యయైనను పాదప్రక్షాళనము (కాళ్ళు కడుగుట) గజేంద్ర మోక్షపఠనము మొదలగు నుపాయములచేత దాని నివృత్తి కలుగుచున్నదో, ఉపాయము లేక తీరుట లేదో,

ఆవిధముగానే యీ కనబడుచున్న జగత్తు అధ్యాసరూపముగా నుండుటచే మిథ్యయైనను, ఉపాయము లేక యది చెడుట లేదు. అయితే జ్ఞానము లేక, భక్తి లేక కర్మమును నేదైననొక యుపాయముచేతనే చెడును. కావున దీని నివృత్తి ఉపాయమును నాకు గృపచేసి చెప్పవలయును. నేను తమపాదములకు నమస్కరించుచున్నాను.

---

*73. ఇది ప్రతిజీవునియొక్క సృష్టిభేదమును అంగీకరించు, వాచస్పతి మిశ్రులు మొదలగువారి మతమున (చెప్పబడినది)

*74. ఇది శాస్త్రప్రసిద్ధ సాధారణమతమువలన చెప్పబడినది.

*75. ఎట్లు నిద్రకాలమున స్వప్న అనాదిత్వము కనబడి, జాగ్రత్తకాలమున దానికి బాధ కలుగుచున్నదో అట్లు అజ్ఞానదశయందు కారణముతోగూడిన ప్రపంచ అనాదిత్వము కనబడి జ్ఞానరూపజాగ్రత్తకాలమున దానికి బాధకలుగుచున్నది. అనాదిరూప ఘటము మొదలగు కార్యముల ప్రాగభావనాశమువలెను, కొండగుహయందుండు అనాది అంధకార నాశమువలెను అనాదివస్తువు నాశమును అనుభవసిద్ధ మగును.

35. నివృత్తి లక్షణము

ఇప్పుడు శ్రీ గురువు జగత్తుయొక్క అత్యంతనివృత్తి ఉపాయమును చెప్పుటకు బూర్వము నివృత్తిభేదముల చెప్పుచున్నాడు.

నివృత్తి రెండువిధము లగును:-

1. ఒకటి కారణమందు కార్యముయొక్క లయరూపనివృత్తి యగును, అది సుషుప్తి, మూర్ఛ, మరణము, ప్రళయము అను నవస్థలయందు జగత్తు తనకారణమయిన అజ్ఞానమునందు లయ మగుటయును, పగులునట్టి యవస్థయందు ఘటము, మన్నురూపముగా మిగులుటచే మంటియందు లయ మగుటయు నగును.

2. మఱియొకటి కారణముతో కార్యలయ రూపనివృత్తి యగును. అది మోక్షదశయందు అజ్ఞానరూప కారణముతో జగము లయ మగుటయును, దగ్ధపటము (మండింపబడిన వస్త్రము) తనకారణమయిన తంతువుతో (నూలుతో) లయ మగుటయు నగును.

ఇట్లీ రెండువిధముల నివృత్తి చెప్పబడినది. వానిలో,

(1) కారణమందు కార్యలయరూప మొదటినివృత్తి యేదియో యది అసారము. అనగా మోక్షమందుపయోగము లేనిదై యుండుటచే శ్రేష్ఠము లేనిదగును.

(2) కారణముతో కార్యపులయరూప రెండవనివృత్తి యేదియో యదియే సారమయిన దగును. అనగా మోక్షమునం దుపయోగము గలదిగా నుండుటచే శ్రేష్ఠమగును.

కావున జగత్తుయొక్క రెండవ నివృత్తియే ముముక్షువునకు జ్ఞానముచే సంపాదింప దగినదగును.

36. జగముయొక్క నివృత్తి ఉపాయవర్ణనము.

జగత్తునకు కారణము అజ్ఞానము. దానికార్యము జడమగు జగత్తని తెలియునది. ఇట జడమనుపదము చేతనరూప చిదాభాసుని సూచించునదై యుండుటచే, జడచేతనరూప చరాచరజగత్తు అజ్ఞానపు కార్య మగును. ఆరెంటియందు ముందు చెప్పిన అత్యంతనివృత్తి జ్ఞానముచే గలుగుచున్నది. దీని నివృత్తికొఱకు వేఱు ఉపాయము లేదు. ఏలయన "జ్ఞానము లేక ముక్తి కలుగనేరదు" దానినే యెఱిగి మృత్యువును దాటుచున్నాడు ;మోక్షమునకు పోవుటకొఱకు వేఱుమార్గము లేదు" అనుట మొదలగు ననేక శ్రుతులుండుటచే నీశ్రుతులను అర్థముతో ముందు (రెండవ యుపదేశమందు) చెప్పియుంటిమి. ఐనను, ముముక్షువు దృఢతనముకొఱకు మఱియు వానినిట జ్ఞాపకపఱచితిమి గాన నది పునరుక్తి (చెప్పినది మఱల చెప్పుట) కానేరదు.

37. జ్ఞానముయొక్క విషయమును (బ్రహ్మాత్మైక్యమును) చెప్పుట.

ఇప్పుడు శ్రీగురువుగారు జ్ఞానస్వరూపమును చెప్పుటకు ముందు జ్ఞాన విషయమగు బ్రహ్మాత్మలయొక్క ఐక్యమును జెప్పుచున్నాడు:-

1. స్థూలదేహమును దాని స్థూలత్వము (లావు), కృశత్వము (సన్నము), గౌరవత్వము(గురుత్వము), నలుపు (వర్ణము), జాతి, ఆశ్రయము (స్థితి)- మొదలగు ధర్మములును; దాని (దేహ) జాగ్రత్త బాల్యము మొదలగు అవస్థలును, మొదలగునవిగా తక్కిన ఇంద్రియములును ప్రాణము, మనస్సు, బుద్ధి, అజ్ఞానము, వానిధర్మము, అవస్థ- యనునవియును వ్యష్టి ప్రపంచ మగును.

2. విరాట్టు మొదలగు శరీరమును, సర్వజ్ఞత్వమును సృష్టిని కలుగజేయుట మొదలగునవి; వానిధర్మములు ఉత్పత్తి మొదలగువాని అవస్థలు మొదలగునవి, సమష్టిప్రపంచ మగును.

ఈ దేహాదిప్రపంచముకంటె వేఱగు (వివేకదృష్టిచే భిన్నమయిన) అహం ప్రత్యయమునకు (నే నను పదమునకును) నేనను వృత్తికిని విషయమయిన

యాత్మస్వరూప మేదియో యది, సంగము (సంయోగము మొదలగు రూప లేక, సజాతీయ విజాతీయ స్వగతరూప సంబంధము), వికారము, (జన్మము ముందులేదు. వెనుక గలదను) అస్తిత్వము; వృద్ధి (పెరుగుట), విపరిణామము (తిరుగుట), అపక్షయము (తక్కువ), నాశము- అనునాఱు లేక చలనరూపక్రియ యను నీ మొదలుగా నింకను గల యనేకసంసారధర్మములు లేనిది యగును.

స్థాలీపులాకము (ఒకబియ్య ముడికిన అన్నిబియ్యము లుడుకుట) అను న్యాయముచే లేక ఒకయింట ఆకాశము సిద్ధింపగా నన్నియిండ్లయందైనను లేక బ్రహ్మాండమందైనను నాకసము సిద్ధించు విధమున; ఎట్లు ఒకశరీరమందు సచ్చిదానందరూపాత్మ "నేనున్నాను; నేను ప్రకాశించుచున్నాను; నేనెప్పుడు ప్రియుడనై యున్నా"నను అనుభవముచేత సిద్ధించుచున్నదో, యట్లు అన్యశరీరములందును, నాకసము మున్నగు ప్రపంచమునందును సిద్ధించుచున్నది. కావున నది పూరణము (అన్నిచోట్ల వ్యాపించినది) అగును. దీనిచేతనే యది బ్రహ్మరూప మగును.

ఈవిధమున నిట మహావాక్యార్థరూపమును, జ్ఞానవిషయరూపమును నగు బ్రహ్మాత్మయొక్క ఐక్యము చెప్పబడెను.

ఆత్మ, ఈశ్వరుడు, సృష్టి యను వాని విషయమగు ప్రశ్నోత్తర వర్ణనమను మూడవ యుపదేశము సమాప్తము

నాల్గవ యుపదేశము

బ్రహ్మాత్మైక్య సామాన్యనిరూపణము

38. శిష్యుడు ప్రశ్నించుచున్నాడు:- స్వామీ! కర్త, భోక్తయను సంసారజీవుడనగు నేను, ఎట్లు బ్రహ్మరూప మగుదును అనునిట్టి సంశయము నాహృదయమున నినుపచీలవలె కష్టపఱచునదై యుండుటచే చీలయై యున్నది. ఆ సంశయమునే దయయుంచి తాము నాశముచేసి కృపజేయవలయును.

39. ఇప్పుడు బ్రహ్మమునందు జీవత్వసంభవమును గురువుగారు చెప్పుచున్నారు.

మహాకాశమువలె పరిపూర్ణమైయున్న బ్రహ్మము, అశంకయైనను కల్పితదేహ రూపఘటమందున్న మాయా (అవిద్యా) రూపఘటజలశంకచే (కల్పిత సంబంధముచే) శరీరము రెంటి యభిమానమును జేసి పరిచ్ఛిన్నమయిన జీవరూపముగా గనబడియున్నది.

వేఱుదృష్టాంతము:- నిర్వికారకుంతీదేవి పుత్రుడయిన కర్ణునందు రాధ యను దాసిసంబంధముచేత రాధాపుత్రత్వము (దాసత్వము) కనబడునట్టి రూపభ్రాంతి కలిగెను. పిమ్మట సూర్యుని వాక్యముచే వానికి రాధయొక్క పుత్రత్వభ్రాంతి నివృత్తియై కలరూప కుంతీపుత్రత్వము కనబడురూపమైన తేటయగు జ్ఞానము కలిగెను. అట్లే నిర్వికార చిదానందఘన బ్రహ్మమునందు అవిద్యాసంబంధముచే జీవత్వపు కనబడు రూపభ్రాంతి కలిగియున్నది. పిమ్మట గురురూపసూర్యుని వచనముచే నాజీవత్వభ్రాంతి పోయి కలరూపమున బ్రహ్మత్వము ప్రతీతి యయిన చక్కని జ్ఞానము కలుగుచున్నది.

40. జీవస్వరూప వర్ణనము.

ఘటమందు నిండించిన జలమందుండు మహాకాశప్రతిబింబమువలె బుద్ధియందు లేక దాని కారణమయిన అవిద్యయందుగల బ్రహ్మాభాస మేదియో

యది అవివేకదృష్టిచే తన యధిష్ఠాన మయిన కూటస్థచేతనముతో గూడినదై (కూటస్థచేతనముతో తాదాత్మ్యము గలదై) కనబడుచున్నది. దానిని జీవుడందురు.

41. స్థూలదేహరూప ఘటమందు బుద్ధిరూప లేక అవిద్యారూప జలము నిండియున్నది దానియందుండు బ్రహ్మాభాసమును మిథ్యయని యెఱిగి విడుచుటచే, మిగిలి నిలిచిన దగువాని అధిష్ఠానమగు చిద్రూపకూటస్థచేతన మేదియో యది మహాకాశమువలె బ్రహ్మ మగును. (పరిపూరణ చేతనరూప మగును) అదియు తానే తానగు స్వరూప మగును.

ఎట్లు ఐంద్రజాలక పురుషుడు మాయచే నయిన శరీరమును ధరించిన వాడై మాయికమైన (మాయచేనైన) ఏనుగుమీద కూర్చుండి కదలక యుండువాడైనను కదలువాడై కనబడుచున్నాడో, అట్లు ప్రాణమునందును (ప్రాణము మొదలగువానితో గూడిన జాగ్రత్తయందును), స్వప్నమందును ప్రవేశించినదై (సంబంధమూలమున అధ్యస్తమయి) అచల (అకర్త) రూపమయి యుండియు ఆత్మ చలించుచున్నది. (క్రియయొక్క కర్తయు దీనిచే భోక్తయు నయి కనబడుచున్నది.)

ఇంటియందుండు అర్కాభాసము (సూర్యచ్ఛాయ) చేతిక్రియచే కదలనిదై యుండియు, కదలునట్లు కనబడుచున్నది. దానివలె దేహ ఉపాధిచే అచలమయిన ఆత్మ చలించునట్లు అభిప్రాయమిది:- ఆత్మ అకర్త యగును, కావున అభోక్త యగును. దీనివలన దాని బ్రహ్మత్వముయొక్క జ్ఞానము సంభవించుచున్నది.

42. జ్ఞానస్వరూప వర్ణనము.

మూడుశరీరములు గలవు. వానికి మూడు అవస్థలు గలవు. ఆ మూడు దేహములందును పంచకోశములు గలవు. నేను వీనికి సాక్షి. కావున నీసాక్ష్య (సాక్షిచే నెఱుగబడునది) రూపసంఘాతము నేను గాను. అయినను సాక్షిరూపప్రత్యగాత్మ యగు నేను వీనికి వేఱుగా నున్నాను.

ఇట్లు నిజస్వరూపమును నెఱిగి పిమ్మట దానిని బ్రహ్మమునకు అభిన్నముగా

నెఱిగిన అబ్రహ్మమున కభిన్నమయిన ఆత్మయే యెప్పుడున్ను సచ్చిదానంద రూపమగును.

అదియునుగాక ప్రపంచము సత్యముగానే ద్వైతము సిద్ధించుటచే అద్వైతశ్రుతిచేత జెప్పబడు బ్రహ్మాత్మైక్యము పొసగదు. కావున నిట బ్రహ్మాత్మైక్యమును జెప్పుటచే నాబ్రహ్మాభిన్న ఆత్మకు భిన్నమయిన కార్యకారణ రూప ప్రపంచమేదియో యది యద్దమందున్న నగరప్రతిబింబమునువలెను, స్వప్నమునువలెను అధ్యస్తమయి యుండుటచే మిథ్య అనునది అర్థముచే సిద్ధించుచున్నది.

ఈవిధమగు నిశ్చయము (సంశయవిపరీతములు లేని ఎఱుక) ఏదియో యది జ్ఞాన మనబడును. అజ్ఞానమే ప్రపంచరూప అనర్థవృత్తి రూపమును పరమానందరూప బ్రహ్మప్రాప్తి స్వరూప మయిన మోక్షమునకు హేతువు నగును. (సాక్షాత్) సాధనము నగును.

బ్రహ్మాత్మైక్య సామాన్యనిరూపణమను నాల్గవయుపదేశము
సమాప్తము.

ఐదవ యుపదేశము

***76 దేహత్రయ ఆత్మవివేచన వర్ణనము.**

43. శిష్యుడు ప్రశ్నించుచున్నాడు.

యథా ముంజాదిషీకేవ ఆత్మా యుక్త్యా సముద్ధృతః ।
శరీర త్రితయాద్ధీరై : పరం బ్రహ్మైవ జాయతే ॥

"ఎట్లు ముంజయును ఆకు మూసిన శలాకరూపతృణ (కసవు)

*76. ముందు మూడవ యుపదేశమున దిఙ్మాత్రమును జూపునదివలె సంగ్రహముగా దేహములందుండి వేఱుచేయబడిన ఆత్మ యేదియో యది యిప్పుడు ఇటనుండి (ఐదవ యుపదేశమందుండి) ఏడవ యుపదేశ పర్యంతము విశేషముగా వేఱుపరచబడుచున్నది. కావున నిట పునరుక్తిరూప దోషప్రాప్తి లేదు.

విశేషమునుండి ఇషీకము (నడిమిదంటు) ఎత్తబడుచున్నదో యట్లు ధీరపురుషుల యుక్తిచే మూడు శరీరమునుండియు చక్కగా నెత్తబడిన ఆత్మ పరబ్రహ్మ రూప మగుచున్నది." అను శాస్త్రమందు (పంచదశియందు) చెప్పబడిన యర్థమును నెఱుగుటకొఱకు శిష్యు డడుగుచున్నాడు.

1. గురుశ్రేష్ఠుడును, శ్రోత్రియుండును బ్రహ్మనిష్ఠుడు నయిన గురువరా! తాముచెప్పిన మూడు దేహము లేవి? ఇది దేహముయొక్క పేరును గూర్చిన ప్రశ్నము.

2. ఈమూడు దేహముల రూపమేది - ఇది వాని విపాకపూర్వక మయిన స్వరూపముయొక్క ప్రశ్నము.

3. ఆత్మ యెట్లు వీటికంటెను వేఱై యున్నది? ఇది వాని విచార ఉపయోగము యొక్క ప్రశ్న మగును.

ఈమూడుప్రశ్నములకు తాము కృపచేసి యుత్తరము చెప్పవలయును.

44 గురువుగారు చెప్పుచున్నారు.

1. స్థూలదేహము, లింగదేహము, కారణదేహ- మను నీమూడుదేహము లగును.

2. ఈవిధము చెప్పిన మూడుదేహములు కార్యకారణరూపములై యున్నవి.

(1,3) వానిలో స్థూలదేహమును లింగదేహమును నగు రెండును అవిద్యచే చేయబడినవై యుండుటచే అవిద్య కారణరూప మగును.

(3) కారణదేహము జగత్తునకు గారణ మయిన మూలప్రకృతియొక్క అవస్థావిశేషమగు నవిద్యరూపముగా నుండుటచే గారణరూప మగును.

ఇది వాని విపాక మగును. కార్యకారణత లేనిదియు ప్రపంచము నందుండు ఉపమానము లేనిదియు నగునది ఆత్మ యగును.

45. ఇప్పుడు స్థూలదేహ స్వరూపమును దానితో ఆత్మకు గల భేదమును

శ్రీగురువుగారు చెప్పుచున్నారు:- ఏభూతములకు ముందు (27వ ప్రసంగమున) చెప్పిన విధము పంచీకరణము కలుగుచున్నదో ఆవిధమయిన ఆకాశము, వాయువు తేజస్సు, జలము, పృథివి-యను పంచభూతము లగునవి పంచీకృత మనబడును. వాని నిరువదైదు తత్త్వముల నుండి స్థూలదేహము కలుగుచున్నది.

ఆ పంచీకృతభూతముల నిరువదైదు తత్త్వము లివి యగును.

1-4 పృథివియొక్క ఐదు తత్త్వములు:- ఎముకలు, మాంసము, నాడి, తోలు, రోమ మనునవి యగును.

5-10 జలముయొక్క ఐదు తత్త్వములు - శోణితము, శుక్లము, మూత్రము, చెమట, ఉమ్మినీరు - అనునవి యగును.

11-14 తేజస్సుయొక్క ఐదు తత్త్వములు:- సోమరితనము, కాంతి, ఆకలి, దాహము, నిద్ర - యనునవి యగును.

15-60 వాయువుయొక్క ఐదు తత్త్వములు:- సన్నగించుట, నడచుట, ఉండుట, పరుగెత్తుట, విస్తరించుట అనునవి యగును.

21-54 ఆకాశపు ఐదు తత్త్వములు:- (1) భయము, మోహము, క్రోధము, కామము, శోకము - అనునవి యగును.

(2) లేక నడుముయొక్క అవకాశము, కడుపుయొక్క అవకాశము, బొమ్మయొక్క అవకాశము, మెడయొక్క అవకాశము, తలయొక్క యవకాశము అనునవి ఆకాశముయొక్క ఐదు తత్త్వము లగును.

ఇవి పంచీకృత పంచమహాభూతముల కార్యరూపమైన యిరువదైదు తత్త్వము లగును. ఆ యొక్కొక్క భూతముయొక్క ఐదైదు తత్త్వములలో నొక్కొక్క తత్త్వము తమతమ ముఖ్యభాగ మగును. తక్కిన నాలుగేసి తత్త్వములు తక్కిన నాల్గుభూతముల నుండి వచ్చిచేరియున్నవి. ఈవిధమగుటచే నీ భూతములకు పరస్పరము చేరిక యున్నది. వానిలో నొకదాని కొకటికి గల చేరికను నిట్లు తెలియవలయును.

1-4 పృథివియొక్క అయిదు తత్త్వములలో

(1) ఎముకలు - పృథివియొక్క ముఖ్యభాగ మగును.

(2) మాంసము - జలముయొక్క భాగము చేరియున్నది.

(3) నాడి(నరము) - తేజోభాగము చేరియున్నది.

(4) త్వక్కు (తోలు) - వాయువుభాగము చేరియున్నది.

(5) రోమము - ఆకాశభాగము చేరియున్నది.

జలముయొక్క అయిదు తత్త్వములందు:-

(1) శోణితము - పృథివియొక్క భాగము చేరియున్నది.

(2) శుక్లము - జలముయొక్క ముఖ్యభాగ మగును.

(3) మూత్రము - తేజోభాగము చేరియున్నది.

(4) చెమట - వాయువుభాగము చేరియున్నది.

(5) ఉమ్మినీరు - ఆకాశభాగము చేరియున్నది.

౧౧-౧౪ తేజస్సుయొక్క అయిదు తత్త్వములందు

(1) సోమరితనము - పృథివీభాగము చేరియున్నది.

(2) కాంతి - జలభాగము చేరియున్నది.

(3) ఆకలి - తేజస్సుయొక్క ముఖ్యభాగము అగును.

(4) దాహము - వాయువుభాగము చేరియున్నది.

(5) నిద్ర - ఆకాశభాగము చేరియున్నది.

౬౧-౮౦వాయువుయొక్క అయిదు తత్త్వములయందు

(1) ముక్కుట (సగమగుట) - పృథివీభాగము చేరియున్నది.

(2) నడచుట - జలభాగము చేరియున్నది.

(3) ఉండుట (నీల్గుట) - తేజోభాగము చేరియున్నది.

(4) పరుగెత్తుట - వాయువుయొక్క ముఖ్యభాగము.

(5) విరియుట (విస్తరించుట) - ఆకాశభాగము చేరియున్నది.

౨౧-౨౫ ఆకాశముయొక్క అయిదు తత్త్వములయందు;

(1) భయము - పృథివిభాగము చేరియున్నది.
(2) మోహము - జలభాగము చేరియున్నది.
(3) క్రోధము - తేజోభాగము చేరియున్నది.
(4) కామము - వాయువుభాగము చేరియున్నది.
(5) శోకము - ఆకాశముఖ్యభాగ మగును.

లేక ఆకాశముయొక్క అయిదు తత్త్వములయందు
(1) నడుము అవకాశము - పృథివీభాగము చేరియున్నది
(2) కడుపు అవకాశము - జలభాగము చేరియున్నది.
(3) ఱొమ్ము అవకాశము - తేజోభాగము చేరియున్నది.
(4) గొంతు (మెడ) అవకాశము - వాయువుభాగము చేరియున్నది.
(5) తల అవకాశము - ఆకాశపు ముఖ్యభాగ మగును.

ముందు చెప్పిన భయము మొదలగునవి లింగదేహపు ముఖ్యధర్మము లగును. స్థూలదేహమందును ఘటమందలి జలముయొక్క శీతలత్వమువలె ఇవి బయలుపడుచున్నవి. అందుచే నవి స్థూలదేహపు గౌణధర్మము లగును. కావున స్థూలదేహముయొక్క తత్త్వములు తెలియదగినవి యగును.

నడుము, అవకాశము మొదలగునవి స్థూలదేహమందు ప్రసిద్ధముగా గనబడుటచేత గొందఱు గ్రంథకర్తలు వానినే స్థూలదేహపు తత్త్వములుగా గణించుచున్నారు.

రెండువిధములందును ఆత్మ వానినుండి వేఱగునని నిశ్చయింపవలెను. ఈ యిరువదైదు తత్త్వముల సముదాయపు పేరు స్థూలదేహమట. దానికి పేరు, జాతి, ఆశ్రమము, రంగు, రూపము, (లావు, సన్నము, పొడవు, పొట్టి) జన్మము, మరణము మొదలగు ధర్మములు గలవు.

46. ఈవిధముగా స్థూలదేహ స్వరూపమును చెప్పి, ఇప్పుడు దానితో ఆత్మకు గల భేదమును జెప్పుచున్నాడు.

1. ఆత్మ, స్థూలదేహపు జన్మమునకు ముందును, మరణమునకు పిమ్మట

నుండునదియు నేకముగా నుండుటచే ఘటముయొక్క వేరైన ఆకాశమువలె, స్థూలదేహముకంటె వేరైనదగును, వ్యభిచారము లేనిదియు నగును.

2. దేహము ఘటమువలె తనయుత్పత్తికి ముందును మరణమునకు వెనుకయును లేనిదై అనేకముగా నుండుటచే నాత్మకంటె వేరైనదగును.

1. ఏవస్తువు అంతయు (అధిక) దేశమందును, అంతయు (అధిక) కాలమందును ఉన్నదగుచున్నదో, యది అవ్యభిచారి (వేఱుకానిది) అనబడుచున్నది.

(1) ఆత్మ, దేనిచే సకలశరీరములందును నొకటిగా నుండుటచే. ఆకాశమువలె వ్యాపకముగా నున్నదో అందుచే అన్ని దేశములందును నున్నది.

(2) ఎందుచే సర్వదేహముల యుత్పత్తికి ముందును, నాశమునకు వెనుకను ఆత్మ యున్నదిగా నుండుటచే మూడుకాలములందును బాధింపబడనిదిగా నగుచున్నదో, దానిచే నది అన్ని కాలములందును నున్నదగును.

3. ఆత్మ యెందుచే నన్ని దేహములందును, నన్నికాలములందును నున్నదో దానిచే నది యవ్యభిచారి యగును.

2. ఏవస్తువు అన్ని దేశములందును, అన్నికాలములందును లేకయుండి యేదేనొకదేశమందును నేదేనొక కాలమందు నున్నదో యది వ్యభిచారి యనబడుచున్నది.

(1) దేహము దేనివలన ఘటమునువలె పరిచ్ఛన్నముగా నున్నదో దానివలన అన్ని దేశములందుండక యేదేనొక దేశమందున్నది.

(2) దేహము దేనిచేత ఉత్పత్తినాశము కలుగునదిగా నున్నదో; దానిచేత అన్నికాలములందు నుండక యేదే నొకకాలమందు నున్నది.

(3) దేహము ఎందుచేత అన్నిదేశములందును, అన్నికాలములందును నుండక యేదేనొకదేశమందు నొకకాల మందున్నదో యందుచేత, వ్యభిచారి యగును.

ఎందుచేత ఆత్మయు దేహమును క్రమముగా నవ్యభిచారయు వ్యభిచారి యునై యున్నందున ఒకదానికొకటి విలక్షణమై యుంటున్నదో; యందుచేతనే వానికి నొకదానికొకటికి భేదము సిద్ధించుచున్నది.

ఇట ఈశంక కలుగుచున్నది:-

బ్రహ్మరూప ఆత్మకును దేహ (శరీరము మొదలగు) రూప అనాత్మకును-

1. భేదము గలదా? 2. లేక అభేదము గలదా? 3. లేక భేదాభేదములు రెండును గలవా? అను నీమూడు వికల్పముల నడుగుదుము. వానిలో;

1. వానికి భేదమును చెప్పినట్లయిన శ్రుతిస్మృతియుక్తి విద్వాంసుల యనుభవమును, వానిచే సిద్ధించిన అద్వైతసిద్ధాంత మేదియో, దానికి హాని కలుగును.

2. వానికి అభేదమును జెప్పినచో, నారెంటినిన్ని వేఱుపరచుట వ్యర్థమగును.

3. వానికి భేదాభేదము అను రెంటిని జెప్పినచో, చీకటియు వెలుతురునువలె ఒకదానికొకటి విరుద్ధ మగునా? రెండు ధర్మములకును నొకకాలమందు నొక ఆశ్రయమునందుండుట పొసగదు. కావున ఈ నీ వచనము "నిజము అబద్ధము" అనువాక్యమునుబోలి *77 వ్యాఘాతదోషము గలదగును.

ఈశంకకు నిది *78 సమాధాన మగును:-

---

*77. ఒకదానికొకటి విరోధము గల రెండుధర్మములొక యధికరణమందు (ధర్మియందు) కూడియుండుట వ్యాఘాతదోష మగును. అది 'నా' తల్లి గొడ్రాలు. నాకు నాలుకలేదు అను మొదలగువాని యందుండున దగును.

*78. పార్థివకాష్ఠరూప (పృథివీకార్యమగు కట్టెరూప) కార్యమునకును జడతత్త్వమూలముగ అగ్నితత్త్వరూప కారణమునకును, చిలుకుటకు ముందు అభేదము కనబడుచున్నది అది అయోగ్య మగును. శ్రేష్ఠమగు కారణ మేదియో దానికి తిరోధాన ముండుటచే, దానిని (నికృష్ట అభేదమును) పోగొట్టుకొఱకు చిలుకుట మూలముగా వానిభేదము చేయబడుచున్నది. పిమ్మట కలిగి అగ్నియొక్క ప్రబలత్వము మూలమున వానికి అభేదము కలుగుచున్నది. అది యోగ్య మగును. నికృష్ట (తక్కువ యగు) కాష్ఠరూపకార్యమునకు

(cont...)

ఐదవ యుపదేశము

1. శిష్యా! ఆత్మానాత్మలకు ముందు వేఱుచేసి నెఱుగని (భ్రాంతికాలమందు సర్వజీవములకును నభేదము గనబడుచున్నది. పిమ్మట వివేచనము (వివేకజ్ఞాన) కాలమందు చేతనత్వము మొదలగునవియు జడత్వము మొదలగునవియు నగు ధర్మము విలక్షణతా జ్ఞానముచేతను "నాదేహ మున్నది" యను ననుభవముచేతను వానికి భేదము కనబడుచున్నది.

2. వివేచన (పదార్థశోధన) మునకు పిమ్మట గురువుచే నుపదేశింపబడిన మహావాక్యముయొక్క అర్థవిచార (తత్త్వజ్ఞాన)కాలమునందును అభేదనిశ్చయము గలుగుచున్నది.

కావున ఆత్మానాత్మల భేదము, అభేదములు రెండును అనుభవింపబడినవి యగును. అయిన నారెంటికిని సత్యత్వముచేనైనను, కల్పితత్వముచేనైనను నొకధర్మియొక్క (ఆశ్రయమందు) ఉనికియో సంభవింపదు. అవి చీకటియు వెలుతురునువలె నొకదానికొకటి విరోధములుగా నుండుటచే అయిన నారెంటి లోను నొకదానికి సత్యత్వమును మరొకదానికి కల్పితత్వమును చెప్పవలయును. కావున ఆత్మానాత్మల భేదాభేదములు రెంటిలోను భేదము కల్పితమును, అభేదము సత్యమును నగునని నిశ్చయము చేయవలయును. ఇందుచే అద్వైత సిద్ధాంతమునకు హానిలేదు. భ్రమ (అవివేకము)చే సిద్ధించిన ముఖ్యఅభేదమును దీర్చుటకొఱకు వానిని వివేకించుటయు వ్యర్థము గాదు. ఈకల్పితముతోగూడిన వాస్తవ అభేదమే *79. తాదాత్మ్య సంబంధ మని చెప్పబడుచున్నది. ఆ

దాహమూలమున తిరోధాన ముండుటచే, అట్లే అనాత్మరూప కార్యమునకును, ఆత్మరూప కారణమునకును, వివేకజ్ఞానమునకు ముందు అభేదము కనబడచున్నది. అది అయోగ్యమగును. ఆత్మయొక్క (అధిష్ఠాన) తిరోధానముండుటచే, దానిని (భ్రాంతిచే) సిద్ధించిన అభేదమును పోగొట్టటకు వాని భేదజ్ఞానరూప వివేకజ్ఞానము చేయబడుచున్నది. పిమ్మట ప్రకటమగు ఆత్మ ప్రబలత్వము (ముఖ్యత్వము) మూలముగా తత్త్వజ్ఞానకాలమందు వానికి అభేదము కలుగుచున్నది. అది యోగ్యమగును. మిథ్యయగు అనాత్మ(ప్రపంచ) రూపకార్యమునకు బాధమూలముగా తిరోధాన ముండుటచే,

*79. ఇట ఇది యభిప్రాయ మగును. రెండు సంబంధులు లేక సంబంధము చెప్పుట సంభవింపదు. అభేదము లేక తాదాత్మ్యము చెప్పుట పొసగదు. కావున భేదముతో

(cont...)

*80. తాదాత్మ్యమును, అనాత్మయును, ఆత్మయును నయిన కార్యకారణ ములవలె గుణగుణియందును, జాతివ్యక్తి యందును, క్రియాక్రియలు గలదాని యందును నెఱుగ దగినది.

ఇట ఇది ప్రక్రియ యగును:- 1. సత్యము 2. కల్పితము అను భేదములచే రెండువిధము లగును. వానిలో,

1. భిన్నసత్త గల పదార్థములకు గల భేదమేదియో యది కల్పితభేదమే యగును. అది రజ్జువునకును కల్పిత సర్పమునకును గల భేదమును జాగ్రత్స్వప్న ములకును గల భేదమును ఆత్మానాత్మలకు గల భేదమును కల్పితము లగును. రెండును భిన్నసత్త గలవిగా నుండుటవలన అనుటవలె నగును.

2. సమానసత్త గల పదార్థములకు గల భేద మేదియో యది (1) కొన్నిచోట్ల కల్పితమును (2) కొన్నిచోట్ల సత్యమును నగుచున్నది.

(1) ఎచ్చట ఏదేనొక యుపాధిచే భేదము కనబడుచున్నదో యాభేదము ఎచ్చట కల్పిత మగును. అది సమానసత్త గల ఘటాకాశమునకును మఠాకాశమున కున్ను, జీవునికిని ఈశ్వరునికి గల భేదము ఉపాధిచే గలిగినదై యుండుటచే కల్పిత మగుటంబోలును.

గూడిన అభేదమునకు తాదాత్మ్య సంబంధమని పేరు. భేదాభేదములకు రెంటికిని వెలుతురు చీకటివలె నొకచోటనుండుట విరోధమగునైనను అనాత్మకల్పిత కార్యరూపముగా నుండుటచేతను, ఆత్మ అకల్పితకారణ(అధిష్ఠాన) రూపముగా నుండుటచేతను, నారెంటికిని కల్పిత /(మాటమాత్ర) భేదము గలదు. కల్పితమునకు అధిష్ఠానమున కన్న వేరైన సత్త లేనందున వానికి వాస్తవఅభేదము గలదు. వీనిచే ఆత్మానాత్మలకు కల్పితభేదముతో గూడిన వాస్తవాభేదరూప తాదాత్మ్య సంబంధము గలదు. దీనినే భేదాభేదముల విలక్షణ అనిర్వచనీయ తాదాత్మ్య మనియు చెప్పుదురు. వాస్తవభేదము లేనందున భేదముయొక్క విలక్షణ మగును. కల్పితభేద ముండుటచే అభేదముకంటె విలక్షణ మగును.

*80. ఘటమయిన కార్యమునకును మట్టియయిన కారణమునకును కల్పిత (మాటమాత్ర) భేదమును వాస్తవ అభేదము గలవు. అట్లు అనాత్మకును ఆత్మకును నున్నది. అట్లే, ఘటనీలవర్ణమగు గుణమునకును, ఘటమగు గుణికిని మాటమాత్రము భేదమున్నది. విచారింపగా గుణమునకు గుణితో భేదము సిద్ధింపదు. కావున అభేద మగును. ఇందుచేతనే వానికి తాదాత్మ్యసంబంధ మున్నది. విచారింపగా దానికి భేదము సిద్ధింపదు.

(2) ఎచ్చట ఉపాధిలేక స్వరూపముగా భేదము కనబడుచున్నదో, యచ్చట యాభేదము సత్య మగును. అది ఘటపటములకు గలభేదమును, శరీరములకు నొకదాని కొకటికి గలభేదమును, ఆకాశము మొదలగువానికి నొకటికొకటికి గల భేదమును ఉపాధిలేని ఘటము మొదలగువాని స్వరూపముచే నైనదిగా నుండుటచే సత్యమగును. వానియందు సత్యభేదమును(1) పారమార్థికము, (2) వ్యావహారికము, (3) ప్రాతిభాసికమను భావముచే (సత్తచే) మూడువిధముల కల్పన చేయబడు చున్నది.

(1) ఏభేదముయొక్క అనుయోగి ప్రతియోగి రెండును పరమార్థసత్త గలవిగా నున్నవో యాభేదము పారమార్థిక మగును. సిద్ధాంతమున, శుద్ధచేతనము నకు వేఱుగా పారమార్థికసత్త గల దొక్కటియు లేదు. అందుచే అనుయోగియు ప్రతియోగియును పారమార్థికసత్త గలది కానేరదు. కావుననే ఏపదార్థమునకును పారమార్థికభేదమో యేవిధమునను సిద్ధింపదు.

(2) ఏభేదముయొక్క అనుయోగియు, ప్రతియోగియు వ్యవహారసత్త గలవిగా నున్నవో యాభేదము వ్యావహారిక మగును. అది వ్యవహారసత్త గల ఘటపటములకును, పృథివీజలములకును, జీవేశ్వరాదులకును, నొకదాని కొకటికి గలభేదము వ్యావహారికమగుట యగును.

(3) ఏ భేదముయొక్క అనుయోగియు ప్రతియోగియు, ప్రాతిభాసికసత్త గలవిగా నున్నవో, యా భేదము ప్రాతిభాసిక మగును. అది రజ్జువునందు కనబడు సర్పము, దండము, మాల మొదలగువానికి నొకదానికొకటికి గలభేదము ప్రాతిభాసిక మగుట పోలును.

ఈవిధముగా సత్యభేదమునందును ఇంతటి విలక్షణతన మున్నది.

దేనియందు అన్యముయొక్క భేదమున్నదో, అట్టి భేదముయొక్క ఆశ్రయ మేదియో యది అనుయోగి యనబడుచున్నది. అది ఘటమందుండు పటముయొక్క భేదమునకు, ఘటము అనుయోగి యగుటను బోలును. దీనినే ధర్మి యనియు నందురు.

దేనిభేదము అన్యవస్తువు నందున్నదో, ఆ భేదము గల వస్తువు ఏదియో యది ప్రతియోగి యనబడుచున్నది. అది ఘటమందున్న పటముయొక్క భేదమునకు ప్రతియోగిపట మగుట పోలును. దానినే నిరూపక మనియు చెప్పుదురు.

ఈవిధముగా వస్తువునందుండు భేదస్వరూపము చెప్పబడినది. ఇట్లు అభేదమున్ను ముఖ్యఅభేదము, బాధము మిథ్యానిశ్చయముచేనైన అభేదము అను భేదములచే రెండువిధము లగును.

వానియందు భిన్నసత్త గల పదార్థములకు గల అభేదము (1) ముఖ్య అభేదము, (2) బాధచేనయిన అభేదము అనుభేదములచే రెండు విధముల వానియందు-

1. బాధలేకయే, స్వరూపముగా వానికి కనబడు అభేద మేదియో యది ముఖ్యము అగును, అది రజ్జువునకును, సర్పమునకును, స్థాణువునకును, పురుషునకును, దేహమునకును ఆత్మకును, బ్రహ్మమునకును జగమునకును మొదట, అవివేకకాలమందు గల అభేద మేదియో, యది ముఖ్యమగును (భ్రాంతి రూపముగా నున్నను ముఖ్యమువలె కనబడుచున్నది) అనుటను బోలును. అయితే యది భ్రాంతిరూపముగా నుండుటచే మిథ్య యగును.

2. భిన్నసత్త గల పదార్థములకు రెంటినుండి యొకటిని (అల్పసత్త గలదానిని) బాధించుటలోగల అభేదమేదియో, యది బాధముచేనైన అభేదమగును. అది రజ్జువునకును సర్పమునకును, స్థాణువునకును పురుషునకును, బింబమున కును ప్రతిబింబమునకును, ఆత్మకును అనాత్మకును, బ్రహ్మమునకును జగత్తునకును, బ్రహ్మమునకును చిదాభాసమునకును, పిమ్మట తత్వజ్ఞాన కాలమందు ఏయభేదము కనబడుచున్నదో యది రెంట నొకదానిని బాధించుటచే గలుగుచున్నది. కావున నది బాధముచేనయిన యభేద మగును అనుటను బోలున దగును. అయిన నాయభేదము భ్రాంతినివృత్తిచే నైనదిగా నుండుటచే సత్య మగును.

మిథ్యాత్వనిశ్చయమునకు లేక, త్రికాల అభావ (మూడుకాలము లేమి) నిశ్చయమునకు బాధయని పేరు. దానినే నివృత్తి యందురు.

సమానసత్త గల పదార్థములకు గల, అభేదమేదియో యది, బాధ లేకయే, స్వరూపముగా గాన్పించుచున్నది. కావున ముఖ్యఅభేద మగును. అయితే యా ముఖ్యాభేదమున్ను 1. కొన్నిచోట్ల సత్యము, 2. కొన్నిచోట్ల కల్పితము.

1. ఎచ్చట ఉపాధిలేని వస్తువుయొక్క స్వరూపమునకు అభేదము కనబడుచున్నదో, అచ్చట ఆ అభేదము సత్యమగును; అది ఘటమగు ఉపాధిదృష్టిని విడుచుటచేత కలుగు ఘటాకాశ మహాకాశముల అభేదమున్ను, బ్రహ్మమునకును కూటస్థఆత్మకును గలుగు అభేదమున్ను సత్యమగుటవలె నగును.

2. ఎచ్చట దోషమగు ఉపాధిబలముచే అభేదము కనబడుచున్నదో అచ్చట నాయభేదము కల్పిత మగును. అది సన్నిధిదోషమగు ఉపాధిబలముచే మేఘమునకును ఆకాశమునకును గానబడు అభేదము కల్పిత మగుటవలె నగును.

ఈవిధముచే అభేదమునకును విలక్షణత యున్నది;

1. ఆత్మకును దేహమునకును గల అభేద మేదియో యది కల్పితముగా నుండుటచే, అల్పసత్త గల దేహమగు అనాత్మస్వరూపమును బాధించుటచేతనే కలుగుచున్నది; కావున నది సత్య మగును.

2. మొదట అవివేకకాలమందు సర్వజీవులయందును గనబడు భిన్నసత్త గల ఆత్మకును, దేహమునకును గల అభేద మేదియో యది సమానసత్త గల పదార్థములవలె ముఖ్యఅభేద మగును. అముఖ్యఅభేదము భ్రాంతిరూపమై యుండుటచే కల్పిత మగును.

కావున నాకల్పితముఖ్య అభేదమును నివర్తించుకొనుటకు ముముక్షువగు నతడు మొదట ఆత్మదేహమగు అనాత్మయును, వీనియందు కల్పిత (ఆరోపిత) అభేదముయొక్క వివేచనమును జేయవలెను. పిమ్మట జ్ఞానకాలమందు అనాత్మను శాస్త్రయుక్తులచేతను, అపరోక్షానుభవముచేతను బాధించి యారెంటి అభేదమును తెలియవలెను.

1. మహావాక్యముయొక్క బ్రహ్మాత్మైక్యమగు అర్థమును విచారించు సమయమున దేహాదిప్రపంచమయిన అనాత్మయొక్క ఏబాధము చేయబడు చున్నదో యాబాధము ప్రపంచమును నిషేధించు శాస్త్రమువల్లను స్వప్నాది దృష్టాంతరూప మయిన యుక్తులచేతను జేయబడినది కావున పరోక్ష మగును.

2. మహావాక్యముయొక్క ముందు చెప్పిన అర్థముయొక్క 'నేను బ్రహ్మముగా నున్నాను' అను దృఢనిశ్చయ మయిన అపరోక్షజ్ఞానము కలిగిన పిమ్మట ఏయనాత్మ బాధ కలుగుచున్నదో, యది యపరోక్షానుభవముచే నైనది కావున అపరోక్షబాధ యగును.

అందుచే అపరోక్షబోధమందు అపేక్షింపబడిన బాధ, అపరోక్షబోధము యొక్క ఫలరూపమయిన బాధయనుదాని భేదముచే బోధబాధముల నొకదాని కొకటి అపేక్షరూప అన్యోన్యాశ్రయదోషము నిట సంభవించుట లేదు.

ఈవిధముగ ఆత్మానాత్మల రెంటికిని వాస్తవ అభేదమున్ను, కల్పిత భేదమున్ను అంగీకారము చేయుటచే అద్వైతసిద్ధాంతమునకు జేటు లేదు; వివేచనము చేసినదియు సఫల మగును.

ఈ దేహాత్మల భేదాభేదములందు జెప్పబడిన న్యాయ (ప్రకార)మేదియో దానితక్కిన శరీరమునకును అవస్థ మొదలగు వానికిని, చిదాభాసునికిని, ఆత్మకును గల భేదాభేదములందును ముందు చెప్పిన శంకాసమాధాన పూర్వకముగా తెలిసికొనునది. ఈయర్థము ప్రసంగముచే సక్రమముగా జెప్పబడిన దగును.

శిష్యుడా! ఈవిధముగా ఆత్మకును స్థూలదేహమునకును దేనిచేత సత్త యొక్కభేదముచే; భేదమున్నచో దానిచే నేను స్థూలదేహము కాను, ఇది నాది కాదు, అయితే యిది పంచభూతములది. దేనిచే నేను స్థూలదేహము కానో దానిచే ముందు చెప్పిన పేరు, జాతి, ఆశ్రయము, వర్ణము, రూపము మొదలగు దీని ధర్మములున్ను నేను కాను, నావియు గావు అని నీవు నిశ్చయము చేయుము.

ఇట ఇది విశేషమగును:- 1"అశరీరము నావసంతము-శరీరమునకు వేఱై యుండుదానిని"

"జీవాపేతం వావ ఖిలశరీరం మ్రియతే న జీవో మ్రియతే,
నైనం ప్రియాప్రియే స్పృశతః ॥

జీవునిచే విడువబడిన ప్రసిద్ధశరీరము నిశ్చయముగానే మరణించుచున్నది. జీవుడు మరణించుట లేదు. వీనిని సుఖదుఃఖములు స్పృశించుట లేదు."

అశరీరం శరీరేష్వనవస్థేష్వవస్థితమ్ ।
మహాన్తం విభుమాత్మానం మత్వా ధీరో న శోచతి॥

అస్థిరమయిన శరీరములందు శరీరము లేక నెలకొనియుండు మహావిభుడైన ఆత్మను, ధీరపురుషుడు నేనని మతించి, శోకించుట లేదు" అను నీ మొదలగు శ్రుతులచేతను,

"వాసాంసి జీర్ణాని యథా విహాయ, నవాని గృహ్ణాతి నరోఽపరాణి! ।
తథా శరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవాని దేహీ॥

ఎట్లు పురుషుడు పాతవస్త్రములను విడిచి వేఱు క్రొత్తవస్త్రములను గ్రహించుచున్నాడో, అట్లు దేహి (జీవాత్మ) ప్రాతశరీరములను విడిచి వేఱు క్రొత్తశరీరముల పొందుచున్నాడు'

దేహినోఽస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా!
తథా దేహాన్తరప్రాప్తిర్ధీర స్తత్ర న ముహ్యతి ॥

ఎట్లు దేహి కీ దేహమున కౌమారము (కుమారత్వము), యౌవనము, జర(ముసలితనము) కలుగుచున్నదో (స్వప్న దేహమున్ను కలుగుచున్నదో) అట్లు, అన్యదేహప్రాప్తి కలుగుచున్నది. దానిలో ధీర (వివేకియగు) పురుషుడు, నేను పుట్టితిని గిట్టితిని' అని యీవిధముగా మోహమును పొందుటలేదు."

ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే ।
ఏతత్ యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞఇతి తద్విదః ॥

ఓకుంతీనందనా! ఈశరీరము క్షేత్రము అనబడుచున్నది. దీని నెఱుగున దేదియో దానిని క్షేత్రజ్ఞుడు అని దానిని దెలిసినవారు చెప్పెదరు అను నీ మొదలగు

స్మృతులచేతను.

3.(1) దేహము పేడకుప్పవలెను వృక్షమువలెను పెరుగుటచేతను, ఆహారము మొదలగు వానిని గ్రహించుటచేతను, లేక శకటము మొదలగు వానివలె నడచుట మొదలగు పనులను జేయుటచేతను, లేక కమ్మరితిత్తులవలె నిశ్వాస ఉచ్ఛ్వాసముల గ్రహించుటచేతను, లేక నూనె నాడించు యంత్రమువలె మలమూత్రముల విడుచుటచేతను చేతనము కానేరదు. అయితే జడమును, మమత (నాదియను అభిమానము) యొక్క విషయ మగును. ఆత్మజాగ్రత్తయందు దీని యునికిని స్వప్నసుషుప్తులయందు దీని అభావమును నెఱుగునదిగా నుండుటచే చేతనమును, నేనను వృత్తియొక్క విషయమును నగును. కావున నీరెంటికిని ఐక్యము పొసగదు.

(2) లేక, శిశువునకు స్తన్యపానము (పాలుత్రాగుట) నందు ప్రవృత్తికి హేతువయిన ఏస్తన్యపానమునకు అనుకూలత్వముయొక్క స్మృతి, జన్మమునకు పిమ్మట కలుగుచున్నదో; యాస్మృతి, జన్మాంతరమునందు ఆయనుకూలత్వ అనుభవములేక సంభవింపనేరదు. కావున నది, జన్మాంతరమున ముందు చెప్పిన అనుకూలత్వానుభవమును కల్పితముచే తెలిపించుచున్నది. ఆయనుభవమునకు కర్తయగు ఆత్మ ఈదేహమునకు వేఱుగా సిద్ధించుచున్నది.

(3) లేక ఆత్మ, దేహమునకు భిన్నము కానిచో, పూర్వజన్మమందు లేని, ఆత్మచే చేయబడని కర్మముల విచిత్ర సుఖదుఃఖ రూపమయిన ఫలప్రాప్తి యగును.

అకృతాభ్యాగః:- "చేయబడనిది అనుభవమునకు వచ్చుట" అను దోషమున్ను ఈశరీరము మరణించిన పిమ్మట వేఱుదేహముయొక్క పొందమిచే ఈదేహమున చేసిన కర్మములు అనుభవింపక నశించు నదయిన

'కృతవిప్రనాశ:-చేయబడినవి అనుభవములేక నశించుట" అను దోషమును గలుగుచున్నది. ఈరెండు దోషములును లోకప్రసిద్ధమునకును వేదప్రసిద్ధమునకును విరోధము గలవి యగును అను నీ మొదలగు యుక్తులచేతను, ఆత్మస్థూల దేహము కంటె వేఱయిన దగును.

4.ఇందుచేతనే:-

యథా నభసి మేఘౌఘోరేణుర్వా పార్థివోచితే ।
ఏవం ద్రష్టరి దృశ్యత్వ మారోపిత మబుద్ధిభిః ॥

ఎట్లు ఆకాశమందు మేఘసమూహము లయినను, వాయువునందు పృథివి అణువుల సమూహ మయినను ఆరోపించబడియున్నవో; యెట్లు జ్ఞానము లేని పురుషులచే ద్రష్ట (ఆత్మయందు దృశ్యస్థూలదేహము) ఆరోపింపబడియున్నది' అనునవి మొదలయిన శ్రీమద్భాగవత వచనములును దేహముయొక్క అనాత్మత్వమునందు ప్రమాణములు గలవిగా నున్నవి.

47. ఈవిధమున స్థూలదేహమునుండి ఆత్మను వేఱుచేసి ఇప్పుడు సూక్ష్మశరీరముయొక్క స్వరూపమును దానినుండి ఆత్మ వేఱనుటను చెప్పుచున్నాడు.

వేటికి ముందుచెప్పిన పంచీకరణము కలుగ లేదో; యటువంటి ఆకాశాది పంచమహాభూతములు అపంచీకృత భూతము లనబడుచున్నవి. వాటినే సూక్ష్మభూతమనియు, తన్మాత్రయనియు జెప్పుదురు. ఆ యపంచీకృత పంచభూతముల పదునేడు తత్త్వములచేతను లింగదేహము కలిగెను.

ఇప్పుడు పదునేడు తత్త్వములతో గూడిన లింగదేహమును జెప్పుచున్నాడు.

1-4 శ్రోతము, త్వక్కు, చక్షువు, జిహ్వ, ఘ్రాణ మనునైదు జ్ఞానేంద్రియములు,

6-10 వాక్కు, పాదము, పాణి, ఉపస్థ, గుద మను నైదుకర్మేంద్రియములు.

11-15 ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యాన మనునైదు ప్రాణవాయువులు.

16-17 సంకల్ప వికల్పమయ వృత్తిరూపమనస్సు, నిశ్చయరూపవృత్తిమయుమయిన బుద్ధి అను నీ పదునేడు తత్త్వములును చేరి లింగదేహమనబడుచున్నది.

శుభాశుభక్రియల కర్తృత్వము సుఖదుఃఖముల భోక్తృత్వము, పరలోకమునకు బోవుటయు, నీలోకమునకు వచ్చుట; రాగము ద్వేషము మొదలగునవి, శమదమ మొదలగునవి, అంధ మంద పటుత్వములను నీ మొదలగునవి లింగ దేహము యొక్క ధర్మము లగును. [ఇట అంధత్వము (గ్రుడ్డితనము) మొదలగునవి చెవిటితనము మొదలగు వానిని గుర్తించుచున్నవి]

48. మరణము, మూర్ఛ, సుషుప్తి, ప్రళయము, జ్ఞానము, (సమాధి) అనునైదవస్థలయందును లింగదేహమును నాశము(తనకారణమయిన అజ్ఞానమున లయించుట) కలుగుచున్నది. ఇట్లు వ్యభిచారి యయి యుండుటచే నీలింగదేహము అసత్తగును.

ఆత్మ యన్ననో యాయన్ని కాలములందును, ఉన్నట్లే ప్రకాశము గలదియయి నెలకొనియున్నది. ఇట్లు అవ్యభిచారి యయి యుండుటవలన ఆత్మ సద్రూప మగును. ఆత్మ, దేనివలన సద్రూపమయి యున్నదో యందువలన, నది యీలింగదేహము కాదు. అయితే ఘటమందు పూర్ణమయిన జలముకంటె దానియందుండు ఆకాశము వేఱై యుండుటవలె లింగదేహముకంటె వేఱుగా నున్నది కావున,

శిష్యుడా! ఈలింగదేహము నేను గాదు. ఇది నాది కాదు. ఇది అపంచీకృత పంచమహాభూతముల కార్య మగును. దేనిచే నీలింగశరీరము నేను కానో దానిచే కర్తృత్వ భోక్తృత్వ సుఖదుఃఖాదులు ముందు చెప్పిన వీనిధర్మములును నేను గాను, నావియు గావు. అయితే యవి లింగదేహమునకు చేరినవి. వీని నెఱుగు ద్రష్టయగు నేను వీనికంటె వేఱుగా నున్నానని నిశ్చయము చేయుము.

ఇట ఇది విశేషమగును:-

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥ 1

ఇంద్రియాణి హయానాహుర్విషయాం స్తేషు గోచరాన్ ।
ఆత్మేంద్రియమనోయుక్తం భోక్తేత్యాహుర్మనీషిణః ॥ "శ్రోత్రస్యశ్రోత్రవం" ॥ 2

యద్వాచాఽనభ్యుదితం యేన వాగభ్యుద్యతే ॥
తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిదముపాసతే । 1

యన్మనసా న మనుతే యేనాహుర్మనో మతమ్ । ॥ తదేవ 2
యచ్చక్షుషా న పశ్యతి యేన చక్షూంషి పశ్యతి । త దేవ॥ 3

యచ్ఛ్రోత్రేణ న శృణోతి యేన శ్రోత్ర మిదం శ్రుతమ్ త దేవ।
4

యత్ ప్రాణేన న ప్రాణితి యేన ప్రాణః ప్రణీయతే ॥ త దేవ 5

"నాచికేతువా! ఆత్మను రథికుడనియు, శరీరమును రథమనియు బుద్ధిని సారథియనియు, మనస్సును కళ్ళెమనియు తెలియుము. (1)

ఇంద్రియములను గుఱ్ఱములందురు (ప్రాణము లేక, ఇంద్రియములకు ప్రవృత్తి సంభవింపమింజేసి, ఇట ఇంద్రియశబ్దముచేత, వాని యజమానుడైన ప్రాణరూప రథముయొక్క బంధము చేకొనబడుచున్నది). వానియందు శబ్దము మొదలగు విషయముల మార్గమందురు. ఇంద్రియములను మనసుతో గూడిన ఆత్మను పండితులు భోక్తయని చెప్పుదురు (కేవలాత్మను గాదు(2))

"శ్రోత్రియమునకు శ్రోత్రియము" ఏబ్రహ్మము వాక్కుచే చెప్పుట లేదో, యే బ్రహ్మముచేత వాక్కు ప్రకాశింపబడుచున్నదో, దానినే నీవు బ్రహ్మమని యెఱుగుము. ఏ వీరిని (బ్రహ్మవిష్ణువు మొదలగు వారిని) జనులు ఉపాసించు చున్నారో వారు బ్రహ్మము కాదు (ఇట వాక్కు సకలకర్మేంద్రియములకు ఉపలక్షణ మగును) (1) దేనిని మనస్సుచేత (ఫలవ్యాప్తిచే లోకము) మననము చేయుట లేదో, యేది మనస్సును విషయము చేసియున్నదో, దానినే నీవు బ్రహ్మమని తెలిసికొనుము. (తక్కిన వస్తువు లన్నిచోటులయందును సమాన మగును. ఇట మనస్సు, బుద్ధి మొదలగు వానికి ఉపలక్షణ మగును.) (2) దేనిని చక్షువుచే గాంచుట లేదో, దేనిచే చక్షువులను చూచుచున్నావో, దానినే నీవు బ్రహ్మమని యెఱుగుము.

(3) దేనిని శ్రోత్రములచే వినుట లేదో, దేనిచే నీశ్రోత్రియము విషయించు

చున్నదో - దానినే నీవు బ్రహ్మమని యెఱుగుము. దేనిని ప్రాణముచే (ప్రాణవృత్తితో గూడిన ఘ్రాణేంద్రియముచేత) విషయము చేయుట లేదో, దీనిచే (ప్రకాశింప బడునదిగా నుండుటచే) ప్రాణము (ఘ్రాణము) తనవిషయము గూర్చి పోవుచున్నదో, దానినే నీవు బ్రహ్మమని తెలియుము. (ఇట చక్షుః - మొదలగు మూడుఇంద్రియములును త్వక్కు రసనముల ఉపలక్షణ మగును.) 5 అను మొదలగు "శ్రుతులచేతను"

ఇంద్రియేభ్యః వరా హ్యర్థా హ్యర్థేభ్యశ్చ వరం మనః ।
మనసస్తు వరా బుద్ధిర్యో బుద్ధేః వరతస్తు సః ॥

ఇంద్రియములకంటె విషయములు వేఱగును. "విషయములకంటె మనస్సు వేరగును. మనస్సుకంటె వేఱయినది బుద్ధి. బుద్ధికంటె వేఱయిన దేదియో యది ఆత్మ యగును." అను మొదలగు స్మృతులచేతను లింగమో జడమును, దృశ్యమును, వికారియు, వినాశియు, మనోబుద్ధులకు విషయము నగును. జాగ్రత్ స్వప్నముల దాని యునికియు, సుషుప్తియందు దాని లేమియు నెఱుగునట్టి ఆత్మ యన్ననో వానివిలక్షణ మగును అను మొదలగు యుక్తులను బోధించి(ఆఱు) లింగములచేతను ఆత్మలింగ దేహముకంటెను వేఱయి సిద్ధించుచున్నది.

49. ఇప్పుడు కారణదేహముయొక్క స్వరూపముతో దానియాత్మ వేఱనుటను జెప్పుచున్నాడు.

శిష్యుడా! నీవు ఆత్మను దెలియజాలవు. తెలియనందున "నేను అజ్ఞాని" యని తన్ను మతించుచున్నావు. ఇదియే అజ్ఞానమని యెఱుగుము. ఆయజ్ఞానమే కారణదేహ మగును.

"ఆత్మ లేదు" అనునది అసత్తు(అసత్వాపాదక) ఆవరణముచే ఆత్మ కనబడలేదు" అనునది అపాన ఆవరణమును అగును.

ఈరెండువిధ ఆవరణములకు హేతువగు చిదాభాసునితోడ గూడిన స్థూలసూక్ష్మశరీరములును; కర్తృత్వము మొదలగువాని ధర్మములగు ప్రపంచరూప విక్షేపమునకు హేతువగు రెండును, అజ్ఞానరూప కారణదేహపు ధర్మము లగును.

ఆ కారణదేహము ఆత్మను నెఱుగుటచే నాశ మగుచున్నది.

స్థూలదేహ లింగదేహములకు హేతువై యుండుటచే నీయజ్ఞానము కారణదేహ మనబడుచున్నది.

ఆ కారణదేహము దేనివలన నీయొక్క దృశ్యమై (నీచే జూడబడునదై) యున్నదో (దేనిచే); నీవు ఎప్పుడును దీనికి ద్రష్ట యయి (దీనిం జూచువాడై) యున్నావో, దానిచే నీ వీకారణదేహముకన్న వేరయిన అదృశ్యరూపముగా నున్నావు.

కావున శిష్యుడా! నేను కారణదేహుడను గాను, ఇది నాదికాదు, ఇది అజ్ఞానిఅంశము. దేనిచే కారణదేహము నేను గానో, దానిచే దీని ధర్మమయిన ముందు చెప్పిన ఆవరణవిక్షేపములకు హేతువాదము మొదలగు నవియును నేను గాను. నావియు గావు. కారణదేహమని యగును. నేను దీని నెఱుగు ద్రష్ట దీనికంటె వేఱుగా నున్నాను అని నిశ్చయము చేయుము. ఎట్లు జీవుల వ్యష్టియయిన మూడు శరీరములకంటెను జీవసాక్షి వేఱుచేసి యెఱిగింపబడినదో అట్లు ఈశ్వరుని సమష్టి మూడుశరీరములనుండి ఈశ్వరసాక్షి (బ్రహ్మము) ఇట వేఱుపరచి యెఱిగింపదగినది యగును. అట్లయినను అది ముందు మూడవ యుపదేశమందు తెలుపబడినదిగాన నిట తెలుపబడలేదు.

ఇట ఇది విశేషమగును:-

సుషుప్తి కాలే సకలే విలీనే తమోఽభిభూతః సుఖరూపమేతి ॥

సుషుప్తికాలమందు సకలమును (స్థూలసూక్ష్మప్రపంచమును) లీనము కాగా చీకటిచే (అజ్ఞానముచే) ఆవరింపబడినవాడై సుఖరూపమును బొందుచున్నాడు. అను నీ మొదలగు శ్రుతివాక్యములచేత జగమునకు కారణమును జ్ఞానముచే (జీర్ణ) నష్టమయి యుండుటచే కారణ శరీరమైన అజ్ఞానము సుషుప్తిఅవస్థయందు గనబడుచున్నది. దానిచే నావరింపబడిన చిదానందరూప మేదియో దాని జ్ఞాత ("సుషుప్తినుండి లేచిన పురుషునికి కలుగు" నేను ఒక్కటియు నెఱుగను." అనురూపస్మృతికి కారణరూప సామాన్యచేతన మయిన సుషుప్తి యజ్ఞానమునందు అనుభవరూప ప్రకాశకము.) ఆత్మ యగును. అది యాకారణ దేహరూప

అజ్ఞానముకంటె వేఱని సిద్ధించుచున్నది. స్వప్నమందు స్థూలదేహము తెలియక యుండ ఆత్మ ప్రకాశించుట అన్వయ మగును. ఆత్మ వ్యక్తము కాగానే స్థూలదేహము వ్యక్తము కాని వ్యతిరేకము. అట్లే సుషుప్తియందు లింగదేహము తెలియకయుండి సాక్షి తెలియుట అన్వయము. లింగము తెలియమి వ్యతిరేకము. అట్లే సమాధియందు కారణదేహము తెలియక యుండి సమాధికి సాక్షి యయి యుండుటచే ఆత్మ వ్యక్తమగుట అన్వయ మగును. కారణదేహము వ్యక్తము కామి వ్యతిరేకమును నగును. ఈ యన్వయ వ్యతిరేకములు దేహమును ఆత్మను భేదించునవి యగును.

దేహత్రయ యాత్మవివేచన (వివేకము) వర్ణన మను
నైదవ యుపదేశము సమాప్తము

ఆఱవ యుపదేశము

అవస్థాత్రయ ఆత్మవివేచనము

50. శిష్యుడు చెప్పుచున్నాడు.

జాగ్రత్స్వప్న సుషుప్త్యాది ప్రపంచం యత్ప్రకాశతే ।
తద్బ్రహ్మాఽహమితి జ్ఞాత్వా సర్వబంధైః ప్రముచ్యతే ॥

జాగ్రత్స్వప్నములు సుషుప్తి మొదలగు ఏప్రపంచము ప్రకాశించుచున్నదో అది బ్రహ్మము నేనని యెఱింగి సర్వబంధములనుండి మిక్కిలి ముక్తుడగుచున్నాడు.

(1) "అస్య త్రిస్రః అవస్థాః త్రయః స్వప్నాః" ఈజీవునికి మూడవస్థలు గలవు. అవి మూడును స్వప్నములట (మిథ్యయట)" (2) ఈమొదలగు శ్రుతులచేతను,

త్రిషు ధామసు యద్భోగ్యం భోక్తా భోగశ్చ యద్భవేత్ ।
తేభ్యో విలక్షణస్సాక్షీ చిన్మాత్రోఽహం సదాశివః ॥

జాగ్రత్త మొదలగు మూడుచోట్లయందు గల భోగ్యము, భోక్త, భోగమను త్రిపుటి విలక్షణమయిన చిన్మాత్రసాక్షిరూపమైన నేను సదాశివుడై యున్నాను. (3) అను సూతసంహిత వాక్యముచేతను,

బుద్ధేర్జాగరణం స్వప్నః సుషుప్తిరితి వృత్తయః ।
తా యేనైవానుభూయంతే సోఽధ్యక్షః పురుషః పరః॥

బుద్ధికి జాగ్రత్త స్వప్నము, సుషుప్తి అనునవి వృత్తులు. అవి యెవనిచే ననుభవింపబడచున్నవో, యీసాక్షియగు పురుషుడు పరమాత్మ యగును." (4) అను శ్రీ భాగవతపు నేడవ స్కంధమునందుండు వాక్యముచేత మూడవస్థలనుండి వేఱుచేయబడిన ఆత్మ బ్రహ్మరూపముగా నిశ్చయింపబడి యున్నదను నభిప్రాయముచేత శిష్యుడు ప్రశ్నించుచున్నాడు.

స్వామీ! చెప్పబడిన నీమూడుదేహములును, దృశ్యమై యుండుటచే జడము; నేను వీని ద్రష్టయగు చేతనుడ; కావున నీమూడుదేహములును నేను గాను అను తమరహస్యమయిన అభిప్రాయమును నేనెఱింగితిని. ఇప్పుడు మూడవస్థలు ఎట్లున్నవి? వానిని చెప్పవలయును.

51. మూడవస్థలును వాటితో నాత్మకు గల భేదమును 1.జాగ్రత్త 2. స్వప్నము, 3. సుషుప్తి అనునవి మూడవస్థలు, ఈమూడవస్థలును నీవు గావు, అవి నీవియు గావు. ఈమూడవస్థలును క్రమముగా మూడుదేహముల కున్నవి. వాటిలో స్థూలదేహ అవస్థ జాగ్రత్తయును, సూక్ష్మదేహఅవస్థ స్వప్నమును, కారణదేహపు అవస్థ సుషుప్తియు నగును. ఇది వీనిక్రమ మగును.

52. జాగ్రదవస్థా వర్ణనము.

ఏ యవస్థయందు మనుష్యుడు జాగ్రత్త (మేల్కొనియుండుట) కలిగి వ్యవహారములు చేయుచున్నాడో యది జాగ్రదవస్థ యగును.

ఆ జాగ్రతావస్థ యేలాటిదనగా దేనియందు పదునాలుగు త్రిపుటులచే నన్ని వ్యవహారములును గలుగుచున్నవో ఆలాటి దగును.

ఇట మఱియు దేనియందు వ్యావహారికపు పదునాలుగు త్రిపుటులచే నన్ని వ్యవహారములును కలుగుచున్నవో యది జాగ్రదవస్థ యనబడుచున్నది అని జాగ్రదవస్థయొక్క స్థూలలక్షణము సూచింపబడినది. ముందు ' దేనియందు పురుషుడు మేల్కొనుచున్నాడో'' అనువాక్యము చేత నీయర్థము సూచింపబడున దగుచున్నది.

దేవతలకును మనుష్యులకును జాగ్రదవస్థ గలదు.
పశువు పక్షి మొదలగు వాటికి స్వప్నావస్థ గలదు.
మ్రాను కొండ మొదలగు వాటికి సుషుప్త్యవస్థ గలదు.
వానిలో మ్రాకులకు క్షీణ(తక్కువ) సుషుప్తి గలదు.
కొండ మొదలగువానికి గాఢ (దట్టమైన) సుషుప్తి గలదు.

దేనినుండి లేపుట లేక (నిద్రనుండి) తానే లేచుచున్నాడో అది క్షీణసుషుప్తి యనబడును.

దేనినుండి లేపితేగాని నిద్రనుండి లేచుట లేదో యది గాఢసుషుప్తి యనబడును.

1.శుభేచ్ఛ, సువిచారణ, తనుమానస అనునీమూడు జ్ఞానభూమికల పర్యంతము అభ్యాసము గల జిజ్ఞాసువులకు జాగ్రదవస్థ గలదు.

2. సత్త్వాపత్తి యను పేరుగల నాల్గవభూమిక గల బ్రహ్మవిత్తను జీవన్ముక్తు డయిన విద్వాంసునకు:- తనస్వరూపపు అచిరకాలమందు జాగ్రత్తవంటి యవస్థ యున్నది విచారకాలమందు స్వప్నమునుండి లేచిన పురుషునివంటి యవస్థ యున్నది.

3. అసంసక్తియను ఐదవజ్ఞానభూమిక గల బ్రహ్మవిద్వాంసుడైన జీవన్ముకు నికి- సమాధినుండి లేచిన కాలమందు స్వప్నమునుండి లేచిన వానివంటి యవస్థ గలదు. సమాధికాలమందు సుషుప్తివంటి యవస్థ యున్నది.

4. పదార్థాభావిని యనునాఱవ భూమిక గల బ్రహ్మవిద్వర్యుడైన పురుషునికి-

అనేకముగా సుషుప్తివంటిదియును

ఒకకాలమున స్వప్నమునుండి లేచినది వంటిదియైన అవస్థ యున్నది.

తురీయమను నేడవభూమి నెక్కిన బ్రహ్మవిద్వరిష్ఠ జీవన్ముక్తునకు ఎప్పుడును గాఢసుషుప్తివంటి యవస్థ గలదు.

ఈయన్ని యవస్థలును జ్ఞానరూప వృత్తివి యగును. ఏలయన -

1. క్షేపము (లోకవాసన, శాస్త్రవాసన, దేహవాసనను మూడు రాజసవాసనల చేతను ఉద్భూతమయిన రాగద్వేషములు మొదలగు వానితో గూడుట)

2. మూఢత్వము (నిద్ర)

3. విక్షేపము (క్షేపమునుండి విశేషమయిన చిత్తమునకు ఒకకాలపు ధ్యానముతో గూడియుండుటయు

4. ఏకాగ్రత్వ (ఒకేవిషయరూప మగుట)

5. నిరోధము (అనాత్మాకారమును విడిచి ఆత్మయందు నిలుచుట లేక తన యుపాదానమైన సత్త్వగుణమందు చిత్తము లయమగుట)

ఈయైదుభాగములును యోగశాస్త్రమందలి బుద్ధికి ఉన్నవిగా జెప్పబడియున్నవి. దేనిచే జాగ్రత మొదలగునవియును శుభేచ్ఛ మొదలగునవియు నయిన యవస్థలు వానియందు అణగినవై యున్నవో దానిచే నవియు బుద్ధియొక్క యవస్థలే యగును. ఆత్మవి కావు. ఆత్మ వీనికి సాక్షియై ఎప్పుడును వీనికి వేఱుగా నున్నదని తెలియుము.

53. పదునాలుగు త్రిపుటుల వర్ణనము

1-5 ఐదు జ్ఞానేంద్రియములు; 6-10 ఐదు కర్మేంద్రియములు;

11-14 మనస్సు బుద్ధి చిత్త అహంకారములగు నాలుగు అంతఃకరణములు అను నీపదునాలుగు ఇంద్రియములును అధ్యాత్మము లగును.

1-5 దిశలు వాయువు సూర్యుడు వరుణుడు అశ్వినీకుమారులను నైదుగురును క్రమముగా జ్ఞానేంద్రియముల దేవతలు.

6-10 అగ్ని, ఇంద్రుడు, ఉపేంద్రుడు, ప్రజాపతి, మృత్యువను నీ యైదుగురును కర్మేంద్రియముల దేవత లగుదురు.

11-14 చంద్రుడు, బ్రహ్మ, వాసుదేవుడు (క్షేత్రజ్ఞుడు), రుద్రుడు అను నీ నలుగురు అంతఃకరణముల దేవత లగుదురు.

ఈపదునాలుగురు దేవతలును అధిదేవతలు.

శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము అను నైదును జ్ఞానేంద్రియ ముల విషయము లగును.

వచనము, ఆదానము, గమనము, రతి, మలవిసర్జనము అను నీయైదును కర్మేంద్రియముల విషయము లగును.

సంకల్ప వికల్పములు, నిశ్చయము, చింతనము, అహంభావము అను నాల్గును అంతఃకరణ విషయము లగును.

ఈశబ్దము మొదలు పదునాలుగు విషయములు అధిభూతము లగును.

ఇట్లు ఒక్కొక్క యింద్రియమును అధ్యాత్మము. దాని యొక్కొక్క దేవతయు అధిదైవతము. దానియొక్క విషయమును అధిభూతము నగును.

వీటిచే నీపదునాలుగు త్రిపుటులకును భేదము గలదు.

54. ఈవిధమున జాగ్రదవస్థయొక్క స్వరూపమును జెప్పి యిక దాని సామగ్రిని జెప్పుచున్నాడు.

జాగ్రదవస్థయందు చిదాభాసరూప జీవునికి-

1. నేత్రము స్థానము. జాగ్రత్తయందును అది శరీరమంతటను వ్యాపించి యున్నది. అట్లయినను దాని విశేషభాగము నేత్రమందుండుటచే నేత్రము స్థానమనబడుచున్నది.

2. క్రియాశక్తి యగును, 3. వైఖరివాక్కు, 4. స్థూలము, భోగము 5. గుణము సత్త్వము 6. విశ్వయను పేరుపొందిన ఈజీవుడు జాగ్రత్తయొక్క అభిమాని యగును.

55. ఇప్పుడు తక్కిన అవస్థలయందు ఆత్మయొక్క అన్వయమునున్ను జాగ్రత్తయొక్క వ్యతిరేకమునున్ను చెప్పుచున్నాడు.

స్వప్నసుషుప్తులందుండు జాగ్రదవస్థయొక్క అభావమేదియో యది దాని వ్యతిరేక మగును.

శిష్యుడా! నీవు దానికి సాక్షిగా నున్నావు. అది యెప్పుడును స్వరూపముగా సత్త గలది యగును. ఇది అచ్చటనుండు నీయన్వయ మగును.

ఇందుచే నీవు స్థూలదేహముతో గూడిన జాగ్రదవస్థకంటెను వేఱుగా నున్నావు.

పుష్పమాలయందు ప్రవేశించియుండు నూలుపోగువలె దేహముతో కూడిన సర్వావస్థలయందును ఆత్మయొక్క ప్రవేశము గలదు. అది ఆత్మయొక్క అన్వయ మనబడును.

పుష్పములవలె నొకదానికొకటి యైనను తన యధిష్ఠానమైన ఆత్మతో నైనను దేహముతోగూడిన మూడవస్థలకు గల భేదమేదియో యది దేహముతో గూడిన యవస్థల వ్యతిరేక మనబడుచున్నది.

ఇట వ్యతిరేక మనునది అభావమునకును, అన్వయ మనునది భావమునకును నగును.

56. స్వప్నావస్థా వర్ణనము-

జాగ్రదవస్థయందు శ్రవణమందైనను, నేత్రమందైనను, తక్కిన యింద్రియములచే నైనను, అనుభవింపబడిన విషయముల జ్ఞానముచే గనబడు వాసన లేవియో యవి వెంద్రుకకొనవలె సూక్ష్మమయి కంఠమందుండు హిత అను నాడియందున్నవి.

సంస్కారరూప వాసనయొక్క శబ్దము మొదలగు విషయములును, వాని జ్ఞానమునగు రెండురూపములును ఏనిద్రకాలమందు గలుగుచున్నవో దానిని స్వప్నావస్థ యనవలెను.

57. స్వప్నావస్థయొక్క సామగ్రి

స్వప్నావస్థయందు చిదాభాసరూపజీవునకు

1. కంఠము స్థానము 2. బలము(శక్తి) జ్ఞానము 3. మధ్యము, వాక్కు 4. సూక్ష్మము (వాసనామయము) భోగము 5. గుణము రాజసము 6. తైజసమను పేరుపొందిన యీజీవుడు ఆయవస్థకు అభిమాని. ఇది స్వప్నసామగ్రి చెప్పబడినది.

58. ఇక స్వప్న సంబంధమైన అన్వయవ్యతిరేకములను జెప్పుచున్నాడు.

1. జాగ్రత్ సుషుప్తులందుండు స్వప్నావస్థ అభావ మేదియో యది దాని వ్యతిరేక మగును.

2. ఆవ్యతిరేకముయొక్క సాక్షియైన నీవు ఎప్పుడును తనస్వరూపముగా సత్త గలవాడుగా నున్నావు.

ఇదియే యచ్చట నుండు నీయన్వయ మగును. కావున నీవు దీనికి వేఱుగా నున్నావు.

59. సుషుప్తిఅవస్థా వర్ణనము

ఏయవస్థయందుండి మేల్కొని 'నేనొకటియు 'నెఱుగ' నని నిద్రకాలమం దనుభవించిన అజ్ఞానస్మరణరూప జ్ఞానము కలుగుచున్నదో ఆ విధగాఢ (లోతైన) నిద్రను సుషుప్తి యనెదరు.

60. సుషుప్తి అవస్థా సామగ్రివర్ణనము

సుషుప్తి యవస్థయందు జీవునికి 1 హృదయము స్థానము, 2 బలము(శక్తి) ద్రవ్యరూపము.

ఎందుచే నటక్రియారూపమును, జ్ఞానరూపమును నగు వ్యవహార అభావ

మున్నదో, ఎందుచే అజ్ఞానరూప ద్రవ్యమగు వస్తుమాత్రపు ఉనికి యున్నదో అందుచే నట ద్రవ్యము శక్తి యనబడుచున్నది లేక అట అజ్ఞానమందు ద్రవ్యమగు నాకాశము మొదలగు భూతములను గల్పించుటయొక్క సామర్థ్యరూపశక్తి ఏదియో యది ద్రవ్యశక్తి యనబడుచున్నది.

3. వాక్కు పైసంధి (హృదయమందుండునది)

4. ఆనందము భోగము

5. గుణము తమస్సు.

6. ప్రాజ్ఞుడను పేరుపొందిన జీవుడు సుషుప్తికి అభిమాని యగును. ఇది సుషుప్తియొక్క సామగ్రి యగును.

61. ఇప్పుడు సుషుప్తి సంబంధమును అన్వయవ్యతి రేకములు చెప్పుదుము.

1. జాగ్రత్స్వప్నములయందున్న సుషుప్తియొక్క అభావమేదియో యది అట దాని వ్యతిరేక మగును.

2. ఆ వ్యతిరేకమునకు సాక్షియయిన నీవు ఎప్పుడును స్వరూపముగా సత్త గలవాడవుగా నున్నావు. ఇది యచ్చట నుండు నీయొక్క అన్వయము.

దీనిచేతనే నీవు సుషుప్తియవస్థకంటె వేఱుగా నున్నావు. జీవుని మూడవస్థల కంటె ఆత్మ వేఱుచేసి యెఱిగింపబడినది. అట్లే ఈశ్వరుని మూడవస్థలమునుండి బ్రహ్మమున్ను ఇచ్చట వేఱుచేసి యెఱిగింప బడవలసిన దగును. అట్లయినను అది మూడవ యుపదేశమందు తెలిపింపబడినందున నిట తెలిపింపబడలేదు.

అవస్థాత్రయ ఆత్మ వివేచనమను ఆఱవ యుపదేశము

సమాప్తము

ఏడవ యుపదేశము

పంచకోశములు- ఆత్మవివేచన వర్ణనము.

62. శిష్యుడు చెప్పుచున్నాడు

స్వామీ! మూడవస్థలు నేను గాను. ఇవి నావియు గావు అను తమ యభిప్రాయమును తెలిసికొంటిని.

ఇక పంచకోశముల పేర్లును, రూపమును గృప యుంచి చెప్పవలయును.

63. గరువు చెప్పుచున్నారు

1. మొదటిది అన్నమయము, 2. రెండవది ప్రాణమయము, 3. మూడవది మనోమయము, 4. నాల్గవది విజ్ఞానమయము, 5. ఐదవది ఆనందమయకోశము-

ఇవిపంచ *82 కోశముల పేర్లని యెఱుంగుము.

ఇప్పుడు పంచకోశముల ఆహారములను చెప్పుటతో వాని అనాత్మతయున్ను చెప్పుచున్నాడు.

1. (1) మాతాపితరులు భుజించిన యన్నముచే నయిన రజస్సు (తల్లి రుధిరము) చేతను, వీర్యము (తండ్రి రేతస్సు) చేతను తల్లి కడుపున శరీరము

*82. కోశమునునది కోశకారమను పురుగుయొక్క ముండ్లచేనైన గూడగును. అదెట్లు ఆపురుగునకు క్లేశమునకు హేతువయి యుండుటవలన కోశ మనబడుచున్నదో అట్లు ఈపంచకోశములును ఆత్మకు ఆవరణమూలమున క్లేశమునకు హేతువయి యుండుటచే కోశము లనబడుచున్నవి. లేక కత్తియొక్క ఒరయును ధనముయొక్క బొక్కసమును క్రమముగా కత్తిని ధనమును మూయునదిగా నున్నందున కోశ మనబడుచున్నది. అట్లే యీపంచ కోశములును దేనిచే ఆత్మను మూయునదిగా నున్నదో దానిచేత కోశము లగును.

ఎట్లు నీలము పీతము(పసుపు)మొదలగు వర్ణములమీద నుంచబడిన స్ఫటికము మొదలగునవి ఆయారూపముగా గనబడుచున్నదో అందుచే నవి వాని (స్ఫటికము మొదలగువాని) ఆవరణమగునో యట్లు పంచకోశములందున్న ఆత్మ ఆయారూపముగా ప్రకాశించుచున్నది. కావున నది (కోశము) దీనికి ఆవరణ మగును. విచారము చేయగా అది వానికే వేఱుగా నున్నది.

ఉత్పత్తి యగుచున్నది.

(2) అది పుట్టిన పిమ్మట పాలు మొదలగు అన్నముచే పెరుగుచున్నది.

(3) మరణమునకు పిమ్మట అన్నమగు పృథివియందు లయించుచున్నది. ఈవిధమయిన స్థూలదేహ మేదియో యది అన్నమయకోశ మనబడుచున్నది.

ఈయన్నమయ కోశమగు పక్షికి ఇదియే (ప్రసిద్ధముగా నుండుటయే) శిరస్సగును; తూర్పుదిక్కునకు ఎదురుముఖముగా నుండు పురుషుని నిది (కుడిభుజము) దక్షిణకుడిపక్ష మగును (రెక్కయగును). ఇది (ఎడమ భుజము) ఉత్తర (ఎడమ) పక్ష మగును. (ఇది మధ్యదేహపు భాగము) అంగముల ఆత్మ (స్వరూప) మగును. ఇది (నాభికి క్రిందిఅంగము) పుచ్ఛ(తోక) రూపప్రతిష్ఠ యగును (ఆధారము).

(2) ఐదు కర్మేంద్రియములును, ఐదు ప్రాణములు నైన పదితత్త్వములు జేరి ప్రాణమయకోశ మనబడును.

ఈప్రాణమయకోశ మగుపక్షికి ప్రాణమే శిరస్సును, వ్యానము దక్షిణ పక్షమును, అపానము ఉత్తరపక్షమును, ఆకాశము (సమానవాయువు) ఆత్మయును, (మధ్యభాగ స్వరూపము నగును.) పృథివి పుచ్ఛ (తోక) రూపప్రతిష్ఠయు నగును. దేనిచే ఆధ్యాత్మ (దేహమునందుండునది) రూపప్రాణికి పృథివీరూప దేవతస్థితికి హేతువై యుండుటచే ధారణ చేయునదిగా నున్నదో దానిచే పృథివీప్రతిష్ఠ యనబడినది.

3. ఐదు జ్ఞానేంద్రియములును మనస్సును నయిన ఆఱుతత్త్వములును చేరి మనోమయకోశ మనబడును.

ఈమనోమయ రూపపక్షికి యజుర్వేదమే శిరము. ఋగ్వేదము దక్షిణ పక్షమును, సామవేదము ఉత్తరపక్షమును, ఆదేశము (ఉపనిషత్తు మొదలగు బ్రాహ్మణముల భాగము) ఆత్మయు నగును. అథర్వాంగిరసము (అథర్వవేదము) పుచ్ఛరూపప్రతిష్ఠయు నగును.

వర్ణోచ్చారణముయొక్క (స్థానము) ప్రయత్నము, నాదము, స్వరమను వానిచే నిండిన పదమును వాక్యమును విషయము చేయునదగువాని (స్థానము మొదలగువాని) సంకల్పరూపవాని భావన గల మనస్సుయొక్క వృత్తి యేదియో యది శ్రోత మొదలగు కరణముల మూలముగా యజుర్వేదముయొక్క సంకేతముచే విశిష్టమయి "యజుర్వేద" మని చెప్పబడుచున్నది. ఇట్లే ఋగ్వేదమును నున్నది. ఇట్లే సామవేదమును నున్నది. వీనిచే మంత్రములకు మనోరూపత్వ మున్నదిగా మనస్సుయొక్క వృత్తియే ఆవర్తనము (చేయ) త్రిప్ప బడుచున్నది. దీనిచే మానసజపము సంభవించుచున్నది. దీనిచే మనోమయకోశమునకు వేద రూపత్వము తైత్తిరీయ ఉపనిషత్తునందు చెప్పబడుచున్నది:

4. ఐదు జ్ఞానేంద్రియములును; బుద్ధియు నయిన నీయారు తత్త్వములు చేరి విజ్ఞానమయ కోశమనబడుచున్నది.

ఈ విజ్ఞానమయ కోశరూపపక్షికి శ్రద్ధయే శిరము. ఋతము(సత్యము పలుకుటకు హేతువయిన వృత్తి) దక్షిణపక్ష మగును. సత్యము (సమదర్శనము) ఉత్తరపక్ష మగును. యోగము (చిత్తముయొక్క యేకాగ్రత) ఆత్మ యగును. మహత్తత్త్వము (సమష్టిబుద్ధి) పుచ్ఛరూప ప్రతిష్ఠ యగును: (తీగకు ఆధారముగా నుండు పృథివివలె బుద్ధికి ఆధార మగును) ఇట మనోమయమునకు వేదరూపత్వ మును, విజ్ఞానమయమునకు శ్రద్ధాదిరూపత్వమును చెప్పబడినది. అది అధికారి యొక్క మనోబుద్ధులచే గలుగునదిగా నుండుటచే జెప్పబడినది.

ఈవిధప్రాణము మొదలగు మూడుకోశములును లింగదేహరూప మగును.

(1) ప్రాణమయము, (2) మనోమయము, (3) జ్ఞానమయము - అను నీమూడుకోశములును లింగదేహరూపమే యగును; అట్లయినను,

(1) ప్రాణమయకోశము కేవలము రజోగుణావస్థ యగును.

(2) మనోమయకోశము రజోగుణముతోగూడిన సత్త్వగుణ అవస్థ యగును.

(3) విజ్ఞానమయకోశము కేవలసత్త్వగుణ అవస్థ యగును.

ఇట్లు గుణముల యవస్థల భేదములచే ఒకేలింగదేహమందు మూడు కోశముల కల్పన యున్నది.

4. ఆత్మయొక్క స్వరూపరూప ఆనందముయొక్క ప్రతిబింబముతో గూడిన ప్రియమోద ప్రమోదరూప వృత్తుల లయమునకు స్థానమయిన కారణ దేహ మేదియో అది ఆనందమయకోశ మనబడుచున్నది.

ఇష్టవిషయముయొక్క దర్శనమువలన కలుగు వృత్తి ప్రియము అగును. దానిలాభముచే గలుగు వృత్తి మోద మగును. దాని భోగముచే కలుగు వృత్తి ప్రమోదవృత్తి యగును.

ఈవృత్తులు జాగ్రత్ స్వప్నముల పుణ్యకర్మల ఫలమగు సుఖముయొక్క భోగకాలమం దుదయించుచున్నవి. పుణ్యఫలభోగ అభావకాలమందు కలుగు సుషుప్తి ఏదియో దానియం దావృత్తులు, తమ కారణమయిన అజ్ఞానమునందు లయించుచున్నవి. ఆయజ్ఞానము ఆనందమయకోశ మగును.

ఈయానందమయకోశ రూపపక్షికి ప్రియవృత్తి శిరము. మోదవృత్తి దక్షిణపక్షము, ప్రమోదవృత్తి ఉత్తరపక్షము. ఈవృత్తుల ప్రతిబింబరూప విషయానందము దీని ఆత్మ యగును. బింబమగు ఆనందరూపబ్రహ్మము పుచ్ఛరూపప్రతిష్ఠ యగును (ఆధారమగును)

ఇట అన్నమయకోశమునకు పక్షము, పుచ్ఛము మొదలగు వానికి సమానమయిన అవయవములు ప్రసిద్ధ మగును. కావున దాని పక్షిత్వముయొక్క రూపకమున్ను ప్రసిద్ధమే యగును. కోశమందు పోయబడిన కరగించిన తామ్రపు ప్రతిమవలె ప్రాణమయము మొదలగు కోశములకు రూపకము సిద్ధించుచున్నది. కావున కోశములందు పక్షియొక్క ఆహారమును కల్పించున దేదియో యది బాహ్యవిషయముల ఆసక్తిని (ఆశను) నిషేధించుటకు హేతువైన బుద్ధిని ఆత్మయందు నిల్పుటకొఱ కగును. ఉపాసనపు విధానముకొఱకు గాదు.

ఇట్లు చెప్పబడిన పంచకోశములును అనిత్యములును, జడములును, వికారులును, వ్యభిచారులును, క్షణికములును నగును.

వీనినెఱుగు ఆత్మయయిన నీవు అలింగముగా నున్నావు. అనగా నీపంచకోశముల లింగమగు లక్షణము లేవియో యవి లేనివాడుగా నున్నావు. కావున నీవు నిత్యమును, చేతనమును, అవికారియు, అవ్యభిచారియు ఎప్పుడునుండు వాడును నగుదువు కావున నీ *83 పంచకోశములు నీవు కావు. అయితే నీవు వీనికి వేఱుగా నుండుటచే పంచకోశాతీతుడవు. చెప్పబడిన

---

*83. ఇట ఇది విశేషమగును:-

౧ అన్నముచే కలిగినదియు, అన్నముచే జీవించియుండునదియు; అన్నము లేనందున నాశమగునదియు; తోలు, నరము, మాంసము, నెత్తురు, ఎముక పురీషము (మలము)- అనువాని రాశియు, పుట్టుకకు పూర్వమును మరణమునకు వెనుకయు లేనిదియు, నియమము లేని స్వభావము గలదియు, అనేకరూపములు గలదియు, జడమై ఘటములవలె కనబడు చేతులు, కాళ్ళు, మొదలగువానిని గలదియు; నియమమందుంచదగిన దుఃఖరాశియు, మాంసముచే పూయబడినదియు నయిన యీస్థూలదేహరూప అన్నమయ కోశమేదియో యది ఆత్మ కాదగినది గాదు. ఏలయన ఆత్మ దీనికి విలక్షణమయి నిత్యమున్ను, శుద్ధమును, ఉత్పత్తి నాశములు లేనిదియు, నియమింపబడిన స్వభావము గలదియు, ఏకమును చేతనరూపమును ద్రష్టయును షడ్భావరూప వికారముల నెఱుగునదియు, అంగములు లేనిదియు, శరీరజీవనమునకు హేతువైనదియు, ఆయాశక్తి గలదియు, (శక్త్యధిష్ఠాన) నియామకుడును, దేహము దానిధర్మము దానికర్మము దానియవస్థ మున్నగు వానికి సాక్షియు నిత్యాపరోక్షమును జ్ఞాతయును నైయున్నది.

౨ ఎందుచే అన్నముచే నిండించుటచే అన్నమయకోశము బలము గలదై అన్ని క్రియలందును ప్రవృత్తము (ప్రయత్నము) గలదగుచున్నదో, అట్లే వాయువుయొక్క వికారము వాయువువలె బయట లోపల పోవుట వచ్చుటయునై యటనే యిష్టునకైనను, అనిష్టునకైనను, తనకైనను, తక్కినవారికైనను, ఒక్కటియు నెఱుగనిదియై నిత్యపరతంత్రమై యున్న నీవిధమైన యైదు కర్మేంద్రియములతో గూడిన ప్రాణరూప ప్రాణమయకోశ మేదియో యది యాత్మ యగుటకు తగినది కాదు. ఏలన ఆత్మ దీని విలక్షణజ్ఞాతమయి (ఎఱుగునదియు) లోపలను, బయటను పూర్ణమయి నిశ్చలరూపమై యున్నది.

3. నేను నాది - యను వస్తువుల వికల్పమునకు హేతువును; పేరు మొదలగు భేదకల్పనతో గూడినదియు, అత్యంత బలము గలదియునయి ఏది దానికంటె ముందటి కోశములను వాల్గ్రక్కలను వూరించి వెలయుచున్నదో - యీవిధమగు నైదుజ్ఞానేంద్రియములతో గూడిన మనస్సు ఏదియో యది మనోమయకోశ మగును. ఈ

(cont...)

మనోమయరూపాగ్ని ఐదు ఇంద్రియరూప హోమకర్తలచే విషయరూపమైన నేతిధారచే బెరిగి, బహువాసనారూప ఇంధనములచే జ్వాలలు విడిచి ఉండునదై ప్రపంచమును (ప్రపంచపు జీవులను) మండించుచున్నది. మనస్సునకు వేఱుగా అవిద్య లేదు. భవబంధమునకు హేతువయిన అవిద్య మనస్సగును. అది నష్టమయిన అన్నియు నష్టమగును. అది ప్రకాశించిన అన్నియు ప్రకాశించును. వస్తువు లేని స్వప్నమందు తనశక్తిచే భోక్త మొదలగు సకలవిశ్వమును మనస్సే సృష్టించుచున్నది. అట్లే జాగ్రత్తయందు విశేషము లేదు. అందుచే నివియన్నియు మనస్సుయొక్క విలాసమగును. సుషుప్తికాలమందు మనస్సు లయించినప్పుడు "ఒక్కటియు లేదు" యనునది సకలజనులకు ప్రసిద్ధము. కావున నీపురుషునికి మనఃకల్పితమే సంసార మగును. వాస్తవముగా లేదు. ఎట్లు మేఘము వాయువుచే వచ్చుచున్నదో మరల దానిచేతనే పోవుచున్నదో, అట్లే మనస్సుచే బంధము కల్పింపబడుచున్నది. దేహము మొదలగు సర్వవిషయములందును, రాగమును కల్పించి దానిచే దారముచే కట్టబడిన పశువువలె పురుషుని కట్టుచున్నది. పిమ్మట దీనియందు విషమువలె నీరసత్వముచే నామనస్సు దీనిని బంధమునుండి విడిపించుచున్నది. అందుచే నీజంతువులకు బంధముకొఱకైనను, మోక్షముకొఱకైనను, కారణము మనస్సే యగును. రజోగుణ, తమోగుణములచేత మలినమైన మనస్సు బంధము నకు హేతువగును. రజస్సు తమస్సులు లేని శుద్ధమయిన మనస్సు మోక్షమునకు హేతువగును. వివేకము వైరాగ్యమను గుణాతిశయము (అధికము) చేత శుద్ధత్వమును బొందిన మనస్సు విముక్తికొఱ కగుచున్నది. కావున బుద్ధిమంతులగు ముముక్షువులకు మొదటినుండియే దృఢమయిన యా రెండు గుణములతో గూడియుండుట తగినదగును.

మనస్సనునది వ్యాఘ్రము. అది విషయమయిన వనభూముల విహరించుచున్నది. వానియందు (ముందు చెప్పిన భూములందు) సాధువులయిన (సదాచారము గలవారయిన) ముముక్షువులు పోవుటకూడదు. మనస్సనున దేదియో యది స్థూలరూపముగాను సూక్ష్మ(వాసన) రూపముగాను భోక్తయొక్క సకలవిషయములను శరీర వర్ణ ఆశ్రమ జాతి భేదములను గుణక్రియారూప హేతువులు గల ప్రయోజనములను నిత్యమును గలిగించుచున్నది. అదియుగాక ఈమనస్సు అసంగ చిద్రూపమయిన యాత్మను విశేషముగా మోహింపజేసి దేహేంద్రియ ప్రాణరూప త్రాళ్ళచే కట్టి "నేను నాది" యని నిరంతరము తనకార్యరూప బలముయొక్క ఉపయోగములందు త్రిప్పుచున్నది. అధ్యాసదోషముచే పురుషునకు సంసారము కలుగుచున్నది. అధ్యాసరూప బంధమును ఇదియే కల్పించియున్నది. కావున రజస్తమో రూపదోషము గల అవివేకికి జన్మమొదలగు దుఃఖమునకు కారణము ఇది యగును. (మనస్సగును) కావున తత్త్వమును దెలిసిన పండితులు మనస్సును అవిద్య యందురు. ఎందుచే వాయువుచే మేఘమండలము తిరుగుటవలె విశ్వము తిరుగుచున్నదో,

(cont...)

అన్నమయము మొదలగు కోశము లేవియో యవి అనుభవముయొక్క

ఆమనస్సుయొక్క శోధన (శుద్ధీకరించుట) ముముక్షువుచే జేయదగినది. ఇది బొత్తిగా ముక్తియందు అఱచేతియందలి పండువలె నగుచున్నది. ఏపురుషుడు మోక్షమొక్కటియందు ప్రీతిచే విషయములందు రాగమును విడిచి సకలకర్మములను విడిచి చక్కని శ్రద్ధచే శ్రవణాదులందు స్థిరముగ నిలుచునో వాడు బుద్ధియొక్క రజోగుణముచే నయిన స్వభావమును నాశము చేయుచున్నాడు. ఈవిధమైన ఈమనోమయ కోశమున్ను పరమాత్మ కానేరదు. ఏలయన ఆద్యంతములు గలదిగా నున్నది. పరిణామత్వము గలదిగా నున్నది. దుఃఖ స్వరూపముగా నున్నది. ద్రష్టయొక్క విషయదృశ్య రూపముగా నున్నది. దృష్టి యేదియో యది దృశ్యరూపత్వముగా కనబడుటలేదు.

4. పంచజ్ఞానేంద్రియ సహితవృత్తితో గూడిన కర్తృరూపబుద్ధి యేదియో యది విజ్ఞానమయకోశ మగుచున్నది. అది పురుషునికి సంసారమునకు కారణ మగుచున్నది. చేతనముయొక్క ప్రతిబింబశక్తి దేనియందు అనుగతమై యున్నదో యావిధి విజ్ఞానమను పేరు గలదియు, జ్ఞానరూపక్రియ గలదియునగు ప్రకృతియొక్క వికార మగును. అది నిరంతరము దేహము, ఇంద్రియములు మొదలగు వానియందు అత్యంత అభిమానమును జేయుచున్నది. ఈ విజ్ఞానమయకోశము పరాత్మ కానేరదు, ఏలయన వికారియు జడమును, పరిచ్ఛిన్నమును, దృశ్యమును, వ్యభిచారియును, అనిత్యమును నైయుండుటయే,

5. ఆనందపు ప్రతిబింబముచే నీడ్వబడిన యాహారము దేనికి గలదో యావిధమైన అజ్ఞానముచే వికాసమును బొందిన వృత్తి ప్రియము, మోదము, ప్రమోదము అను గుణములు గలదియు, కోరినవస్తువును బొందుటచే నుదయించు నదియును, పుణ్యముయొక్క అనుభవకాలమందు ప్రకాశించునదియు నయిన యానందమయకోశ మగును. దానియందు పుణ్యవంతులు అయిన దేహధారులు మాత్రము ప్రయత్నము లేకయే తామే యానందరూపులయి చక్కగా నానందమును బొందుచున్నారు. ఈయానందమయ కోశమునకు సుషుప్తియందు స్ఫూర్తి (ప్రకాశించుట) అధిక మగును. స్వప్నజాగ్రత్తలందు ఇష్టవస్తువును దర్శనలాభ భోగములచే గొంచెము గలుగుచున్నది. ఈయానందమయ కోశమున్ను పరమాత్మ కానేరదు. ఏలయన ఉపాధితో గూడినదియు, ప్రకృతియొక్క వికారమును, పుణ్యక్రియ కార్యమును, వికారముతో గూడిన శంకాతంకములతో గూడినదియునై యుండుటయే.

పంచకోశములను యుక్తిచేతను, శ్రుతిచేతను నిషేధింప వాని నిషేధమునకు ఎల్లయగు బోధరూపసాక్షి మిగులుచున్నది. ఏయొక్క ఈయాత్మ స్వయంజ్యోతియై పంచకోశముల విలక్షణమై మూడవస్థలకు సాక్షియై నిర్వికార నిరంజనమై ఎల్లప్పుడును ఆనందబ్రహ్మరూపమై యున్నదో అది వివేకవంతుడగు పురుషునిచేతనయొక్క ఆత్మత్వముగా నెఱుగదగిన దగును.

విషయముగా చేయబడుచున్నవి. వాటికంటె వేఱయిన ఒక ఆత్మ చేయి మొదలగు వాటిమీద నుంపబడిన విశ్వరూప (స్ఫటికమున కన్న స్వచ్ఛమయిన) మణివలె అనుభవమునకు విషయము కానేరదు. అట్లయినను నాపంచకోశములు ఏయనుభవము (చేతనరూప స్వప్రకాశజ్ఞానము) నకు విషయ మగుచున్నవో, యాయనుభవమును "లేదు" అని నివేదించు వాడెవడు? ఒక్కడును నిషేధింప శక్తుడు కాజాలడు. అది స్వప్రకాశమై యుండుటచే కలదైయుండి ఏజ్ఞాతకును, జ్ఞానమునకును విషయముకాక అనుభవమే ఆత్మయై యున్నది.

64. అట్లయిన స్వామీ నేను ఎప్పుడు మూడుశరీరములకును మూడ వస్థలకును పంచకోశములకును వేఱైయున్నానో అప్పుడు నాస్వరూపము ఏది? యని శిష్యు డడుగ గురువు చెప్పుచున్నారు.

1. దేహము మొదలగు అన్నిటిని ఎఱుగునదిగా నున్నందున ఏది ద్రష్టగా నున్నదో-

2. ఉదాసీనమున్ను (రాగద్వేషరూప అంతఃకరణముల ధర్మములు లేనిదియు), సమీపించి యుండునదియు, ఎఱుగునదియైన చేతన రూపమునయి యుండుటవలనను; లేక అంతరమందును దానివృత్తియందును చేతనమాత్రముగా నుండుటవల్లను; ఏది యన్నిటికి సాక్షిగా నుంటున్నదో-

3. మూడుకాలములందును (జాగ్రత్త మొదలగు వాటియందును, బాల్యము మొదలగు వాటియందును, చావు మొదలగు వాటియందును) బాధింపబడనిదిగా నుండుటచేత నేది సత్యముగా నున్నదో-

4. మూడుకాలములందును అన్నిటిని ప్రకాశము చేయునదిగా నుండుటచే నేది చిత్తుగా నున్నదో-

5. పరమప్రేమకు విషయమై యుండుటచే నేది యానందరూపమై యున్నదో-

6. నిర్వికల్ప సమాధియందుండు యోగులు తానే తానని ఎఱిగి దేనిని ధ్యానించుచున్నారో-

ఆవిధపు బ్రహ్మమున కభిన్నమగు ఆత్మతత్త్వమే నీయొక్క స్వరూప మగును. *84

ఇట ఇది తాత్పర్య మగును. చెప్పబడిన నీయాత్మ అవివేక దృష్టిచే జీవుడై వెలయుచున్నది. దానికి

1. నేత్రము, కంఠము, హృదయము అను మూడును దేశము.

2. జాగ్రత్త స్వప్నము సుషుప్తి అనుమూడును కాలము.

3. స్థూలసూక్ష్మకారణమను మూడును వస్తువులు (భోగసామగ్రులు)

4. ఇవియే మూడు శరీరములు.

5. విశ్వ, తైజస, ప్రాజ్ఞులను ముగ్గురు జాగ్రత్స్వప్న సుషుప్తి అవస్థల క్రమముగా అభిమానులు.

---

*84. ఇట ఇది యావిశేషములను పేర్లచే కీర్తించునవి యగును. ఆత్మయొక్క విశేషణము విధేయము నిషేధ్యము అనుభేదముచే రెండువిధము లగును. వానిలో ఆత్మయొక్క సాక్షాద్భేదమగు విశేషణము లేవో యవి విధేయవిశేషణము లనబడును. ఈవిధమయిన (1) సత్తు (2) చిత్తు (3) ఆనందము (4) బ్రహ్మము (5) స్వయంప్రకాశము (6) కూటస్థుడు (7) సాక్షి (8) దృష్టము (9) ఉపదృష్టము (10) ఏకము- అనునీ మొదలగువి యగును. ఎట్లు సధవ (సుమంగలి) అనుపదము విధవస్త్రీని నిషేధించి సువాసినీ స్త్రీని సూటిగా దెలిపించుచున్నదో అట్లు "సత్తు" మొదలగు విశేషణములు అసత్తు మొదలగు ప్రపంచపు విశేషణములను నిషేధించి సత్తు మొదలగు రూపమగు బ్రహ్మమును సూటిగా దెలిపించునవియై యున్నవి. కావున విధేయవిశేషణము లనబడుచున్నవి. ప్రపంచనిషేధ మూలమున ఆత్మను బోధించు విశేషణములు ఏవియో యవి నిషేధ్యము లనబడుచున్నవి. ఈవిధమయినవి (1) అనంతము (2) అఖండము (3) అసంగము (4) అద్వితీయము (5) అజన్మము (6) నిర్వికారము (7) నిరాకారము (8) అవ్యక్తము (9) అవ్యయము (10) అక్షరము మొదలగునవి. ఎట్లు అవిధవ యనుపదము విధవస్త్రీని నిషేధించి అర్థమందు ఆమెకు విలక్షణమైన సూవాసిని (సుమంగలి) ని తెలిపించునదిగా నున్నదో అట్లే ఈ అనంతము మొదలగు విశేషణములు దేనిచే అంతము మొదలగు ప్రపంచధర్మముల నిషేధించి అర్థముచే వాని విలక్షణమయిన బ్రహ్మమును దెలిపించునవియై యున్నవో అందుచేత నిషేధ్యవిశేషణము లనబడుచున్నవి.

6. జాగ్రత్త మొదలగు మోక్షపర్యంతమగు సంసార మేదియో యది జీవునికార్య మగును.

7. అల్పజ్ఞత్వము మొదలగునవి వానిధర్మము లగును.

ఈసర్వసామగ్రితో గూడిన బుద్ధి లేక అవిద్య దాని అధిష్ఠానసాక్షి యయిన ఆత్మయును నన్నియు చేరి జీవుడనబడుచున్నది. ఇది అన్ని సామగ్రులతోగూడిన బుద్ధినిగాని అవిద్యనుగాని, మిథ్యయను తెలివిచే విడిచి, మిగిలియుండు బుద్ధ్యుపహిత లేక అవిద్యోపహిత, చేతనరూపసాక్షియైన ఆత్మ యేదియో యది జీవుడను పదమునకు లక్ష్య మగును. అదియే యాజీవుని నిజరూప మగును.

పంచకోశ ఆత్మవివేచన వర్ణనమను నేడవ యుపదేశము

సమాప్తము

ఎనిమిదవ యుపదేశము

తత్త్వంపద వాచ్యార్థ లక్ష్యార్థములను చెప్పుటతో వాని ఐక్యమును నిరూపించుట.

65. శిష్యుడు చెప్పుచున్నాడు.

స్వామీ! జీవుడు, ఈశ్వరుడు వీని ఉపాధియయిన జగత్తు అనువాటి స్వరూపభేదమును నేనెఱింగితిని.

ఇప్పుడు తత్త్వమసి యను మహావాక్యము నందుండు, తత్పద త్వంపదముల వాచ్యార్థ లక్ష్యార్థములను జెప్పవలయు, పిమ్మట నా రెంటి లాక్ష్యార్థముల యభేదమును జెప్పవలయును.

66. తత్పదార్థ వర్ణనము 1

శ్రీ గురువుగారు చెప్పుచున్నారు.

౧ మాయతోగూడిన బ్రహ్మరూప ఈశ్వరుడు, తత్పదమునకు వాచ్యార్థ మగును.

౨ మాయలేని శుద్ధబ్రహ్మము అవాచ్యమయిన (వాక్కునకు విషయము కాని) తత్పదముయొక్క లక్ష్యార్థము.

67. త్వంపదార్థ వర్ణనము 2.

1. చిదాభాస సహితబుద్ధితో గూడిన కూటస్థ చేతనరూపజీవుడు త్వంపదముయొక్క వాచ్యార్థ మగును.

2. చిదాభాస సహిత బుద్ధిరూప ఉపాధి లేని కేవల కూటస్థ చేతన మేదియో యది అవాచ్య. త్వంపదముయొక్క లక్ష్యార్థ మగును.

ఇట ఇది తాత్పర్యము:- శబ్దమునకు అర్థముతోనుండు సంబంధము శబ్దవృత్తి యనబడును. ఆ వృత్తి శక్తి, లక్షణ యను భేదములచే రెండువిధము లగును.

1. శబ్దమునకు అర్థముతో నుండు సాక్షాత్సంబంధము (ప్రవృత్తి ఏదియో యది) శబ్దముయొక్క శక్తివృత్తి యగును. ఆశక్తివృత్తిచే, నేయర్థము తెలియబడుచున్నదో *85 అది వాచ్యార్థ మనబడును.

2. ఆ వాచ్యార్థ *86 సంబంధ మేదియో యది లక్షణావృత్తి యనబడు చున్నది. ఆలక్షణచేత నేయర్థ మెఱుంగబడుచున్నదో యది *87 లక్ష్యార్థ మనబడును.

---

*85. దీనినే శక్యార్థము లేక బోధ్యార్థము లేక విధేయార్థము లేక ముఖ్యార్థములే యని చెప్పుదురు.

*86. పైయోగము లేక తాదాత్మ్యము మొదలగు నేవిధమైనను వేఱుఅర్థముతో వాచ్యార్థమునకు గల సాక్షాత్సంబంధ మేదియో యది లక్షణ మనబడును. ఇట ఇది అభిప్రాయము. శబ్దమునకు తన యర్థముతోగల సంబంధము శబ్దశక్తివృత్తి యగును. శబ్దమునకు తన వాచ్యార్థమూలముగా వేఱొక (వాక్కునకు విషయము కానిదైన) అర్థముతో గల పరంపర సంబంధ మేదియో యది శబ్దమునకు లక్షణావృత్తి యగును. ఆ లక్షణ యెట వాచ్యార్థము పొసగబడదో యట ఆశ్రయింపదగినది. *87. వాచ్యార్థసంబంధి లక్ష్యార్థ మగును.

ఆలక్షణ *88 జహత్ (విడిచిన) లక్షణ *89 అజహత్ (విడువని) లక్షణ *90 భాగత్యాగ (విడిచి విడువని) లక్షణయను భేదములచే మూడువిధములు. వానిలో *91 మహావాక్యమునందు భాగత్యాగమే యుపాదేయము.

ఇట్లు ఘటాకాశ మఠాకాశముల యందుండు ఘట మఠ రూప ఉపాధి భాగమును విడిచి మిగిలియుండు ఘటమఠ సంబంధియగు ఆకాశము ఒక్కటిగానే యున్నదో; యెట్లు ఈశ్వరునియందును జీవునియందును గల మాయయును

---

*88. ఎచ్చట వాచ్యార్థమంతయు విడిచి దానిసంబంధియైన వేఱుఅర్థము చేకొనబడచున్నదో యట జహల్లక్షణ గలదు. ఎట్లు "గంగయందు గొల్లపల్లె" అను వాక్యమునందు గంగయనుపదముయొక్క వాచ్యార్థమయిన దేవనదియొక్క ప్రవాహమున గొల్లపల్లె సంభవింపనందున ఇట గంగయను పదవాచ్యార్థము పూర్తిగా (దేవనదీ ప్రవాహమును) విడిచి దానిసంబంధియైన గట్టు రూప వేఱు (లక్ష్య) అర్థము చేకొనబడుచున్నది. కావున నిది జహల్లక్షణ యగును.

*89. ఎచ్చట వాచ్యార్థము విడువక దానిసంబంధియగు అన్య (అధిక) అర్థము చేకొనబడచున్నదో యచ్చట అజహల్లక్షణ గలదు. ఎట్లన "ఎఱుపు పరుగిడుచున్నది" అనువాక్యమున "ఎఱుపు" అనుపదముయొక్క వాచ్యార్థమయిన ఎఱుపువర్ణమున పాఱుట సంభవింపమిచే దాని సంబంధియగు ఆశ్రయమగు గుఱ్ఱమనెడు అన్యార్థము చేకొన బడుచున్నది. కావున నిది అజహల్లక్షణ యగును.

*90. ఎచ్చట వాచ్యార్థమునుండియే విరోధిభాగమును విడిచి ఆ విరోధిభాగము చేకొనబడుచున్నదో యచ్చట భాగత్యాగ లక్షణగలదు. ఎట్లన " వాడే యీ దేవదత్తుడు" అనువాక్యమున భూతకాలమును, దూరదేశమందుండు దేవదత్తుని శరీరమును, "వాడు" అనుపదమునకు వాచ్యార్థము అగును. వర్తమానకాలమును, సమీపదేశమందుండు దేవదత్తునిశరీరమును "ఈ" అనుపదమునకు వాచ్యార్థము అగును.

సమానబలముచేత నారెండువాచ్యార్థములు ఏకమును దెలుపుచున్నవి. ఆయేకము ఒకదానికొకటి విరోధముగ రెండుపదార్థములకు సంభవింపదు. కావున దేశ కాల రూప విరోధభాగమును విడిచి ఆ విరోధమయిన దేవదత్తుని శరీరపు ఏకత్వము నిశ్చయింప బడుచున్నది. కావున నిది భాగత్యాగ లక్షణ యగును.

*91. సకల వాచ్యభాగములను (జీవేశ్వరుల) విడుచుటచేత చేతనభాగము పోవుటచేత మహావాక్యమునందు జహల్లక్షణ సంభవింపదు. వాచ్యార్థమునువలె ఏకత్వమునకు విరోధ ముండుటచేత మహావాక్యమున అజహల్లక్షణయును సంభవింపదు. అయితే విరోధియైన వాచ్యభాగమును (ధర్మముతో మాయ అవిద్యలను) విడుచుటచే అవిరోధియైన చేతనభాగము చేకొనబడి ఏకత్వపు నిశ్చయము స్ఫురించుటచే మహావాక్యమునందు భాగత్యాగ లక్షణయే సంభవించుచున్నది.

(cont...)

బుద్ధియు నైన ఉపాధిభాగమును చిదాభాసుడు సర్వజ్ఞత్వము మొదలగు నవియును అల్పజ్ఞత్వము మొదలగునవి యైన మాయ, ఆ విద్యలచే నయిన ధర్మము- అను వీనితో విడిచి మిగిలియుండు బ్రహ్మమును, ఆత్మయును ఒక్కటియే యగును.

1. తత్పద త్వంపదములకు ఈశ్వరుడును, జీవుడును నైననిద్దఱును క్రమముగా వాచ్యులు.

2. బ్రహ్మమును, ఆత్మయును నైన రెండును క్రమముగా లక్ష్యములు. వానియందు భాగత్యాగ లక్షణచే *92 విరోధియగు వాచ్యభాగమును విడిచి అవిరోధియగు లక్ష్యార్థములు రెండును ఏకమే యగును.

ఇట్లు దీపముయొక్క అగ్ని స్వల్పఉపాధి గలదియై యుండుటచే స్వల్పమయి, సూర్యుని అగ్నివిషయము (గొప్ప ఉపాధి) గలదియై యుండుటచే గొప్పదగును. ఇట్లు వానికి ఉపాధివలన గలిగిన భేదము గలదు. అయిన మండెడు ఉష్ణమును, ప్రకాశముయొక్క తనరూపము, మహాతేజోధర్మములు- ఏవియో యవి రెంటియందును నొకటి యగును. (సమమయినది అగును) కావున సామాన్యరూప మహాతేజస్సు రెంటియందును నొకటియే యగును.

అట్లు వ్యష్టిరూప అల్పఉపాధి గల చేతనము జీవుడు. సమష్టిరూప గొప్ప ఉపాధిగల చేతనము ఈశ్వరుడు - అని ఇట్లు వానికి ఉపాధిచే నయిన భేదము కనబడుచున్నది. అయినను సత్తు చిత్తు ఆనంద రూప బ్రహ్మముయొక్క ధర్మము రెంటియందును ఒక్కటియే యగును. కావున జీవుడును ఈశ్వరుడును నయిన నీరెంటియందును కలిసియున్న సామాన్య చేతనరూప ఉపాధి లేని బ్రహ్మచేతన మేదియో యది జీవుడు ఈశ్వరుడు అను రెంటియందును అఖండమయిన దగును. (ఒక్కటియే యగును)

69. ఇప్పుడు ఏభేదమును ఉపదేశించియు నొకవేళ చక్కని అభేదజ్ఞానము లేనందున శిష్యుని హృదయమున తత్పదముయొక్క అర్థమునందు పరిచ్ఛిన్నతా భ్రాంతియును, త్వంపదముయొక్క అర్థమునందు పరిచ్ఛిన్నతా భ్రాంతియును

---

*92. ధర్మముతో గూడిన మాయ అవిద్య యను ఉపాధిరూపము.

మిగిలియుండిన యెడల. దానిని నివర్తించు నిమిత్తము శ్రీ గురువుగారు పరస్పరమందు పరస్పరముయొక్క ఏకత్వమును చెప్పునదయిన *93. ఓతప్రోత భావమును ఉపదేశించుచున్నారు.

1. "అది" (తత్పదముయొక్క లక్ష్యమయిన బ్రహ్మము) 'నేను'

2. "నేను" త్వంపదముయొక్క లక్ష్యఆత్మ "అది" బ్రహ్మము అని యిట్లు ఓతప్రోత భావముచే బ్రహ్మము ఆత్మ అనురెండును ఏకమగును. శిష్యుడా! నీవు రెండని తెలియకుము. ఎవడు బ్రహ్మమును ఆత్మను రెండని తెలియుచున్నాడో ! వానికి ఒక గురువును చిక్కరు. వాడు గురువు లేనివాడే యగును.

70. ఇప్పుడు ముందు చెప్పిన అర్థమందు ప్రమాణరూప సకలశాస్త్రముల సారమును చెప్పుచున్నారము:-

***94. శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః ।**
బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః ॥

కోటి గ్రంథములయందు చెప్పబడిన దేదియో దానిని అర్ధశ్లోకమునందు చెప్పుచున్నాను:- బ్రహ్మము నిత్యము; జగత్తు మిథ్య; జీవుడు బ్రహ్మమే; వేఱులేదు"

ఈ జగత్తుయొక్క సకలవస్తువులయందును, 1. అస్తి(ఉన్నది) 2. భాతి (ప్రకాశించుచున్నది) 3. ప్రియము. 4. నామము(పేరు) 5. రూపము (ఆకారము) అనునీయైదు అంశములున్నవి. వానిలో మొదటి మూడును బ్రహ్మరూపము. వెనుకటి రెండును మాయారూపములు. వానియందు.

1-3 అస్తి, భాతి, ప్రియరూప బ్రహ్మమేదియో యది అన్నికాలముల యందు అన్నిటియందు సమానముగా అనుస్యూతముగా(కలిసి)ఉన్నది. కావున అవ్యభిచారి యగును. అందుచే నది సత్యము.

---

*93. పరస్పరమందు పరస్పరమును చేర్చుటనయిన వ్యధికరణమును ఓతప్రోత మందురు.
*94. కోటిగ్రంథముల సారమును అర్ధశ్లోకమున చెప్పుచున్నారు.

4-5 నామరూప మయమయిన మాయిక జగము నొకవేళ నొక్కొక్కచోటుల యందుండునదిగావున వ్యభిచారి యగును. ఇందుచేనది మిథ్య యగును.

మిథ్య యయిన జగత్తుయొక్క లోపల అణగినవి యయిన శుద్ధచేతన మందు ఈశత్వజీవత్వముల ఉపాధిరూప దేహాదులు ఏవియో యవియును, స్వప్నమందలి ఏనుగు మొదలగు వానివలె లేనివియై వ్యక్తమగుచున్నవి. కావున మిథ్య యగును. ఇందువలన నాయుపాధులచే చేయబడిన ఈశజీవభావమును మిథ్యయగుచున్నది.

కావున జీవుడు ఏదియో యది బ్రహ్మము అనునది సర్వశాస్త్రముల నిశ్చయమయిన సారమగును. దానిని చక్కగా ధారణ చేయుము.

ఇట ఇది తాత్పర్యము:- నాల్గు ఉపదేశములును; ఆఱువేదాంగములును; పురాణములు. న్యాయము, మీమాంస ధర్మశాస్త్రమను నాల్గువేదముల ఉపాంగములును నైన వానికన్నిటికిని వేదార్థములయందే తాత్పర్యము గలదు. నాల్గువేదముల కర్మ ఉపాసనా కాండములకు చిత్తశుద్ధి మూలమున అద్వైత జ్ఞానమునందు తాత్పర్య మగును. జ్ఞానకాండమగు వేదాంతమునకును, వాని యనుసారియగు తక్కిన బ్రహ్మసూత్రము, గీత మొదలగు సంస్కృత ప్రాకృత గ్రంథములకును సాక్షాత్తు అద్వైత జ్ఞానమునందే తాత్పర్యము గలదు. కావున ముందు జెప్పిన అర్థము సర్వగ్రంథముల సారమగును.

సత్యవ్రతం సత్యవరం త్రిసత్యం
సత్యస్య యోనిం నిహితం చ సత్యే ।
సత్యస్య సత్యం ఋతసత్యనేత్రం
సత్యాత్మకం త్వాం శరణం ప్రపన్నాః ॥

దేనికి వ్రతము (మాయయొక్క వృత్తిరూప సంకల్పము) సత్యముగా నున్నదో; దేనియందు పరమ శ్రేష్ఠప్రాప్తి సాధనముగా సత్యముగా నున్నదో; సృష్టికి పూర్వమును, ప్రళయమునకు వెనుకయును, స్థితికాలమందును- నీమూడు కాలములయందును ఏది సత్యముగా (వ్యభిచారము లేక యుండునదిగా) ఉన్నదో;

ఏది సత్య (పంచభూతముల) యోనియో, (వివర్తోపాదాన కారణమో), (దీనిచే సృష్టికి ముందున్న దనునది చెప్పబడియున్నది.) ఏది సత్యమందు (ముందు చెప్పిన పంచభూతములందు) న్నదో, (ఇందుచేత స్థితి సమయమందును సత్యత్వము చెప్పబడియున్నది); అట్లే ఏది సత్యముయొక్క (వ్యావహారిక ఆకాశము మొదలగు వానియొక్క) సత్యమో (పారమార్థిక సత్యముగా నున్నదో)- ఆ ప్రాణమే సత్యము. వానికిది సత్యము, నిత్యములకు నిత్యము, చేతనములకు చేతనము- అనుట మొదలగు శ్రుతులచేత ఇందుచే నా భూతములు నాశము పొందియు అవశేషమయి యున్నందున, ప్రళయకాలమందును అవధి(ఎల్ల) యుండుటవల్ల సత్యత్వము చూపించబడినది. ఇట్లు మూడుకాలములందును సత్యత్వము సంపాదింపబడినది. అట్లు సత్యభాషణమును, సత్యముయొక్క (సమదర్శనము యొక్క) నేత్రమును (ప్రవర్తకమును) నగును. ఇట్లు అన్ని విధములచేతను సత్యరూపముగా నున్న మిమ్ము మేము (బ్రహ్మాది దేవతలు) శరణము పొంది యున్నాము. ఇది శ్రీభాగవతము పదియవస్కంధము పూర్వభాగము రెండవ యధ్యాయ వాక్య మగును. ఇది మొదలుగా ననేక శాస్త్రములచేతను, యుక్తులచేతను బ్రహ్మమునకు సత్యత్వము సిద్ధించుచున్నది. జగత్తుయొక్క మిథ్యాత్వమును శ్రీగురువుగారిట్లు వాక్రుచ్చుచున్నారు.

> ఏకాయనోఽసౌ ద్వివలస్త్రిమూల
> శ్చతూ రసః పంచవిధః షడాత్మా ।
> సప్తత్వగష్ట విటపోనవాక్షో
> దశ చ ధీ ద్వికగోహ్యాది వృక్షః ॥

"దేనికి అయనము (మాయారూప ఆశ్రయము) ఒక్కటిగా నున్నదో, దేనికి (ఫలము) రెండు (సుఖదుఃఖ) రూపమగా నున్నదో, దేనికిమూలము మూడు (గుణ) రూపమో, దేనిరసము (ధర్మార్థ కామ మోక్షమను) నాల్గు (పురుషార్థ) రూపముగా నున్నదో, దేని (జ్ఞానము) ఐదు (ఇంద్రియములు) గానున్నవో, దేని స్వభావము (జన్మ మొదలగు) ఆఱు (వికారరూప) అలలుగా నున్నదో, దేనిపట్ట సప్తధాతురూపమో, దేని శాఖలు ఎనిమిది (పంచభూతములు మనసు బుద్ధి

యహంకారమను అపర ప్రకృతి) యో, దేని తొఱ్ఱలు తొమ్మిది ద్వారములో దేని ఆకులు(ప్రాణాది నాగాది) దశ వాయువులో, దేనియందు పక్షులు రెండు జీవేశ్వర రూపములో, దేని జన్మకారణము సత్యపరబ్రహ్మమో, దేని లయస్థానమును పాలనము చేయుటయును సత్త్వగునో (బ్రహ్మమో)- అది యా ప్రసిద్ధమయిన సమష్టి వ్యష్టి ప్రపంచ రూప ఆది వృక్ష మగును."

1. ఇట్లు శ్రీ భాగవతము నందు చెప్పిన స్థలమందే దీనిని వృక్షరూపముగా జెప్పియుండుటవలన వృక్షమువలెనే; దీని వినాశ రూపత్వమున్ను చెప్పబడియున్నది. అదియే మిథ్యాత్వ లింగమగును. దానిని (మిథ్యాత్వమును) ఇప్పుడు వ్రాక్రుచ్చుచున్నారు.

ఎట్లు ఇంద్రజాల రూపమాయచే చేయబడిన వృక్షము మూడుకాలము లందును మిథ్యగానే యున్నదో, యట్లు మాయాశక్తిచే జేయబడిన సకల జగత్తు సమూహరూపవృక్షమును మూడుకాలములందును మిథ్యయని యెఱుగుము.

ఈ జగత్తు (మిథ్యాత్వరూప) అర్థమందే

2. స్వప్నము, గంధర్వ నగరము, అద్దమందు నగర ప్రతిబింబము- మొదలగు మఱియు ననేక దృష్టాంతరూప ఉపమాన ప్రమాణములు గలవు.

3. ప్రపంచము మిథ్య యగును. దృశ్యముగా నుండుటచే స్వప్నము మొదలగు వానిలోవలె ననునది అనుమాన ప్రమాణ మగును.

4. 'శాస్త్రవాక్యము, యుక్తి, తత్త్వజ్ఞానము' అను వానిచే ప్రపంచ మిథ్యాత్వము నిశ్చయరూప లేక మూడుకాలముల అభావనిశ్చయ రూపమే (విషయి) బాధ కలుగుచున్నదో; యది ముందే సిద్ధించియున్న ప్రపంచ మిథ్యాత్వము లేకయే యయినను; మూడుకాలములయొక్క అభావము లేకయే యయినను కలుగనిదియై దానిని (విషయరూపబాధను) కల్పించి తెలుపుచున్నది. ఇది అర్థాపత్తి ప్రమాణ మగును.

5. ప్రపంచ పారమార్థిక అభావమును నిశ్చయించు విచారము, లేక జ్ఞానదశయందు పరమార్థసత్తచే ప్రపంచ అప్రతీతిరూప అనుపలబ్ధి ప్రమాణ

మగును.

6. జ్ఞానమునకు పిమ్మట ప్రపంచపు మూడుకాలముల అభావము విద్వాంసుల ప్రత్యక్షానుభవమునకు గోచరమగును. ఇది ప్రత్యక్ష లేక అనుభవ ప్రమాణ మగును.

7. పరంపరగా లోకమున జగము మిథ్యయని చెప్పుకొనుట ఐతిహ్య ప్రమాణమగును.

8. "అత ఏతదార్తం,=కావున ఈజగము మిథ్య యగును" " ఈ జీవునికి మూడవస్థలు గలవు. మూడును స్వప్నము (మిథ్యయగును)" అను మొదలగు శ్రుతులును

ఆర్థేహ్యావిద్యమానేఽపి సంసృతిర్న నివర్తతే ।
ధ్యాయతో విషయానస్య స్వప్నేఽనర్థాగమో యథా ॥

అర్థము లేకయుండియు సంసారము నివృత్తి యగుటలేదు. విషయములను ధ్యానించెడి వీనికి స్వప్నమందు అనర్థముల ప్రాప్తి కలుగుటవలె"

దృష్ట శ్రుతమసద్బుద్ధ్వా నానుధ్యాయేన్న సంవిశేత్ ।
సంస్కృతి త్వాత్మనాశం చ తత్ర విద్వాన్ స ఆత్మదృక్ "

దృష్టమయిన ఈ లోకముతో శ్రుతమైన స్వర్గాది లోకములను అసత్తని యెఱిగి దానిని ధ్యానింపను దగదు, అనుభవింపను గూడదు. అదృష్టశ్రుతముల ధ్యానము మొదలగు వానియందు సంసారమును తననాశనమును నెవడెఱుగుచున్నాడో వాడాత్మజ్ఞాని యగును." అను నీ మొదలగు శ్రీ భాగవతవాక్యమున్ను సప్త ప్రమాణము లగును. జగత్తు మిథ్య యనుటకున్ను ప్రమాణములు గలవు.

73. పదార్థ శోధన ఐక్యమగు సర్వాత్మత్వము.

ఇప్పుడు జీవబ్రహ్మల ఏకత్వ దృఢత్వము కొఱకు దానియందు ప్రమాణ రూప శాస్త్రవాక్యముల అర్థమును క్రమముగా త్వం పదార్థశోధన, తత్పదార్థశోధన వాక్యార్థ సర్వాత్మత్వము పూర్వకముగా శ్రీగురువుగారు చెప్పుచున్నారు.

మనస్సు మొదలగువాని ద్రష్టగా నుండుటనుబట్టి బ్రహ్మము మనస్సు, చక్షువు మొదలగు ఇంద్రియము లనువానికి వేఱుగా నున్నది. ఏది దేనికి ద్రష్టగా నుంటున్నదో యది దాని భిన్న మగుచున్నది. ఎట్లు ఘటముయొక్క ద్రష్ట ఘటమునకంటె వేఱుగా నుండునో యట్లు మనస్సు ఇంద్రియముల ద్రష్టయగు ఆత్మరూప బ్రహ్మము, మనస్సు మొదలగు వానికి వేఱగును. లేక " నామనస్సు నా నేత్రము" అను మొదలగు అనుభవములచేతను; మమతకు విషయమగు నామనస్సు మొదలగు వానిచేత ప్రత్యయమునకు విషయమయిన ఆత్మరూప బ్రహ్మము భిన్నముగా (సత్తయొక్క భేదము గలదిగా) సిద్ధించుచున్నది.

ఆత్మకు అభిన్నమయిన బ్రహ్మము, మనస్సు మొదలగు వాటికిని మనస్సు మొదలగునవి యగును. ఏలయన

శ్రోత్రస్య శ్రోత్రం మనసో మనో యద్వాచోఽహ
వాచ స ఉ ప్రాణస్య ప్రాణాశ్చక్షుషశ్చక్షురతి ముచ్య ధీరాః
ప్రేత్యాస్మా ల్లోకా దమృతా భవంతి।

కల్పిత సర్పముయొక్క స్వరూపమైన రజ్జువువలె శ్రోత్రము మొదలగువాని స్వరూపమున్ను సమర్థరూపముగా నున్నందున; ఏబ్రహ్మము శ్రోత్రమునకు శ్రోత్రముగాను, మనస్సునకు మనస్సుగాను, వాక్కునకు వాక్కుగను నున్నదో, యదియే ప్రాణమునకు ప్రాణముగను, చక్షువునకు చక్షువును నగును. వీనిచే ఉపలక్షింపబడినవియు చెప్పబడనివియునైన తక్కిన ఇంద్రియములకును ఇంద్రియము లగును. (సత్తను నిచ్చునదియును ప్రకాశమును జేయునదియు నగును) అని తెలిసి ధీరపురుషుడు శ్రోత్రము మొదలగు వానియందు ఆత్మ భావమును విడిచిపెట్టి ఈ (నేను నాదియును తనరూప లేక దేహరూప) లోకమునుండి వేఱై అమృతుడు (మరణరహితుడు) అగుచున్నాడు- అను శ్రుతిచే ఆత్మరూప బ్రహ్మము వాస్తవముగా మనస్సు మొదలగువాని స్వరూపమే యగును

బ్రహ్మము మనస్సు మొదలగు వానిచే నెఱుగబడని దగును. ఏలయన

న తత్ర చక్షుర్గచ్ఛతి న వాగ్గచ్ఛతి నో మనో
న విద్మోన విజానీమో యథైతదనుశిష్యా
దన్యదేవ తద్విదితా తథో అవిదితాదధి ।
ఇతి శుశ్రుమ పూర్వేషాం యేనస్తద్వ్యాచచక్షిరే ॥

అట చక్షువు (దీనిచే ఉపలక్షింపబడిన సర్వజ్ఞానేంద్రియములును) పోవుటలేదు. వాక్కు (దీనిచే ఉపలక్షింపబడిన కర్మేంద్రియములును) పోవుటలేదు. మనస్సు (అంతఃకరణచతుష్టయము) ప్రవేశించుటలేదు. కావున " ఆ బ్రహ్మము ఈవిధముగా నున్నది" అని మేమెఱుగజాలము. దీనిచేతనే ఏవిధమున నీబ్రహ్మము శిష్యుల కుపదేశింపబడునో యది మాకు దెలియదు. (కరణములకు విషయము గానిదై యుండుటవలన) జాతి, గుణము, క్రియ, సంబంధమను విశేషణములచే *95 నెరుగుటకైనను; శాస్త్రముచేతను, గురువుచేతను, *96

*95. ఫలవ్యాప్తి (చిదాభాసునికి విషయ మగుట) చే నెఱుగ సాధ్యము కానిదై యుండుటవలన అనుదాని యర్థమిది. అంధకారమందున్న ఘటము మొదలగు అప్రకాశరూప పదార్థములు దీపము, కన్ను రెంటిచేతను నెఱుగబడుచున్నవి. దానివలె ఘటము మొదలగునవియు నట్లే సూర్యాదులయిన సకల అప్రకాశ(జడరూప) పదార్థములును, అంతఃకరణపు వృత్తియందుండు బలమగు చిదాభాసుడు వృత్తి-యను రెంటిచేతను నెఱుగబడు చున్నవి. కేవల వృత్తిచేత గాదు. వానియందు వృత్తిచే ఘటాది యవిచ్ఛిన్నచేతన ఆవరణము తీరుచున్నది. చిదాభాసునిచే ఘటము మొదలగు జడపదార్థముల ప్రకాశము కలుగుచున్నది! ఎట్లు సూర్యుని దీపమును నెఱుగుటకొఱకు కేవల చక్షువుయొక్క అపేక్ష యున్నదో, వేఱే ప్రకాశ(దీప) అపేక్షలేదో యట్లు ప్రత్యగభిన్నబ్రహ్మము నెఱుగుట కొఱకు కేవలవృత్తియొక్క అపేక్ష గలదు. చిదాభాసుని అపేక్ష లేదు. అట నేను బ్రహ్మమనురూప మయినవృత్తి, చేతన ఆవరణమును పోగొట్టుచున్నది. స్వయంప్రకాశ రూపముగా నున్నందున దానికి చిదాభాసరూపమైన వేఱుప్రకాశ అపేక్ష లేదు. కావున బ్రహ్మము ఫలవ్యాప్తిచే నెఱుగదగనిదై యుండుటవలన మనస్సునకు చిదాభాసునిచే గూడిన వృత్తివిషయము కానిదగును.

*96 శబ్దముయొక్క శక్తి వృత్తిచే ఉపదేశము చేయ సాధ్యము గానిదై యుండుటవలన అనుదాని అర్థము ఇదియగును. జాతి మొదలగు విశేషణములు గలదై యుండినచో నది మనస్సుచే (చిదాభాసుని గూడినవృత్తిచే) నెఱుగబడును. వాక్కు (శబ్దశక్తివృత్తి) చేతను నెఱుగబడును. బ్రహ్మము జాతి మొదలగునవి లేనిదై యుండుటవల్ల మనస్సునకును (ఫలవ్యాప్తికిని), వాక్కునకును (శక్తివృత్తికిని) విషయ మగుటకు దగనిదగును.

ఉపదేశించు టకైనను సాధ్యపడనిదై యుండుటచేత ప్రత్యక్షము మొదలగు ప్రమాణములకు అగోచరమైనను బ్రహ్మము *97వృత్తివ్యాప్తివల్ల నెఱుగ బడుచున్నది.

శాస్త్రముచేతను; గురువుచేతను; లక్షణావృత్తిచేత ఉపదేశింపబడుచున్నది. కావున శ్రుతి చెప్పునదేమన:- అది విదితముకంటెను (జ్ఞానపు విషయమయిన వ్యాకృతరూప కార్యమునకంటెను) అన్యమే యగును. అవిదితముకంటెను (ఎఱుగబడని దానికంటెను వేఱయిన అవ్యాకృతరూప కారణము కంటెను) అన్యమగును- అని ఇట్లు మేము పూర్వాచార్యుల వచనమును వినియున్నాము. వారు మా కా బ్రహ్మమును స్పష్టముగా చెప్పిరి" అనుశ్రుతిచేతను ఈయర్థమునే యనుసరించిన-

నైతన్మనో విశతి వాగుత చక్షురాత్మా
ప్రాణేంద్రియాణి చ తథాఽనలమర్చిషః స్వాః
శబ్దోఽపి బోధక నిషేధతయాత్మ మూల
మర్థోక్త మాహ యదృతే వ నిషేధసిద్ధిః ॥

ఈ బ్రహ్మమునందు మనస్సు, వాక్కు, చక్షువు, అహంకారము - అనునవి ప్రవేశించుట లేదు. ప్రాణమును, (చెప్పబడని తక్కిన) ఇంద్రియములును ప్రవేశించుట లేదు. ఎట్లు అగ్నియందు దాని జ్వాల ప్రవేశించుట (దాహము చేయుట)లేదో; అట్లే అవియు ప్రవేశించుట లేదు. శబ్దము (వేదమున్ను) "దేనినుండి వాక్కులు నివర్తించుచున్నవో" యని బోధించు తన్ను నిషేధించునదిగా నుండుటచే, అర్థముచే ముందుచెప్పిన తన మూలమును (బ్రహ్మమును) జెప్పుచున్నది. అది లేక నిషేధసిద్ధి గలుగనేరదు. (అధిష్ఠానరూప అవధి లేక బాధరూప నిషేధము లేని)-అను శ్రీ భాగవత ఏకాదశస్కంధము మూడవఅధ్యాయ వచనముచే

*97 సూర్యునికి ఎదురు ముఖముగా నుంచబడిన దీపము ప్రకాశము తగ్గగా నేత్రముచే సూర్యునిప్రకాశము కలుగునదివలె; బ్రహ్మాకార వృత్తియందు గల చిదాభాసుడు ప్రకాశము తగ్గగా ఆవృత్తి మాత్రముచే బ్రహ్మముయొక్క ప్రకాశము (ఆవరణభంగము) కలుగుచున్నది.

బ్రహ్మము, మనస్సు మొదలగు వానిచేతను నెఱుగబడని దగును.

ఆ యనాది (జన్మములేని దీనిచేతనే షడ్వికారములు లేని)బ్రహ్మము (నిరతిశయవ్యాపక సచ్చిదానంద ఘనవస్తువు) నీవగుదువని గురువుగారు చెప్పుచున్నారు: శిష్యుడా! నీవున్నావని ఇది ముందుచెప్పిన త్వంపదార్థశోధన దృఢత్వముకొఱకు అనువాదము చేయబడినది.

ఇప్పుడు గురువుగారు ప్రపంచ నిషేధపూర్వకముగా తత్పదార్థముయొక్క శోధనమును వ్రాకుచ్చుచున్నారు. **"ఈ జగత్తంతయు సత్త రూపమే యగును. సద్దీదం సర్వం సదసత్ "**

ఈసత్తు అసత్తు (కార్యకారణరూపము) అంతయు సత్తే (పరమార్థ సద్రూపబ్రహ్మమే) యగును అను శ్రుతియు కల్పితమునకు అధిష్ఠానముకంటె వేఱయిన సత్త లేనిదానిని నిశ్చయించు యుక్తియు నుండుటచే-

ఇవంతయు చిద్రూపమే యగును. "చిద్దీదం సర్వం ప్రకాశతే," ఇవంతయు చిత్తు (బ్రహ్మచేతన) రూపముగా ప్రకాశించుచున్నది." అను శ్రుతియును కల్పితమునకు అధిష్ఠానముయొక్క భిన్నమయిన స్ఫూర్తి (వివరించుట) లేని దానిని నిశ్చయించు యుక్తియు నుండుటచే-

అంతయు బ్రహ్మమే! "సర్వం ఖల్విదం బ్రహ్మ"=ఈ కనబడు జగత్తంతయు నిశ్చయముగా బ్రహ్మమే యగును అను శ్రుతియుండుటచే అంతయు ఆత్మయే యగును; ఆత్మైవేదం సర్వం=ఇదంతయు ఆత్మరూపమే యగును అను శ్రుతి యుండుటచేతను-

ఈ మొదలగు వానిచే "పురుషుడు స్థాణువు" అను వాక్యమునందు ఎట్లు పురుషుని బాధించి స్థాణువును మిగిలించుటయగు "బాధ సామానాధికరణ్యాము (పురుషుడు స్థాణువు అను రెండుపదములకు నొక అర్థము కలిగియుండుట) ఉన్నదో, అట్లే సకల ప్రపంచమును బాధ సామానాధికరణ్యాము" చే అధిష్ఠానబ్రహ్మ రూపమని యెఱిగి జిజ్ఞాసువులారా! సమష్టివ్యష్టిరూప దేహమును దానిగర్వ (అహంకార మమకార హితకార రూప అభిమాన) మును విడిచి (మిథ్యయని

యెఱిగి) ఉండు; ఇది (నామరూపమును బాధించి అస్తి, భాతి, ప్రియ రూప బ్రహ్మమును (మిగులజేయుట) విధిముఖశ్రుతుల అర్థమగును. అది కనిష్ఠ మధ్య అధికారులకు తత్పదార్థ శోధనమందు ఉపయోగము గలదగును. లక్షణ మొదలగు క్లేశముల అంగీకారము వలన-

స్థూల, సూక్ష్మ; దీర్ఘ, హ్రస్వ- అను రూపములు గలది బ్రహ్మము కాదు.

"అస్థూలమనణు మహ్రస్వమదీర్ఘం" స్థూలము లేనిదియు, అణువు కానిదియును, పొడవు లేనిదియు, పొట్టిలేనిదియునై యుండుదానిని" అనుట మొదలగు శ్రుతులచేతను-

శబ్దము మొదలగు వాని విలక్షణము బ్రహ్మ మగును.

"అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం తథాఽరసం నిత్య మగంధ వచ్చయత్"- శబ్దము లేనిదియు, స్పర్శము లేనిదియు, రూపము లేనిదియు తక్కువ నిండుట లేనిదియు, రసము లేనిదియు, నిత్యమును గంధము గలిగియుండుట లేనిదియునై ఏది యున్నదో" అను శ్రుతిచేతను-

సత్తును (స్థూలకార్యమును) అసత్తును (సూక్ష్మకారణమును) కాదు. ఏలయన "నేతి నేతి ఇటు కాదు ఇట్లు కాదు" అను శ్రుతియున్ను-

"అనాది మత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే"=అనాదిగా నుండు పరబ్రహ్మము, సత్తును (కార్యమును), అసత్తును (కారణమును) కానేరదన బడుచున్నది అను గీతాస్మృతియు నుండుటవలనను-

ఇందు (అనేకము కాని బ్రహ్మమందు) నానా యనుట కొంచెమైనను లేదు.

"నేహనానాస్తి కించన"=ఇందు నానా అనునది కొంచెమైనను లేదు అను శ్రుతియుండుట చేతను-

జిజ్ఞాసువులారా! ఇట్లు తెలిసి నిజస్వరూపమందు మదించియుందురుగాత! ఇది (నామరూప ఆది ప్రపంచమును నిషేధించి, అర్థముచే అస్తి; భాతి, ప్రియరూప బ్రహ్మమును సత్యమని యెఱింగి మిగిలించుట) నిషేధముఖి శ్రుతులకు

అర్థమగును. ఇది లక్షణ మొదలగు క్లేశము లేనిదగుటచే ఉత్తమాధికారికి తత్పదార్థ చేతనమందు ఉపయోగి యగును.

దీని యందిది దృష్టాంతము:-

ఒకని ఆవులు ఎనుములు మొదలగు ధనమును దొంగ దోచుకొని పోయెను. అప్పుడు వాడు భైరవ దేవుని యెదుట "ఈ ధనమును సొంతగానికి చేరకయుండిన నేను వీనియం దీ ఎనుమును నీకర్పించుచున్నా" నని ప్రతిజ్ఞ చేయుచున్నాడు. పిమ్మట సొంతగాడు వెదుక నారంభించి వాడును భైరవదేవుని యెదుట ఆధనము నాకు దొరకిన వీనియం దీ ఎనుమును నీకర్పణము చేసెదనని ప్రతిజ్ఞ చేయుచున్నాడు. రెండు పక్షములందును ఆ యొకే యెనుముయొక్క మరణము నిశ్చయింపబడినది.

దార్ష్టాంతము:- అట్లే యిట (వేదమునందు) విధి ముఖమును నిషేధముఖము లయిన శ్రుతులకు జ్ఞానరూప భైరవునికొఱకు నాకు రూపము మొదలగు ప్రపంచ స్వరూపమైన ఎనుమును అర్పణము చేసి (బాధించి) దాని అధిష్ఠానమైన అస్తి (సత్తు), భాతి (చిత్తు), ప్రియ (ఆనంద) రూప బ్రహ్మమును సత్యమని యెఱిగి మిగిలించుటయే తాత్పర్యమగు అర్థమని నిశ్చయింప బడుచున్నది. లేనిచో (ముఖ్యార్థ మయినచో) శ్రుతిస్మృతులచేతను విద్వాంసుల యనుభవముచేతను బొందెడు ద్రష్ట మొదలగు రూపము యొక్కయు భావరూపముయొక్కయు నయిన బ్రహ్మమునకు దృశ్యాది భావమును అభావమును గలుగును. ఇది తత్పదార్థముచే తన దృఢత్వముకొఱకు అనువాదము చేయబడినది.

ఇప్పుడు గురువుగారు నాల్గువేదములందు గల మహావాక్యముల అర్థమును సంగ్రహించి చెప్పుచున్నారు.

1. "ప్రజ్ఞానం బ్రహ్మ" అను ఋగ్వేదముయొక్క ఐతరేయ ఉపనిషత్తునం దుండు మహావాక్యమునకు అర్థము "ప్రజ్ఞాన (ప్రత్యక్చేతన) మేదియో యది "బ్రహ్మ మనునదగును. (ప్రత్యక్= లోపల)

2. **"అహంబ్రహ్మాఽస్మి"** అను యజుర్వేద బృహదారణ్యకో పనిషత్తు నందుండు మహావాక్య అర్థము "నేను(ప్రత్యగాత్మ) బ్రహ్మము" అను నదగును.

3. **"తత్త్వమసి"** అను సామవేద ఛాందోగ్యోపనిషత్తు నందుండు మహావాక్యమునకు అర్థము "అది (బ్రహ్మము) నీవు (ఆత్మా)" అనునదగును.

4. **"అయం ఆత్మా బ్రహ్మ"** అను అథర్వ వేదమందలి మాండూక్యోపనిషత్తు నందుండు మహావాక్యమునకు అర్థము "ఈజ్ఞానమునకు విషయము కాక నిత్యాపరోక్షముగా నున్న ఆత్మ బ్రహ్మము (అన్నిటికంటె నెక్కువ వ్యాపకమయిన సచ్చిదానంద ఘనము)" అనునదగును.

కావున బ్రహ్మమునకు వేఱుగా నేను లేనని యెఱుంగుము. ఈ నాల్గు మహావాక్యముల యందుండు "ప్రజ్ఞానం, అహం, త్వం, ఆత్మా అను పదములకు వాచ్యార్థము జీవుడును, లక్ష్యార్థము కూటస్థరూప సాక్షియు నగును. బ్రహ్మము, బ్రహ్మము, తత్, బ్రహ్మము అను నాల్గు పదములకును వాచ్యార్థము ఈశ్వరుండును (*98 శబల బ్రహ్మము) లక్ష్యార్థము శుద్ధ బ్రహ్మమును నగును. వానియందుండు వాచ్యార్థమునకు ఐక్యము సంభవింపమిచే నిట లక్ష్యార్థములకు ఐక్యము చేకొనబడియున్నది. నాల్గు మహావాక్యముల అర్థము శ్రీపంచదశి ఐదవ మహావాక్య వివేకమందు విస్తారముగా వర్ణింపబడియున్నది.

ఇప్పుడు,

అహమేవ చ సర్వేషు భూతేషు చ నభో యథా।
మయి సర్వాణి భూతాని జానన్నితి న జాయతే ॥

అను ఉపదేశ సాహస్రియగు గ్రంథమున గల భాష్యకారుల వచనాను సారముగ సర్వాత్మత్వమును చెప్పుచున్నాడు. చిదాత్మయగు నేనే ఆకాశమువలె సకల భూతములందును కలిసియున్నాను. (ఆకాశమందు వాయువు మొదలగు వానివలె) నాయందన్నియు అధ్యస్తముగా నున్నవి యని యెఱుంగు వానికి జన్మము లేదు.

*98. శబల బ్రహ్మము = మాయతో గూడినబ్రహ్మము

ఈ యర్థమందు ప్రమాణము:

సర్వభూతేషు చాత్మానం సర్వభూతాని చాత్మని ।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥

యోగముతో గూడిన మనస్సు గలవాడును, అన్నిచోట్లను సమదర్శనము గలవాడును నెవడో వాడు సర్వభూతములందును ఆత్మను ఆత్మయొద్ద సర్వభూతములను జూచుచున్నాడు అను గీతావచనమున్ను-

సర్వభూతేషు యః పశ్యేద్భగవద్భావమాత్మనః ।
భూతాని భగవత్యాత్మన్యేష భాగవతోత్తమః ॥

ఎవడు సర్వభూతములందును ఆత్మయొక్క భగవద్భావమును జూచుచున్నాడో; భగవద్రూపత్వమందలి భూతములను గనుచున్నాడో; వాడు భాగవతు (భక్తు) లందుత్తముడ (జ్ఞానియందు భక్తుడ) గును అను భాగవత ఏకాదశ స్కంధమునందలి రెండవ యధ్యాయముయొక్క వచన మున్నది. ఇట్లు ఓతప్రోత భావరూప సర్వాత్మత్వము చెప్పబడి యున్నది.

77. ఇప్పుడు ప్రమేయమునందుండు సంశయముయొక్క నివృత్తికొఱకు వేదాంతమున అవశ్యముగా నెఱుగదగిన ప్రమేయము (పదార్థము)లను శిష్యుడు ప్రశ్నించుచున్నాడు.

స్వామీ! (ఈగ్రంథమున) చెప్పబడినవియును, జెప్పబడనివియును నయిన పదార్థములను చేర్చి చెప్పునదగు సంగ్రహమును జెప్పవలయును. దానివలన నాకు ప్రమేయమునందుండు సంశయము తీరును. ప్రమాణగత సంశయమో ఈశ్వర రూపముగ మతింపబడిన తమయొక్క వేదమునకు సమమయిన వచనములను పూర్ణ విశ్వాసముతో వినుటచేతను, నాకు (ఉత్తమాధికారికి) నష్టమగును. దీనిచేతనే నాకు నిజస్వరూపము నిశ్చయింప బడినదగును. (ఇది శిష్యుని లక్షణావళి (లక్షణముల వరుసను) ఎఱుగు నిమిత్తము ప్రశ్నించినదగును.)

శ్రీగురువుగారు చెప్పుచున్నారు.

లక్షణావళి ఈక్రింది గలవి:-

1. అసాధారణ ధర్మములను లక్షణమందురు. ఒకటి యందుండున దయిన ధర్మమును అసాధారణ ధర్మ మందురు.

2. అవ్యాప్తి, అతివ్యాప్తి, అసంభవమను మూడు దోషములును లేని లక్షణమును సల్లక్షణ మందురు. (మంచిలక్షణ మందురు.)

3. పై జెప్పిన మూడు దోషములందు నేదేనియొక దోషముతో గూడిన లక్షణమును అసల్లక్షణ (చెడు లక్షణ) యందురు.

4. ఎప్పుడు నుండునదయి యేది వ్యావర్తకమయి (వేఱు చేసి తెలిపించునదై) అగుచున్నదో దానిని స్వరూప లక్షణ మందురు.

5. ఒకకాలమునం దుండునదై వ్యావర్తకము చేయున దేదియో దానిని తటస్థ లక్షణ మందురు. దీనినే ఉపలక్షణ మనియు చెప్పుదురు.

1. లక్ష్యముయొక్క ఏకదేశమందు లక్షణ ముండుటను అవ్యాప్తి యందురు.

ఎట్లు కపిలత్వము (ఒకే పింగల వర్ణముతో గూడి యుండుట) ఆవుయొక్క లక్షణ మగును. ఆ కపిలత్వము ఆవురూప లక్ష్యముయొక్క ఏకదేశమందే యున్నది. ఆవుమాత్ర మందు లేదు. కావున ఈ లక్షణము అవ్యాప్తిరూప దోషము గూడిన దగును.

2. లక్ష్యమందు పూర్తిగ వ్యాపించి లక్ష్యము కాని దానియందును లక్షణ ముండుటను అతివ్యాప్తి యందురు.

ఎట్లు:- "కొమ్ము కలిగియుండుట" ఆవు లక్షణ మగును. అది లక్ష్యమగు ఆవునంతటి యందునుండి లక్ష్యము గాని యెనుము మొదలగు వానియం దునున్నది. కావున నీయావు లక్షణము అతివ్యాప్తి రూప దోషముతో గూడిన దగును.

3. లక్ష్యమును విడిచి అలక్ష్యమందే లక్షణ ముండుట అసంభవ మందురు.

ఎట్లు "ఒంటి గిట్టగలది ఆవు" అనునది ఆవు లక్షణ మగును. అది లక్ష్యమగు

ఆవును విడిచి లక్ష్యము గాని గుల్మము నందున్నది. కావున ఈ లక్షణము అసంభవ దోషముతో గూడిన దగును.

1. వస్తువునందు అవస్తువును (వస్తువు కాని దానిని) చెప్పుట అధ్యారోప మందురు.

2. అదిష్ఠాన శేషమును అపవాద మందురు.

1. శుద్ధ బ్రహ్మమును వస్తువందురు.

2. అజ్ఞానమును దానికార్యమగు స్థూలము సూక్ష్మము మొదలగు ప్రపంచమును అవస్తు వందురు.

1. ఆవరణ విక్షేప శక్తులు గల్గు అనాది భావరూపమును అజ్ఞాన మందురు. అదియే మాయ, అవిద్య, ప్రకృతి, ప్రధానము, శక్తి, అవ్యక్తము, అక్షరము మొదలగు పేర్లచేత జెప్పబడుచున్నది.

2. అస్తి, భాతి (ఉన్నది ప్రకాశించుచున్నది) అను వ్యవహారమునకు (చెప్పుట కనబడుటకు) యోగ్యమగు వస్తువులందు నాస్తి, న భాతి (లేదు కాన్పించుట లేదు) అను విపరీత వ్యవహారమును సంపాదించుట ఆవరణ మగును.

1. నాస్తి (లేదు) అను వ్యవహారమున హేతువు అసత్వాపాదక (అసత్తును సంపాదించు) ఆవరణ మగును.

2. న భాతి (కనబడమి) అను వ్యవహారమునకు హేతువు అపానా పాదకమును (కనబడమిని) సంపాదించు ఆవరణ మగును.

(3) స్థూలము సూక్ష్మము మొదలగు ప్రపంచమును దానిజ్ఞానమును విక్షేప మందురు.

1. ఆవరణమునకు హేతువగు శక్తిని ఆవరణశక్తి యందురు.

2. విక్షేపమునకు హేతువగు శక్తిని విక్షేపశక్తి యందురు.

1. శుద్ధచేతనమును మూసిపుచ్చు అజ్ఞానమును మూలాజ్ఞాన మందురు.

2. రజ్జువు మొదలగు ఉపహిత చేతనమును మూసిపుచ్చు అజ్ఞానమును తూలాజ్ఞాన మందురు. దీనినే అవస్థాజ్ఞాన మనియు చెప్పుదురు.

1. భ్రాంతిజ్ఞానమునకు దాని విషయమును కార్యజ్ఞాన మందురు.

2. భ్రాంతికి హేతువగు అజ్ఞానమును కారణాజ్ఞాన మందురు.

1. అధ్యాసమును భ్రాంతి యందురు. అదిష్ఠాన విషమ (విపరీతమయిన) సత్త గల అవభానమును లేక తన అభావాధికరణ (ఆశ్రయు) మందు అవభాసమును అధ్యాస యందురు. జ్ఞానమును దాని విషయమును అవభాస మందురు.

1. భ్రాంతి జ్ఞానమును జ్ఞానాధ్యాస మందురు. ఒకటియందు వేఱొకదాని జ్ఞానమును భ్రాంతిజ్ఞాన మందురు. అదియే విపర్యయమును విపరీతభావనయు నగును.

2. భ్రాంతిజ్ఞానముయొక్క విషయమును అర్థాధ్యాస మందురు (అది 1 సంసర్గాధ్యాసము 2. స్వరూపాధ్యాసము అను భేదములచే రెండువిధములు)

1. కల్పిత తాదాత్మ్య సంబంధమును సంసర్గాధ్యాస మందురు; అదియే సంబంధాధ్యాసమును నగును. (ఈవిధముగా సత్యాత్మయొక్క అనాత్మయం దుండును.)

2. సంబంధియొక్క అధ్యాసమును స్వరూపాధ్యాస మందురు. అదియే అన్యతరాధ్యాస మనియు చెప్పబడును. (ఈవిధముగా మిథ్యయగు అనాత్మయొక్క ఆత్మయందుండును.)

1. కల్పిత భేదముతో వాస్తవ అభేదమును కల్పిత తాదాత్మ్యసంబంధ మందురు.

2. పరస్పరమునందు పరస్పరము ఒక్క అధ్యాసమును అన్యోన్యా ధ్యాస మందురు.

(ఈవిధముగా ఆత్మానాత్మలకు ఎక్కడను తమయందు అధ్యాస ముండును)

1. వేనియందు బ్రహ్మజ్ఞానము లేక బాధ (మిథ్యాత్వ నిశ్చయము గలుగుట లేదో; బ్రహ్మజ్ఞానమునకు పిమ్మట వేనికి అధిష్ఠానమునకంటె వేఱయిన సత్తాస్ఫూర్తి కనబడుట లేదో అవిధమాయయును, దానికార్యమును వ్యావహారిక మగును. వానిసత్తను వ్యావహారికసత్త యందురు.

2. ఎవనికి బ్రహ్మజ్ఞానము లేక రజ్జువు మొదలగు వానిజ్ఞానముచేతనే బాధ కలుగుచున్నదో; ఆవిధ స్థూలాజ్ఞానమున్ను దాని కార్యమగు రజ్జుసర్ప భ్రాంతి మొదలగు నవియు ప్రాతిభాసిక మగును. వానిసత్తను ప్రాతిభాసిక సత్త యందురు.

(3). దేనికి మూడు కాలములందును బాధ కలుగుట లేదో; ఆవిధ ఉత్పత్తి నాశము లేనిదై యుండుటచే; నిత్య (సత్య)మయిన చేతన మేదియో యది పారమార్థిక మగును. దాని సత్తను (ఉండుటను) పారమార్థికసత్త యందురు.

(ఇట మంత్రి మొదలగు వారియొద్ద ఎట్లు రాజుయొక్క సత్తయే అనుస్యూతమయి యున్నదో; వారికి స్వతంత్ర సత్త లేశమయినను లేక యున్నదో యట్లు వ్యావహారిక ప్రాతిభాసిక పదార్థములందును ఒక చేతనసత్తయే అనుస్యూతమయి "ఘట మున్నది పట మున్నది" యని యున్నదను వ్యవహారము నకు హేతువయి కనబడుచున్నది. వానికి స్వతంత్రసత్తయో లేశమాత్రమును లేదు. దీనియందు నాట్యమాడువాని దృష్టాంతము చెప్పబడియున్నది.)

1. వ్యావృత్తిని అవచ్ఛేద మందురు. ఇతర మయిన వానినుండి వేఱుచేసి తెలిపించుటను వ్యావృత్తి యందురు.

2. అవచ్ఛేదము గలదానిని అవిచ్ఛిన్న మందురు: దీనినే అవచ్ఛేద్యము, వ్యావృత్తము, వ్యావృత్తి, వ్యావర్తనీయము అనియు చెప్పుదురు.

(3) వేఱుపరచి తెలిపించుదానిని వ్యావర్తక మందురు. దానినే అవచ్ఛేదక మనియు చెప్పుదురు. (ఈవిధ మగునవి విశేషణము, ఉపాధి, ఉపలక్షణము, ఉపరంజక మనునవి యగును.)

1. కార్యమందు సంబంధము గల వర్తమాన వ్యావర్తకమును విశేషణ మందురు.

[ఎట్లు జలముచేత నిండింపబడిన ఘటము" జలాకాశముయొక్క పోకడ మొదలగు కార్యములయందు సంబంధియై జలాకాశము (జలము నిండిన ఘటమందును,దానియందుండు ఆకాశముయొక్క ప్రతిబింబముతో గూడిన ఘటదేశమందును గల ఆకాశము) యొక్క వ్యావర్తక మగును. ఇందుచేతనే వ్యావర్తనీయ (వేఱుపరచి తెలిపించుటకు తగిన జలాకాశ) మునకు సమానమయిన దేశకాలముల యందున్నది. కావున దాని విశేషణ మగును. ఎట్లన "అంతఃకరణము" జీవుని జన్మము మొదలగు (సంసారరూప) కార్యమందు సంబంధియయి వ్యావర్తక మగును. ఇందుచేతనే వ్యావర్తనీయమునకు (జీవునికి) సమానమగు దేశకాలములం దున్నది. కావున దాని విశేషణ మగును.]

2. కార్యమందు సంబంధము లేనిదిగా నుండు వర్తమాన వ్యావర్తకమును ఉపాధి యందురు.

[ఎట్లన "జలము నిండిన ఘటము" ఘటాకాశముయొక్క (ఘటము నందున్న ఆకాశముయొక్క) అధికరణ (ఆశ్రయ) తారూపకార్యమునందు సంబంధము లేనిదై, వ్యావర్తకమయి యున్నది. దీనిచే వ్యావర్తనీయ (ఘటాకాశ) మునకు సమమయిన దేశకాలముల యందున్నది. కావున దాని ఘటాకాశ ఉపాధి యగును. ఎట్లన "అంతఃకరణము" సాక్షియొక్క (కూటస్థచేతనముయొక్క) అధిష్ఠానత్వ రూపకార్యమునందు సంబంధము లేనిదై దాని వ్యావర్తకమై యున్నది. దీనిచే వ్యావర్తనీయముయొక్క (సాక్షియొక్క) సమాన దేశకాలముల యందున్నది. కావున అది సాక్షికి ఉపాధి యగును.]

(3) కార్యమందు సంబంధము లేనిదైన వ్యావర్తకమును ఉపలక్షణ మందురు.

[ఎట్లు:- "జలము నిండిన ఘటము" ముందుచెప్పిన ఘటముచే అవిచ్ఛిన్నము కాని ఆకాశ మేదియో యది "మహాకాశ" మను జనులయొక్క

ప్రవృత్తియగు కార్యమునందు సంబంధము లేనిదై (ముందు జెప్పిన ఘటమున్నను, లేకున్నను ముందు జెప్పిన కార్యముండుటవలన) తక్కిన (ఘటాకాశము మొదలగు) ఆకాశములనుండి దానిని (మహాకాశమును) వేఱుపరచి తెలిపించునది యగును. దీనిచేతనే దానియందది ఒక చోటను నొకకాలమందును నున్నది. కావున దాని (మహాకాశము) యొక్క ఉపలక్షణ మగును.]

[ఎట్లు:- "అంతఃకరణము" అంతఃకరణ అనవచ్ఛిన్న చేతనము ఈశ్వరసాక్షి (శుద్ధ బ్రహ్మ) యగునను జనులప్రవృత్తి రూపకార్యమందు సంబంధము లేనిదై (జీవన్ముక్తియందు అంతఃకరణ మున్నను లేక విదేహముక్తియందు అది లేకయున్నను, చెప్పబడిన వ్యవహారముండుటచే) తక్కిన (జీవుడు మొదలగు) చేతనములనుండి దానిని వేఱుపరచి తెలిపించునది యగును. దీనిచేతనే యది దానియందు కొన్ని చోట్లయందును, కొన్ని కాలములయందును నున్నది. కావున దానికి (ఈశ్వరసాక్షికి) అది (అంతఃకరణము) ఉపలక్షణ మగును.]

4. స్వభావముగా పొందబడిన ధర్మరూప వ్యావర్తకమును ఉపరంజక మందురు. దానినే స్వరూపలక్షణ మనియు జెప్పుదురు.

ఎట్లు:- ఆకాశనిరవయవత్వము విభు (వ్యాపక)త్వము ఛేదింపబడని మొదలగు ధర్మము లేవియో యవి దానికి స్వభావముగ సిద్ధించిన వ్యావర్తక ధర్మము లగును. కావున ఉపరంజక మగును.

ఎట్లు:- బ్రహ్మముయొక్క సత్యత్వము, జ్ఞానము, అనంత్వము మొదలగు ధర్మములు దానిస్వభావముగ సిద్ధించియున్న వ్యావర్తక ధర్మము లగును. కావున ఉపరంజక మగును.

1. విశేషణము గలదానిని విశిష్ట మందురు.

2. ఉపాధి గలదానిని ఉపహిత మందురు.

3. ఉపలక్షణము గలదానిని ఉపలక్షిత మందురు.

4. ఉపరంజకము గలదానిని ఉపరంజిత మందురు.

1. సదసత్తులకు విలక్షణమైన దానిని అనిర్వచనీయ మందురు. దానినే

మిథ్యయనియు నందురు. మూడు కాలములందును బాధింపబడని దానిని సత్తందురు. స్వరూపము లేని దానిని (శూన్యమును) అసత్తందురు. బాధయోగ్య స్వరూపము గలదానిని సదసద్విలక్షణ మందురు.

1. మిథ్యాత్వము నేనియు, మిథ్యాత్వము నిశ్చయము నైనను లేక మూడుకాలముల అభావమును నైనను, మూడుకాలముల అభావనిశ్చయము నైనను బాధయందురు. దానినే అత్యంత నివృత్తి యనియు చెప్పుదురు.

1. మిథ్యాత్వము నేనియు, మూడుకాలములయందు లేనిదానినైనను విషయరూప బాధ యందురు. దానినే నిత్యవృత్తి యనియు చెప్పుదురు.

2. మిథ్యాత్వపు నిశ్చయమును నైనను, మూడుకాలములందు లేనిదాని నిశ్చయము నైనను విషయిరూప బాధ మందురు. దానినే నిత్యనివృత్తియొక్క నివృత్తి యనియు జెప్పుదురు.

2. ఉపాదాన కారణమందు కార్యము విలయ మగుటను (లేక ప్రతియోగి యొక్క ప్రతీతిపూర్వక కార్యవిలయమును) నాశమందురు. దానినే ప్రధ్వంసాభావ మనియు జెప్పుదురు.

1. ఉపాదానమునకు సమానమగు సత్తను గల అన్యథా (వేఱు) స్వరూపమును పరిణామ మందురు. దానినే వికార మనియు జెప్పుదురు.

2. అధిష్ఠానముకంటె విషమసత్త గల ప్రత్యేక స్వరూపమును వివర్త మందురు. దానినే కల్పితకార్య మనియు జెప్పుదురు.

1. కార్యమునందును నియమింపబడిన అవ్యవహిత పూర్వమందున్న దానిని కారణ మందురు.

1. అంతరాయము (మఱుపు) గలదానిని వ్యవహిత మందురు.

2. అంతరాయము లేనిదానిని అవ్యవహిత మందురు.

1. ఉత్పత్తిమాత్రపు కారణమును నిమిత్తకారణ మందురు.

2. ఉత్పత్తి స్థితిలయముల కారణమును ఉపాదానకారణ మందురు.

1. పరిణామరూప కార్యపు కారణమును పరిణామి ఉపాదాన మందురు.

2. వివర్తరూప కార్యపు కారణమును వివర్త ఉపాదాన మందురు. దానినే అధిష్ఠాన మనియు జెప్పుదురు.

1. ఏది భ్రాంతికాలమందును, భ్రాంతియొక్క నివృత్తికాలమందును కనబడుచున్నదో దానిని సామాన్య అంశ మందురు. దానినే ఆధార మనియు జెప్పుదురు.

2. ఏది భ్రాంతికాలమందు కనబడుట లేదో; ఏది కనబడుటవలన భ్రాంతి తీరుచున్నదో దానిని విశేష అంశ మందురు. దానిని అధిష్ఠాన మనియు జెప్పుదురు.

(3) ఏది అజ్ఞాన కాలమందు (స్ఫురించు) కనబడుచున్నదో, జ్ఞానకాల మందు కనబడుట లేదో దానిని కల్పితవిశేషఅంశ మందురు. దానినే ఆధ్యస్త మనియు జెప్పుదురు.

1. కేవల అజ్ఞానముచే స్ఫురించు భ్రాంతిని నిరుపాధికభ్రాంతి యందురు. ఈవిధమగునది సర్పము మొదలగున వగును.

2. ఉపాధితో గూడిన అజ్ఞానముచేత స్ఫురించు భ్రాంతిని సోపాధిక భ్రాంతి యందురు. ఈవిధ మగునది అద్దమునందలి ప్రతిబింబము, జగత్తు, మొదలగునవి యగును. కార్యసమకాల మందుండునదియగు (బింబముయొక్క సన్నిధియు, ప్రారబ్ధము మొదలగునవియు నయిన) నిమిత్త కారణమును నిట ఉపాధి యందురు.

బాధను బొందిన దానిని బాధిత మందురు. బాధితముయొక్క అనువృత్తిని బాధితానువృత్తి యందురు. పిమ్మట స్ఫురించు దానిని అనువృత్తి యందురు.

1. అది యుండిన అది యుండుట అన్వయ మగును, లేక అనువృత్తి. మాలయందు నూలువలె అనుస్యూత మగుటను అన్వయ మందురు.

2. అది (కారణము) లేకయుండ, అది (కార్యము) లేకయుండుట, వ్యతిరేకము లేక వ్యావృత్తిని (భేదజ్ఞానమును) వ్యతిరేక మందురు.

1. ఉన్నదను జ్ఞానమునకు హేతువగు అజ్ఞాన అంత:కరణముల పరిణామమును వృత్తి యందురు.

1. యథార్థ అనుభవమును ప్రమ యందురు.

2. ప్రమకంటె వేఱయిన జ్ఞానమును అప్రమ యందురు.

1. ఉద్భూత (లేచిన) సంస్కారమాత్రముచే కనబడు జ్ఞానమును స్మృతి యందురు.

2. స్మృతికంటె అన్యమయిన జ్ఞానమును అనుభవ మందురు.

1. రెండుపక్షములను గలిగిన జ్ఞానమును సంశయ మందురు.

2. సంశయముకంటె వేఱయిన జ్ఞానమును నిశ్చయ మందురు.

1. విపరీత నిశ్చయమును విపర్యయ మందురు.

2. యథార్థ నిశ్చయమును మంచిజ్ఞాన (తేటయగు జ్ఞాన) మందురు.

1. ప్రమయొక్క కారణమును ప్రమాణమందురు.

1. వ్యాపారమునకు వేఱయిన అసాధారణ కారణము కరణ మందురు.

1. కారణము నందుండి కలిగి కార్యమును కలిగించునది ఏదియో దానిని వ్యాపార మందురు.

1. సకల కార్యముల కారణమును సాధారణ కారణమందురు. [ఈవిధమగునవి ఈశ్వరుడు, అతని జ్ఞానము, ఇచ్ఛ, ప్రయత్నము, అదృష్టము, ప్రాగభావము, ప్రతిబంధాభావమును; కాలము, దిక్కు అను తొమ్మిది యగును.]

2. ఏదేని నొక కార్యకారణమును అసాధారణ కారణ మందురు. [ఈవిధమగునవి ఘటము మొదలగు వాని కారణమయిన కపాలము మొదలగునవి.]

1. సకల అనర్థములును వీడి పరమానంద మొందుటను మోక్ష మందురు.

1. అజ్ఞానమును దానికార్యమును అనర్థ మందురు, దానినే బంధమనియు దుఃఖమనియు జెప్పుదురు.

2. పరమప్రేమయొక్క విషయమును పరమానంద మందురు. అన్నిటికంటె అధికమయిన ప్రేమను (ప్రియమును) పరమప్రేమ యందురు. దానినే నిరతిశయ ప్రేమ యనియు జెప్పుదురు.

1. దేహాది ప్రపంచము కనబడుచుండగా బ్రహ్మస్వరూపముగా నిలుచుటను జీవన్ముక్తి యందురు.

1. నిరావరణ పరిపూరణ వృత్తితో గూడిన ఆనందమును జీవన్ముక్తియొక్క విలక్షణానంద మందురు.

2. ప్రపంచము (కనబడుట) లేని బ్రహ్మస్వరూప మయిన స్థితిని విదేహముక్తి యందురు.

1. నిష్ప్రపంచ బ్రహ్మాత్మయొక్క ఏకత్వజ్ఞానమును తత్త్వజ్ఞాన మందురు.

ఆత్మానాత్మల భేదజ్ఞానమును వివేకజ్ఞాన మందురు.

2. విడుచు ఇచ్ఛను లేక ఇచ్ఛ లేకుండుటయు వైరాగ్య మందురు

(3) ఆఱుసాధనములను పొందుటను షట్సంపత్తి యందురు.

1. బైటి విషయములయందుండి మనస్సును అడ్డగించుటను శమ మందురు.

2. బయటి విషయములనుండి ఇంద్రియములను అడ్డగించుటను దమ మందురు.

(3) వమనమును వలె విడిచిన పిమ్మట మరల వచ్చిన విషయమును విడుచుట నుపరతి యందురు.

(4) ద్వంద్వ (శీతోష్ణములు మొదలగు) ధర్మముల సహించు స్వభావమును తితిక్ష యందురు.

5. శాస్త్రవాక్యము లందును గురువాక్యములందును గల విశ్వాసమును శ్రద్ధ యందురు.

6. స్వరూపమందు చిత్తము ఏకాగ్ర మగుటను సమాధాన మందురు.

7. మోక్షేచ్ఛను ముముక్షుత్వ మందురు.

పూజ్యబుద్ధితో గూడ గలుగు ప్రీతిని (స్నేహమును) భక్తి యందురు. [ఈవిధ ప్రీతి ఈశ్వరుడు, గురువు మొదలగు వారియందు గలుగునది]

4. షట్‌లింగ రూపయుక్తులచే వేదాంత తాత్పర్యమును నిశ్చయించుటను శ్రవణ మందురు.

6. భేదమునకు బాధకమును, అభేదమునకు సాధకమును నగు యుక్తుల చేత అద్వైత బ్రహ్మమును చింతించుటను మనన మందురు.

7. అనాత్మాకారవృత్తులను అడ్డగించుట పూర్వకముగ ఆత్మాకారవృత్తుల ప్రవాహమును నిదిధ్యాస మందురు.

8. వ్యష్టి సమష్టి ప్రపంచమందుండి బ్రహ్మమును ఆత్మను వివేకించుటను పదార్థశోధన యందురు.

9. బ్రహ్మాత్మయొక్క ఏకత్వమును నెఱిగించు వాక్యమును మహావాక్య మందురు.

10. తత్ త్వం, త్వం తత్ (అది నీవు, నీవు అది)' అను పరస్పరమందు పరస్పరముయొక్క ఐక్యమును అన్వయమందురు. దానినే ఓతప్రోత భావమనియు వ్యధికార మనియు జెప్పుదురు.

1. సకల అనాత్మాకారవృత్తుల నిరోధ మగునట్లు బ్రహ్మాకారవృత్తి యందుండు అహంప్రత్యయమును సాక్షాత్కార మందురు. అదియే "నేను బ్రహ్మ" మనుజ్ఞానము. దానినే అపరోక్షజ్ఞా నమనియు తత్త్వజ్ఞాన మనియు జెప్పుదురు.

2. బ్రహ్మ మున్నదను జ్ఞానమును పరోక్షజ్ఞాన మందురు.

1. శబ్దమునకు అర్థముతో గల సంబంధమును వృత్తి యందురు.

1. శబ్దమునందు అర్థముయొక్క జ్ఞానమును గలిగించు సామర్థ్యమును (కలిగించురూప సంబంధమును) శక్తివృత్తి యందురు.

1. శక్తియొక్క సంబంధమును లక్షణ యందురు.

1. శక్తివృత్తిచేత కనబడునదైన అర్థమును శక్యార్థ మందురు. దానినే వాచ్యార్థ మనియు జెప్పుదురు.

2. లక్షణావృత్తిచే స్ఫురించు నదియైన అర్థమును లక్ష్యార్థ మందురు. దానినే శక్యసంబంధి యనియు జెప్పుదురు.

1. త్వంపదముయొక్క వాచ్యము జీవుడు.

2. తత్ పదముయొక్క వాచ్యము ఈశ్వరుడు.

1. త్వంపదముయొక్క లక్ష్యము కూటస్థుడు. అదియే జీవసాక్షి

2. తత్ పదముయొక్క లక్ష్యము శుద్ధబ్రహ్మము. అదియే ఈశ్వరసాక్షి.

1. అంతఃకరణ విశిష్టచేతనము జీవుడు.

2. అంతఃకరణ ఉపహితచేతనము సాక్షి యగును. లేక ఉదాసీనమై సమీపమందుండుకొని యెఱుంగునది యయిన చేతనము సాక్షి యగును. లేక అంతఃకరణమందును దానివృత్తియందును గల చేతనమాత్రము సాక్షి యగును.

1. మాయావిశిష్ట చేతనము ఈశ్వరుడు.

2. మాయా ఉపహితచేతనము ఈశ్వరసాక్షి యగును. అదియే శుద్ధ బ్రహ్మము.

1. మూడుకాలములందును బాధింపబడని దానిని సత్తందురు.

2. ఉత్పత్తినాశము లేనిదానిని నిత్య మందురు.

(3) అలుప్త (చేటులేని) ప్రకాశమును చిత్త మందురు.

4. పరమ ప్రీతియొక్క విషయమును ఆనంద మందురు.

5. అన్నిటికంటె అధిక వ్యాపకమును బ్రహ్మ మందురు.

6. తన ప్రకాశమందు అన్యప్రకాశముయొక్క అపేక్ష లేనిదై అన్నిటిని ప్రకాశింప జేయుదానిని స్వప్రకాశ మందురు. దానినే స్వప్రకాశ మనియు స్వయంప్రకాశ మనియు జెప్పుదురు.

7. కూటము (కరమల కట్టడము) వలెనుండు దానిని లేక కూటము (కపటరూప మాయయొక్క పరిణామ మయిన అంతఃకరణము) నందు ఉండుదానిని కూటస్థ దందురు. లేక కూట (నిశ్చల) త్వముగా నిలుచు దానిని కూటస్థ డందురు.

8. అంతఃకరణమందును, దాని వృత్తులయందు నుండు చేతన మాత్రమును సాక్షి యందురు.

9. చూచువానిని లేక దృష్టి కర్తను ద్రష్ట యందురు.

10. ఎఱుగు వానిని లేక జ్ఞానముయొక్క కర్తను జ్ఞాత యందురు.

11. సమీపమందుండు చూచువానిని ఉపద్రష్ట యందురు.

12. ఉపలబ్ధియొక్క కర్తను (జ్ఞానముయొక్క) ఉపలబ్ధయందురు. [ఎట్లు:- సూర్యుడు ప్రకాశమును చేయుచున్నా డనునది ఉపచారమాత్రమో యట్లు ఆత్మదృష్టిని లేక జ్ఞానమును లేక ఉపలబ్ధిని చేయుచున్నా డనునది ఉపచార మాత్రమగును. లేక చక్షువు అంతఃకరణములయొక్క వృత్తిభేదముచే రెండువిధముల అనిత్యదృష్టి గలదు. చేతన రూపము నిత్యదృష్టి యగును. వానికంటె ప్రతిబింబరూపము ప్రకాశమును జేయు సూర్యునివలె అనిత్యదృష్టికి ఆశ్రయ మగుటచే ఉపచారముగా దృష్టియొక్క కర్త ఆత్మ యనబడుచున్నది. రాహువు యొక్క శిరస్సువలె నిత్యదృష్టియే ఆత్మయొక్క స్వరూపమే యగును. ఇట్లు ఉపలబ్ధి మొదలగు వానియొక్క కర్తృత్వమునందును తెలియదగినది.]

13. అన్ని రూపములను సర్వాత్మ యందురు. [ఇవి ఆత్మయొక్క విధేయ విశేషణము లగును.]

14. దేశకాల వస్తువులచేనైన యా పరిచ్ఛేదము లేనిదానిని అనంత మందురు. దానినే అపరిచ్ఛిన్నము, భూమము, వ్యాపకము, విభువు అనియు చెప్పుదురు.

15. జీవేశ్వరులు మొదలగు పంచభేదములు లేక సజాతీయాది మూడు భేదములు లేని దానిని అఖండ మందురు.

16. సంబంధము (సంఘము) లేనిదానిని అసంగ మందురు.

17. ద్వైతము లేని దానిని అద్వైత మందురు.

18. అవయవము (అంగము) లేని దానిని నిరవయవ మందురు.

19. జన్మము లేని దానిని అజన్మ మనియు అజ మనియు జెప్పుదురు.

20. మరణము లేనిదానిని అమర మందురు. దానినే అవినాశి యనియు, అమృత మనియు చెప్పుదురు.

21. జర (ముసలితనము) లేనిదానిని అజర మందురు.

22. క్రియ లేనిదానిని అక్రియ మనియు, నిష్క్రియ మనియు జెప్పుదురు.

23. షట్ (ఆఱు) వికారములు లేని దానిని నిర్వికార మందురు. అది యే అక్రియయు కూటస్థుడును నగును.

24. స్థూలము మొదలగు (నాల్గు) రూపములు లేని దానిని నిరాకార మందురు.

25. మనస్సు, ఇంద్రియములకు గోచరము (విషయము) కాని దానిని అవ్యక్త మందురు.

26. ప్రమాణమునకు విషయము కానిదానిని అప్రమేయ మందురు.

27. తఱుగుట, పెరుగుట లేనిదానిని అవ్యయ మందురు.

28. క్షరణ (క్షయ) ము లేని దానిని అక్షరమనియు, అక్షయ మనియు చెప్పుదురు. (క్షయము తగ్గుట) [ఇవి ఆత్మయొక్క నిషేధ్య విశేషణములు]

ఈరీతిని లక్షణావళి చెప్పబడినది.

75. ఇప్పుడు తమ యుపదేశమును సమాప్తి చేయువాడై శ్రీ గురుస్వాములు తమ శిష్యునికి జ్ఞానము దృఢ మగుటకు సూచన చేయుచున్నాడు.

శిష్యుడా! నీవు నాయీ వేదోక్తమయిన యుపదేశమును వింటివి. అందుచే శబ్దముయొక్క స్వభావముచేత నీచిత్తమందు దృఢముగా (సంశయవిపరీత భావనము లేనిదిగా) నైనను లేక అదృఢముగా (సంశయ విపరీత భావనలతో గూడినదిగా) నైనను అపరోక్షజ్ఞానము అవశ్యము కలిగియుండు ననునది నాకు అనుమాన ప్రమాణముచేత నిశ్చయ మయినది. ఏలనః-

1. శబ్దమునకు స్వభావమిది యగును. దేశముయొక్క అంతరాయము గల (మఱుపుగల) లేక కాలముయొక్క అంతరాయము గల వస్తువుయొక్క జ్ఞానము, శక్తి లక్షణజ్ఞానము గల పురుషునికి శబ్దములచేత పరోక్షముగానే గలుగుచున్నది. అపరోక్షముగా గలుగుటలేదు.

ఎట్లు దేశకాలముల అంతరాయము గల స్వర్గముయొక్క జ్ఞానమును, ఇంద్రాది దేవతల జ్ఞానమును, శాస్త్రరూపశబ్దముచే పరోక్షముగానే కలుగుచున్నది. అపరోక్షముగా గలుగుటలేదో-

3. దేశకాలముల అంతరాయము లేనిదిగా నుండుటచే సమీపదేశమందును వర్తమాన కాలమునందును గల వస్తుజ్ఞానము శబ్దముచే పరోక్షము, అపరోక్షమను రెండువిధములుగా గలుగుచున్నదో-

ఎట్లు దశము (పదియవ వా)డున్నాడు, మఱచిన కంఠపు ఆభరణ మున్నది. అని ఉన్నదను రూపముచే శబ్దముచే తెలిపింపబడిన అంతరాయము లేని దశమునియొక్క జ్ఞానమున్ను, కంఠముయొక్క ఆభరణ జ్ఞానమున్ను, వినువానికి

పరోక్షముగా గలుగుచున్నదో- అట్లే "సత్యజ్ఞానానంద రూపబ్రహ్మ మున్నది" అని అవాంతరవాక్యముచే ఉన్నదను రూపముచే నెఱిగింపబడిన శ్రోతయొక్క స్వరూపముగా నుండుటచే అంతరాయము లేని బ్రహ్మ మేదియో; దానిజ్ఞానము వినువానికి పరోక్షముగానే కలుగుచున్నది. అపరోక్షముగా గలుగుట లేదు. ఈవిధముగా జ్ఞేయవస్తువు స్వరూపమును నెఱిగించు పదము లేనివాక్యముచే అంతరాయములేని వస్తువుయొక్క జ్ఞానమున్ను శక్తి లక్షణల జ్ఞానము గల పురుషునికి నియమముగా పరోక్షముగానే కలుగుచున్నది.

ఎట్లనః- నీవు పదియవవాడవు, ఇది కంఠాభరణము- అని వస్తువుయొక్క స్వరూపమును నెఱిగించు పదముతో గూడిన వాక్యముచే దెలిపింపబడిన పదియవవాడు, కంఠాభరణము అనువాని జ్ఞానము శబ్దముయొక్క శక్తి, లక్షణల జ్ఞానము గల పురుషునికి అపరోక్షముగా గలుగుచున్నది, పరోక్షముగా గలుగుట లేదు. అట్లే శ్రోతయొక్క (వినువాని) స్వరూపమును నెఱిగించు "త్వం" మొదలగు పదములతోగూడిన "తత్త్వమసి" మొదలగు మహావాక్యములచే నెఱిగింపబడిన శ్రోతయొక్క స్వరూపముగా నుండుటచే అంతరాయములేని బ్రహ్మము ఏదియో; దానిజ్ఞానము శబ్దముయొక్క శక్తియు లక్షణయు నయిన వృత్తియొక్క (శబ్దమునకు అర్థముతో నుండు సంబంధముయొక్క) *98 జ్ఞానముగల పురుషునికి నియమముగా దృఢముగా నైనను, అదృఢముగా నైనను కలుగుచున్నది.

1. అత్యంతశుద్ధ అంతఃకరణముగల ఉత్తమ అధికారికన్ననో ముందు జెప్పిన శబ్దముచే దృఢజ్ఞానమే కలుగుచున్నది. అతనికి అపరోక్షజ్ఞాన ముదయించిన పిమ్మట సంశయము మొదలగు వానిని నివర్తించుకొఱకు శ్రవణమననాదిరూప ప్రయత్నము చేయవలసినది లేదు.

2. ఏ పురుషుని అంతఃకరణము అత్యంతము శుద్ధము గాక కొంచెము

*98. ఇట ఇది అభిప్రాయముః- శబ్దముయొక్క శక్తిలక్షణల జ్ఞానము లేక శబ్దార్థముయొక్క జ్ఞానము కలుగునేని దేశాంతరమందు వసించు పురుషునికి వేఱు దేశ భాషయొక్క జ్ఞానము చదువుట లేకయే కలుగవలయును. కలుగుట లేదు. కావున పదార్థముల జ్ఞానమునందు శక్తి లక్షణల జ్ఞానము అపేక్షింపబడున దగును.

మలములేక విక్షేపము మొదలగు దోషములతో గూడినదై యున్నదో; వాడు మధ్యమ, లేక కనిష్ఠ అధికారి యగును. వానికి ముందు చెప్పిన మహావాక్య రూపశబ్దముచే అంతరాయములేని వస్తువుయొక్క జ్ఞానమున్ను అదృఢ అపరోక్షముగా గలుగుచున్నది. వానికి అపరోక్ష జ్ఞాన ముదయించిన పిమ్మటనున్ను, సంశయాదుల నివారణకొఱకు శ్రవణమననాదిరూప ప్రయత్నములు చేయదగ్గవి.

ఈయర్థము ప్రసంగముచే చెప్పబడినది.

శిష్యుడా! నీవు శాస్త్రాభ్యాస మూలమునను, ముందు జెప్పిన విధమునను, శబ్దముయొక్క (తత్పద త్వంపదములయొక్క) శక్తివృత్తి లక్షణావృత్తుల జ్ఞానము గలవాడవుగా నున్నావు. శ్రుతి, యుక్తి, నా(గురువు) వాక్యము, నీయనుభవము- అను ప్రమాణములచే నీకు దెలియదగిన బ్రహ్మముయొక్క వేఱుకాని ఆత్మ ప్రమేయ మేదియో, యది సర్వాత్మయో యుండుటచే నొకదానికి దూరమనియు, సమీపమనియు చెప్పబడుట లేదు. అయితే అన్నిటికి తానే తానై యుండుటచే అన్నిటికిని అత్యంత సమీపముగా నున్నది.

1. ఆయత్యంత సమీపమందున్న బ్రహ్మరూప ఆత్మయొక్క ఉపదేశమును నేను "తత్త్వమసి" అను మొదలగు వాక్యములచే చేసియున్నాను.

2. నేను నిన్నెఱుగదగిన బ్రహ్మాత్మల ఏకత్వరూప తత్త్వముయొక్క అజ్ఞానముచే చేసిన ప్రశ్ననుండి ఉపరమించితివని గాంచుచున్నాను.

(3) నీకు ముముక్షుత్వమునకు పిమ్మట అపేక్షింపబడు ఆత్మయొక్క అభిన్నమును విస్మరణము నొందిన కంఠభూషణమువలె నిత్యప్రాప్తియు నయిన ఏబ్రహ్మముయొక్క ప్రాప్తి యుండినదో యది దాని జ్ఞానమూలమున సిద్ధించినది. కావున బుద్ధియొక్క చంచలతకు హేతువయిన రజోగుణజన్యమగు ఇచ్ఛావృత్తి యొక్క నివృత్తిమూలమున అంతర్ముఖమయిన బుద్ధివృత్తియందు ప్రతిబింబ మును నొందిన స్వరూపానందముయొక్క అనుభవసూచనను జేయునది యయిన ముఖముయొక్క ప్రసన్నత కలిగియున్నది. దానినిన్ని చూచుచున్నాను.

కావున ముందు చెప్పిన లింగము (గుర్తు)లచే నీకు అవశ్యము బ్రహ్మాత్మ యొక్క ఐక్యముయొక్క అపరోక్షజ్ఞానము ఉదయించి యున్నదని నాకు నిశ్చయ మగుచున్నది. ఐన నాజ్ఞానము దృఢముగా నున్నది. లేక అదృఢముగా నున్నదను నిశ్చయము నాకు గలుగలేదు. ఏలయన,

1. అంతఃకరణమున్ను దాని వృత్తియున్ను సూక్ష్మపంచభూతముల కార్యమగును. కావున ఇంద్రియరూప ప్రత్యక్ష ప్రమాణమునకు విషయములు కావు. అయితే అవి (అంతఃకరణమును దానివృత్తియు) సాక్షికి (అంతః కరణమందును దానివృత్తులయందును గల చేతనమాత్రమునకు) విషయ మగును.

2. తత్త్వజ్ఞానమున్ను అంతఃకరణముయొక్క వృత్తిరూప మగును. కావున అది ఇంద్రియములకు విషయము కాదు, ఇందుచే ప్రత్యక్షత్వముచేత నీయొక్క జ్ఞానముయొక్క దృఢతనైనను అదృఢత నైనను నెఱుగజాలను.

(3) లేక జ్ఞానియొక్క స్వస్వరూపమందు గతి (ప్రవేశము) రూపజ్ఞాన మేదియో యది మనుష్యునిచే నెఱుగదగిన వయిన ఆకాశమునందు విహరించు పక్షియొక్క గతి, క్షణకాల ముండునది యయిన మెఱుపుయొక్కగతి; సుఖ దుఃఖములు మొదలగు ధర్మములచేత ముఖముయొక్క వాడుబాటునకును, ప్రకాశమునకును, హేతువయిన మనస్సుగతి- యనువానికి విలక్షణ మగును. సాధారణ మనుష్యునిచే అలక్ష్యముగా (ఎఱుగదగనిదిగా) నుండుటచే,

4. యోగిచే లక్ష్యమగు జలప్రవాహమునందు ఎదిరించి పోవునది యగు చిన్నచేపగతి యేదియో దానికంటెను, ముందు చెప్పిన జ్ఞానిగతి విలక్షణ మగును. సర్వజ్ఞుడగు సిద్ధయోగిచేతను అలక్ష్యముగా నుండుటచే,

5. తనకంటెను అధికుడైన వేఱొక సిద్ధయోగిచే నెఱుగదగినదై యుండుటచే దుర్లక్ష్య మగును (దుఃఖముచే నెఱుగదగినదై యుండును). సర్వజ్ఞసిద్ధయోగియొక్క గతికంటెను, ముందు చెప్పిన జ్ఞానియొక్కగతి విలక్షణ మయినది; మహాయోగి చేతను అలక్ష్యముగా నుండుటచే, జ్ఞానమార్గము నెఱుగని అజ్ఞులచేతనో

జ్ఞానముయొక్క గతి పూర్తిగ అలక్ష్య మగును.

6. జ్ఞానమార్గమును గనిన వేఱొక వివేకి యెవడో వాడు తక్కిన జ్ఞానియొక్క నిష్ఠను, తనస్వరూపమునకు భిన్నముగా జూచునేని ద్వైతమును జూచువాడగుటచే నతడు అజ్ఞాని యగును. దానిని (ముందు చెప్పిన నిష్ఠను) వాడు (వేఱువివేకి) తన స్వరూప అభిన్నముగా జూచునేని యది (తనయాత్మకంటె వేఱుకాని దానినిగా జూచుట) తననిష్ఠయే యగును. దానినే చూచుచున్నాడు; తక్కిన జ్ఞాని నిష్ఠను (గతిని) జూచుట లేదు. కావున వేఱు వివేకిచేతను జ్ఞానియొక్కగతి ప్రత్యక్షముచేత దెలియుట కరుదగును. కావున అపరోక్షత్వముచేత నీజ్ఞాననిష్ఠ యొక్క దృఢత్వమును నైనను అదృఢత్వమును నైనను నేనెఱుగజాలను.

7. బహుకాల సహవాసముచేత వచనము మొదలగు లింగములచేత నెఱిగింపబడిన,

1. గుణాతీతత్వము:

2. సమీపమందుండు మృత్యువుయొక్క జ్ఞానముచే భయము లేమి.

(3) ఇష్టానిష్టములందు మోహశోకంబులు లేమి అను నీ మొదలగు జ్ఞానియొక్క *99. స్వసంవేద్యలక్షణములచేత వేరొక తెలిసిన వానిచే అనుమానముచే నెఱుగదగినది జ్ఞానియొక్క గతి యగును. అయితే యుపదేశము నకు పిమ్మట నీకును నాకును చిరకాల పర్యంతము సహవాసము (కూడ నుండుట) కలుగుట లేదు. కావున నీకు గలిగిన జ్ఞాన మేదియో యది దృఢము లేక అదృఢము అనుదానిని అనుమానముచేతను నేనెఱుగజాలను.

7. ముముక్షువునకో (1) పూర్వపుణ్యముచేతను, (2) లోకమునకు తాను బ్రహ్మవిత్తగుటయొక్క ప్రసిద్ధిచేతను, (3) వానిభ్రమనివృత్తి మూలముగా శాంతిని

*99. ఏలక్షణము భాగవతము ఏకాదశస్కంధమున జెప్పిన మేలైన కృప గలిగి యుండుట మొదలగు (30) పరసంవేద్య (పరులచే నెఱుగనగు) లక్షణములవలె బరులకు నెఱుగరానిదో అయితే జ్ఞానియగు తనకే నెరుగవచ్చునో యది జ్ఞాని స్వసంవేద్య (తనచే నెఱుగబడు) లక్షణ మగును.

కలిగించు వచనములచేతను "వీడు జ్ఞాని" యను భావన కలుగుచున్నది.

1. కావున శిష్యుడా! నేను నీకు దీని నెఱింగించుచున్నాను. నీకు సంశయ విపర్యయ రూపదోషము లేని దృఢజ్ఞానము కలిగియుండునేని, నీవు కృతకృత్యు (చేయవలసిన దానిని చేసినవా) డవును. ప్రాప్య ప్రాప్తు (పొందవలసిన దానిని పొందినవా) డవును నగుదువు. కావున నీకాదోషముల నివృత్తికొఱకు శ్రవణము మననము మొదలగు నేప్రయత్నమును జేయవలసినది లేదు.

2. నీకు సంశయ విపర్యయరూప దోషముతో గూడిన "నేను బ్రహ్మ" మను నిశ్చయరూప అదృఢ (మంద) బోధము కలిగి యుండినట్లయిన, అప్పుడు నీకు శ్రవణాదులు మూడును చేయదగినవి యగును.

1. వాటియందును నీకు ఉపనిషత్తురూప లేక దాని అనుసారి యయిన అన్ని సంస్కృత లేక ప్రాకృతభాషల గ్రంథరూప వేదాంత శాస్త్రములు బ్రహ్మాత్మ ఐక్యమును ప్రతిపాదించుచున్నవా? లేక వేఱు అర్థమును ప్రతిపాదించుచున్నవా? అనురూపమగు కేవల ప్రమాణగత సంశయము గలుగునేని అప్పుడు నీకు శ్రవణమాత్రము చేయవలసిన దగును.

ఉపనిషత్తు అభ్యాసరూప లేక దానిని అనుసరించు తక్కిన సంస్కృత లేక ప్రాకృత భాషాగ్రంథముల అభ్యాసరూప విచారమయిన సాధన (గురుముఖముగా వాక్యపు శ్రవణరూప అంగియొక్క వేఱయిన అంగ) శ్రవణ మేదియో దాని మూలమున

1. ఉపక్రమ ఉపసంహారములు (ఆరంభము, సమాప్తి,)

2. అభ్యాసము (అడుగడుగునకు చెప్పుట)

(3) అపూర్వత (శ్రుతికి వేఱయిన ప్రమాణములకు విషయము కానందుననైనను, స్వప్రకాశత్వముచే నయినను అద్వైతవస్తువుయొక్క అలౌకికత్వము)

4. ఫలము (అనర్థనివృత్తియు పరమానంద ప్రాప్తియు నైన మోక్షము)

5. అర్థవాదము (భేదజ్ఞాననిందయు అభేదజ్ఞానస్తుతియు)

6. ఉపపత్తి(అద్వైతజ్ఞానమున కనుకూలమయిన దృష్టాంతరూపయుక్తి) అనునవి తాత్పర్యమును నిశ్చయించు ఆఱు లింగరూప యుక్తు లగును. ఈ యాఱు లింగరూప యుక్తులచేత వేదాంత (ఉపనిషత్తుల) తాత్పర్యమును నిశ్చయించుట శ్రవణ మనబడుచున్నది. అది నీకు కర్తవ్యమగును. దీనిచే (శ్రవణముచే) ముందుచెప్పిన ప్రమాణగత సంశయనివృత్తి గలుగుచున్నది.

2. ఉపనిషత్తుల విచారముచే నైనను లేక దానిని అనుసరించు తక్కిన సంస్కృత ప్రాకృత గ్రంథముల విచారముచే నైనను లేక నిజము పలుకు గురువు వాక్యమునందుగల దృఢవిశ్వాసముచే నైనను ఉపనిషత్తురూప ప్రమాణములచే నెఱుంగదగు బ్రహ్మాత్మైక్యరూప ప్రమేయ మేదియో యది ఉపనిషత్తులయందు అవశ్యము నిరూపణము చేయబడియున్నది అను నిశ్చయమువలన నీకు ప్రమాణగత సంశయము గలుగక బ్రహ్మమయిన పరమేశ్వరుడు.

1. సర్వజ్ఞత్వము మొదలగు గుణములతో గూడినవాడు.

2. (1) అవిద్య, (2) అస్మిత, (3) రాగము, (4) ద్వేషము, (5) అభినివేశము అనునైదు క్లేశములు లేనివాడు.

3. ఎక్కడను పూర్ణుడు.

4. నాయుపాసకుడు (ఉపాసింపబడువాడు)

జీవుడైన నేను: -

1. అల్పజ్ఞత్వము మొదలగు గుణములతో గూడినవాడను,

2. అవిద్య మొదలగు పంచక్లేశములతో గూడినవాడను,

3. దేహసంబంధియై యుండుటవలన పరిచ్ఛిన్నుడను,

4. దాని ఉపాసి అను నీవిధ అసంభవముచే బ్రహ్మాత్మైక్యరూప వేదాంతపు ప్రమేయ మేదియో యది నాబుద్ధియందు వచ్చుటలేదు. కావున "బ్రహ్మాత్మైక్యము సత్యమా?" అను కేవల ప్రమేయసంశయము కలిగినట్లయిన నీకు,

1. రజ్జుసర్పము, శుక్తిరజతము, అద్దమందుండు నగర ప్రతిబింబము-

అను నీ మొదలగు దృష్టాంతరూపమున్ను,

2. (1) భేదము లేని ఆత్మయందు బ్రహ్మభేద మున్నదా!

(2). లేక భేదముతో గూడిన ఆత్మయందు బ్రహ్మభేద మున్నదా?

(3) పేరు, జాతి మొదలగు ద్వైతరూప వికల్పము లేని ఆత్మయందు వికల్ప మున్నదా? లేక వికల్పముతో గూడిన దానియందు వికల్ప మున్నదా? అను రెండు చోట్లను,

1. మొదటి పక్షమందు వ్యాఘాత దోషము గలదు.

3. రెండవ పక్షమందు ఆత్మాశ్రయము అన్యోన్యాశ్రయము, సక్రియగ అనవస్థ మొదలగు దోషములు గలుగుచున్నవి అనునదగు- ఇవి మొదలగు భేదముల బాధకయుక్తులచేతను,

4. ఘటాకాశమునకును మహాకాశమునకును స్వరూపముచేత ఎప్పుడును భేదము గలదో, అట్లే నిరుపాధిక బ్రహ్మమునకును, ఆత్మకును స్వరూపముచే నెప్పుడు నభేదము గలదు- అను మొదలగు అభేదసాధక యుక్తులచేతను,

అద్వైతబ్రహ్మ (బ్రహ్మాత్మయొక్క అభేదము) చింతించు రూపమననము చేయదగిన దగును.

3. నీకు ముందు చెప్పిన రెండువిధముల సంశయములు కలిగినట్లయిన నీవు ముందు చెప్పిన విధమగు శ్రవణమననములు రెంటిని చేయవలెను.

4. నీకేవిధమయిన సంశయమును లేక జ్ఞానమునకు ముందు సగుణబ్రహ్మ పూర్ణ ఉపాసనచే కలుగు చిత్తముయొక్క ఏకాగ్రత లేనందున "నేను జీవుడనై యున్నాను, బ్రహ్మమునకును, నాకును గల భేదము సత్యము; దేహము మొదలగు జగత్తు సత్యము" అనురీతిగా గలుగు ప్రతిక్షణమున్ను లేచునవియైన బుద్ధిరూప కేవల విపరీతభావన (రజ్జువునందు సర్పనిశ్చయమువలె ఆత్మయొక్క యథార్థ స్వరూపము కన్న విపరీత మయిన నిశ్చయము) కలుగునేని అప్పుడు నీవు విజాతీయ ప్రత్యయముల (అనాత్మాకారవృత్తుల) నివృత్తితోగూడిన సజాతీయ ప్రత్యయ

(ఆత్మాకార వృత్తుల) ప్రవాహరూప నిదిధ్యాసనమును (సవికల్పసమాధిని) జేయవలయును.

4. నీకు రెండువిధముల సంశయములును విపరీతభావనయును కలుగునేని, అప్పుడు నీవు ముందుచెప్పిన శ్రవణ,మనన, నిదిధ్యాసనమను మూటినిన్ని చేయవలయును. అంజనముచే నేత్రరోగ నివృత్తిమూలముగా, సూర్యుని సాక్షాత్కారమున్ను కలుగుటబోలె, నాశ్రవణాది సాధనములచే నిదిధ్యాస పరిపాకావస్థరూప ధ్యాతధ్యానమను వానియందు మఱవు గలిగి అద్వితీయ స్వప్రకాశ ప్రత్యగభిన్న బ్రహ్మరూప ధ్యేయాకార (ధ్యానింపబడు వస్తురూప) వృత్తియొక్క స్థితిమయమగు క్షణిక (క్షణము సేపుండునదైన) సమాధిరూప సాక్షాత్కారము (దృఢాపరోక్షజ్ఞానము) కలుగును. అందుచే అదేక్షణమందు కార్యముతో గూడిన అవిద్య నివృత్తియు మూడు కాలములందు లేని నిశ్చయరూప బాధయున్ను పరమానందరూప బ్రహ్మపు ఆవిర్భావము నయిన జీవన్ముక్తి కలుగును.

కావున ఇప్పుడు నీవు శ్రవణమననములచే నుదయమయిన జ్ఞానమును దృఢము చేయుము. పిమ్మట

1. నీకు ఉత్తము ప్రారబ్దము గలదేని నీజీవన్ముక్తి విలక్షణానం దానుభవము కొఱకు విద్వత్సన్న్యాస రూపనివృత్తిని చేకొనుటతో నిర్వికల్ప సమాధియొక్క అధిక అభ్యాసము కలుగును.

2. నీకు మధ్యమ ప్రారబ్ధము ఉండునేని స్నానము, సంధ్య, దేవపూజ, సాధుసేవ, గురుభక్తి, శాస్త్రాధ్యయనము అను నీ మొదలగు శాస్త్రములందు చెప్పబడిన వ్యవహారములు కలుగును.

3. నీకు కనిష్ఠ ప్రారబ్ధ ముండునేని కృషి (పైరుచేయుట) వర్తకము, సేవకము, కుటుంబ సంరక్షణ, రాజ్యపాలన- అను నీ మొదలగు క్లేశరూప కనిష్ఠమైన లౌకికవ్యవహారములు గలుగును అయితే :

ఎండమావుల జలదృశ్యముచే పృథివి తడియక యుండులాగు బాధితమగు ప్రపంచవు అనువృత్తి (పిమ్మట దృశ్యము)చే దేహము పడువఱకు ప్రారబ్ధాను

సారము కనబడు నీవ్యవహారములచే నీకొకహానియు లాభమును లేదు.

శిష్యుడా! నీవు దృఢజ్ఞానముచే ముందుండిన భేదవాది, కడుపు సాకు పామరుడు అనువారి సంఘమును, స్త్రీని, స్త్రీల సంఘమును గల విషయ పురుషుల సంగమును విడిచిపెట్టుము. ఏలయన వారి సంగమేదియో యది ఉదయమయిన మందబోధమును నాశము చేయున దగును.

ఒకరాజు, పుత్రులు మొదలగు వాటి కోరికతో వాయుదేవునికి యాగము చేయుట కొఱకు శాస్త్రమునందు చెప్పియుండు లక్షణములు గల మేకయను నొకపశువు కావలసియుండెను. అందుకొఱ కాతడొక వేదవేదాంగము లెఱింగిన బ్రాహ్మణుని బంపెను. ఆ బ్రాహ్మణుడొక దేశాంతరమందున్న మేకలమందనుండి శాస్త్రములందు జెప్పియుండు లక్షణములు గల మేక నొకదానిని [నూఱురూప్య ములు మతింపుగల దానిని] ధనమిచ్చి తీసికొని రాజు నగరమునకు వచ్చు చుండెను.

అప్పుడు త్రోవయందు నలుగురు దొంగలు చేరి యిది రాజుయొక్క మేకయని తెలిసికొని యొకని కొకడు సంకేతములు చేసికొని దాని నపహరించుట కొఱకు నాబ్రాహ్మణునికి నొక్కొక్కక్రోశ (రెండుమైళ్ల) దూరమున కావల నలుగురు కట్టెలు కొట్టుట మొదలగు వేర్వేరు పనులు చేయుచుండిరి.

అప్పు డొకదొంగ యున్నచోటికి ఆబ్రాహ్మణుడు రాగానే వా "డీపశువు మేక కాదు వెట్టికుక్క" యని చెప్పెను. దానిని వినిన యాతనికి సందేహము కలుగలేదు. పిమ్మట రెండవ దొంగ యున్నచోటికి రాగా వాడు నాలాగే చెప్పెను. దానిని వినిన నాతనికి సందేహము కలిగెను. పిమ్మట మూడవ వాడున్నచోటికి రాగా వాడును నట్లే చెప్పెను. దానిని విని "ఈ పశువు వెట్టికుక్కయే" యని విపరీత నిశ్చయ మాబ్రాహ్మణునికి గలిగెను. అప్పుడాత డామేకను త్రాడు విడిచిపోయెను. ఆ పశువు మాత్రము స్నేహవశమున నాతని వెనుకపోయెను. పిమ్మట నాల్గవదొంగ సమీపముగా పోవునపుడు వాడును మిక్కిలి భయమును కలిగించు మాటలు చెప్పి యట్లే చెప్పెను. అప్పు డాబ్రాహ్మణుడు భయపడి ఆ

మేక మెడకు కట్టియున్న త్రాటింబట్టి నొకవృక్షమునకు గట్టివైచి వేగముగా రాజు దగ్గఱ పోయిచేరెను. ఆపశువును ఆ నలుగురు దొంగలు చేరి తీసికొనిపోయిరి. రాజు ఈసంగతి తెలిసికొని మరల నాపశువును దెప్పించి తన కార్యమును ముగించుకొనెను.

అట్లు గురురూపరాజు మోక్షమను కార్యసిద్ధికొఱకు ముముక్షురూప బ్రాహ్మణుని శాస్త్రమందు చెప్పియుండు సచ్చిదానంద లక్షణములతో గూడిన ఆత్మరూప పశువును విచారించి నిశ్చయము చేయుట యనెడు ప్రాప్తికొఱకు శాస్త్రయుక్తులచే విచారము చేయుట యగు దేశాంతరమున కంపెను. అప్పు డా ముముక్షువగు బ్రాహ్మణుడు బ్రహ్మమున కభిన్నమగు ఆత్మయొక్క నిశ్చయ రూపమైన ఆ పశువును పొందెను. అయిన భేదవాది మొదలగు జనసముదాయ రూపులైన దొంగల సంగముచేత సంశయమును; దేహము మొదలగు అనాత్మలచే నేను నాదియను విపరీతభావనమును బొందుచున్నాడు. అతనికి మరల గురురూపరాజుయొక్క సంగము కలుగునేని ఆ విపరీతభావన నివృత్తి యగును. లేనిచో ఆత్మయగు పశువును బోగొట్టుకొని జనన మరణమను సంసారమును పశ్చాత్తాపమును అనుభవించును. కావున భేదవాది మొదలగు వారి సంగరూప కుశంక దృఢజ్ఞానమునకు ముందుగనే నివృత్తి చేయదగిన దగును.

దృఢజ్ఞానమునకు పిమ్మటయును జీవన్ముక్తియొక్క విశేషసుఖముకొఱకు ముందు చెప్పిన జనులసంగము విడువదగిన దగును.

నిస్సంగతా ముక్తిపదం యతీనాం
సంగాదశేషాః ప్రభవంతి దోషాః ।
ఆరూఢయోగోఽపి నిపాత్యతేఽధః
సంగేన యోగీ కిముతాల్పసిద్ధిః ॥

ప్రయత్నము గల పురుషులకు సంగాభావ (జనులతో రాగద్వేషములు మొదలగునవి లేకుండుట యగును. దాసీనత్వ)ము ముక్తిపద మగును. సంగముచే సకలదోషములు కలుగుచున్నవి. యోగారూఢ పురుషుడును సంగముచే

జారిపడుచున్నా డనగా అల్పసిద్ధి గల పురుషుడు (అపక్వయోగి) సంగముచే జారిపడుచున్నాడు అనుటలో నేను చెప్పవలసియున్నది అని వేలు శాస్త్రమందు చెప్పబడియున్నది. ఈయర్థమందిక ననేక ప్రమాణము లున్నవి. అవి విస్తర భీతిచే నిట వ్రాయబడలేదు. ఆస్తిక అధికారులకు విశేషప్రమాణముల అపేక్షయు నుండదు. ఏలయన-

"బ్రహ్మవిద్బ్రహ్మైవ భవతి - బ్రహ్మవిత్తు (బ్రహ్మమును దెలిసిన వాడు) బ్రహ్మమే యగుచున్నాడు" అనుశ్రుతిచే వానికో (మిక్కిలి విశ్వాసము గల యధికారితో) బ్రహ్మజ్ఞానులగు పురుషుల సకలసంస్కృతము లేక ప్రాకృతభాషల) వాక్యములును భేదభ్రాంతిని భేదించునవియై యుండుటచే వేదరూపముగా గాన్పించుచున్నది. దీనిచేతను నీగ్రంథమున కొన్నిచోట్ల శ్రుతి మొదలగు ప్రమాణములు విశేషముగా వ్రాయబడలేదు. కావున జ్ఞానము గలిగిన పిమ్మటను కుశంకనుండి దూరస్థుడై యుండుటయే తగినదగును.

సంగదోషమును నాశము చేయు సత్పురుషుల సంగము చేయగా నిస్సంగత్వము కలుగుచున్నది. కావున వాసనాక్షయము మొదలగు ఫలమునకు హేతువుగా నుండుటచే నాసాధు సంగమెప్పుడును చేయవలసినదగును.

76. 1. వైరాగ్యము, 2. జ్ఞానము, 3. ఉపరతి అనుమూటిని 1. హేతువు 2. స్వరూపము, 3. ఫలము, 4. అవధి అనువాని నెఱింగి వానిని హృదయమున ధారణ చేయుము. ఈమూటిని నొక్కటిగా చేకొనుట జీవించు నరునికి అవధి లేని సుఖమగును. అనగా జీవన్ముక్తియొక్క విలక్షణానందమునకు హేతు వగును.

1. (1) ఈలోక విషయములందును పరలోక విషయములందును అనిత్యత్వబుద్ధి దోషదృష్టి(వివేకము) వైరాగ్యమునకు హేతు వగును.

(2) జిహాస (విడుచుట కొఱకగు ఇచ్ఛ) వైరాగ్య స్వరూప మగును.

(3) విడిచిన పిమ్మట యాభోగ్య (విషయ)ములందు కలుగు ఉపరతి వైరాగ్యఫలము అగును.

(4) అన్నిటికంటెను మేలయిన బ్రహ్మలోకమునుగూడ తృణమువలె

(తుచ్ఛముగా) చూచుట [అప్పుడు ఈలోకము మొదలగు వానిని తృణమువలె చూచుటయందు చెప్పవలసినదేమి] వైరాగ్యావధి యగును.

ఇవి విరాగహేతువు మొదలగునవి యని యెఱుంగుము.

2. (1) గురుముఖముగా మహావాక్య ఉపదేశమును శాస్త్రవిచారమును నగు రెండువిధముల శ్రవణాది (శ్రవణ, మనన, నిదిధ్యాసనమను) మూడును జ్ఞానమునకు హేతువు లగును.

(2) మిథ్యనున్ను (సకల అనాత్మవస్తువులను) తత్త్వమును (ప్రత్యగభిన్న బ్రహ్మమునున్ను) వివేకించుట అనగా నిష్ప్రపంచ ఆత్మకంటె (తనకంటె) వేఱు గాని బ్రహ్మనిశ్చయము తత్త్వజ్ఞాన స్వరూప మగును.

(3) ఇంకను గ్రంథి (ముడి) ఉదయము కాని అనగా కారణ(అవిద్య) కార్యము (జన్మాది) లతో గూడిన అన్యోన్యాధ్యాసరూపచిత్ జడగ్రంథియొక్క అత్యంత నివృత్తి (పరమానంద ప్రాప్తిరూపమోక్షము) తత్త్వజ్ఞాన ఫలమగును.

(4) దేహమునందువలె అనగా (అజ్ఞానదశయందు) దేహమునందు ఆత్మబుద్ధి ఉండునదివలె దాని (దేహమునందు ఆత్మజ్ఞాన) బాధకమయిన ఒకే (బ్రహ్మమున కభిన్నమయిన) ఆత్మయందు బుద్ధి గలిగెనేని అది తత్త్వజ్ఞానావధి యగును.

3.(1) యమము, నియమము, ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము, ధారణము, ధ్యానము, సవికల్పసమాధి అను నెనిమిదియు ఉపరతికి హేతువు లగును.

(2) చిత్తనిరోధ రూపయోగము (నిర్వికల్పసమాధి) ఉపరతి యొక్క స్వరూపమగును.

(3) వ్యవహార విస్మృతి (మఱపు) ఉపరతియొక్క ఫలమగును.

(4) సుషుప్తివలె కలిగిన అది ఉపరతి అవధి (ఎల్ల) స్వరూపమగును.

1. వైరాగ్యము జ్ఞానమునకు హేతువు (2) జ్ఞానము ఉపరతికి హేతువు.

(3) ఉపరతి శాంతికి హేతువు (4) శాంతి సుఖమునకు హేతువు.

1. వైరాగ్యముచే వాసన నశించుచున్నది.

2. జ్ఞానముచే అజ్ఞానము పాడగుచున్నది.

(3) ఉపరతిచే మనస్సు నశించుచున్నది. అనగా బ్రహ్మాభ్యాసఫలముచే రజోగుణ తమోగుణములు తిరస్కరింపబడగా సత్త్వగుణ ఆవిర్భావము (బయలుపడుట) కలుగుచున్నది.

ఇట మనస్సను శబ్దముచే రజోగుణ తమోగుణములచే సత్త్వగుణము గల మనస్సుయొక్క స్థూలత్వము చేకొనబడుచున్నది. మనోనాశమను శబ్దముచే ముందుచెప్పిన మనస్సు స్థూలత్వనాశము చేకొనబడుచున్నది.

ఈవిధముగా వాసనాక్షయము, అజ్ఞానక్షయము, మనోనాశము అను మూడున్ను సిద్ధింపగా మూడుదేహముల అభిమానము నివృత్తి యయ్యెను.

ఇట ఇది వివేకము:

1. స్థూలదేహాభిమానము నివర్తించుటచే సకల వాసనలును క్షయించు చున్నవి.

2. సూక్ష్మ దేహాభిమాననివృత్తి చే మనోనాశము కలుగుచున్నది.

(3) కారణదేహ నివృత్తిచే ఆ యజ్ఞాననాశము సిద్ధ మగుచున్నది. దీనిచే జ్ఞానికి వివేకబలముచేతనే వాసనాక్షయము మొదలగువాని సిద్ధి సహజముగా గలగుచున్నది. అదియే మరల అభ్యాసబలముచే పెంపదగిన దగును.

77. ఈవిధముగా నివృత్తిప్రాప్తి గలిగిన జ్ఞానికి జీవన్ముక్తియొక్క విలక్ష ణానందముకొఱకు వాసనాక్షయ మనోనాశముల విశేష అభ్యాసరూప కర్తవ్యమును జెప్పి, యిప్పుడు ప్రవృత్తియొక్క ప్రాప్తి గలజ్ఞానికి బయటి వ్యవహారములందు దోషదృష్టి మిథ్యాత్వబుద్ధిచే గనబడు దృఢవైరాగ్యముచే లోపల నిర్మోహముగా (అహంకార మమకారరూపమైకము లేక) ఉండుట తగినది యనుటను

నుపదేశించుటకొఱకు మోహజిత్తుని కథను శ్రీగురువుగారు చెప్పుచున్నారు.

ఒక రాజుయొక్క కుటుంబమంతయు (రాజు, రాణి, రాజపుత్రుడు, పుత్రునిభార్య, దాసి - అనువీరు) జ్ఞానముగల వారగుటచే మోహజిత్తులై (మోహమును జయించినవారై) యుండిరి - అనునది యొక ఉదాహరణము. ఈమోహములేని మాట వినగానే కొంచెమైనను మోహము కలుగదు.

మోహజిత్తుకథ:-

ఒక జ్ఞానము గల రాజకులమంతయు, మోహమును జయించిన వారై యుండిరి. ఒక సమయమున నొకవనమందలి సింహము రాజనగరి జనులను ప్రతిదినమును వచ్చి చంప నారంభించెను. దానిని జంపునిమిత్తము అనేకులతో రాజకుమారుడు గుఱ్ఱముమీద నెక్కి యడవికి పోయెను. ఆ సింహము కంటబడగానే యందఱిని వెనుక విడిచి రాజకుమారుడొక్కడే సింహము వెంటబోయెను. సాయంకాలమున కాసింహము మహారణ్యమున కరిగెను. అప్పుడా రాజకుమారు డట గంగాసమీపమున నుండిన నొక యోగి యాశ్రమమును జూచి సమీపమునకు బోయి యాయోగీశ్వరునికి సాష్టాంగ నమస్కారము చేసెను. వానినిజూచి యోగి నీవెవడవని యడుగ, రాజకుమారుడను మోహజిత్తనగా యోగి యాశ్చర్యపడెను. దానినిజూచి రాజకుమారుడు మరల 'యోగీశ్వరా! నేను మాత్రము మోహజిత్తు కాను. నాకులమంతయు మోహజిత్తేయని చెప్పెను. దానిని విని యోగీశ్వరుడు మిక్కిలి యాశ్చర్యపడి 'రాజకుమారా! మీకులమంతయు మోహజిత్తను మాట నేనెట్లు తెలియుదు ననియడుగ, రాజకుమారుడు చెప్పుచున్నాడు:- ఎఱుపువర్ణము గల పండ్లచాయగల నావస్త్రములను, గుఱ్ఱము నగలు మొదలగువానితో శస్త్రములను, తాము రాజనగరమునకు కొనిపోయి పరీక్షింపవచ్చు ననెను. అప్పుడాయోగి యట్లు సకల సామగ్రులను తీసికొని రాజనగరమునకు బోయెను.

అట మొట్టమొదట దాసికి రాజకుమారుని సామగ్రులను జూపి

"రాజపుత్రుని వార్తయో రమణి వినుమ!

యేమిసెప్పుదు నయ్యయో యంతక్రూర
సింహమొక్కటి నాతని జీల్చిచంపె
శవమునున్నది నాయింట నత్యమిదియ. "

యని యోగి చెప్పగా వినిన యా దాసి-

"దాసినే గాను నతనికి నతడు నాకు
నేలికయు గాదు వినుమ యో యోగితిలక!
సంద్రమును దాటుటయె గాని చక్కజాడ
నాడవలని ఫలంబు వేరొండు గలదె ॥"

అని బదులు చెప్పెను. పిమ్మట నాయోగి "రాజాశ్రయముండుట వల్ల నీదాసికి శోకము గలుగలేదు. వాని భార్యకు మోహపూర్వక శోకము గలుగు" నని తలచి యామెకు సర్వసామగ్రులను జూపి-

"సుందరీ! నీదు ప్రాణనాథుండు నొక్క
సింహముచే జంపబడెను బ్రసిద్ధముగను
వింటె యేమందు నాశౌర్యవీర వరుడు
నిను విడిచె నెట్లు మనుదు నీవింక నకట."

అనిచెప్పెను. దానిని విన్న యా రాజకుమారుని పత్ని-

తాపసశ్రేష్ఠ! నీదగుతపము విడిచి
మమతచే నగు శోకంబు మానవేల?
అతనికిని నాకుగల్గు సంబంధమింత
కాల మీభవమున గాదె గలిగియుండె!

అని యుత్తరమిచ్చెను. అది విన్న యాయోగి "వేఱుతల్లి కూతురగు ఆ రాజకుమారుని భార్యకు తదితర రాజసుఖము లుండుటంబట్టి మోహపూర్వక శోకము కలుగలేదు అయినను నాతని తల్లికి అవశ్యము మోహపూర్వక శోకము గలుగు" నని తలచి వాని తల్లి దగ్గరకు బోయి సకల సామగ్రులంజూపి-

"తల్లిరో! వినుమమ్మ నీతనయు నొడలు
నొక్క మృగరాజు చీల్చెను నక్కజముగ!
నతివ, యాతనిమరణంబు నాటగోలె
యేమిసెప్పుదు నన్నంబు నేమ నొల్ల."

అని చెప్పెను. దాని విన్న యారాజు కొమరునితల్లి-

విటపిశతంబులుగల యొక
ప్రకటితవృక్షమున నిశల బరగు ఖగంబుల్ ।
పటుతరముగ వేగిన నం
దొకటియు నిలకెచటికేని దోకుంగాదే ॥

అని యుత్తరమిచ్చెను. అదివిన్న యాయోగి తల్లికి దనపతియుంటంబట్టి మోహపూర్వక శోకంబు కలుగలేదనియు రాజునకన్నన్ జరావస్థయందు యువకుడగు పుత్త్రుని మరణము అవశ్యము మోహపూర్వకశోకము గలిగించు ననియు తలంచి రాజుదగ్గరకు బోయి సకల సామగ్రులనుజూపి-

వినుము రాజేంద్ర!యక్కటా విన్నవంబు
చెప్ప నోరాడదు మనంబు చెదరియున్న
దయ్యయో నీదునందను నతులమతిని
జంపె మృగరాజు నాయింట శవము గలదు.

అని చెప్పెను దానిని విన్న యా రాజు:

యోగివర ! యేలనీయోగ మొప్పువీడి
వ్యర్థముగ శోకసంతప్త హృదయు డయితి ।
పోదురెట్లయిన నొకవిధంబున తటాక
తీరమున నుండు పాంథులు తెరువుపట్టి

అని యుత్తరమిచ్చెను.

ఇట్లాయోగీశ్వరుడు "కశ్శోకః కో మోహః ఏకత్వ మనుపశ్యతః - ఐక్యమును

నెడతెగక చూచు జ్ఞానికి అట శోకమెక్కడిది? మోహమెక్కడిది?'' అను ఈశావాస్యశ్రుతికి ననుగుణముగా వారిశోకము (ఆవరణము), మోహము, (విక్షేపము) లేకుండుట ననుభవించి [దాసి, రాజపుత్రుని భార్య, రాజు భార్య, అనువారు ముందొక సమయమున రాజుచేతను, రాజకుమారుని చేతను పరీక్షకొఱకు విడువబడినపుడు శోకము లేకయుండిన విధముననే యుండిరి. అనుమాటనున్ను విని అతడు (దాసిమొదలగువారి) ఎదుట పూర్వము కల్పింపబడిన దోషారోపమును విడిచి] దీనిని నేను పరీక్షకొఱకు జెప్పితినిగాని రాజకుమారుడు నాయాశ్రమమందు సుఖముగా నున్నాడు అనివారికి చెప్పెను. దానిని విని వారందఱు సంతోషమున్ను పొందలేదు. అయిన "అట్లయిన మంచిదే'' యని చెప్పి సమత్వమందే యుండిరి. పిమ్మట నాయోగి రాజకుమారుని పరీక్షించు నిమిత్తము సకల సామగ్రులతో దనచోటునకు వచ్చి రాజపుత్రుని జూచి-

వినుము నృపకుమార! వివరింతునొక్కటి ।
మహితశోకమందు మగ్నుజేయు
వేగ నీవు నాడు వేటరా బిమ్మట ।
గూల్చె రిపులు నీదు కులము నెల్ల ॥

అని చెప్పెను. దానిని వినిన రాజకుమారుడు ఆయోగిం జూచి

లోకమందు జనుల కొక్కదినంబున
గల్గు సంగమందు ఘనవివృత్తి
గాన నేను మునుపె, గడతేరు మార్గంబు
గనుచు బంధమేది? మనెద నిట్లు.

దృఢగతి పాంథులు త్రోవను
విడి వటవృక్షంబునీడ విగతశ్రములై
వడిగం జనుదురు గాదే
గడియకు నొకయామడంబుగా గతత్రపులై.

మున్నాళ్ళ ముచ్చటలె ఇవి

చెప్పగు స్వప్నంపు సుఖము చెలువున నేగున్
వప్పుగ నీలోకంబున
నెప్పగ నుంతైన లేదు నిహభోగంబుల్.

చేయుట యేది? యేది' మరిచేరుట కొన్నిదినంబులే గదా !
పాయక మిథ్యయౌ జగతి బామరవాంఛల గూడి యెంతయున్
గాయము గీము నర్థములుగా గల రాజ్యము లాదికల్మలున్
వేయును గల్గి యన్నిటిని వీడియ పోదురుగాదె నిచ్చలున్.

వంధ్యపుత్రుని యట్లు మాయంబెకాని
బంధువులు వీడుతరి దుఃఖబాహుళమును
నొంది నశియించి నశియించి మరలకుంభి
పాకనరకంబునందున బడుదురకట!

ఇట్లు రాజపుత్రుని వాక్యములు విని వారందఱి మోహము లేకుండుటను నిశ్చయించి ఆయోగి మిక్కిలి సంతసమును బొంది రాజపుత్రుని శ్లాఘించెను. ఇట్లు యోగులు శోకమోహములు లేకయుండుట తగినదగును.

78. పిమ్మట శ్రీగురువుగారు ముందు జెప్పిన అర్థ దృఢత్వముకొఱకు నొకపతివ్రతయొక్క ప్రసంగమును చెప్ప నారంభించెను.

ఒక బ్రాహ్మణుని భార్యయగు పతివ్రతా స్త్రీకి తనతండ్రి గృహమున పుత్రజన్మము కలిగెను. ఆమెను తనభర్త బండినెక్కించుకొని యింటికి బోవుచుండగా మార్గమధ్యమున నామెకు దాహము కలిగెను. అప్పు డా బ్రాహ్మణుడు జలముకొని తెచ్చుటకు బోయి యెండమావులను గని అట మిక్కిలి భ్రమగొని యుండెను, పిమ్మట బండితోగూడ వస్త్రాభరణములను దొంగలు కొనిపోయిరి. ఆమె మిక్కిలి రూపవతిగా నుండుటంజూచి వేటకు వచ్చిన యొక రాజామెను కొనిపోయెను. అటు పిమ్మట మామిడిమ్రానున గట్టియుండు వస్త్రమున నాడుచుండిన శిశువును గని అనేక యెద్దలమీద బరువు నెక్కించుకొని పోవువాడు ఒకవణిజుడు ఎత్తుకొనిపోయెను.

బ్రాహ్మణుడు మరలి వచ్చిచూడ నొకరును లేనందున వెదకు నిమిత్తము దేశదేశాంతరములు బిచ్చమెత్తుచు తిరిగెను. అతని ధర్మపత్ని "నేను కొంతకాలమువఱకు శైవవ్రతమొకటి గలిగియున్నాను. అది ముగియువఱకు పురుషసంగముకూడదు. క్రొత్తగా వచ్చిన వారికి లేదనక భోజనాదుల నిచ్చుచుండ వలయును నను సంకల్పము గలదు." అని చెప్ప రాజది విని అట్లే చేయుమని యంగీకరించెను.

ఒకనాడామె భర్తయగు బ్రాహ్మణు డటకు భిక్షకు వచ్చెను. అప్పుడా యిరువురకు పతిపత్నీత్వములు స్మరణకు వచ్చెను. అప్పు డా స్త్రీ భర్తకు పాకసామగ్రుల నిచ్చి నగరమునకు బయటనుండు శివాలయ మందుండుమని గుర్తించి పంపి తన వ్రతసమాప్తి తలంచి రాజునకు విందు చేయించి, రాత్రియందు విషము కలిపిన అన్నము పెట్టి వానిని జంపి వానియాభరణ వస్త్ర ఆయుధములు మొదలగు వానిని ధరించి గుఱ్ఱమెక్కి శివాలయమునకు వచ్చెను. అట పాముచే కఱవబడిన భర్తను జూచి యాతని భుజముమీద తీసికొని యేటిగట్టునకు పోయి యాప్రేతమును అగ్గిపెట్టి చెత్తచేమలు వేసి కాల్చి భూమియందు పూడ్చి స్నానముచేసెను. అప్పుడు నలుగురు దొంగలచటకి వచ్చి యన్ని సామగ్రులతో నామెను దేశాంతరము కొనిపోయిరి.

ఒకే పురుషుని సంగ మామెచే కోరబడినదను సంకేతముచే నామెను వారొక వేశ్యకు విక్రయముచేసిరి. అప్పుడామె దైవయోగమువల్ల వేశ్య యాయెను.

ఒకకాలమున నామెకొడుకు వ్యాపారమున కా నగరమునకు వచ్చెను. ఆమె యజమానురాలైన ముసలివేశ్యకు కావలసిన ధనమిచ్చి తనతల్లియగు వేశ్యదగ్గరకు బోయెను. అప్పుడామె స్తనములనుండి పాలుకాఱెను. దానిచే వాడామె తనతల్లి యని నిశ్చయించి యామెకు సాష్టాంగ నమస్కారముచేసి తనయిల్లు చేరెను. పిమ్మట పుత్రుడు భర్తగా వచ్చుటను జూచి యామె పశ్చాత్తాపముచే నేటిగట్టున వానిచే నిడబడిన చితియందు ప్రవేశించెను. అప్పుడు అకాలవర్షము కురిసి యామె అందుచే దహింపబడక యేటిప్రవాహమున కొట్టుకొనిపోబడి, దేశాంతరమున నొకగట్టునందు చేరెను. ఆమెను కనికరము గల గొల్లవాడొకడు తీసికొనిపోయి

తనయింటి కూతురువలె భావించి నుంచుకొనియుండెను. ఆమె యొకనాడు తక్కిన గొల్లస్త్రీలతో ప్రతిదినమువలె పెరుగమ్మబోయెను. త్రోవయందు నొక రాజకుమారుని గుఱ్ఱము దుముకుచు వచ్చెను. అందఱు గొల్లపడుచులు భయపడి క్రిందబడ వారి పెరుగుకుండలు పగిలినవి. వారందఱు నేడ్వ మొదలుపెట్టిరి. అప్పు డాకన్యకయగు పతివ్రతా స్త్రీ మాత్రము నవ్వెను. అప్పు డా గొల్లెతలలో నొకతె "పెరుగు పోయినందుకు మేమేడ్చుచుండ నీకు నవ్వెట్లు వచ్చె" నని తిట్టసాగెను. అందు కాకన్య-

హత్వా నృపం పతిమవేక్ష్య భుజంగదష్టం
దేశాంతరే విధివశాద్గణికాఽపి జాతా ।
పుత్రం పతిం సమధిగమ్య చితాం ప్రవిష్టా
శోచామి గోపగృహిణీ కథమద్య తక్రం ॥

"భూపతిని జంపితిని, మగడు భూరిభుజంగముచేత జచ్చెను. నేనాపదబొంది దేశాంతరమున నొకవేశ్య నయితిని. పుత్రుని పతియని చేరబోయి పాపముగట్టుకొని చితింబడి దగ్ధముగాక, నీటబడి చావక నిటగొల్లవానికి కాపురముచేయుదాన నైతిని. యోగోపగృహిణీ! ఈ పెరుగుకుండ పగిలినందుకు నవ్వక దేనికని యేడ్వబోదు" ననియెను.

79. శిష్యుని నిస్పృహుని (ఇచ్ఛలేని వానిగా) జేయుటకొఱకు

ఉదారస్య తృణం విత్తం శూరస్య మరణం తృణం ।
విరక్తస్య తృణం భార్యా నిస్పృహస్య తృణం జగత్ ॥

అను శ్లోకమునకు అర్థము చెప్పుచున్నాడు:- ఉదార పురుషునికి ద్రవ్యము తృణము. ధనాశ లేనందున, శూరునికి మరణము తృణముతో సమానము. శరీరమందాశ లేనందున విరక్తునకు భార్య తృణము. స్త్రీల యందిచ్ఛ లేనందున నిస్పృహునకు (నిజస్వరూపమందు నిలకడగల జ్ఞానికి) జగము (సకల ప్రపంచరూప బంధము దానిచే గుర్తించబడిన మోక్షము) తృణమగును. లోకమంతటియందును కోరిక లేనందున జ్ఞాని అతిశయ నిస్పృహత్వమును సూచించుటకు వాని

నీశ్లోకమందు నిస్పృహుడను పేరుచే చెప్పబడియున్నది.

80. 1. శిష్యుడా! చెప్పబడిన యీవిధ గురూపదేశము విని ఆ విన్న యర్థమును గ్రంథవిచార పూర్వకముగా వేదాంత అద్వైతమందు తాత్పర్య నిశ్చయరూప శ్రవణమును చేసి,

2. శ్రుతి యనుసరించిన ప్రత్యక్షప్రమాణము ఉపజీవమైన (ఆశ్రితమైన) అనుమాన, ఉపమాన (దృష్టాంత), అర్థాపత్తి, అనుపలబ్ధి ప్రమాణరూప, జీవబ్రహ్మల భేదమును బాధించునవియు, అభేదమును సాధించునవియు నయిన యుక్తులచేత అద్వైతబ్రహ్మ చింతనరూప మననము చేసి,

3. అనాత్మయందు మిథ్యాత్వబుద్ధిచేత అనాత్మాకారవృత్తుల తిరస్కార పూర్వకమయిన బ్రహ్మాభిన్న ఆత్మాకారవృత్తుల ప్రవాహరూప నిదిధ్యాసనము చేసి, అనగా మూర్తి మొదలగువాని ధ్యానమందు ఎట్లు గుఱ్ఱము మొదలగువాని నిరోధమును పోలు చిత్తనిరోధము కలుగుచున్నదో, యట్లు నిదిధ్యాసనమందు చిత్తనిరోధాపేక్ష లేదు. అయితే కథ వినుటయొక్క ప్రసంగముచేతను, విచారప్రసంగముచేతను, ఆకలిని పోగొట్టు భోజనమువలె, బుద్ధివినోదమునకు హేతువగు నాట్యదర్శనమువలె ఆసనము మొదలగువాని నియమము లేక నడచియును తిరిగియును, స్వరూపాకార వృత్తియొక్క అభ్యాసమూలమున నిదిధ్యాసనము సిద్ధించుచున్నది. కావున ఆవిధమైన నిదిధ్యాసనము చేసి,

4. సకల అనాత్మాకార వృత్తులును, సహజముగా నిరోధము కాగా బ్రహ్మాకారమగు చిత్తవృత్తియందు అహంప్రత్యయ స్ఫురణరూప సాక్షాత్కార మేదియో దానిని సంపాదించి,

5. అవిద్యారూప కారణాధ్యాసతో అహంకారము మొదలగువాని అధ్యాస రూపసంబంధ పరమార్థ దృష్టిచేత మూడుకాలములు లేని నిశ్చయరూపమును వ్యవహారదృష్టిచేత మిథ్యాత్వము, నిశ్చయరూపమును నగు ప్రతిపాదనము చేయబడినది.

ఇదియే సర్వానర్థ నివృత్తి యగుచున్నది. అర్థముచే పరమానందరూప బ్రహ్మ

ఆవిర్భావమును బొందెను. కావున వానికి జీవన్ముక్తి సిద్ధించెను.

తత్త్వంపద వాచ్యార్థ, లక్ష్యార్థములను జెప్పుటలో దానినైక్యమును నిరూపించుటయను నెనిమిదవ యుపదేశము సమాప్తము.

తొమ్మిదవ యుపదేశము.

శిష్యుని యనుభవమును జెప్పుట, ఇంటికి వెళ్లుట, సన్న్యాసముతో యోగమును జేకొనుట - అనువానిని చెప్పుటతో గ్రంథముయొక్క ఉపసంహారము.

81. ఇప్పుడు శిష్యుడు తన అనుభవమును గురువునొద్ద చెప్పువాడై, మొదట గురువుగారి యుపదేశమును *100 అనువదించుచున్నాడు.

శిష్యుడు చెప్పుచున్నాడు:- స్వామీ! తాము నాకు "తత్త్వమసి" యను మహావాక్యము నుపదేశించితిరి. దానిచే నేను నాస్వరూపము నెఱింగితిని. దానియందేమాత్రము సంశయము లేదు.

82. ఇప్పుడు శిష్యుడు తనయనుభవమును జెప్పుచున్నాడు:-. స్వామీ ! నేను దేశకాలవస్తువులచే పరిచ్ఛేదము లేనివాడనై యుండుటచే పూర్ణుడనై యున్నాను. (అనంతుడనై యున్నాను)

2. మిథ్యయైన ఉపాధిచే నయిన విలక్షణధర్మములు లేక యుండుటచే నిర్విశేషరూపమై యుండుటచే ఆకాశమువలె ఏకరసముగా నున్నాను.

3. సజాతీయ (సమజాతి కలిగియుండుటతోను) సంబంధము, విజాతీయ (అన్యజాతి గలిగియుండుటతో నున్న) సంబంధము స్వగత అవయవములతో నున్న) సంబంధమను సంగమును లేక దేహాదులందున్న అహంకారమున్ను ఇల్లు మొదలగువాని యందుండు మమతయునగు సంగమును

4. జన్మము, అస్తిత్వము (ముందు లేనిదై పిమ్మట నుండునది)

---

*100. ముందుచెప్పిన యర్థమును మరియు చెప్పుట అనువదించుట యగును.

పెరుగుటలు, తిరుగుట(మారుట), తక్కువ, నాశము అను నారువికారములగు నివిలేని అసంగుడును నిర్వికారుడు (కూటస్థుడు)నై యున్నాను.

5. మరియు సజాతీయ స్వగతభేదము లేనివాడనై యుండుటచేనైనను లేక మాయ, అవిద్య, దానికార్యమగు నామరూపమను ఉపాధులచే కల్పింపబడిన **1.** జీవేశ్వరబేదము, **2.** జీవుల పరస్పరభేదము, **3.** జీవజడముల భేదము, **4.** జడజడముల భేదము 5. జడ ఈశ్వరభేదము అను నైదు భేదరూపవస్తు పరిచ్ఛేదము లేనివాడనై యుండుటచేత నైనను నేను అఖండుడనై యున్నాను.

6. మఱియు నేను నిజసుఖ (ఆనంద) రూపముగా నున్నాను. ఈవిచారము నాకు దృఢమయి యున్నది.

83. శిష్యుడు పూర్వము జ్ఞానమందలి ఆశకాలమున గురువునొద్ద తనస్వరూపమునకు వేఱుగా ఈశ్వరత్వమును అంగీకరించి యుంటిని. పిమ్మట జ్ఞానకాలమున అతనియొద్ద తనస్వరూపమున కభిన్నమగు బ్రహ్మత్వమును నిశ్చయము చేసియున్నాను అనుటను నిప్పుడు ప్రకటన చేయుచున్నాడు-

స్వామీ! తామెక్కడును పరిపూర్ణమయిన అద్వైత ఆత్మారాముడై యున్నారు. పిమ్మట ఆదియందును, అంతమందును మధ్యను ఏకమై యున్నారు. తామే సుఖస్వరూప బ్రహ్మమై యున్నారు.

84. 1. స్వామీ! మునుపు అజ్ఞానదశయందు నాకీ లోకవ్యవహారముకొఱకు కృషి, వాణిజ్యము మొదలగునవి చేయవలసియుండెను.

2. లేక పరలోకముకొఱకు సకామకర్మము సకామోపాసన మొదలగు నవియు జేయవలసియుండెడివి.

3. చిత్తశుద్ధి యేకాగ్రతలకొరకు నిష్కామకర్మము నిష్కామోపాసనయు నగు కర్తవ్య ముండెడిది.

4. వేదాంతశ్రవణము మొదలగువాని యధికారముకొఱకు వివేకము, వైరాగ్యము మొదలగు సాధనసమూహము చేయవలసియుండెడిది.

5. అపరోక్ష జ్ఞానోత్పత్తికొఱకు గురుముఖమూలమున తత్త్వమసి మొదలగు మహావాక్యముల అర్థోపదేశరూప అంగి (సాధ్య) శ్రవణము చేయవలసి యుండెను.

6. సంశయ విపరీతభావనా రూపజ్ఞాన అదృఢత్వమునకు హేతువయిన దోషముల నివృత్తికొఱకు శ్రవణ మనన నిదిధ్యాసనములు చేయవలసియుండెను.

7. తత్పదార్థమునందు పరోక్షత్వ భ్రాంతిని త్వంపద అర్థమునందు పరిచ్ఛిన్నత్వపు భ్రాంతిని నివృత్తిచేయు నిమిత్తము "బ్రహ్మము నేను, నేను బ్రహ్మము" అనునదైన ఓతప్రోతభావము (వ్యధికారము) చేయవలసియుండెను.

8. మోక్షముకొఱకు ముందు చెప్పిన సాధనములచే దృఢ అపరోక్షజ్ఞానమును సంపాదించుట చేయవలసియుండెను.

ఆ యన్ని కృత్యములును నిపుడు దృఢ అపరోక్షజ్ఞానము సిద్ధి బొందగా చేయబడినవాయెను.

కోరినయూరికి పోయిచేరిన పథికునకు (త్రోవబోవువాడు) త్రోవయందున్న నానేకములగు నడచుట మొదలగు ప్రయత్నరూప కర్తవ్యముండినది లేదు. అట్లే నాకును జ్ఞానప్రాప్తిచే నీలోక పరలోకముల యందిచ్ఛ భంగము కాగా సకల సాధనముల పూర్ణత్వమును ముక్తియు సిద్ధించెను. కావున మోక్షము కొఱకైనను జ్ఞానము కొఱకైనను జేయవలసిన దొక్కటియు లేదు.

శాస్త్రవిధి నిషేధరూప ఆజ్ఞచే నేసాధనము చేయబడుచున్నదో యది కర్తవ్య మనబడుచున్నది.

విధి నిషేధమును చేకొనుట లేక తనయిచ్ఛనే వేదాంతవిచారము మొదలగు సాధనములు చేయబడుచున్నవో యవి కర్తవ్యము కాదు. కావున

ఇప్పుడు విధినిషేధరూప ఆజ్ఞయొక్క అంగీకారము లేక తనయిచ్ఛచే బ్రహ్మవిచారము మొదలగు శాస్త్రములచే చెప్పబడిననే యాచరణ (నడవడు)లను నేను జేయుదునో యవియు కర్తవ్యములు కావు. కావున నేను వేనిని జేయవలసి యుండెనో, యవియన్నియును జేయబడెను. దీనిచే నేను కృతకృత్యుడనైతిని.

పూర్వము, 1. ఐహిక (ఈలోక) సుఖము, 2. పారలౌకికసుఖము 3. లేక చిత్తశుద్ధి 4. లేక ఏకాగ్రత అర్థము 5. లేక దృఢ అపరోక్ష జ్ఞానమర్థము 6. సంచిత అగామికర్మములు జన్మ మొదలగు కార్యములతో అవిద్యానివృత్తియు పరమానందరూప బ్రహ్మముయొక్క ప్రాప్తియునగు అర్థము-అనునివి నాకు పొందవలసినవియై యుండెను. అవన్నియు నిప్పుడు జ్ఞానప్రాప్తిచే బొందబడిన వాయెను. కావున నిప్పుడు నాకిష్టమయిన యూరిని జేరిన పురుషునివలె బొందవలసిన దేదియు లేదు. దీనిచేతనే నేను ప్రాప్తప్రాప్యుడ (కృతార్థుడ) నయితిని.

కావున తమదయచే నిప్పుడు నాకొక సాధనమును చేయవలసినది లేదు. ఒక దేవతారూపముచే నయినను లేక భగవంతుని ప్రక్కల యందుండువారి రూపములచేనైనను, లేక నిత్యప్రాప్తమగు బ్రహ్మరూపముచేనైనను, లేక వేరురూపముచే నైనను ఒక్కటియు కావలసినదిలేదు. అది "విషయములచే నేతృప్తి కలుగుచున్నదో, యది సాంకుశ మగును. (అడ్డు గలదగును) ఈఅపరోక్షజ్ఞానముచే గలిగిన తృప్తి నిరంకుశమగును (అడ్డులేనిదగును) కావున నేది చేయదగినదై యుండినదో, యదిచేయబడినది. ఏది పొందదగినదిగా నుండినదో యది పొందబడినది అని యిట్లు జ్ఞాని తృప్తిని పొందుచున్నాడు. 1. వీనికి (జ్ఞానికి) పూర్వము (అజ్ఞానకాలమందు) ఈలోకపరలోక సంబంధమైన భోగముల సమూహము సిద్ధించుటకై ముక్తి సిద్ధించుటకును బహుకృత్యములు (కర్తవ్యములు) నుండెను. అవన్నియు నిప్పుడు (జ్ఞానముదయించిన పిమ్మట) చేయబడినవి" (2) అనునది యగును.

85. ముందు చెప్పిన ప్రకారము కృతకృత్యత్వముచేతను. ప్రాప్తప్రాప్యత్వము చేతను తృప్తుడైన విద్వాంసుడైన శిష్యుడు తన మనసుచే నెట్లు (పైజెప్పిన విధముచే) మతించుచున్నాడో అట్లే గురువునొద్ద మాటలమూలమున నివేదించుచున్నాడు.

1. దేవా! నేను తన ఆత్మను *101 పేరు, జాతి, మొదలగు వానిని నెఱుగుట

*101. అజ్ఞానియగు పురుషుడు దృఢముగా నభ్యసింపబడిన తనశరీరముయొక్క పేరు, జాతి మొదలగువానిని విచారములేక యెఱుగుచున్నాడు. స్వప్నమందును మఱచుటలేదు.

(cont...)

వలె అనాయాసముగా నెప్పుడును అపరోక్షముగా నెఱుగుచున్నాను. కావున నాజ్ఞానముచే నేను ధన్యుడనైతిని; ధన్యుడనైతిని.

2. సార్వభౌముడు మొదలు హిరణ్యగర్భరూప బ్రహ్మపర్యంతము గల సంసారసుఖ మేదియో యది దేని లేశ (ఆభాస)ముగా నున్నదో యావిధ బ్రహ్మానందము నాకు బహిరంగముగా తెలియుచున్నది. కావున ఆబ్రహ్మానందపు చక్కని స్ఫురణచేత నేను ధన్యుడనైతిని.

3. సంసార సంబంధమైన దుఃఖమును నేనిప్పుడు చూడనందున ఆ సంసారదుఃఖ దర్శనము నాకు లేనందున నేను ధన్యుడనై యున్నాను.

4. పర్వతగుహయందున్న బహుకాలపు చీకటి దండముచే గొట్టుట మొదలగు వేఱుప్రయత్నములచే పరుగెత్తుట లేదు. అయినను దీపముండిన తక్షణమే పరుగిడుచున్నది. అట్లు ఆత్మయొక్క అజ్ఞానము, కర్మ, ఉపాసన మొదలగు కోటియుపాయములచేతను బోవుటలేదు. అయినను "సకల జగమున్ను నేనును బ్రహ్మము'' అను నాకారముగల దృఢ అపరోక్షజ్ఞానముచే తక్షణమే పరుగెత్తును.

ఆ యజ్ఞాన నాశము నాకు జ్ఞానముచే సిద్ధించినది. కావున నా యజ్ఞానము పోగా నేను ధన్యుడనైతిని.

5. విధినిషేధ రూపశాస్త్ర వచనముచే గలిగిన విహిత (శుభ) కర్మముల పుణ్యరూప అపూర్వము మూలమున స్వర్గము మొదలగు నిష్టఫలప్రాప్తియొక్క సంభావనా (జరుగుట) రూప గుణబుద్ధియు, నిషిద్ధ కర్మమందు పాపరూప అపూర్వము మూలమున నరకము మొదలగు అనిష్ట ఫలప్రాప్తియొక్క సంభావనా రూపదోషబుద్ధియు నయిన యా రెండు బుద్ధులచేతను విహితకర్మమున ప్రవర్తించియు, నిషిద్ధకర్మమునుండి నివృత్తి పొందుటయు నయిన ఏక్రియ గలుగుచున్నదో అది కర్తవ్య మనబడుచున్నది. తనయిచ్ఛచే లౌకిక వైదికకర్మలు

దానివలె దేహమందు ఆత్మజ్ఞానమును బాధించి నాకు ఆత్మయందు దృఢ అపరోక్షజ్ఞాన మున్నది అనునది యర్థమగును. ఇందు జ్ఞానియొక్క అవధి చెప్పబడినది.

చేయబడుచున్నవో అవి కర్తవ్యములు కావు. ముందుచెప్పిన విధమగు కర్తవ్యము ముందు (84-వ ప్రసంగమందు) జెప్పబడిన విధమున నాకు నివృత్తి యైనందున కర్తవ్యము తీరినందున నేను ధన్యుడనైతిని.

6. ఎట్లు వృథివియందంతయు గల వాపీకూప తటాకాదులందు స్నానపానాది ప్రయోజనము గలుగుచున్నదో అంత ప్రయోజనమున్ను శుద్ధోదక (మధురజల) సముద్రమునందు సిద్ధించుచున్నది. ఎట్లు పది బంగారునాణెములు మొదలు ఏబది నాణెములవరకు దొరుకుటవలన పైగా పైగా గలుగు ఆనందము అంతయు నూఱునాణెములు దొరుకుట వలన సిద్ధించుచున్నదో అట్లే అనేకవిధ నకామకర్మ ఉపాసనాది సాధనములచే బొందబడు స్వర్గవైకుంఠములు బ్రహ్మలోకము మొదలగు ప్రయోజనములను పొందుటచేతనే తారతమ్య సుఖములు కలుగుచున్నవో- అవియన్నియు బ్రహ్మానంద ప్రతిబింబములై యుండుటవలన దానియందు అణగియుండునవి యగును. కావున ఆబ్రహ్మానందము పరమ ప్రయోజన మగును, అది దేనిచే నాకు తనస్వరూపముగా బ్రహ్మానందమును నెరుగుటచేతనే సిద్ధించినదో దానిచే నాబ్రహ్మానందరూప ప్రాప్తియొక్క సిద్ధిచే నేను ధన్యుడ నయితిని.

7. రాజు మొదలు బ్రహ్మలోక పర్యంతము గల విషయములచే కలుగు తృప్తి తనకంటె అధికమయిన వేఱువిషయ ఇచ్ఛారూప అంకుశముతో గూడినదిగా నుండుటచే సాంకుశతృప్తి యగును. ఆనందరూప బ్రహ్మమున కభిన్నమయిన ఆత్మజ్ఞానముచే గలుగుతృప్తి ముందుచెప్పిన అంకుశము లేనిదై యుండుటచే నది నిరంకుశ తృప్తి యగును. అందుచే నాతృప్తి ఉపమానము లేని దగును. కావున నా నిరుపమాన నిరంకుశతృప్తి లాభముచే నేను అడుగడుగున ధన్యుడనై యున్నాను.

8. జ్ఞానమును హేతువయిన నిష్కామకర్మచే గలుగు సంస్కార రూపనైపుణ్యము దేనిచే దృఢముగా ఫలించియున్నదో అందుచే నది అతిశయ మగును.

9. ఈపుణ్యసంబంధముచే నేనందటికంటెను శ్రేష్ఠుడనై యున్నాను.

10. ఈవేదాంత శాస్త్రమున్ను, గురువున్ను, జ్ఞానమున్ను నిరతిశయమగును.

11. జ్ఞానముచే బయలుపడిన బ్రహ్మానందము నిరవధి (ఎల్లలేనిది) యగును.

86. ఇప్పుడు శ్రుతియందు చెప్పిన హృదయగ్రంథి, సంశయగ్రంథి, కర్మగ్రంథి అనుభేదములచే మూడువిధములైన గ్రంథులు గలవు. వానికి జ్ఞానముచే నివృత్తిని శిష్యుడు చెప్పుచున్నాడు.

1. దేవా! ఎప్పుడు (ఏక్షణమందు) నేను పరబ్రహ్మదర్శనమందు సమర్థుడైతినో- అప్పుడు నాబుద్ధి, ఆత్మల తాదాత్మ్య అధ్యాసరూప హృదయగ్రంథి (చిజ్జడగ్రంథియు దానిజ్ఞానమగు విపరీత భావనయును) భేదింపబడినవి. (నాశము చేయబడినవి)

బుద్ధి (అహంకార) చిదాత్మల తాదాత్మ్య అధ్యాసరూప హృదయగ్రంథి యేదియో యది వేఱుకార్యరూప హృదయగ్రంథులకు కారణమగును. అది దేనిచే తీరినదో దానిచే కార్యరూప హృదయ గ్రంథియు తీరినది. "నాకిది కలుగుగాత, నాకిది కలుగుగాక" యను ఇచ్ఛావృత్తి యేదియో యది శ్రుతియందు జెప్పబడిన "కామ" శబ్దవాచ్యమగును. దానికి (ఇచ్ఛావృత్తికి *102 ఆశ, తృష్ణ, కామన, వాంఛ, లోభము, దీనత్వము మొదలగు భేదములు గలవు. ఆ ఇచ్ఛావృత్తులు కార్యరూప హృదయగ్రంథు లగును. అవియు నాశమయినవి కావున ఇప్పుడు అహంకార ధర్మమగు కామము మొదలగు వృత్తులుదయ మయినవి. వాటియందు చిదాత్మను

---

*102. పరులచే రాబోవుకాలమున బొందదగిన వస్తువుయొక్క యిచ్ఛ యేదియో యది ఆశయమగును. పొందినయర్థము వృద్ధిపొందవలెనన్న ఇచ్ఛ తృష్ణయగును. పొందిన యర్థమును అనుభవింపవలెనను ఇచ్ఛ కామమగును. దీనినే కామమందురు. వర్తమానకాలమున పొందదగిన యర్థమునందు ఇచ్ఛ యేదియో యది వాంఛ యగును. దొరికిన ధనము మొదలగువానిని సెలవుసేయక యుండవలెనను ఇచ్ఛ లోభపత్నియగు కృపణత్వము అగును. ఇతరులచే వర్తమానకాలమందు పొందదగిన వస్తువును పొందవలయునను ఇచ్ఛ దీనత్వము. దీనినే లోభమనియు చెప్పుదురు. ఇవన్నియు ఒకే యిచ్ఛయొక్క భేదము లగును.

ప్రవేశింపనీక (వానిని చిదాత్మధర్మములుగా చేకొనక) కామము మొదలగు ధర్మముల అహంకారమును చిదాత్మకు వేఱగు మిథ్యారూప మన దెలిపి ప్రారబ్ధదోషముచే నేను కోటివస్తువులను ఇచ్ఛించుచున్నాను, ఇచ్ఛించినను నాకు బాధకము లేదు.

2. నా సకల సంశయములును దీరినవి. "ఇది రజ్జువా లేక సర్పమా" అను రెండుపక్షముల (యథార్థ అయథార్థమను రెండు పక్షములను విషయముచేయు) జ్ఞానము సంశయ మనబడుచున్నది. ఆ సంశయము ఆత్మయందుండునది, అనాత్మయందుండునది అనుభేదములచే రెండువిధములు. వానియందు అనాత్మయందుండు సంశయము ఉండును. లేకపోవును. దాని నివృత్తి అవశ్యము లేదు.

1. ఆత్మయందుండు సంశయమేదియో యందుండు 1. ప్రమాణగత సంశయము 2. ప్రమేయగత సంశయము అను భేదములచే రెండువిధములు

1. ఉపనిషద్రూప వేదాంతవాక్యము భేదమును ప్రతిపాదించునదా?

2. లేక అద్వైతమును ప్రతిపాదించునదా?

3. లేక వేఱుఅర్థము చెప్పునదా? అను ఆకారముగల ఆఱులింగ రూపయుక్తులచే వేదాంత తాత్పర్యము నిశ్చయరూప శ్రవణము చేయుటకు పూర్వమే ఏయే సంశయము కలుగుచున్నదో అదే ప్రమాణ గత సంశయము.

2. వేదాంతరూప ప్రమాణముచే తెలియదగిన మోక్షము మొదలగు పదార్థము లేవియో యవన్నియు ప్రమేయ మనబడుచున్నవి. వాని స్వరూపము నందు నేసంశయము గలదో యది ప్రమేయగత సంశయ మన బడుచున్నది. ఆ ప్రమేయగత సంశయము విషయభేదముచే ననేకవిధములు.

(అ) "సర్వదుఃఖనివృత్తియు పరమానందరూప బ్రహ్మప్రాప్తియునగు-

1. ఇదియే *103 మోక్షమగునా?

(2) లేక *104. తక్కిన త్రివిధ దుఃఖముల నాశమా?

(3) లేక *105. ఇరువదొక్కటి దుఃఖముల నాశమా?

(4) లేక *106. పంచక్లేశముల నాశమా?

(5) లేక *107. స్వర్గ వైకుంఠములు మొదలగు విషయసుఖపు లాభమోక్షమా?

ఈ విధముగా మోక్షస్వరూపమందు సంశయములు గలవు. అవి ప్రయోజనరూప ప్రమేయగత సంశయము లగును.

(ఆ) సకల అనర్థముల నివృత్తియు పరమానంద ప్రాప్తియు మోక్షమనుకొన్న.

(1) ఆ మోక్షమునకు సాక్షాత్తు సాధనము *108 కర్మమా?

(2) లేక *109 ఉపాసనయా ?

(3) లేక *110 కర్మ ఉపాసనలతో గూడిన జ్ఞానమా ?

(4) లేక *111 కేవల జ్ఞానమా ?

(5) కేవల జ్ఞానమన్న *112 భేదజ్ఞానమా *113 అభేదజ్ఞానమా?--

అను నీ మొదలగు సంశయములు మోక్షసాధన మందున్నవి. అవి సాధనరూప ప్రమేయగత సంశయము లగును.

(ఇ) మోక్షముయొక్కసాధనము అభేదజ్ఞానమే యనిన

---

*103. ఇది సిద్ధాంతపక్షము. *104. ఇది సాంఖ్యమతము. *105. ఇది న్యాయమతము *106. ఇది యోగమతము. *107. ఇది కర్మిష్ఠుల లేక ఉపాసకుల మతము. *108. ఇది మీమాంసకుల (కర్మిష్ఠుల) యొక్క మతము. *109. ఇది ఉపాసకుల మతము. *110 ఇది సముచ్చయవాది మతము. *111. ఇది సాంఖ్యులు నైయాయికులు మొదలగువారి మతము. *112. ఇది సాంఖ్యులు మొదలగు భేదవాదుల మతము. *113. ఇది సిద్ధాంతపక్షము.

(1) ఆ యపరోక్షజ్ఞానముఖ్య (సాక్షాత్తు) అంతరంగసాధనము కర్మోపాసనలా?

లేక వివేకము మొదలగు నాలుగా? లేక శ్రవణాదులు మూడా లేక పదార్థ శోధనయా? లేక మహావాక్య ఉపదేశమా?

(2) జ్ఞాన బహిరంగ సాధనము శ్రవణాదులా? లేక వివేకము మొదలగునవియా? లేక కర్మ మొదలగునవియా?

ఇవి మొదలగు సర్వసంశయములు జ్ఞానసాధన నిర్ణయమందున్నవి. అవి సాధనరూప ప్రమేయగత సంశయ మగును.

(ఈ) అపరోక్ష జ్ఞానముఖ్య అంతరంగసాధనము మహావాక్య ఉపదేశ మనియు, వివేకాది యెనిమిదిటిని అణచిన (పరంపర) అంతరంగ సాధనమనియు, యజ్ఞాదికర్మలు బహిరంగ సాధనములనియు ననిన,

(1) అజ్ఞాన విషయము *114 భేదమా? లేక *115 అభేదమా?

(2) అభేదమనిన ఆత్మకును బ్రహ్మమునకును *116 అభేదమా? లేక అంతఃకరణ విశిష్టచేతనరూప జీవునకును విరాట్టు లేక హిరణ్యగర్భుడు లేక అంతర్యామియను ఈశ్వరునకును *117 అభేదమా ?

-ఇవి మొదలగు సంశయములు జ్ఞానముయొక్క విషయమందున్నవి. అవియు ప్రమేయగత సంశయము లగును.

(ఉ) ఆత్మకును బ్రహ్మమునకును గల అభేదమే జ్ఞానవిషయమన్ననో,

(1) ముందుచెప్పిన ఆత్మ స్థూలదేహముకంటె *118 భిన్నమా ? లేక *119 అభిన్నమా?

---

*114. ఇది సాంఖ్యులు, నైయాయికులు మొదలగు భేదవాదుల మతము. *115. ఇది వేదాంత సిద్ధాంతము. *116. ఇది ఉపనిషత్తుల సిద్ధాంతము. *117. ఇది అహంగ్రహ ఉపాసకులమతము. *118. ఇది సకల ఆస్తికుల మతము. *119. ఇది చార్వాకలోకాయతుల (దేహాత్మ వాదుల) మతము.

(2) భిన్నమయినను నది *120 జడమా? లేక *121 చేతనమా? లేక *121 జడ చేతనమను రెండునా।

(3) చేతనమనినను అది *123 కర్తాభోక్తయా లేక *124 అకర్తా అభోక్తయా?

(4) అకర్తా అభోక్తా యంటేను అది దేహాదుల అహంకార మమకారరూప *125 సంగము గలదియా? లేక *126 అసంగమా?

(5) అసంగమైనను అది *127 అణు పరిమాణమా ? (రోమముయొక్క వేయింట నొకభాగ సూక్ష్మమా) లేక *128 మధ్యమ పరిమాణమా? (దేహమంతయా?) లేక *129 మహత్పరిమాణమా (పరిపూరణమా?)

(6) మహత్పరిమాణము గలదయినచో, దానికి తత్పదార్థముతో *130 భేదమున్నదా లేక *131 అభేదమున్నదా? ఇవి మొదలగు సంశయములు త్వంపదార్థమందు గలవు. అవియు ప్రమేయగత సంశయము లగును.

(ఊ) ముందు చెప్పిన ఆత్మ తత్పద అర్థముతో అభిన్న మయినను

(1) ఆయాత్మ తత్పదవాచ్యార్థరూప *132 ఈశ్వరునికన్న అభిన్నమా? లేక యా యీశ్వర భావమునకు అధిష్ఠాన మయిన తత్పద లక్ష్యార్థ రూప *133 శుద్ధబ్రహ్మముతో అభిన్నమా?

(2) లక్ష్యార్థముతో అభిన్నమయినను, జగమునకు కారణము *134 ప్రధా

---

*120. ఇది నైయాయిక ప్రభాకరుల మతము. *121. ఇది సిద్ధాంతపక్షమును సాంఖ్యమతమును యోగమతమును నగును. *122 ఇది భట్టుల మతము. *123. ఇది న్యాయమతము. *124.ఇది సాంఖ్య వేదాంతమతము. *125. ఇది ఉపాసకులు మొదలగువారి మతము. *126. ఇది సిద్ధాంత సాంఖ్యుల మతము. *127. ఇది కొన్ని నైయాయిక ఉపాసకుల మతము. *128. ఇది నవీన నైయాయికుల దిగంబరుల మతము. *129. ఇది సిద్ధాంతము. సాంఖ్యము, యోగము, న్యాయము, వైశేషికము, ప్రభాకరము, భట్టము అనువాని మతము. *130. ఇది నైయాయికులు మొదలగు భేదవాదులమతము. *131. ఇది సిద్ధాంతపక్షము. *132. ఇది అహంగ్రహ ఉపాసకుల మతము. *133. ఇది సిద్ధాంతపక్షము. *134 ఇది సాంఖ్యులు (cont...)

నాదులా? లేక తత్పద వాచ్యార్థమయిన *135 ఈశ్వరుడా?

(3) ఈశ్వరుడైనను ఆ యీశ్వరుడేక దేశమందుండు వాడగుటచే *136 పరిచ్ఛిన్నుడా? *137 వ్యాపకుడా?

(4) వ్యాపకుడైనను గోలోకము మొదలగు చోట్ల *138 లీలా విగ్రహము గొనినవాడై వ్యాపకుడా? లేక *139 ఏకరస వ్యాపకుడా?

(5) ఏకరస వ్యాపకుడైనను ఆజగమునకు *140 ఉపాదానకారణుడా?

లేక నిమిత్త *141 కారణుడా? లేక సాలెపురుగువలె స్వప్నమునకు హేతువైన సాక్షివలెను *142 అభిన్ననిమిత్తోపాదానకారణుడా?

(6) అభిన్ననిమిత్తో పాదానకారణు డయినను-

అతడు జీవుల కర్మాపేక్ష లేనివాడై సృష్టిని *143 చేయువాడై యుండుటచే విషమముగా జేయుట మొదలగు దోషముతో గూడినవాడా?

లేక కర్తయొక్క అపేక్ష గలవాడై యుండుటచే, సృష్టియొక్క *144 కర్త యగుటచే, విషమత్వము, దయాళుత్వము లేమి రూపదోషములు లేనివాడై యున్నాడా?

(7) కర్మాపేక్షరూప కర్తగా నుండుటచే విషమముగా చేయుదోషము లేనివాడైనను ఆ యీశ్వరుడు పరమార్థముగా మాయాశక్తి దానిధర్మములగు

మొదలగువారి మతము. *135. ఇది వేదాంతుల నైయాయకుల మతము. *136. ఇది కొందరు ఉపాసకుల మతము. *137. న్యాయయోగ వేదాంతుల మతము. *138. ఇది వల్లభాచార్యమతము. వల్లభమతమందు ఈశ్వరుడు (అంతర్యామి నానాగాను జీవునివలెనే సాదియు (ఉత్పత్తియు) పరిచ్ఛిన్న (అణురూప) ముగా కొనియున్నారు. అయినను ఇట ఈశ్వరశబ్దముచే వారు చేకొనియుండు పరబ్రహ్మము (పూర్ణ పురుషోత్తముడు) చేకొనబడును.

*139. ఇది సిద్ధాంతపక్షము. *140. ఇది యొక ఉపాసకుల మతము. *141. ఇది న్యాయము యోగము మొదలగువారి మతము. *142. ఇది సిద్ధాంత పక్షమున్ను వల్లభుడు మొదలగువారిమతము. *143. ఇది భక్తజనుల మతము. *144. ఇది వేదాంతుల మతము.

సర్వజ్ఞత్వము మొదలగునవి కర్మయగు సృష్టి మొదలగునవి యను *145 కల్పనలతో గూడినవాడా?

లేక *146 అకల్పనలు లేనివాడా?

(8) అవి లేనివాడైనను అతడు ముందు చెప్పిన ఆత్మకంటె *147 భిన్నుడా? లేక *148 అభిన్నుడా? ఇవి మొదలగు సంశయములు తత్పదార్థమందున్నవి. అవియు ప్రమేయగత సంశయము లగును.

(ఎ) ఏ తత్పదార్థ లక్ష్యార్థమగు శుద్ధబ్రహ్మము త్వంపద లక్ష్యార్థమగు ఆత్మతో అభిన్న మయినను,

(1) ఆ బ్రహ్మాత్మయొక్క ఏకత్వమేదియో యది *149 మోక్షకాల మందుండునదియా? లేక *150 ఎప్పుడును నుండునదియా?

(2) ఎప్పుడును ఏకత్వము గలదైనను ఆయేకత్వము సచ్చిదానందరూప *151 ఐశ్వర్యములు లేనిదియా? లేక *152 ఐశ్వర్యముతో గూడినదా?

(3) సచ్చిదానందైశ్వర్యముతో గూడినదైనను ఆ సచ్చిదానందము మొదలగునవి *153 గుణరూపమా లేక బ్రహ్మాత్మయొక్క *154 స్వరూపమా?

(4) స్వరూప మయినను వాని కొకదానికొకటి భేదము చెప్పుట కలుగు చున్నది. ఆ భేదము వాస్తవమా? లేక కల్పితమా? ఇవి మొదలగు సంశయములు తత్పదార్థమున కభిన్నమయిన త్వంపదార్థమందున్నవి. అవియు ప్రమేయగత సంశయము లగును.

పై జెప్పిన వానిచే శ్రవణమననములచే క్రమముగా నివృత్తి బొందదగినదగు

---

*145. ఇది ఉపాసకులు మొదలగువారిమతము. *146. ఇది సిద్ధాంతపక్షమున్ను యోగమతమునగును. *147. ఇది యోగమతము. *148. ఇది సిద్ధాంతపక్షము *149. ఇది భక్స్యప్రపంచ (ప్రాచీన వృత్తికారుల) మతము. *150. ఇది సిద్ధాంతపక్షము. *151. ఈపక్షము ఏభేదవాదికిన్ని ఇష్టము గలది కాదు. *152. ఈపక్షము సకల అభేదవాదు (వైదికులు) లకు నిష్టమయినది. *153. ఇది నైయాయికులు మొదలగు ఆత్మ జడత్వ వాదులమతము *154. ఇది సిద్ధాంతి మొదలగువారి మతము.

ప్రమాణగత ప్రమేయగత సంశయము లేవియో యవి యన్నియు బ్రహ్మ సాక్షాత్కారము కాగానే క్షీణించుచున్నవి.

ముందు చెప్పిన ద్వివిధ సంశయములును శ్రవణమననములచే నశించు జ్ఞానముచే వాని నివృత్తి సంభవింపక పోయినను శ్రవణమననములచే నివృత్తి చెందిన సంశయములకు అవిద్యారూప కారణ ముండుటవలన మరల అవి ఉత్పత్తి యగుచున్నవి. జ్ఞానము కలిగిన పిమ్మట అవిద్య నాశమగుటవలన ఆ సంశయ ములు మరల ఉత్పత్తి యగుట లేదు. కావున జ్ఞానముచేతను సంశయముల నివృత్తి చెప్పుట సంభవించుచున్నది. సంశయనివృత్తియందు ఉపయోగమగు ననేక శాస్త్రముల వాక్యములగు ప్రమాణములును ఉక్తులును గలవు.

నాజన్మ మొదలగు దుఃఖములకు కారణమగు కర్మ లేవియో యవి యన్నియు జ్ఞానాగ్నిచే నష్టమయినవి.

ఇట ఇది తాత్పర్యము:- (1) సంచితము (2) ప్రారబ్ధము (3) ఆగామి యను భేదములచే కర్మములు మూడువిధములు.

(1) వ్యవసాయము చేయువాడు మొదటి సంవత్సరమున పండిన ధాన్యము లను పాత్రలలో చేర్చిపెట్టును.

(2) దానినుండి యాహారముకొరకు కొంచెము ధాన్యము తీసి కుదిటియం దుంచును. దానినుండి యెత్తి భుజించుటకును చేలయందు విత్తుటకు నుపయోగించును.

(3) మరల దానియందు పండిన ధాన్యములను గరిసెలయందు బోయును.

(1) అట్లే జన్మాంతరముల ఆగామి కర్మము లేవియో యవి అంతఃకరణ ఉపహిత సాక్షియందుండు అజ్ఞాన ఆవరణ శక్తిరూపమైన గరిసెలయందున్నవి. ఆకర్మములు సంచిత మనబడుచున్నవి.

(2) వానినుండి సమయభేదములచే పరిపక్వమయిన నొకకర్మ ఈశ్వరేచ్ఛ వలన నీవర్తమాన శరీర మారంభమై సుఖదుఃఖములచే భోగరూపఫలము

నిచ్చుచున్నది. అజ్ఞాన విక్షేపశక్తిరూప ఆశ్రయమందున్నది. ఆకర్మము ప్రారబ్ధ మనబడుచున్నది.

(3) ప్రారబ్ధకర్మచే నయిన భోగమును ననుభవించుచు వర్తమాన భావికాలముల భోగముల సంపాదించు నిమిత్తము ఈవర్తమానదేహమునందు ఏకర్మము కలుగుచున్నదో అదియుగాక ప్రారబ్ధరూప సంస్కారము లేక రాగ ద్వేషాది శుభాశుభ వాసనారూప సంస్కారము దేని ఉత్పత్తియందు నిమిత్తమో-

(అ) భ్రమజతాదాత్మ్యము (అహంకారమునకు సాక్షితోనుండు తాదాత్మ్యము)

(ఆ) సహజతాదాత్మ్యము (అహంకారమునకు చిదాభాసునితోడి తాదాత్మ్యము)

(ఇ) కర్మజతాదాత్మ్యము (అహంకారమునకు స్థూలదేహముతో గల తాదాత్మ్యము)-అను భేదములచే అహంకార తాదాత్మ్యములు మూడువిధములు. వానియందుండు మొదటిది భ్రమజతాదాత్మ్యము ఏదియో దానియందు (దాని యాశ్రితమయి) ఏది నెలకొనియున్నదో ఆవిధకర్మము ఆగామి యనబడును.

ముందుచెప్పిన మూడువిధముల కర్మలలో జ్ఞానులకు

(1) సకలసంచిత కర్మలును జ్ఞానాగ్నిచే నాశమగుచున్నవి. ఏలయన తనయాశ్రయ మయిన అజ్ఞాన ఆవరణశక్తి యేదియో యది నాశమయినది, కావున ఆశ్రయము లేనందున సకలసంచిత కర్మలకును నాశము కలుగుచున్నది.

(2) ప్రారబ్ధభోగము ముగియగానే (ఈవర్తమాన శరీరమునకు అంతము కలుగగానే) విదేహమోక్ష ఆరంభకాలమున స్థూలసూక్ష్మ శరీరరూపముగా పరిణామమును బొందియుండినదియు, తత్త్వజ్ఞానముచే మునుపు (జీవన్ముక్తి దశయందు) బాధింపబడి (మిథ్యాత్వ నిశ్చయరూప బాధవిషయముగా) నుండిన దగు అజ్ఞానవిక్షేపశక్తి (అవిద్యాలేశము) ఏదియో యది తత్త్వజ్ఞానముచే లేక మరణసంబంధి యయిన మూర్ఛ కలుగగా తత్త్వజ్ఞాన సంస్కారముచే

నాశనమయినది. అనగా కాగిన యినుమునందు నీటిబిందువు మరుగునదివలె చేతనమందు అణగినది.

ఆ తన ఆశ్రయముచే నీశ్వర సంకల్పమునకు విషయమయిన దాని యాశ్రితమయిన ప్రారబ్ధకర్మము నాశమగుచున్నది.

(3) అహంకారమునకు సాక్షి చేతనముతోఁగల తాదాత్మ్య (భేదముండగా అభేదము కనబడుట) రూపభ్రమజ (మున్ముందు అధ్యాసరూపభ్రాంతియొక్క సంస్కారముచే నయిన) తాదాత్మ్య మేదియో యారూప హృదయగ్రంథి నాశము కాగా దాని యాశ్రితమయిన జ్ఞానమునకు ముందైనను వెనుకైనను ఈ వర్తమాన జన్మమున జేయబడు ఆగామి కర్మము లేవియో యవి జలముచే నంటని తామరాకువలె విద్వాంసుని అంటుటలేదు. అయితే యావిద్వాంసుని శుభాశుభ కర్మములకు భక్తులును నిందితులును క్రమముగా *154 భాగము గల వారగుచున్నారు.

కావున నిటముందు "జ్ఞానాగ్నిచే సకల కర్మములు నాశమగుచున్న" వని చెప్పబడినవి.

అట పర్వకర్మమను శబ్దముచే అనేకవిధ జన్మాంతరములందు చేయబడిన అపక్వమయిన సంచిత కర్మములే చేకొనబడును. కావున-

భిద్యతే హృదయగ్రంథిశ్ఛిద్యంతే సర్వసంశయాః ।
క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే ॥

---

*154. ఇట ఇది వివేకము. జ్ఞానియొక్క ద్రవ్యము, గృహము, లేక మఠము పుస్తకములు అనువానికి పుత్రుడును శిష్యుడును భాగస్థు లగుదురు. కాని జ్ఞానమునకు జిజ్ఞాసులు భాగస్థు లగుదురు. వాని శుభకర్మలకు సకామభక్తులు భాగస్థు లగుదురు. వాని అశుభకర్మలకు నిందకులు భాగస్థు లగుదురు. వాని మంచినడతలకు పుణ్యాత్ములగు నుదాసీనులు భాగస్థులు. వారిపాపమును నివర్తించు శుద్ధదృష్టి పాతమునకు పాపము గల ఉదాసీనులు జ్ఞానులయందు (రాగద్వేషములు లేని పాపులు) భాగస్థు లగుదురు. అనగా వాని మంచినడతలచే పుణ్యము గల ఉదాసీనులు చూచి మంచినడతల నడతురు. పాపులగు ఉదాసీనులు పాపము లేనివారగుదురు.

"ఆ పరావరము (అన్నిటికంటెను మేలైన బ్రహ్మము) ను కనుగొనగానే (అపరోక్షము చేయగానే) ఈజ్ఞాని హృదయగ్రంథి (అహంకార గ్రంథి) ఛేదింపబడుచున్నవి. వీని సకల సంశయములును ఛేదింపబడుచున్నవి. వీని సకల కర్మలును క్షీణించుచున్న" వను శ్రుత్యర్థమును శిష్యుడు చెప్పెను.

87. ఇప్పుడు శిష్యుడు

"మాయామేఘో జగన్నీరం వర్ష త్వేష యథా తథా ।
చిదాకాశస్య నో హానిర్నో వా లాభ ఇతి స్థితిః ॥

అను పంచదశి గూఢస్థ దీపమందుండు శ్లోకమున జెప్పబడిన విద్వాంసుల జీవన్ముక్తి దశయందలి స్థితిని తనచిత్తమునకు తెచ్చుకొని చెప్పుచున్నాడు.

స్వామీ! జ్ఞానముచే బాధింపబడిన మాయయగు మేఘము తన విక్షేపశక్తిచే కలిగిన జగద్రూపజలమును అన్నివిధముల (కావలసినట్లు) వర్షింపనిమ్ము. అయితే ఎందుచే నేను దీనికి ఆధార (అధిష్ఠాన) చిదాకాశ రూపముగా నున్నానో, ఆ కారణముచే నీజగముచే నాకొక లాభమును నష్టమును లేదు.

88. ఇప్పుడు శిష్యుడు,

తుచ్ఛాఽనిర్వచనీయా చ వాస్తవీ చేత్యసౌ త్రిధా ।
జ్ఞేయా మాయా త్రిభిర్భోధైః శ్రౌతయౌక్తికలౌకికైః ॥

1. శ్రౌతము (ఈ బ్రహ్మమునందు నానాయనునది కొంచెమైనను లేదు. "ఇట్లుకాదు, ఇట్లుగాదు" అనునది మొదలగు శ్రుతివాక్యములచే గలిగిన మూడు కాలములందు లేని నిశ్చయరూప విద్వాంసుల చిత్తమందు ఆరూఢ మయినది.)

2. యౌక్తికము (రజ్జుసర్పము, శుక్తిరజతము, స్వప్నజగత్తు - మొదలగు దృష్టాంతములును అనుమానాది రూపమునగు యుక్తులచే నయిన వేదాంత యుక్తుల సమర్థులగు పండితుల చిత్తమున అరూఢమయినది)

3. లౌకికము (విచారము లేక పామరవిషయుల చిత్తమున స్వభావముగా పొందబడినది)- అనుభేదములచే మూడువిధము లగును. వానిచే నీజగత్తగు

కార్యముతో గూడిన మాయ యనునది.

1. తుచ్ఛము 2. అనిర్వచనీయము (సదసద్విలక్షణముగా నుండుటచే బాధయోగ్య స్వరూపము గలది.)

3. వాస్తవి (సత్యమయినది)- అనుభేదముచే మూడువిధముల నెఱుగ దగినది. అనుపంచదశి చిత్రదీపమందుండు వాక్యముచే జెప్పబడిన మాయయొక్క త్రివిధ స్వభావముల విపరీతక్రమముగా తన చిత్తమందుదయించిన స్వానుభవ మును జెప్పుచున్నాడు.

వేదాంతశాస్త్రముల అభ్యాసమునకు పూర్వము అజ్ఞానరూపకారణముతో జగత్తు సత్యమని యుంటిని. అది వేదాంతశాస్త్ర అభ్యాసముచే (శ్రవణ మననములచే) స్వప్నజగమునకు సమానమని విచారించి మిథ్యగా (అనిర్వచనీయ ముగా) సిద్ధింపజేసితిని. అది యిప్పుడు అపరోక్షజ్ఞానము కలుగగా నిషేధ ముఖశ్రుతి యనుసారముగా శశవిషాణము (కుందేటికొమ్ము) వలె అపారమై యుండుటచే అసత్తు (తుచ్ఛము) అని సిద్ధించినది.

ఈయర్థము వేఱుశాస్త్రములందును జెప్పబడియున్నది-

శాస్త్రేణ నశ్యేత్పరమార్థబుద్ధిః
కార్యక్షమా నశ్యతి చాపరోక్షమ్ ।
ప్రారబ్ధనాశే ప్రతిభాననాశో
హ్యేవం క్రమాన్నశ్యతి చాత్మమాయయా ॥

పారమార్థికము, వ్యావహారికము, ప్రాతిభాసికము అనుభేదములచే జగము మూడువిధముల కనబడుట గలదు. వానిలో,

1. వేదాంతశాస్త్రముల అభ్యాసముచే, కార్యముతో గూడిన మాయయందు పూర్వము అజ్ఞానకాల మందుండిన పరమార్థబుద్ధి (సత్యత్వజ్ఞానము) ఏదియో యది నష్టమగుచున్నది.

2. ఇది యనిర్వచనీయముగా నుండుటచే వ్యావహారికముగా నెఱుగబడి

యున్న మాయయందు *155 కార్యమును గలిగించుటయందు సామర్థ్యము గలదని యుండిన బుద్ధి యేదియో యది అద్వైతతత్త్వ అపరోక్షజ్ఞానముచే నష్ట మగుచున్నది.

3. జ్ఞాతమగు అద్దమందు గల ప్రతిబింబము బాధితానువృత్తిచే కనబడుట వలె నీకార్యముతో గూడిన మాయ (దేహము నడుపువఱకు జ్ఞానికి) కనబడు చున్నది.

అది ప్రారబ్దము నాశము కాగానే నష్టమగుచున్నది. ఇట్లు క్రమముగా ఆత్మయొక్క మాయ (అజ్ఞానము) నాశమగుచున్నది. ఇది శాస్త్రాంతర వచనముచే జెప్పబడిన యర్థ మగును.

89. ఇప్పుడు శిష్యుడు

న నిరోధో న చోత్పత్తిర్న బద్ధో న చ సాధకః ।
న ముముక్షుర్న వై ముక్త ఇత్యేషా పరమార్థతా ॥

అను మాండూక్యోపనిషత్తునకు గౌడపాదాచార్యులచే చేయబడిన కారిక యొక్క అర్థమును చిత్తమందారూఢము చేసి పరమార్థత్వమును జెప్పుచున్నాడు.

స్వామీ! జగమునకు తనకారణ మయిన అజ్ఞానమందు తిరోభావరూప నిరోధ (ప్రళయ) మును లేదు. తన ఉపాదానమగు అజ్ఞానమునుండి యావిర్భ వించిన ఉత్పత్తియు [సృష్టియును లేదు. బద్ధుడు (సంసారి, జీవుడు)ను లేదు. సాధక మోక్షసాధనములతో గూడినవాడు] ను లేదు. ముముక్షువు (బంధమునుండి విడబడుటకు గోరువాడు)ను లేడు. (బంధమునుండి) విడువబడినవాడును లేడు.

---

*155. నిద్రనుండి లేచుటకు ముందు స్వప్నద్రష్టకు ఘటము మొదలగు పదార్థముల సఫలక్రియను గలిగించుట కనబడునట్లు; అపరోక్షజ్ఞానమునకు ముందు శాస్త్రముచే మిథ్యయని తెలిసిన పదార్థములందును మిథ్యయను ఘటముచే మిథ్యాజలమును తెచ్చుటయు; మిథ్యయగు పుణ్యాపాపములచే మిథ్యయగు స్వర్గనరకములు గలుగుచున్నవి.'' అని యిట్లు ఏసఫలక్రియను గలిగించుట కనబడుచున్నదో యది కార్యమును గలిగించుటలో సామర్థ్యము గలదగును.

దీని యభిప్రాయము:- ఎందుచే సకలమైన యీలౌకికవైదిక వ్యవహారము యున్న కామాదిదోషములతో గూడిన దృష్టికి విషయమగు శంఖముయొక్క పీతత్వమువలెను, నిద్రాదోషములతో గూడిన దృష్టికి విషయమగు స్వప్నమువలెను, అవిద్యయొక్క (అవిద్యతో గూడిన దృష్టికి) విషయమగునో దానిచే ఉత్పత్తి ప్రలయముల అభావముచే బద్ధుడు మొదలగువారు లేరు. అయితే ఈకనబడు ద్వైతము మిథ్య యగును. ఆత్మ యొక్కటియే పరమార్థముగా సత్తగును. ఇది పరమార్థత యగును. (విద్యతో గూడిన దృష్టికి విషయ మగుట వాస్తవిక యగును) కావున నాపరమార్థరూపము నేనగుచున్నాను. దీనిని నేను తమ కృపవలన నిశ్చయము చేసితిని.

90. ఇప్పుడు పదార్థముల పరస్పర విలక్షణత్వముతో గూడిన జాగ్రత్త యందు గానబడు పదార్థములు ఆదియందును, అంతమునందును లేనందున వానికి మిథ్యాత్వము గలదు అని శిష్యుడు

ఆదావంతే చ యన్నాస్తి వర్తమానేఽపి తత్తథా ।
వితథైః సదృశాః సంతోఽవితథా ఇవ లక్షితాః ॥

అను గౌడపాదాచార్యుల వాక్యానుసారము చెప్పుచున్నాడు.

ఎండమావులు మొదలగు వస్తువు ఆదియందును (ఉదయమందును) అంతమందును (సాయంతనమందును) లేదు. ఆదిమధ్య (మధ్యాహ్నరూప వర్తమానకాలమందు) కనబడినను ఒకప్పుడును లేదు. ఇది లోకమందు నిశ్చయింపబడినది. అట్లే, యీజగము తనయుత్పత్తికి పూర్వము నిమిత్తనాశముచే తాను నాశమయిన వెనుకయును లేక జ్ఞానముచే తన ఉపాదానము నశించుటచే బాధ పొందిన పిమ్మటను లేదు.

కావున నీజగము ఎండమావులవలె మూడుకాలములందును లేదు.

91. ఇప్పుడు శిష్యుడు-

ఆత్మానం చేత్ విజానీయా దహమస్మీతి పూరుషః ।
కిమిచ్ఛన్ కస్య కామాయ శరీరమనుసంజ్వరేత్ ॥

పురుషుడు (సాభాస అంత:కరణ విశిష్టచేతనరూప జీవుడు ఎప్పుడు (విచారదశయందు) ఇది స్వప్రకాశముగా నుండుటచే నిత్యఅపరోక్షమగు బ్రహ్మరూపాత్మ నేనుగా నున్నానని ఆత్మను తెలిసికొనుచున్నాడో; అప్పుడు దేనిని (ఏభోగ్యపదార్థములను) ఇచ్ఛించువాడై ఎవనియొక్క (ఏభోక్తయొక్క) కామ (భోగ) ముకొఱకు స్వభావముగా క్రమముగా రోగము మొదలగునవియును; కామ క్రోధములు మొదలగునవియును; శాంతి మొదలగునవియు; ఆరెంటి సంస్కారమును నగు తాపములతో గూడిన త్రివిధ శరీరములు పొంది తపింపబడు వాడగును- అను పంచదశి తృప్తిదీపమునందు వ్యాఖ్యానము చేయబడియుండు బృహదారణ్య శ్రుతివచనార్థమును చిత్తమున గొని చెప్పుచున్నాడు:

1. దేవా! ఆకాశము మొదలగు సకలజగమును అసత్తుగానుండి కనబడు చుండుటచే స్వప్నగజము మొదలగువానివలె మిథ్యగా నుండుటచే దానియందణగి యుండునవియగు ఇహపరలోకముల సంబంధము గల మాలా గంధము, స్త్రీ అమృతపానము, అప్సరస మొదలగువిషయ రూప భోగ్య (భోగపు) సాధనము లున్న;

2. జాగ్రత్త మొదలగు అవస్థల అభిమానముచేత విశ్వుడు, తైజసుడు (ప్రాజ్ఞుడు) అను పేర్లను బొందిన అంత:కరణమందు చేతన ప్రతిబింబమయమగు చిదాభాసరూప భోక్తయు- నీరెండును దేనిచేత మిథ్యయో దానిచే నాభోగ్యము నిమిత్తమైన భోక్తయందు చేయబడిన పుణ్యపాపములు మిథ్య యగును. దీనిచే నాపుణ్యాపాపముల ఫలరూప సుఖదు:ఖములును మిథ్య యగును.

కావున నేను చేతనస్వరూప ఆత్మను నెటిగి ఏభోగ్యేచ్ఛచే నేభోక్తయొక్క భోగముకొఱకు జ్వర(తాప) ముగల శరీరమును గొని వ్యర్థముగా తాపము బొందుదును,

అనగా అపరోక్షజ్ఞానముచే బాధింపబడిన (మిథ్యగా గనబడిన) భోగ్య, భోక్త్రు భోగములకు నిమిత్తమగు ప్రబల ఇచ్ఛ లేనందువల్లను; వేచిన విత్తులవలె ప్రారబ్దముచే గలిగి బాధింపబడిన ఇచ్ఛ యుండుటచేతను నాయిచ్ఛారూప నిమిత్తముచే నేను తపింపబడను.

92. ఇప్పుడు శిష్యుడు

అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ ।
వివిధాశ్చ పృథక్ చేష్టా దైవం చైవాऽత్ర పంచమమ్ ॥ 1

శరీర వాఙ్మనోభిర్యత్కర్మ ప్రారభతే నర: ।
న్యాయ్యం వా విపరీతం వా పంచైతే తస్య హేతవ: ॥ 2
తత్రైవం సతి కర్తార మాత్మానం కేవలం తు య: ।
పశ్యత్యకృతబుద్ధిత్వాన్న స పశ్యతి దుర్మతి: ॥ 3

ప్రకృతే: క్రియమాణాని గుణై: కర్మాణి సర్వశ: ।
అహంకారవిమూఢాత్మా కర్తా హమితి మన్యతే ॥ 4

తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయో: ।
గుణా గుణేషు వర్తంతే ఇతి మత్వా న సజ్జతే । 5

యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే ।
హత్వాऽపి స ఇమాంల్లోకాన్న హంతి న నిబధ్యతే ॥ 6

అర్థము:- అధిష్ఠానము (శరీరము), అట్లె కర్త (అంత:కరణము), వేర్వేరు కరణములు (దశేంద్రియములు), అనేక విధములగు భిన్న చేష్టలు, (పంచ ప్రాణములు) ఐదవది దేవుడు (ప్రేరకుడగు ఈశ్వరుడు లేక ప్రారబ్ధము) లేక (ఇంద్రియముల దేవతలు) అనునవి యున్నవి. (1) శరీరము మనస్సు వాక్కు అనువానిచేత ఏన్యాయమైన (శుభ) లేక విపరీత (అశుభ)మగు ఏకర్మమును మనుష్యుడు ప్రారంభించుచున్నాడో, దాని కీశరీరము మొదలగు నైదును హేతువు లగును.

(2) అట ఈవిధముగా క్రియకు వేఱుహేతువు లున్నవని కేవలము (అక్రియ) ఆత్మను ఏపురుషుడు కృతార్థత లేని బుద్ధిగలవాడై యుండుటచే కర్తయని కాంచుచున్నాడో; ఆదుర్బుద్ధి గలవాడు కనజాలడు. (ఆత్మను యథార్థముగా నెఱుగడు)

(3) శరీరము ఇంద్రియములు మొదలగు రూపపరిణామమును బొందిన ప్రకృతి (మాయ) సత్త్వము మొదలగు గుణములచే జేయబడుచున్నవి. సకల కర్మములును వానికి అహంకారముచే (అహంకార తాదాత్మ్యముచే) ఎవని ఆత్మ విమూఢమై వేఱగుటను పొందియున్నదో ఆవిధపురుషుడు నేను కర్త అని యనుకొనుచున్నాడు.

(4) మహాబాహో! గుణకర్మముల విభాగతత్త్వమును దెలిసినవాడో గుణములు (ఇంద్రియములు) గుణ (విషయ) ముల యందున్నవని తలంచి తాను సంగము గలవాడగుట లేదు.

(5) ఏపురుషునికి శరీరము, మొదలగువానిచే జేయబడు కర్మమందు ఈ కర్మమునకు కర్త నేనను అహంకారము లేదో; అదియుగాక ఈశుభాశుభకర్మల స్వర్గ నరకాది రూపఫలము నం దేపురుషుని బుద్ధి నేను దీనిఫలమును ననుభవించు వాడను అనునట్లు బంధమును పొందుట లేదో; యా పురుషుడు ఈలోకములను చంపువాడైనను లోకదృష్టిచే చంపుటను జేయుచున్నాడు. శాస్త్రదృష్టిగా చంపుట లేదు. దానిఫలము బొందెడు బంధనమున్ను పొందుటలేదు.

(6) ఇవి మొదలగు ఆత్మయొక్క అకర్తృత్వము, అభోక్తృత్వము; అట్లే ఆత్మజ్ఞానము అనువాని మాహాత్మ్యమును ప్రతిపాదించు గీతయొక్క వాక్యములు గలవు. వాని అర్థమును అనుభవగోచరము చేసికొని శిష్యుడు చెప్పుచున్నాడు,

నేను శరీరము, వాక్కు, మనస్సు అనువానిచే చేయబడిన క్రియల అనాశ్రయము (సంబంధము లేని) వాడనై యుండుటచే అక్రియుడ అకర్తగా నున్నాను.

ఏది క్రియయొక్క ఆశ్రయరూపమై క్రియను గలదై యున్నదో; యది కర్త యనబడును. అది ముందు చెప్పిన శరీరము మొదలగు సామగ్రులతో గూడిన అంతఃకరణ రూపకర్తను బోలినది. దేనిచే నేను క్రియయొక్క ఆశ్రయరూపమయిన క్రియను గలవాడును గానో అందుచేత కర్తను గాను.

ఏది కర్తయో యదియే భోక్త యనుట లోకప్రసిద్ధి. ఎట్లు అంతఃకరణము

కర్మమునకు కర్తయయి యున్నది. కావున అది కర్మయొక్క ఫలరూపమగు తనపరిణామరూప సుఖదుఃఖముల భోక్తయై యున్నది. దేనిచే నేను ముందుచెప్పిన కర్మమునకు కర్తను గానో దానిచే దానిఫలముయొక్క భోక్తయు గాను.

ఎందుచే నేను కర్మఫలభోక్తను గానో; అందుచే నేను (సంగము) బంధకము లేనివాడనై యున్నాను.

ప్రారబ్ధకర్మరూప నిమిత్తముచేత అజ్ఞానవిక్షేపశక్తిచేత జేయబడిన లింగదేహముతో గూడిన స్థూలదేహ మేదియో యది దీని ప్రారబ్ధము ప్రకారము ఊర్ధ్వగతిగాను, లేక అధోగతిగాను గాలిచే కొట్టబడిన రాగియాకు లేక తృణమువలె చలించని శబ్దప్రారబ్ధ పర్యంత ముండిన నుండనిమ్ము. అందుచే ఆత్మయయిన నాకు లాభము లేదు. నష్టము లేదు. ఈయర్థము శ్రీ పంచదశి తృప్తిదీపము నందును-

> వ్యవహారో లౌకికో వా శాస్త్రీయో వాఽన్యథాపి వా ।
> మమాకర్తురలేపస్య యథాఽఽబ్ధం ప్రవర్తతామ్ ॥

అకర్తయు అభోక్తయు నయిన నాప్రారబ్ద మెట్లున్నదో యట్లు లౌకిక లేక శాస్త్రీయ లేక ఈరెంటికి వేఱయిన వ్యవహారము ప్రవర్తించనిమ్ము- అని చెప్పబడి యున్నది.

ఇట ఇది సంశయము:- జ్ఞానికి సర్వజ్ఞుడై యుండుటచే విధి నిషేధరూప శాస్త్రపుగట్టు (అడ్డము) లేనందున నెప్పుడు స్వతంత్రత యున్నదో యప్పుడాతనికి యథేష్టాచరణము (ఇష్టప్రకారము నడచుట) కలుగును. అది లోకనిందను, శిష్టనిందను అంతఃకరణమునందుండు కామాదిదోషములు అధికరించుట మూలమున చిత్తము బహిర్ముఖ మగుటయును, గలిగించునదియై యుండుటచే విక్షేపమునకు హేతువగును. జీవన్ముక్తి ఆనందమునకు హేతువు కానేరదు.

కావున నీజ్ఞానికి "వడ్డికాశించి మొదలు పోగొట్టుకొన్నవాడు" అను న్యాయముచే పరమానందము పొందుటకు గోరి జ్ఞానమునందు ప్రవర్తించిన

పురుషునికి మాఱుగా విక్షేపరూపానర్థము వృద్ధియయ్యెనే యను సంశయమునకు నిది సమాధానము-

చక్రవర్తియగు రాజు తనపుత్రుని చంపునది లేక తననగరము నైనను, దేశము నైనను తగులబెట్లునది, లేక మలము తినునది, లేక తనకీర్తిని నుడువు వారును, ఆశీర్వదించువారును, రాజ్యకార్యము చేయువారునగు సూత (పౌరాణికులు) మాగధులు (వంశమును చెప్పువాడు); శ్రేుకవులు, వేదములు తెలిసిన విద్వాంసులు, తనభృత్యులు, మొదలగు వారికి ధనము మొదలగు పదార్థముల నీయక దానికి మారుగా కొల్లగొట్టుట-ఈయన్ని కార్యములయందును వానికి స్వతంత్రత్వము గలదు. అయినను ధర్మమును దెలిసినవాడును లౌకిక వ్యవహారమునందు నీతియందు నిపుణుడునై యుండుటచే ఆరాజట్లు చేయుట లేదు.

అట్లే జ్ఞాని యగువాడు విధినిషేధములు లేనందున స్వతంత్రుడై యుండినను.

1. ఎందుచే నన్నిటను *155 తానుగా నెఱుగుచున్నాడో-

2. శాస్త్రమునందు జెప్పబడిన *156 వివేకముతో గూడిన వాడైయున్నాడో-

3. బిడ్డలయందు తండ్రివలె సకల *157 జనులకు హితమును జేయువాడై యున్నాడో,

---

*155. దీనిచే జ్ఞానికి సర్వాత్మతత్త్వజ్ఞానముచే తనవద్దను, పరులవద్దను భేదజ్ఞాన అపేక్ష గలదగు అనుకూల ప్రతికూలముల జ్ఞానపూర్వక రాగద్వేషములకు దృఢత లేనందున; రాగద్వేషములచే కనబడు (నిషిద్ధ భోగమును హింసారూపమునగు) యథేష్టాచరణ అభావము చెప్పబడినది.

*156. ఇట్లు చెప్పుటచే జ్ఞానికి బాధితానువృత్తిచే ఆకలి, దప్పి, విషము, చక్కెర, అన్నము, మలము మొదలగువాని వివేకమువలె చేయదగినదియును, చేయదగనిదియునగు కార్యముల వివేకము గలదు. కావున వాని అవివేకముచే గనిపించు యథేష్టాచరణము సంభవింప దనునది నెఱిగింపబడినది.

*157. ఇట్లు చెప్పుటచే జ్ఞాని కరుణ నెఱిగింపబడిన దగుటచే తన నిషిద్ధ ఆచరణమును గని యట్లుచేయు జనులకును లేక తన్ను నిందించు జనులకును నరకము మొదలగు దుఃఖములు కలుగునను కరుణచేతను జ్ఞానికి యథేష్టాచరణమున ప్రవృత్తి కలుగదని నెఱిగింపబడినది.

4. సకల విక్షేపములను బోకొట్టి పరమానంద *158 అనుభవమునందు బంధకము గలవాడైయున్నాడో-

దానిచే వాడు యథేష్టాచరణము చేయుట లేదు. అయితే మంత్రమెఱింగిన వానికి ముండ్ల పడకయును వానికి కష్టమును గలిగించదనగా పూలపాన్పు వానికెట్లు కష్టమును కలిగించును." అను న్యాయముచే లోకసంరక్షణార్థము వ్యతిరేక శాస్త్రములందు చెప్పినమార్గములందు మనోవాక్కాయములను చెల్లించుచున్నాడు. లోపలివాని అభిమానమును జేయుటలేదు.

లేక వైరాగ్యము మొదలగు శుభసాధనముల సంస్కారరూపమును పూర్వపుణ్యముయొక్క సంస్కారరూపమును నయిన స్వభావముచేతను వాడు వెఱ్ఱిబట్టిన వైష్ణవునివలె నైనను; బ్రాహ్మణులు మొదలగు వారిబిడ్డలవలె నైనను నిషిద్ధాచరణమున నుండడు. శిష్టాచరణమందే యుండును.

అట ఇది పండితుల యథేష్టాచరణమును నిషేధించు యుక్తితో గూడిన శాస్త్రవచనము-

అధర్మాజ్జాయతేఽజ్ఞానం యథేష్టాచరణం తతః ।
ధర్మకార్యే కథం తత్స్యా ద్యత్ర ధర్మో వినశ్యతి ॥

దీనియర్థము:- దుష్టాచరణముచే (చెడునడతచే) గలుగు సంస్కారమయ పాపరూప అధర్మముచే తెలియమి కలుగుచున్నది. అనగా కార్యాకార్యముల భేదజ్ఞానమగు వివేక అభావరూప అంకురము మూలముగా ఉత్పత్తి యయిన, అవశ్యము చేయదగిన కార్యమును మఱచుట యనెడు లేక విషయపరవశత అను ప్రమాదము కలుగుచున్నది. అందుచే యథేష్టాచరణము కలుగుచున్నది. జ్ఞానరూపమగు ధర్మకార్య ముండగా నాయధర్మకార్యమగు యథేష్టాచరణ మెట్లుండునది యగును. అట జ్ఞానమునకు హేతురూప ధర్మము జ్ఞానరూప

---

*158. ఇట్లు చెప్పుటచే బహిర్ముఖ మగుటకు హేతువై యుండుటచే జీవన్ముక్తి విలక్షణానంద అనుభవమునకు విరోధి యయిన యథేష్టాచరణమునందు జ్ఞానికి ప్రవృత్తి సంభవింపదు.

ఫలముయొక్క తిరోధానముచే నాశముగుచున్నది. కావున జ్ఞానవంతులకు యథేష్టాచరణమందు ప్రవృత్తి గలుగుట లేదు.

లేక అర్జునునికి హింసాదిక యుద్ధమునందు ప్రవృత్తి కలిగిన దేదియో యది యథేష్టాచరణము కాదు. అది క్షత్రియుల స్వధర్మ మగును.

93. "నిత్యబోధపరిపీడితం జగ
ద్వాక్యజా తుదతి విభ్రమం మతిః।
వాసుదేవనిహతం ధనంజయో
హంతి కౌరవకులం యథా పునః।

అను సంక్షేప శారీరక వాక్య అర్థమును శిష్యుడు అనుభవగోచరమును జెప్పుచున్నాడు:- నిత్యబోధరూప చేతనమందు కారణముతో గూడిన జగత్తు బాధితమే యగును. అనగా నిత్యనివృత్తమే యగును. అట్లయినను మహావాక్యముచే గనబడు "నేను బ్రహ్మను" అను జ్ఞానముచే కనబడుచుండెడు భ్రమ (సత్యత్వముచే వ్యక్తరూపమైన వేఱుబాటు) ఏదియో యది నాశమగుచున్నది.

కృష్ణునిచే పూర్వమే చంపబడిన కౌరవకులము పిమ్మట అర్జునునిచేతను నాశమయ్యెను. అట్లే గురువుదృష్టిచే నిత్యనివృత్త మయిన జగత్తు మరల శిష్యుని జ్ఞానదృష్టిచే నివృత్తి యగుచున్నది.

ఆత్మానాత్మవిభాగోఽయం ముధైవ క్రియతే బుధైః।
యద్వన్ను మృణ్మయః కుంభ స్తద్వద్దేహోఽపి చిన్మయః॥

అను అపరోక్షానుభూతి వాక్యపు అర్థమును అనుభవ విషయముగా జేసి శిష్యుడు చెప్పుచున్నాడు- నాచే తత్ పదార్థ త్వంపదార్థముల వివేచనకాలముల యందు జీవబ్రహ్మముల ఐక్యమునకు విరోధము గల ధర్మములతో గూడిన ఉపాధియయిన వాచ్యభాగమును విడిచి అవిరోధియగు చేతనరూప వాచ్యభాగ మును చేకొనుట యగు భాగత్యాగలక్షణచే జడచేతనముల భేదము (వివేకము) చేయబడినది. దాని నిప్పుడు వ్యర్థముగా చేయబడినదని యెఱుగుచున్నాను. ఘటము మట్టిరూపమే యగును. అట్లు దేనిచే నీదేహాది ప్రపంచము నాకు

చి(దూపముగా గాన్పించినదో దానిచే నాకు దేని (గహణమును దేని త్యాగమును లేదు. దీనిచే ముందు జిజ్ఞాసా (జ్ఞానమందలి ఆశ) కాలమందు ఐదవ యుపదేశమందు జెప్పిన దేహాత్మల భ్రమరూపముఖ్య అభేదమును బోగొట్టుకొఱకు చేయబడిన జడచేతనముల వివేక మేదియో యది ఇప్పుడు జడ ప్రపంచబాధచే అభేదము (నిత్యనివృత్తి) కాన్పించుటచే, వ్యర్థము చేయబడినదని కనబడుచున్న దనునది తాత్పర్యము.

95. 1. ఇప్పుడు శిష్యుడు ముందు చెప్పిన యర్థమును సం(గహముగా ననువదించి తనస్థితిని జెప్పుచున్నాడు- ఆత్మ నిరవయవమును నిరాకారమునునై యుండుటవలన త్రోసివేయునదిగా గాని తీసికొనునదిగా గాని లేక యున్నది.

2. మరియు ఆత్మ జననము, మరణము మొదలగు బంధములు లేనిదిగా నున్నందునను తాను (ఆత్మ) నిత్యముక్తముగా నున్నందునను బంధమోక్షములు లేనిదిగా నున్నది.

3. మరియు ఆత్మ చిత్తు అగును. ఎలయన

(1) జా(గత్త స్వప్నము సుషుప్తి - యను మూడవస్థలును; ఆయవస్థలు గల అన్నిదినములును, ఆ దినములు గల చై(తము మొదలగు నెలలును; ఆనెలలు ప్రభవాది సంవత్సరములును గల ఆ సంవత్సరములు గల సత్యాది (కృతాది) యుగములును; ఆయుగములు గల స్వాయంభువాది మన్వంతరములును ఆమన్వంతరములు గల బ్రహ్మదినములును; ఆ(బహ్మదినములు గల మాసము మొదలగు వానితో గూడిన పరార్థము (బ్రహ్మయొక్క 50 యేండ్లు)ను; అట్లే యారెండు పరార్థములు గల వరాహము మొదలగు కల్పములును; ఆకల్పములు గల భూత భావి వర్తమానములను కాలములును; ఆకాలములందు ఆకాశము మొదలగు ఆ(శయముతో గూడిన ఒకదాని కొకటి విలక్షణమగు శబ్దము మొదలగు అన్నివిషయములును; ఆయా విలక్షణ కాలములును- దేనిచే ఆత్మ ప్రకాశింపించునదియై యున్నదో దానిచే ఆత్మ స్వయం(పకాశ మగును. దేనిచే ఆత్మ స్వయం(పకాశమో దానిచే ఆత్మ చిత్తగును.

(2) లేక ఘటము మఠము మొదలగు నొకదానికొకటి భిన్నమయిన ఉపాధు లందుండునవియు, ఆకాశము ఆకాశము అని యొకరూపముగా గనబడుచుండు నదియు నయిన యొక ఆకాశమేదియో దానివలె శబ్దజ్ఞానము స్పర్శజ్ఞాన మనునది మొదలగు వ్యవహారములందు జ్ఞానము జ్ఞానమని యొకరూపముగా గాన్పించు చున్న ఒకే జ్ఞానరూపస్ఫురణ మున్నది. సంవిద్రూప జ్ఞానము జాగ్రత్త మొదలగు మూడవస్థలు భూతము మొదలగు నన్ని కాలములందును నొకదానికొకటి విలక్షణమగు నన్ని విషయములను నొక్కటియై ప్రకాశించుచున్నదియై యున్నది. అరూపమై యుండుటచే ఆత్మ చిత్తగును.

(3) లేక ఆత్మ దేనిచే తన తాదాత్మ్య సంబంధమువలన నన్నిటిని వ్యక్తపరచునదిగా నుండుటవలన నన్నిటికిని సాధకముగా నున్నదో దానిచేతను ఆత్మ చిత్తగును.

(4) మరియు ఆత్మ ఈ (చెప్పిన) యన్నికాలములయందును పరమ ప్రేమకు విషయముగాను దుఃఖసంబంధము లేనిదిగాను నుండుటచే ఆనందరూప మగును.

5. మరియు ఆత్మ సత్తగును. దేనికి చావుపుట్టుకలు లేవో అది మూడు కాలములందును బాధింపబడనిదిగా నుండుటచే సత్తనబడును. ఆత్మకు దేనిచే జన్మనాశములు లేవో దానిచే మూడుకాలములందును బాధింపబడనిదై యుండుటచే ఆత్మ సత్తగును. దానిని జూపుదుము-

సంవిత్తు (చేతన) రూప ఆత్మ.

(1) ఒక్కటిగా నుండుటచే జడవస్తువులచే దానికి జన్మనాశముల జ్ఞానము పొందదు.

(2) తానైన చేతనమును, దీపమునువలె తన సమకాలమందు ప్రకాశింపించునదై యుండుటచేతను, తనయుత్పత్తి నాశ కాలములందు తనలేమి కలుగుటచేతను ఆత్మయొక్క ఉత్పత్తినాశముల జ్ఞానము ఆత్మవలనను పొందునది కాదు.

(3) "దానిని ప్రకాశింప జేయునది వేఱు, దానిని ప్రకాశింపజేయునది వేఱు" అనునట్లు అనవస్థారూప దోషము కలుగుటచే ఆత్మను, దాని జన్మ నాశములను వ్యక్తపఱచునదియైన వేఱుసంవిత్తు (జ్ఞానము) రూప ఆత్మ సిద్ధించుట లేదు.

(4) జడవస్తువు వివరింప గానిదగుటచే ఆత్మయొక్క జన్మనాశముల తెలుపునది జడవస్తు వనునది సిద్ధించుట లేదు. కావున ఆత్మయొక్క జన్మనాశముల యనుభవము లేదు.

(5) శ్రుతి మొదలగు ప్రమాణములచేతను ఆత్మయొక్క జన్మనాశముల అభావము చెప్పబడియున్నది. కావున ఆత్మ ఒకే స్వప్రకాశరూపముగా నుండుటచే దానికి జన్మనాశములు లేవు.

(1) దేనిచే ఆత్మకు జన్మనాశములు లేవో దానివలన ప్రాగభావము ప్రధ్వంసాభావములు లేనందున ముందుచెప్పిన చిదానందరూప ఆత్మ యప్పుడును నుండునదై యున్నది.

(2) దేనిచే ఆత్మ యెప్పుడును నుండునదిగా నున్నదో అందుచే ఆత్మ నిత్యము అగును.

(3) దేనిచే నిత్యమో దానిచే ఆత్మ సత్తగును.

(6) మరియు ఆత్మ వాక్కునకును దానిచే తెలిపింపబడిన మనస్సు మొదలగు సకల ఇంద్రియములకును విషయము కానిదగును.

ఈవిధబ్రహ్మముకంటెను వేఱుకాని ఆత్మ యేదియో యది నా స్వరూప మగును. ఈస్థితినే నేను సంపాదించి యున్నాను.

96. అతిదూరతరం నిజస్వరూపం
గురుశాస్త్రై ర్నవిలోకయేద్యది ।
నికటం గురుశాస్త్రబోధత: ।
ప్రకటం స్యాత్స్వతనౌ స్వయం హి తత్ ॥

అను శాస్త్రవచనార్థమును స్మరించి ఇప్పుడు శిష్యుడు చెప్పుచున్నాడు:- గురుశాస్త్రముల ఉపదేశమునకు ముందు నిజరూప బ్రహ్మము మిక్కిలి దూరముగా గనబడుచుండెడిది. ఆయుపమింప సాధ్యపడని నిజరూపము ఇప్పుడు గురు శాస్త్రముల ఉపదేశ మయిన పిమ్మట సమీపమందుండునది యాయెను.

అప్పుడది అపరోక్ష మగునోయని శంక కలుగగా మరియు ప్రకట(అపరోక్ష) మయినది యని చెప్పుచున్నాడు.

అట్లయిన నది శరీరమునకు నెదుట అపరోక్షముగా నుండునే యను శంక గలుగగా నట చెప్పుచున్నాడు.

తన శరీరమునందే అపరోక్ష మయినది ఏలయన-

1. ప్రమాతృ చేతనమునకును (సాక్షికిని), విషయచేతన (బ్రహ్మ)మునకును శరీరమందు అంతఃకరణ దేశమందే అభేదము కలుగుటచేతను-

2. ప్రమాతృ చేతనమునకు విషయచేతనముతో వృత్తిమూలమున నయినను లేక నేరుగా నైనను గలుగు అభేదమే అపరోక్షజ్ఞాన లక్షణ మగును. అది కలుగుటచేతను-

శరీరమునందు లోపలనే బ్రహ్మముయొక్క అపరోక్షజ్ఞానము చెప్పబడినది. అది మంచిదగును.

శరీరములో అపరోక్షము గలిగియు, అది ఇది యను వృత్తికి విషయమయిన సుఖదుఃఖములు మొదలగువానివలె తనకంటెను వేఱయినదై అపరోక్షముగా నుండునో యను శంక కలుగగా అందులకు నేనను వృత్తికి విషయ మగుటవలన తానే తానై అపరోక్ష మయినది అని చెప్పెను.

97. ఇప్పుడు

ఉద్యుక్తే ప్రచురప్రబోధతరణౌ మాయానిశాఽస్తంగతా
జాతా దృక్తమసో భిదామలభుబోఽనచ్చాదినక్తంచరాః ।

సుప్తాయామితదానవప్రచ్యుతిరియం కామాదయో దస్యవో ।
లీనా ఇంద్రియ తారకాగతరుచః క్షీణో మనశ్చంద్రమాః ॥

అను కువలయానంద అలంకార గ్రంథమున జెప్పిన యర్థమును మనస్సున గొని దృఢ అపరోక్షజ్ఞానమును సూర్యునిగా రూపించి శిష్యుడు వర్ణించుచున్నాడు.

1. నిదిధ్యాసరూప అరుణోదయమునకు పిమ్మట

2. దృఢ అపరోక్షజ్ఞాన సూర్యోదయముచే

3. మాయయందు (తన అంతఃకరణ దేశమందు) గల అజ్ఞానాంశ రూపరాత్రి (చీకటి) నాశమయినది.

ఇందుచే కార్యముతో సమష్టి అజ్ఞాన రూపమాయయొక్క మిథ్యాత్వము కనబడుటచే వస్తువుచే దానికే నాశము గలిగినది అనునది సిద్ధించుచున్నది.

4. చిత్తను ద్రష్టయగు చేతనమునకు జడమను దృశ్యప్రపంచమునకు "సత్తు సత్తే యగును. అసత్తు అసత్తే యగును" అను చీకటి వెలుతురుల వలె భేదము (మిక్కిలి వివేకము) కలిగెను.

5. కనబడుచుండెడు అసత్తు మొదలగు నిశాచరులు (పిశాచాదులు) మలమును భుజించుచున్నారు. (ముముక్షువులకు) కూతలు వేయుట లేనందున కూతలు వేయువారై మలమును భుజించుచున్నారు. అయితే వానిని జ్ఞానమునుండి యేమరించికొని పోవునదియైన యుపాయము లేదు.

6. అజ్ఞాన రూప రాత్రియందు ముముక్షువులయిన ప్రజలను మతాంతర రూపులగు దొంగలు మొదలగు వారినుండి రక్షించువారైన శ్రుతిస్మృతిరూపులైన కావలి వాండ్రు నిద్రించిరి.

అనగా మరల నీజ్ఞానమును రక్షించుటలో వారి సహాయము లేదు.

7. అజ్ఞానరూపమైన చీకటియందు మిక్కిలి బలము గలవారై సంచరించు కామాది చోరులు జ్ఞానమగు సూర్యుడుదయింపగనే పారిపోయిరి.(దాగిరి)

8. అజ్ఞానరూపమైన చీకటియందు విషయములయందు బలాత్కారముగా ప్రవర్తించు తేజస్సుగల యింద్రియములను నక్షత్రములు జ్ఞానముదయము కాగా ప్రకాశము లేనివాయెను.

9. అజ్ఞానకాలమందు కామాదివృత్తిరూప కిరణములచే ప్రకాశించునదియు విషయములందు రాగ రూప అమృతముచే నిండియుండుటచే ప్రమాదము (పొలిపోవుట) నయిన మనస్సను చంద్రుడు జ్ఞానమను సూర్యుడుదయింపగా మందమైనది.

98. ఇప్పుడు

"భుంక్షే గుప్తం బత సుఖనిధిం తాత! సాధారణం త్వం
భిక్షావృత్తిం బహిరభినయన్ మాయయా మాం విభజ్య ।
కుర్వేతన్నకుర్విత్యపి వదసి మాం భృత్యవచ్ఛిక్షయన్ భోః
కూటస్థే త్వాం నివేద్య స్థిరమపి భవదైశ్వర్యమున్మూలయామి" ॥

అను శాస్త్రవాక్యమును జెప్పిన ఈశ్వరునితో జీవునికి గల సంవాదమును మనస్సున నిడుకొని శిష్యుడు చెప్పుచున్నాడు.

1. బ్రహ్మయగు తండ్రికిని, 2. మాయయగు తల్లికిని 3. చిదాభాసమయ జీవుడును, ఈశ్వరుడును నగు ఇద్దఱు పుత్రులు గలరు. వారిలో,

4. ఈశ్వరుడగు జ్యేష్ఠ పుత్రుడు పరబ్రహ్మమగు తండ్రియొక్క సుఖరూప రాజ్యాది ధననిధిని అనుభవించుచున్నాడు. సర్వజ్ఞత్వము మొదలగునవి యగు మాయయొక్క ధనమును స్వాధీనపఱచుకొనుటచే ప్రభువు ఈశ్వరుడు (సమర్థుడు)గా నున్నాడు. నాకొఱకు కర్మానుసారముగా నిర్వాహమునకు ఉపయోగించు మాయయొక్క ధనమునుండి విభాగము చేసి,

5. "పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః ॥

నాకొఱకెవడు పత్రము, పుష్పము, ఫలము, జలము- అనువానిని భక్తితో

నిచ్చుచున్నాడో- ఆ నియమింపబడిన మనస్సుగల భక్తుడు భక్తితో నిచ్చిన వస్తువులను నేనంగీకరించుచున్నాను" అను మొదలగు గీత మొదలగువాని వాక్యములచే నా దగ్గఱనుండియు భిక్ష గొనువాడై

6. పనివానివలె విధినిషేధముగు శిక్షను జేయువాడై యున్నాడు.

7. ఇప్పుడు నేను గురువను పక్కీలగు తమచే

8. భాగత్యాగలక్షణచే నా నిజరూప కూటస్థుని (సాక్షి)తో అతని నిజరూపమయిన బ్రహ్మముయొక్క ఏకరూప న్యాయముచే

9. జయించితిని (అభేదభావముగా కనబడుటచే పరసుఖ నిధియొక్క భోక్తయయి స్వాధీనము చేసితిని) కొన్ని చోట్ల వ్యవహార కాలమందు భేదమును జెప్పుట కలిగి యుండియు లోకదృష్టిచే లజ్జ గలవారై యొకరి కొకరు స్నేహము గల స్త్రీ పురుషులవలె లోపలభేదము ఎప్పుడును గాన్పించుటలేదు. దాని అభేదమే ఆకలిబాధ మొదలగు దోషము లేక భుజించిన అన్నమువలె పరమానందమునకు హేతువుగా నుండుటచే

అభేదదృశ్యము సుఖమును గలిగించునది యగును. భేదదృశ్యము దుఃఖమును గలిగించున దగుననుటలో,

జాతే సమరసానందే ద్వైత మవ్యమృతోమమ్ ।
స్నిగ్ధయోరివ దంపత్యోర్జీవాత్మ పరమాత్మనో : ।
దుఃఖాయ ద్వైతభావో హి సుఖాయాద్వైతభావనా ।
భారాయాన్నం పృథగ్భూతం భుక్తమన్నం సుఖావహమ్ ॥

జీవాత్మ పరమాత్మల సమరసానందము కలుగగనే (వ్యవహారకాలమున మాట మాత్రమయిన) ద్వైతమున్ను అమృతమునకు సమాన మగును. స్నేహము గల స్త్రీ పురుషులవలె ద్వైతము దుఃఖముకొఱకగును. అద్వైతభావన సుఖము కొఱకగును. ఎట్లు:- శరీరమునకు వేఱుగా నెత్తబడిన అసనమేదియో యది భారముకొఱ కగును. భుజించిన (భోజన మూలమున శరీరముతో అభిన్నమయిన) అన్నమేదియో యది సుఖముకొఱకగును అను యుక్తితో గూడిన వేఱు

శాస్త్రముయొక్క వచనమును ప్రమాణ మగును.

దాసోఽహమితి యా బుద్ధి: పూర్వమాసీజ్జనార్దనే ।
దాకారోఽపహృత స్తేన గోపీవస్త్రాపహారిణా ॥

అను మధుసూదన సరస్వతిచే చెప్పబడిన వాక్యార్థమును అనుభవమున గొని శిష్యుడు చెప్పుచున్నాడు.

ఒకని ఇంట నిధిరాతిచే గప్పబడియుండిన ఆనిధిని సిద్ధుల అంజనము (కాటుక)చే దెలిసికొని, ఆరాతిని దీయ బయలగుచున్నది. అయిన దానిని శేష సుఖము ఉపయోగించుటచే గలుగుచున్నది.

అట్లే హరియగు పరమేశ్వరునియొద్ద నాకు ముందు అజ్ఞానదశయందున్న ఉపాసనాకాలమందు అనాది (బహుకాలపు) "దాసోఽహమ్ (దాసుడను నేను)" అను బుద్ధి గలిగి యుండెను. అది గోపికల వస్త్రమును దొంగిలించిన విష్ణువుచే కరుణ వలన గురుశాస్త్ర సమాగమమును గలిగించి దేహాభిమానమును సూచించు *159 "దా" నను రాతిని త్రోయుట మూలముగా గ్రహింపబడినది (చేకొనబడినది). దేనిచే నిప్పుడు నాకు అనాది కాలమునందలి జీవత్వరూప దారిద్ర్యము పోయి తన శరీరమగు ఇంటియందు ముందే నెలకొనియుండిన ఆత్మయొక్క బ్రహ్మత్వరూపధనము దొరకినదో; దానిచే నీ గొప్పలాభము కలిగినది. అయితే దీని విశేషసుఖము నాకు జ్ఞానము గలిగిన పిమ్మట బ్రహ్మ విచారముచే అంతర్ముఖముగా (లోచూపుగా) నిలుచుటచే కలుగును.

100. **దేహాభిమానే గలితే విజ్ఞాతే పరమాత్మని ।**
యత్ర యత్ర మనో యాతి తత్ర తత్ర సమాధయ: ॥

దేహాభిమానము పోయి పరమాత్మ విశేషముగా నెఱుగబడగా ఎక్కడెక్కడ మనస్సు పోవుచున్నదో అక్కడక్కడ (చిన్మాత్రవాసన యొక్క స్థితిచే ఆకాశరూప లక్ష్యమందు వేయబడిన బాణమునువలె తన స్వరూపము ప్రకాశించుటచే) సమాధి యగును. ఈ శ్లోకమున కిది రెండవ అర్థము:- దేహాభిమానము తరుగక

159. దాసోఽహం అను దానిలో నున్నది 'దా' అది పోగా మిగిలినది సోఽహం అనునది.

పరమాత్మయు విశేషముగా నెఱుగబడక ఎక్కడెక్కడ మనస్సు పోవుచున్నదో అక్కడక్కడ మంచి ఆధులు (మనో దుఃఖములు)గలవు.

ఈ యర్థమునే మనస్సున గొని శిష్యుడు చెప్పుచున్నాడు-

స్థూలదేహమున అహంకార అధ్యాసను ముందుంచి ఇంద్రియములు, ప్రాణము, మనస్సు మొదలగు వానియందు అహంకార అధ్యాస కలుగుచున్నది. అహంకార అధ్యాసను ముందుంచి ఇదంతా రూప అధ్యాస కలుగుచున్నది, దానియందును పేరుయొక్క అధ్యాసను ముందుంచుకొని రూపాధ్యాస కలుగుచున్నది. ఇది అనుభవ సిద్ధమగును. దేనిచే విద్వాంసుడైన నాకు దేహమందు నేనను అభిమానరూప అహంకారముయొక్క అధ్యాస పోయినదో; దానిచే నింద్రియాదుల సంఘాతమందు అహంకారమున్ను, బయటి జగత్తు (నామరూప) నందు ఇదంతయు (హితము) నయిన నీని అధ్యాస పోయినది, దీనిచేతనే దానియందణగియుండు గృహము మొదలగు వానియందు నాదనుట మొదలగు వాని అధ్యాస తీరినది. [ఎఱుగబడిన అర్థము నందుండు ప్రతిబింబము బింబముయొక్క సన్నిధి యయిన ఉపాధిబలముచే తెలియునట్లు ప్రారబ్ధమైన ఉపాధిబలముచే బాధింపబడిన ప్రపంచభాసము (తెలియుట)ను కలుగుచున్నది. కావున దానియందు సత్యతాబుద్ధి కలుగుట లేదు] సత్తయొక్క ప్రకాశముచే బ్రహ్మము నిజరూపముగా ప్రకాశించుచున్నది. కావున అప్రమాదియయి (సోలిపోవుట లేక) అవిద్వాంసునకు వ్యవహారమందును ఎల్లప్పుడును సమాధి యున్నది. వానికంటె మాఱయిన అవిద్వాంసునకు అధ్యాసతో నిజరూప బ్రహ్మము వ్యక్తము కానందున ఎప్పుడును విక్షేపరూప ఆధి (మనోదుఃఖము) ఉన్నది.

101 అహంకారో ధియం బ్రూతే మానుప్తం ప్రతిబోధయ ।
ఉత్థితే పరమానందే న త్వం నాహం న వై జగత్ ॥

అను శ్లోకపు అర్థమును మనస్సునందుంచుకొని శిష్యుడు చెప్పుచున్నాడు- ఆత్మయగు పతికి బుద్ధియను పత్నియట. ఆయాత్మ అజ్ఞానమగు నిద్రయందు అనాది కాలముగా నిద్రించుచున్నది. బుద్ధి యగునది అహంకార (దేహాభిమాన)

రూప జారత్వ (వ్యభిచార) ముచే చెడినది. అందుచే జగద్రూప పుత్రుని గనెను. పిమ్మట ఎప్పుడు బుద్ధియగు నామె సత్సంగమను చెలికత్తెల ఉపదేశముచే ఆత్మను పొంది (దానిజ్ఞానమును సంపాదించుచు) ఉన్నదో, అప్పుడు బుద్ధిని జూచి అహంకారము "నిద్రపోవువానిని లేపవలదు. ఏలయన ఈపరమానందరూపము మేల్కొనగానే నీవు ఉండవు, నేను ఉండను, జగము నుండదు, అన్నిటికి అజ్ఞానరూప మూలముతో తొలగుట రూపబాధ కలుగుచున్నది" అని చెప్పినది. అయినను ఉత్తమజాతి కన్యవలె ఉత్తమ సంస్కారము గలదైన బుద్ధి, బాధరూప ప్రాయశ్చిత్తముకొఱకు వానిని లేపుచున్నది- అనునది అర్థము.

102. ఇప్పుడు ఆత్మయగు రాజు సంసారమగు దేశాంతరమునకు పోవుట వచ్చుట యగు యాత్రసమయమున బుద్ధిరూపదాసితో తాదాత్మ్య అధ్యాసరూప ప్రీతిచే దానిని మహారాణియని కల్పించి శరీరరూప తననగరమున హృదయమున అంతఃపురమున నిలిపెను. అయితే అట అది శోకము గలది యాయెను. దానిశోకము పోగొట్టుటకొఱకు అనేక విధములగు మతవాది గురువులగు వైద్యుల నడిగెను. అయినను వారు దాని బయటివృత్తియగు నాడియందు రోగమును గానక పోవుటచే శోకమును పోగొట్టు ఉపదేశరూప ఔషధము నీయలేదు. ఇట్లు చేయుచుండ ఎప్పుడు బ్రహ్మనిష్ఠగురువగు నొక సమర్థవైద్యుడు దొరకునో అప్పుడు దానిని ప్రశ్నించుమూలముగా జగత్తురూప స్వర్ణకారుడగు తన ప్రియతముడు (అధికప్రియుడు)కోరినట్లు దొరకనిదగు వియోగముచే గలిగిన శోకమగు నిమిత్తమును దెలిసి వానిని అధ్యారోపమూలముగా సమీపమునకు దెచ్చి భేదజ్ఞానమగు వివేకకాలమందు రెండవరూపముగా ఆత్మయగు రాజుదగ్గఱ స్థాపించెను. పిమ్మట ఆమెకు శోభనాధ్యాస (రమణీయత్వము) రూపరక్తమును చెఱచు దోషదృష్టియగు రసమును ప్రతిదినమును ద్రాగించి దానియందు విరసత్వపు విరూపత్వమును సంపాదించు మూలమున బుద్ధియగు దాసికి వైరాగ్యమును సంపాదించి ఆత్మయగు రాజునందు ప్రీతిని వృద్ధిపఱచెను. అప్పుడు మిథ్యాత్వము నెఱుగు దృఢవైరాగ్యమును గలిగించుదాని (జగద్రూప స్వర్ణకారుని) నాశము (బాధ) కలిగెను. ఇట్లు బుద్ధిరూప దాసియగు నది నానా విషయమయమగు

జగమును స్వర్ణకారునివద్ద (కలియుటను జేయని తనయొక్క వ్యభిచారము గల మిత్రునియొద్ద దోషదృష్టిచే గాన్పింపగా మిథ్యాత్వము నెఱుగుటచే కనబడినది యయిన వైరాగ్యమును సంపాదించి నిత్యప్రాప్తియగు ఆత్మయను రాజునొద్ద మిక్కిలి అడ్డులేని) ప్రీతిని చేసి సర్వశోకముల నివృత్తిపూర్వకముగా పర మానందమును బొందెను. అందుచే దాని అధ్యాసచే శోకము గలవానివలె నుండిన ఆత్మయగు రాజున్ను శోకము లేనివాడును ఆనంద రూపుడునై ఎట్లో యట్లే కనబడెను' అను రూపకమును శిష్యుడు స్మరించి చెప్పెను.

103 నిర్దోషో నిశ్చలో నాథః! సదోషా చంచలా వధూః ।
దంపత్యోరనయోర్నూనం రసభంగో భవిష్యతి ॥
పృథక్త్వేన పరిజ్ఞాతా దుష్టరూపతయాఽఽత్మనః ।
న ముఖం దర్శయ త్యేషా సలజ్జా మ్రియతేఽపి చ ॥

అను రెండుశ్లోకముల అర్థమును బుద్ధియందుంచుకొని శిష్యుడు చెప్పుచున్నాడు:- ఆత్మ యగు నాథుడు (పతి) నిర్దోషమును (అవ్యభిచారియు) నిశ్చలమును (అవికారియును) నై యున్నాడు. బుద్ధియను స్త్రీ యనునది వ్యభిచారదోషము గలదియు వికారియునై యున్నది. ఈ దంపతులు స్త్రీ పురుషు లందు నిశ్చయముగా రసభంగమగును. బయటి చూపును గల బుద్ధియగు స్త్రీకి ఆత్మయొద్ద ప్రియము లేనందున అయితే యెట్లో యొకట్లు (విక్షేపముతో) వ్యభిచారము నడచుచుండెడిది. ఎప్పుడు గురువగు పరమమిత్రుని మూలముగా ఆస్త్రీని ఆత్మ (తనకంటె) వేఱగుటచేతను దృశ్యమగు జడమను అనిత్యత్వరూప దోషముతో గూడుటచేతను దెలిసికొన్నాడో, అప్పుడు అది కర్తృత్వము భోక్తృత్వము మొదలగు తనధర్మమగు వాటితో తాదాత్మ్య అధ్యాసమైన తన ముఖమును చూపుట లేదు. ఏబుద్ధి గలదో యామె మిక్కిలి యుత్తమ సంస్కారమగు లజ్జతో గూడినదగు కాలము నిర్వికల్పసమాధియైన ఆనందసాగరమున మునిగి మరణమును బొందుచున్నది.

104 యేన చేతయతే విశ్వం విశ్వం చేతయతే న యమ్ ।
యో జాగర్తి శయానేఽస్మి న్నాయంతం వేద వేద నః ॥

అను శ్రీమద్భాగవతపు ఎనిమిదవ స్కంధమందుండు మనుస్తుతి వాక్యార్థమును శిష్యుడు అనుభవగోచరము చేసి చెప్పుచున్నాడు- దేనిచేత (ఏచేతనమగు పరమాత్మచే) విశ్వము (జగత్తు) చేతనమును బొందుచున్నాడో? (చేష్ట చేయుచున్నదో) దేనిని (ఏఆత్మను) విశ్వము, చేతనముతో (చేష్టతో) గూడినదిగా జేయుట లేదో, ఇది (విశ్వము) నిద్రింప ఏది మేల్కొనియున్నదో, దానిని వీడు (సంఘాతరూప పురుషుడు) ఎఱుగుట లేదు. అది (వానిని) ఎఱుగుచున్నది.

105. లోకాశ్చ భాంతి పరమే మయి మోహజన్యాః
స్వప్నేంద్రజాల మరునీరసమానభాసాః ।
వ్యుత్థానకాల ఇహ సన్త్యరలం విచిత్ర
ప్రత్యక్సుఖాబ్ధి పరమామృత చిత్తవృత్తౌ ॥

అను శ్లోకార్థమును, మనస్సున నిడుకొని శిష్యుడు చెప్పుచున్నాడు-

స్వామీ! సమాధినుండియు, మేల్కొనిన కాలమున పరబ్రహ్మమయిన నాయందు స్వప్నము, ఇంద్రజాలము ఎండమావులనీరు- అనువానికి సమముగా అవభాసముగల మోహము (అవివేకము) చే గనబడు లోకములు (చరాచరములగు జీవులును, వాని కాశ్రయమయిన పదునాలుగు భువనములును, వానిభోగ్యమగు అన్నాదులును, అన్నిటికిని కారణమైన స్థూల సూక్ష్మ భూతములును) కాన్పించుచున్నవి. అయితే యీపరిపూర్ణ విచిత్ర (అలౌకిక) ప్రత్యక్ (లోపలి) సుఖముయొక్క సముద్రమయిన పరమామృత సంబంధము గల చిత్తవృత్తియందు (లోపల) ఆలోకము లుండుట లేదు.

106 నిరతిశయసుఖాబ్ధౌ స్వప్రకాశే పరేఽస్మిన్
కథమిదమవివేకాదుత్థితం ప్రక్షణేవ ।
క్వ చ తదధునా తద్దేశికో వా శ్రుతిర్వా
పరమ విమలబోధేఽభ్యుత్థితేఽహంన జానే ॥

నిరతిశయ (అన్నిటికంటె అధికమయిన) సుఖసముద్రమున నీయన్ని

జగములును, రజ్జువునందు మాలయును, సర్పమువలె, నవివేకముచే నెట్లు కలుగుచున్నది? ఇప్పుడు మేలైన విమలబోధము కలుగగానే యదెక్కడ దాగియున్నది? లేక దేశికుడైనను, శ్రుతియైనను నెక్కడపోయెను? అనుదాని నేనెఱుగను.

107 ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాణ్డవ!।
న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥

సాత్త్వికవృత్తుల సమూహమయిన ప్రకాశ (సత్త్వగుణమును రాజసవృత్తుల సమూహ మయినవృత్తిని (రజోగుణమును) తామసవృత్తుల సమూహమయిన మోహ (తమోగుణ)మును (వీనియందు) చక్కగా ప్రవర్తించినవాని (రజస్తమో పరిణామముల) యందు ద్వేషము చేయుట లేదు. నివృత్తియైనవాని సత్త్వగుణ పరిణామములయందు ఇచ్ఛ చేయుట లేదు. (ఈ మొదలగు లక్షణములతో గూడిన వాడెవడో వాడు గుణాతీతు డనబడుచున్నాడు)- అను నీ మొదలగు గీతయొక్క పదునాలుగవ అధ్యాయమునందు జెప్పిన గుణాతీతుని లక్షణములను తనయందుంచుకొని యిప్పుడు శిష్యుడు చెప్పుచున్నాడు, - ప్రకాశము, ప్రవృత్తి, మోహము- అనుగుణములు మూడును వానిలో ప్రవర్తించిన కామక్రోధాది రూపములున్ను; నిద్ర, సోమరితనము, ప్రమాదము (సోలుట) డంబము మొదలగునవియైన రజస్తమోగుణముల పరిణామముల నేను ద్వేషించుట లేదు. వానికి సాక్షియగు నాకు చెఱుపు లేనందున నివృత్తి యగు శమము, దమము మొదలగు సత్త్వగుణ పరిణామముల ఇచ్ఛయు నాకు లేదు. వానికి సాక్షియగు నాకు లాభమును లేనందున.

108. బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యుడు, శూద్రుడు, అతిశూద్రుడు మొదలగు సకల జనులయందును దేహము మొదలగు సంఘాతముల అభిమానము లేక ముందే సామాన్యముగా "అహం" నేను అను ప్రత్యయము (శబ్దము జ్ఞానమును) కలుగుచున్నది. దానికి విషయ మగుటచే పొందబడిన చిత్తచైతన్యము ఏదియో యది ఎవనికి పరోక్షమగును? ఒకనికి కానేరదు. అందటికిని అన్ని వేళలందును అపరోక్షమే యగును కావున నెఱుగబడని

(విజ్ఞానమునకును విషయము గాని) దిగ్గా నున్నను అపరోక్షముగా నుండుటచే స్వప్రకాశముగా నున్నది. ఇందుచేతనే నేను "తెలియబడనిదై నిత్యఅపరోక్ష మగును" అను లక్షణము గల స్వయంప్రకాశుడనై యున్నాను అని నేను తమకృపచే నిశ్చయము చేసితిని.

109. ఒక రాజు దగ్గర నిత్యము కథను జెప్పు అజ్ఞానియగు పండితుని మంత్రి ప్రేరణచే రాజసభయందు వచ్చిన యొక పండితుడు 1. పరమేశ్వరుడెక్కడ ఉన్నాడు? 2. పరమేశ్వరుడేమి చేయుచున్నాడు 3. పరమేశ్వరుడేమి భుజించు చున్నాడు 4. పరమేశ్వరుని ముఖ మేదిక్కుచూచి యున్నది అని నాలుగు ప్రశ్నలు చేసెను.

అప్పు డాపండితు డుత్తర మీయలేదు. అయితే "ఇట కథ చేరిక కావలసియున్నది: కావున నిప్పుడు బదులు చెప్పు నవశ్యము లేదు. రేపు ఒక గంటకు ముందే వచ్చి వీనికి బదులు చెప్పెదము" అని చెప్పి కథ పూర్తిచేసి యింటికిబోయి తన పుత్రునిజూచి "ఆపండితునిచే వేయబడిన ప్రశ్నల కుత్తరమీయ నావలన గానేరదు. ఉత్తర మీయకపోయిన నాప్రతిష్ఠకు భంగము గలుగును. కావున నాక రూపాయకు అభినిమందు కొనిరమ్ము. నేను దానిని దిని చచ్చెదను" అని చెప్పెను. దీనిని విన్న జ్ఞాననిష్ఠుడైన వాని పుత్రుడు "వీనికి బదులు తమ బిడ్డను నేను చెప్పగలను" అన అప్పుడు వాడు చావలేదు. పిమ్మట మరుదినము ఆపండితుడును నీపండితుడును కథకు ఒక గంటసేపు ముందు శిబికయందు గూర్చుండి రాజ సమ్ముఖమునకు వచ్చిరి. అప్పుడు రాజుయొక్క పండితుడు "ఈ ప్రశ్నలకు బదులు నాకుమారుడు ఇచ్చును" అని చెప్ప దానిని విని రాజు పల్లకిని పంపి వాని పుత్రుని రప్పించి యుత్తమాసనమున కూర్చుండ నుంచి ప్రశ్నించెను. అప్పుడాతడు చెప్పినది-

ఒక నీరు నిండిన కుండను దెప్పింపుడు అన అట్లే తెప్పించెను. దాని యందొక శేరు కలకండ వేయుడన, వేసెను. అది కరిగిపోగా ఈ నీళ్ళలో వేసిన కలకండ ఎక్కడ'అని యడిగెను. అప్పుడు రాజన్ని చోట్ల ఉన్నదనెను. ఇది మొదటి ప్రశ్నమున కుత్తరమైనది. పండితుని పుత్రుడు ఇట్లు పరమేశ్వరుడన్ని జగముల

గలడు ఎక్కడను నున్నాడు అనెను.

2. (1) పిమ్మట పండితుని పుత్రుడు "రాజా! తామొక ఘడియసేపు రాజ్యాధికారమును విడిచి నాయొద్ద ఇండు" అనెను. దానిని విని రాజట్లే చేసెను. అప్పుడు పండితుని పుత్రుడు తాను సింహాసనమెక్కి రాజును చెరయందుంచెను. అట్లుంచి 'ఎట్లు పనివాడ నగు నేనొక క్షణమున రాజైతినో రాజగు తామే తత్క్షణమున ఎట్లు సేవకుడైతిరో యట్లు సగుణరూపమున పరమేశ్వరుడు క్షణములో బీదవానిని రాజుగా నైనను, శ్రీమంతునిగా నైనను జేయుచున్నాడు. రాజు నైనను శ్రీమంతు నైనను బీదనుగా జేయుచున్నాడు అని చెప్పి మరల రాజును తనపదవి యందుంచెను.

(2) లేక ఎట్లు రాజు తాను అకర్తగా నుండ నాతని మంత్రి మొదలగు వారు యుద్ధము, ప్రజలను గాపాడుట మొదలగునవియైన కార్యములను జేసినను అన్ని పనుల ఆరోపణయు రాజునందు గలుగుచున్నదో; అట్లే నిర్గుణ రూపముగా పరమేశ్వరుడు తాను ఉత్పత్తి మొదలగు కార్యములను జేయని వాడైనను మాయ మొదలగు వానిచే చేయబడు ఉత్పత్తి మొదలగు కార్యముల ఆరోపము అతనియందే చేయబడుచున్నది.

(3) రాజో తాను జేయుట లేదు. అయితే సేవకులను గొని క్రియలను చేయించుచున్నాడు. దీనిచే వికారి యగునను అరుచిచే వేరు దృష్టాంతము చెప్పబడుచున్నది.

లేక, యెట్లు భరతునిచే రాజ్యపరిపాలనాది కార్యములు చేయబడినను "శ్రీరాముని పాదుకలు రాజ్యాదులను జేయుచున్నవి" అని రాము పాదుకలందు ఆరోపింపబడుచున్నదో యట్లు మాయాప్రకృతిచే సృష్టి మొదలగు కార్యములు గలుగుచుండియు బ్రహ్మమునందు దాని ఆరోపము గలుగుచున్నది. లేక ఇట్లు నిర్గుణరూపముచే పరమేశ్వరుడు చేయుచున్నాడనుట ఉపచారమాత్ర మగును. ఇది 2వ ప్రశ్నమున కుత్తరము.

3. ఎట్లు సోపాధిక (కాష్ఠము మొదలగు ఉపాధులం దెక్కియుండు) అగ్ని

హోమము చేయబడిన ద్రవ్యము మొదలగు వానిని భుజించున దైనను నిరుపాధిక రూపముచే అగ్ని అభోక్త యగుచున్నదో యట్లు సన్న్యాసి సాధు బ్రాహ్మణుడు ఆకలిచే కష్టపడువాడు అను వానియందు ఈశ్వరార్పణ బుద్ధిగా నివ్వబడిన భోజనమును విరాట్టు మొదలగు సోపాధిక (సగుణ) రూపముచే పరమేశ్వరుడు భుజించుచున్నాడు. నిరుపాధిక (నిర్గుణ) రూపముచే నతడు అభోక్తగా నున్నాడు. ఇది మూడవ ప్రశ్నమున కుత్తరము.

4. దీపపు వత్తి చేయించి దానిని ముట్టించి. పండితుని పుత్రుడు "దీని (దీపవత్తి) ముఖము ఏదిక్కును జూచుచున్నది" అని యడిగెను అప్పుడందరు అన్ని దెసలను జూచుచున్నది యన పండితుని పుత్రుడు "అట్లే పరమేశ్వరుడును అన్ని దిక్కులను జూచుచున్నాడు. వాస్తవమున ముఖము లేనివాడును" అనెను. ఇది నాల్గవ ప్రశ్నమున కుత్తరము.

ఈ ప్రసంగమును మనస్సున గొని శిష్యుడు పైజెప్పిన లక్షణములు గల పరమేశ్వరుడు నేనే యనెను.

110. దౌ మనస్తదనుబంధ విమోక్షదృష్టిః
పశ్చాత్ప్రపంచరచనాభువనాభిధానా ।
ఇత్యాదికా స్థితిరియం హి గతా ప్రతిష్ఠా
మాఖ్యాయికా సుభగ బాలజనోదితేవ ॥

అను వాసిష్ఠశ్లోకము యొక్క అభిప్రాయమును శిష్యుడు మనస్సున గొని చెప్పుచున్నాడు- ఆదియందు మనస్సు (లేచుట) కలిగెను. దానివెనుక బంధమోక్షముల దృష్టి కలిగెను. పిమ్మట బంధదృష్టియం దణగిన పదునాలుగు భువనములను ప్రపంచసృష్టి కలిగెను. ఈ మొదలగు సృష్టియొక్క స్థితి మంచి బిడ్డలకొఱకు, దాది చెప్పిన కథవలె ప్రతిష్ఠను (వినువాని చిత్తమున కెక్కుటను) కలిగియున్నది. ఎట్లు ఒక దాది యగునది, ఏడ్చుచున్న బిడ్డకు వినోదముగా, బాబూ! నేను నీకొక కథ చెప్పుచున్నాను వినుము:- ఒక శూన్యనగర ముండెడిది. అందు ముగ్గురు సుందర రాజకుమారు లుండిరి. వారిలో నిద్దఱు పుట్టుక లేనివారు,

ఒకడు గర్భమందును రాలేదు. ఆ రాజకుమారులు వేటాడిరి. ఆకసమున పండిన వృక్షములను జూచి వానిక్రింద గూర్చుండిరి. ఆవృక్షములు ఎట్టివి యన అందు రెండో మొలవలేదు. ఒక్కటికి విత్తులేక యుండెను. స్వర్గలోకము వరకు ఎత్తుగా పెరిగి యుండెను- అని యిట్లు చెప్పెను.

వాసిష్ఠమున జెప్పిన నీ మొదలగు కథలను విని యా బాలుడు, విచారము లేని బుద్ధితో నిశ్చయమును బొందెను. అట్లే శ్రుతి యీ యజ్ఞానులకు విషయ దృశ్యమగు నేడ్పును బోగొట్టుటకొఱకు ముందు చెప్పిన (మనస్సు మొదలగు) ఆకాశాది సృష్టి అజ్ఞానియొక్క చిత్తమందు ముందు చెప్పిన రాజకుమారుల కథనుబోలి భ్రాంతిచే గనబడుచున్నది. దాని క్రమమును చెప్పు (అనువదించు) చున్నది. దానిని విని ఈ యజ్ఞానులు సత్యమని నిశ్చయము నొందుచున్నారు. అయితే యాశ్రుతికి సృష్టిని చెప్పుటలో తాత్పర్యము లేదు. వీని చిత్త మందుండు జగముయొక్క సత్యత్వమును నివర్తించు కొఱకు నేయే విధముల నైనను సృష్టిని ఆరోపించి దాని అర్థమును విచారించుటచే సహజముగా అవవాదము చేయించుటవలన అద్వైత తత్త్వమును నెఱిగించుటయందు తాత్పర్య మున్నది.

111. ఇప్పుడు దేహమందు కూటస్థ చిదాభాసుల భేదము నెఱిగి కూటస్థ (సాక్షి) స్వరూపముయొక్క భేదము తనకు సిద్ధించెనని సూచించుటకొఱకు శిష్యుడు వీనిని జెప్పుచున్నాడు.

ఆకసమందుండు సూర్యునిచే బ్రకాశింపబడిన గోడయందు ఎట్లు అద్దపు సూర్యప్రకాశము (ఎండయందుంచబడిన అద్దమునందుండు సూర్యుని ప్రతిబింబప్రకాశము) కలుగుచున్నదో, యట్లే సాక్షిచే (కూటస్థచేతనముచే) ప్రకాశింపబడిన దేహబుద్ధి యందుండు చిదాభానునిచే విశేషప్రకాశము కలుగుచున్నది. అనేక అద్దములందుండు సూర్యుని గోడయందు పడు అనేక ప్రకాశములు సంధియందును సకలఅద్దములు ఆభాసకాలము లందును ఆకాశ మందుండు సూర్యుని సామాన్య ప్రకాశము కలుగుచున్నది. దానివలె జాగ్రత్స్వప్న ముల వృత్తుల సంధులయందును, సుషుప్తియందు సకలవృత్తులు లేమియందును నెడతెగక కూటస్థుడగు నాయొక్క సామాన్య ప్రకాశ మున్నది.

ఇప్పుడు కూటస్థదీపమందు చెప్పినదగు దేహముయొక్క బయట చిదాభాస బ్రహ్మచేతనముల వివేకమును నాకు సిద్ధించినది అనుదానిని సూచించుకొఱకు శిష్యుడు చెప్పుచున్నాడు-

ఘటాకారమగు బుద్ధియందుండు చిదాభాసుడు ఘటమునే అవభాసము (ఇది ఘటమని ప్రకాశము) చేయుచున్నాడు. ఘటముయొక్క జ్ఞాతృత్వమును అజ్ఞాతృత్వమును నేబ్రహ్మము (బయటి చేతనము) ప్రకాశింప జేయుచున్నదో,

అనగా ఘటరూపబుద్ధి పుట్టునప్పుడు బుద్ధియందుండు చిదాభాసుడు (కల్పితవిశేష చైతన్యము) ఇది ఘటమని ఘటమాత్రమును తెలియుచున్నది.

ఘటాకారబుద్ధి ఉదయించుటకు ముందు ఘటమందున్న "ఘటమును నేనెఱుగను" అను అనుభవమునకు విషయమగు అజ్ఞాతృత్వమును అజ్ఞానరూప విశేషముతో "ఘటమును, నేనెఱుగ" ననునట్లుగా బ్రహ్మచైతన్యము ప్రకాశింప జేయుచున్నది.

ఘటాకారబుద్ధి ఉదయమయిన పిమ్మట ఘటమందు " ఘటమును నే నెఱుంగుచున్నాను'' అను అనుభవమునకు విషయమయిన ఏజ్ఞాతత కలిగియున్నదో; దానితో ఘటరూప జ్ఞేయమును, నేను అను పదమునకు అర్థమగు బుద్ధి యందుండు చిదాభాస రూపజ్ఞాతను; దాని జ్ఞానరూప విశేషణమునున్ను ఘటమును నేనెఱుగుచున్నాను'' అనునట్లుగానే బ్రహ్మచేతనము ప్రకాశింప జేయుచున్నది. ఘటాకారవృత్తి యందుండు చేతనము సాక్షియగును. దానిచే త్రిపుటియొక్క (జ్ఞాతృ, లజ్ఞాన, జ్ఞేయముల) ప్రకాశము సంభవించుచున్నది. అయినను కకారమును అక్షరము తెల్లని కాగితమున శబ్దమాత్ర భేదముగా నుండుటవలె సాక్షికిన్ని బ్రహ్మమునకును శబ్దమాత్రభేద మగును. కావున నిట సాక్షియే బ్రహ్మశబ్దముచే చెప్పబడియున్నది. దీనిచేతనే యా సామాన్య చేతనరూప బ్రహ్మము ఘటాకాశముకంటె మహాకాశము భిన్నము కాని యట్లు, సామాన్య చేతనరూప మగునది కూటస్థుడనగు నాకంటే వేఱుకాదు. కావున "నేను బ్రహ్మము'' అనునది అట్లు చెప్పుటలో రహస్యాభిప్రాయ మగును.

112. మఱియు స్వప్రకాశ రూపముగా ఆత్మయొక్క స్వరూపమును శిష్యుడు చెప్పుచున్నాడు:- శరీరమను నృత్యశాలయందు చిదాభాసరూపజీవుడు రాజు, వాని దగ్గఱ మనస్సనునది మంత్రి, పంచ ప్రాణములు పనివారు, శబ్దము మొదలగు విషయము లైదును సభలోనివారు (సభ్యులు), శ్రోత్రము మొదలగు దశేంద్రియ ములు వాద్యగాండ్రు, బుద్ధి ఆటకత్తె; సాక్షి (ప్రత్యగాత్మ) దీపము, అవన్నియు దీని సన్నిధియందున్నవి. మరియు అది జాగ్రత్ స్వప్నము లివన్నియు నుండినను అప్పుడున్ను ప్రకాశించుచున్నది. సుషుప్తియందు ఇవియన్నియు లేకపోయినను అప్పుడు దానిని (లేనిదానిని) ప్రకాశింప జేయుచున్నది. అదియే నేను.

అనేక రంధ్రములతో గూడిన ఘటముయొక్క లోపలి భాగమున గల దీపమునువలె, విశేషముగా ప్రకాశించు దేని జ్ఞానము ఇంద్రియరూప బహురంధ్రముచే బయట ప్రకాశించుచున్నదో, (ఎఱుగుచున్నానని, దానిప్రకాశము కలిగిన పిమ్మట ఈసకల జగత్తును ప్రకాశించుచున్నదో) ఆప్రకాశము (ప్రకాశమురూపము చేతనము) నేను.

స్నేహము (తైలము) దీపము (వత్తి) పాత్రము (ఆధారము) -ఇవి లేని యొక (మనోవాక్కులకు విషయముకాని) బ్రహ్మమయిన దీపము ప్రకాశించుచున్నది. ఈదీపము మూడు లోకములను నొక (అనిర్వచనీయ) అంజనమును (నలుపును) వివేకించి చూపుచున్నది. అదియే నేను. ఈయర్థము

దీపః కోఽపి సమింధే స్నేహదశాధారహీనమన్వందః।
తదుపరి కిమపి తమిస్రం త్రైలోక్యమథో వివిచ్య దర్శయతి ॥

అను సిద్ధాంత చంద్రికోద్గార గ్రంథ వాక్యమున చెప్పబడియున్నది.

113. ఇప్పుడు ఆత్మయొక్క పరమానందమును శిష్యుడు అనుభవ గోచరముచేసి చెప్పుచున్నాడు. "చదువుచుండెడు అనేక బాలురమధ్య నుండు ఒక పుత్రుని యెలుగు (కంఠధ్వని) సామాన్యముగా వాని తండ్రికి వినబడినను అనేకులతో జదువుటయను ప్రతిబంధముచే ఇది నాపుత్రుని స్వరమని విశేషముగా తెలియుట లేదు. అట్లు పరమానందుడగు నేను సామాన్యముగా పరమప్రీతికి

విషయమయి యుండుటచే ప్రకాశించియు (వ్యక్తమయ్యి) లేదు, కనబడలేదను ఆవరణము అను ప్రతిబంధముచే "నేనే పరమానందరూపుడను" అని విశేషముగా గనిపించుటలేదు అని విచారించి "సామాన్యముగా ప్రకాశించు (తెలియుచుండు) పరమానందము ఏదియో యది నేను" అని శాస్త్రము, గురువు, తనయనుభవము అనువాని కృపచే, నాసుఖరూపమును విశేషించి ఎఱిగితిని."

114. ఇప్పుడు శిష్యుడు అనేకమతముల అపవాదముతో శ్రుతియందు పొందబడిన నిజస్వరూపమును చెప్పుచున్నాడు. స్త్రీ, శిశువు, గ్రుడ్డివాడు, జడుడు అనువారికి సమమగు చార్వాకుడు (1) ప్రాణోపాసకుడు (2) ఇంద్రియాత్మవాది (3) క్షణిక విజ్ఞానవాది (4) శూన్యవాది మొదలగువారు (నైయాయికులు మొదలగువారు) (5) అనువాదులు ఎక్కడ భ్రాంతులయి క్రమముగా దేహము (1) ప్రాణము (2) ఇంద్రియములు (3) బుద్ధి (4) శూన్యము (5) అజ్ఞానము మొదలగునవి (5) అనువానిని తానని చక్కగా నెఱుగుచున్నారో ఆ కొలత లేనిది (అణువు పొట్టి పొడుగు మొదలగు పరిణామములు లేనిది) తానగు ఆత్మయగు నేనై యున్నాను.

115. ఇప్పుడు శిష్యుడు మాయయొక్క ఆశ్చర్యరూపమును చెప్పుచున్నాడు:

ఒక (అనిర్వచనీయ) నల్లని (మేఘమను మూతరూపమగు) మాయ యెప్పుడు చిదాకాశమందు భువన (పదునాల్గు లోకముల) రూపజలమును (సృష్టించిన దగు వర్షమును) కురియుచున్నదో అప్పుడు బ్రహ్మ మొదలగు జీవులగు తుచ్ఛమగు కప్పలు (మండూకములు) నాల్గుప్రక్కల దుముకుచున్నవి.

ఒక (యనిర్వచనీయమగు) ముసలి (అనాది కాలపు) అసత్తైనది (సత్తుకంటె విలక్షణమయిన మాయ యగు వేశ్య) సంగము లేకయే అసంగపరమగు పురుషుని కలిమియంతయు (ఆత్మస్వరూపమగు ధనమును) దొంగిలించుచున్నది. అయ్యో ఈలోకమందుండు చెడుగు నేమని చెప్పుదు? ఏమియు చెప్పగానేరదు.

116. ఇప్పుడు ఇంద్రజాలరూపముగా జగముయొక్క మిథ్యాత్వమును జెప్పుచున్నాడు.

గర్భమందున్న బిందు వగునది సాంగోపాంగముగా (చేయి, కాలు, తల, మొదలగు అంగములును వ్రేలు మొదలగు ఉపాంగములు కలిగి) గర్భముతో గూడినదై క్రమముగా శిశుత్వము మొదలగు అనేక వేషములతో గూడినదయ్యి శ్రవణాదులును, గమనాదులును నగు పనులు చేయుచున్నది, దీనికంటె వేఱు ఇంద్రజాలమేమి? ఒక్కటియు లేదు. అయితే యిట్లు కలుగు వటవృక్షము మొదలగు రూపము గలదగు నీజగత్తంతయు నింద్రజాల మగును. కావున మిథ్య యగును.

117. ఇప్పుడు ఈశ్వరుడు, గురువు, ఆత్మ - అనువానికి వాస్తవముగా నేకరూపత్వము చెప్పువాడై శిష్యుడు తన ఆత్మకు దేహాభిమానమును విడుచుటతో అది నేనను చింతనరూప నమస్కారము చేయుచున్నాడు.

ఈశ్వరుడు, గురువు, ఆత్మ అనురూపముచే భేదమయి ఒక్కటిగా ప్రకాశించు పరమగు నాకు అనేక నమస్కారములు ఇది.

ఈశ్వరో గురురాత్మేతి మూర్తి భేదాద్విభాగినే ।
వ్యోమవద్వ్యాప్తదేహాయ దక్షిణామూర్తయే నమః ॥

"ఈశ్వరుడు, గురువు, ఆత్మయను మూర్తిభేదములచే వ్యాపకమును బొంది ఆకాశమువలె ఏవాని దేహము వ్యాపింపబడియున్నదో యట్టి దక్షిణామూర్తికి నమస్కారము" అను వార్తికకారుని వాక్యార్థము చెప్పబడినది.

118. ఈవిధముగా శ్రీగురువుగారి ప్రార్థన పూర్వకముగా తన ఆత్మను నమస్కరించి ఇప్పుడు తనకిష్టమగు శివుడు మొదలగు పేరులు గల ఈశ్వరుని యందు శిష్యుడు అభేదముగా ప్రార్థించుచున్నాడు-

శివా! తాము నాయాత్మ యయి యున్నారు. మతి (బుద్ధి) శివ (పార్వతి యగును) పంచప్రాణములును నందికేశ్వరుడు మొదలగు పరివారము లగును. శరీరము గృహమగును. శాస్త్రవిరోధము లేని ప్రారబ్ధఫలమగు శాబ్దాది విషయముల భోగము అర్చన యగును. నిద్రయు, నడచుటయు క్రమముగా ధ్యానమును (సమాధియు) ప్రదక్షిణము నగును.

ఇటు ఇది రహస్యము:- ఎట్లు సమాధియందు అజ్ఞానము మొదలగు ప్రపంచ అభావము గలిగి నిష్ప్రపంచ స్వస్వరూపమే మిగులుచున్నదో; అట్లు జ్ఞానికి తత్త్వజ్ఞానముచే మిగత లేని అజ్ఞానము (ఆవరణము) చెడుటవలన వానికి సుషుప్తియందును అజ్ఞానమును, స్థూలసూక్ష్మ ప్రపంచములును లేనివియై సిద్ధించుచున్నవి. ఆలేమి సిద్ధింపగానే నిష్ప్రపంచ స్వరూపమే మిగులుచున్నది. కావున జ్ఞానియొక్క నిద్రయు సమాధికి సమానమై యుండుటచే దానిని సమాధి యనుచున్నాడు. జ్ఞాని తన ఆత్మయయిన శివుని అంతటను నుండువానినిగా (వ్యాపకముగా) ఎఱుగుచున్నాడు. కావున వాని అటుఇటు నడచుట యయినది యాశివుని ప్రదక్షిణమునకు సమాన మగును. వాడుచ్చరించు సకల వాక్యములును స్తుతు లగును.

దీని రహస్య మిది:- ఘటము మొదలగు సకలశబ్దముల వాచ్యార్థము ఆయా యాకారముతో గూడిన అస్తి భాతి ప్రియరూపబ్రహ్మ మగును. ఆయా ఆకారత్వ మును విడిచి మిగిలియున్న అస్తి భాతి ప్రియరూపబ్రహ్మము ఆ శబ్దముల లక్ష్యార్థ మగును. కావున లక్షణావృత్తిచే సకల వచనములును బ్రహ్మమునే (ఆత్మనే) విషయము చేయుచున్నవి.

లేక జ్ఞానియొక్క సకలవచనములును, లక్షణ చేయుట లేకయే శక్తివృత్తి చేతనే శుద్ధబ్రహ్మమును (ఆత్మను విషయము చేయుచున్నవి) వానికి సర్వ జగమును బ్రహ్మరూపముగా గనబడుటచే

వీనిచే నేను ఏయే కర్మములను చేయుచున్నానో యవి శివా! తమ యారాధనమే యగును. అనునది

ఆత్మా త్వం గిరిజా మతి స్సహచరాః ప్రాణాః శరీరం గృహం
పూజా తే వివిధోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః ।
సంచారాస్తు పదోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వా గిరో
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో!తవారాధనమ్ ॥

అను శ్లోకముయొక్క అర్థమగును.

హిమగిరి తనయా హిమాంశులేఖా
సరిదతిశీతల వాహినీ సురాణామ్ ।
త్రిభిరేత్తైరతి వేపితోఽసి శంభో !
మమ హృది విశ త్రితాపతప్తే ॥

అను అప్పయ్య దీక్షితపండితుల వాక్యార్థమును అనువాదము చేయువాడై శిష్యుడు తన యిష్టదైవమగు శివుని ప్రార్థన జేయుచున్నాడు-

శంభో! మంచుకొండకూతురు (పార్వతి), చంద్రుడు, శీతలమగు దేవనది (జడయందుండు గంగ) అనుమూడును శీతలములే. ఈమూటిచేతను తాము మిక్కిలి చలిచే వణకుచుండుటచే ప్రియము కలుగునట్లు నాహృదయమున ప్రవేశింపుము. ప్రవేశించినట్లయిన, తమమూడు శీతలములున్ను పోవును. ఆమూడు తాపములును తీరును.

ఇట ఇది రహస్యము:- శివునిమూర్తి తనదృష్టిని విడుదల లేక దాని మూడు శీతలముల మిధ్యాత్వనిశ్చయరూప అపరోక్షబాధ సంభవింపదు. తన దేహ భావదృష్టిని విడుదల లేక త్రివిధ తాపమిథ్యాత్వ నిశ్చయరూప అపరోక్షబాధ సంభవింపదు. శివునికిని తనకును గల ఉపాధిదృష్టిని వీడుటచే నిరుపాధికమగు పరమశివునికిని ఆత్మకును గల ఏకత్వజ్ఞానము లేని వేఱువిధమగు ప్రవేశము మనస్సున సంభవింపదు. కావున ఓశివా! తాము నిరంతరము నాతో అభేద నిశ్చయమగు తత్త్వజ్ఞానమునకు విషయ మగుదువుగాక! అనునది రహస్య మయిన అభిప్రాయము.

త్వయి మయి చ గణ్యమానే మశకాన్ మశకోఽహమేవ దేహదృశా ।
విశ్వాధిపేశ ! తే మే సద్చిదానంద పూర్ణతా తుల్యా॥

అను వాక్యార్థమును అనువదించి శిష్యుడు చెప్పుచున్నాడు- లోకనాథా! దేహదృష్టిచే తమ్మును నన్నును గణించుకాలమున, నేనొక దోమకంటె చిన్నదోమకు సమమగుటచే, సమానము లేనివాడనై యున్నాను. తమకును నాకును సత్తు చిత్తు ఆనంద మనురూపమున పూర్ణత్వము సమానమే యగును.

శంభువా! దేహదృష్టిచే నేను నీదాసుడను, త్ర్యంబకా! జీవ (ఉపాధితో గూడిన చేతన) దృష్టిచే నేను తమ అంశమై యున్నాను. అన్నిటి ఆత్మస్వరూపుడా! ఆత్మదృష్టిచే తామే నేను అను నీవిధమైన నా బుద్ధి సర్వశాస్త్రము చేతను నిశ్చయము పొందియున్నది.

గ్రంథకర్త వాక్యము.

121. శిష్యుడు ముందు చెప్పినట్లు తానే తన్నెఱిగి కృతార్థు డయ్యెను. పిమ్మట గురువు పాదకమలముల సేవించి గుర్వాజ్ఞ వాక్యములచే ఇంటికి పోయెను.

ఒకకాలమున *160 కాకతాలీయ న్యాయమున

*161 నిష్కామపుణ్య (అశుక్లకృష్ణరూప యోగియొక్క కర్మ) మయమైన ఉత్తమప్రారబ్ధకర్మ ఉత్పత్తిచే ముందు చెప్పిన శిష్యుడయిన జ్ఞానిచిత్తమందు కనబడు భోగములందు దృష్టమిథ్యాత్వముల జ్ఞానులచే తీవ్రతర వైరాగ్యము గలిగెను. అందుచే జీవన్ముక్తియొక్క విలక్షణ సుఖమును చక్కగా భుజించుట కొఱకు ఇల్లు మొదలగు వానిని విడుచుట యగు సన్న్యాసాశ్రమమును తీసికొనెను.

ఇట నిది రహస్యము:- 1. ఉత్తమము, 2. మధ్యమము, 3. కనిష్ఠము, 4. అధమతరము, 5. అధమతమము అను భేదములచే ప్రారబ్ధకర్మమగు-భాగ్యమేదియో యది యయిదు విధములు.

1. ఎప్పుడును నివృత్తికి హేతువగు ప్రారబ్ధకర్మ మేదియో యది ఉత్తమ మగును. ఆదిశుకదేవులు, వాసుదేవుడు సనకాదులు మొదలగు వారియందుండిన ప్రారబ్ధ మగును. అది పుట్టుక మొదలు శరీరముండునంతవఱకు నివృత్తికి హేతువయి యుండుచున్నందున ఉత్తమ మగును.

2. మొదట ప్రవృత్తికి హేతువుగాను పిమ్మట నివృత్తికి హేతువుగాను నుండు

---

*160. కాకికూర్చుండ తాటిపండు పడెను అనున్యాయము (దృష్టాంతము) చొప్పున.

*161. సకామపుణ్యము ఏదియో యది శుక్లకర్మమగు పాప మేదియో యది కృష్ణకర్మమగు ఆరెంటికంటె విలక్షణమయిన నిష్కామ మేదియో యది అశుక్లకృష్ణ కర్మ మగును.

ప్రారబ్ధము మధ్యమ మగును. అది యాజ్ఞవల్క్యుడు మొదలగువారి యందుండిన ప్రారబ్ధము. అది గృహస్థాశ్రమమును అంగీకరించుట యగు ప్రవృత్తికి హేతువుగా నుండి పిమ్మట తీవ్రవైరాగ్యముతోడ విద్వత్సన్న్యాసమును అంగీకరించుట యగు నివృత్తికి హేతువై యున్నందున మధ్యమము అగును.

3. ఎప్పుడును ప్రవృత్తికి హేతువుగా నుండు ప్రారబ్ధము కనిష్ఠ(అధమ) మగును. అది జనకుడు మొదలగు వారికి నుండిన ప్రారబ్ధ మగును. అది యెప్పుడును రాజ్యభోగమును అంగీకరించునది యగు ప్రవృత్తికి హేతువుగా నున్నందున కనిష్ఠ మగును.

4. మొదట నివృత్తికి హేతువుగాను పిమ్మట ప్రవృత్తికి హేతువుగా నుండు *162. ప్రారబ్ధము అధమతర మగును. అది శిఖిధ్వజుడు, అలర్కుడు, ప్రియవ్రతుడు మొదలగు వారికి నుండిన ప్రారబ్ధము. అది మొదటి వైరాగ్య పూర్వకముగా నివృత్తికి హేతువుగా నుండి పిమ్మట భోగేచ్ఛాపూర్వక రాజ్యాదుల నంగీకరించుట యగు ప్రవృత్తికి హేతువై యుండినందున అధమతర మగును.

5. (1) ఇష్టప్రకారము నడచుకొనుట (2) ఇష్టప్రకారము మాట్లాడుట, (ఇష్టప్రకారము భుజించుట అను ప్రమాదమునకు హేతువైన ప్రారబ్ధము. *163 అధమతమ మగును. అది కలియొక్క ప్రమాదముచే కొందఱు ఆధునికులు (ఇప్పటివారు) అనధికారులపై వేదాంతశ్రవణము మొదలగు సుఖసాధనముల ప్రవర్తించు అజ్ఞానులు మొదలగు వారిది. అది (1)ఇష్టప్రకారము నడచుట (2) ఇష్టప్రకారము మాట్లాడుట, (3) ఇష్టప్రకారము భుజించుట యను ప్రమాదములను అంగీకరించుటకు హేతువుగా నుండుటచే అధమతమ మగును. వానిలో,

ముందు చెప్పిన జ్ఞానిపురుషుని ప్రారబ్ధమగు భాగ్యము పూర్వము గృహస్థాశ్రమమును అంగీకరించుట యగు ప్రవృత్తికి హేతువును, పిమ్మట తీవ్రవైరాగ్య పూర్వకముగా నిల్లు మొదలగు వానిని విడుచుట యగు నివృత్తికి

---

*162. అధమముగా నుండు ఒకదానికంటె మరింత అధమముగా నుండునది అధమతర మనబడును.

హేతువుగా నుండుటచే యాజ్ఞవల్క్యుడు మొదలగువారివలె మధ్యమముగా నున్నప్పటికిని అది తీవ్రవైరాగ్యమునకు హేతువయిన నిష్కామ పుణ్య రూపముగా నుండుటచే ఉత్తమమని చెప్పబడినది.

ఇట ఇల్లు మొదలగు వానిని విడుచుట యని చెప్పబడినది. అందు ఇల్లు అనుపదముచే దానిచే ఉపలక్షింపబడిన క్షేత్ర (నేల), పశు, దాస, దాసీ, ధన, ధాన్యాది సంపదయగు ధనమునున్ను; దాని ఉపయోగియగు కృషి వ్యాపారము మొదలగువానియందు ప్రవర్తించుటయగు దాని ఇచ్ఛయును గైకొనవలెను.

"మొదలగునవి'' యను శబ్దముచే పుత్రేషణయు, దాని యుపయోగులకు స్త్రీ వివాహము మొదలగువాని ఈషణము, ఈలోకము స్తుతింపదగు తనమును, నిందింపదగు తనమును సంపాదించు ఇచ్ఛగాక లోకాంతర ఇచ్ఛయను లోక ఈషణయు, దాని యుపయోగి యగు యాగాది కర్మములయొక్క ప్రవృత్తికిని ఈషణయు నయిన వీనిని చేకొనవలయును. కావున నీమూడు ఈషణల నుండియు లేచునట్టి సన్న్యాసమే ఇల్లు మొదలగు వానిని విడుచుటయను వాక్యమునకు అర్థమగును.

ఆ సన్న్యాసము 1. కుటీచకము, 2. బహూదకము, 3. హంసము 4. పరమహంసము అను భేదములచే నాలుగు విధములు.

1. యాత్ర జేయశక్తి లేనందున ఎచ్చట నైనను గుడిసె నేర్పఱచుకొని యుండుట కుటీచకము అగును.

2. సన్న్యాస ఆశ్రమమున కర్మమును జేయుచు యాత్ర జేయుట బహూదక మగును.

3. అగ్నిచే సాధింపబడు కర్మమును విడిచి ప్రణవజపము మొదలగు వానిని ననుష్ఠించు వాడగుట హంస మనబడును.

4. పరమహంస సన్న్యాసమును వివిదిష, విద్వత్తు అను భేదములచే రెండు విధము లగును.

1. జ్ఞానములకు పూర్వము దోషదృష్టిచే గలుగు తీవ్రతర వైరాగ్యముచే జిజ్ఞాసచే జేసికొనబడునది వివిదిషా సన్న్యాస మగును.

2. జ్ఞానమునకు పిమ్మట దోషదృష్టి మిథ్యాత్వదృష్టులచే గనబడు తీవ్రతర వైరాగ్యముచే విద్వాంసుని (జ్ఞాని) చే చేసికొనబడునది విద్వత్సన్న్యాసము.

వానిలో నిట విద్వత్ సన్న్యాసము తీసికొనబడును.

122. ఈ శిష్యుడు సన్న్యాస ఆశ్రమమును అంగీకరించి విక్షేపనివృత్తికొఱకు నేవస్తువులను విడిచి దేహయాత్ర మొదలగు వానికొఱకు నేవస్తువులను విడువక జగమున సంచరించెను? అను శంక కలుగగా నట ఐదును విడిచి, ఐదును విడువక, వాడు జగమున సంచరించెను అని చెప్పబడుచున్నది:-

1. స్త్రీ 2. బంగారు, మఠము మొదలగు నవియగు ధనమును జేకొనుట, 3. విషయము, (శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము) 4. సభ (జనసమూహము,) 5. సన్మానము-అను నీయైదును విడిచి [అట ఐదు విషయములలో స్పర్శమును, రసమును సగము విడువవలెను. ఏలయన వానిని పూర్తిగ విడుచుటచేత దేహయాత్ర సంభవింపదు. కావున వస్త్రమయిన స్పర్శమును భిక్షయగు రసమును విడుచుట కూడదు. వానియందు అధికమును విడువవలెను. అనునది వ్యవస్థ యగును.] 1. వస్త్రము, 2. త్రాటితో గూడిన కమండలము, 3. ఏకాంతము, 4. భిక్ష, 5. దేహాదులు కనబడుచుండునపుడు శ్రుతియగు శాస్త్రము అను నీయైదును విడువక సంచరించెను.

123. పిమ్మట ఆ జ్ఞానిమనో (చిత్త) నిరోధమగు రాజయోగముకొఱకు మొదట ప్రాణనిరోధమగు *164. హఠయోగమును జేసెను. ఆ హఠయోగము చేత పిమ్మట రాజయోగమును సాధించి అష్టాంగములతో గూడిన నిర్వికల్ప రూప శ్రేష్ఠసమాధిని పొందెను.

---

*164. హఠయోగముచే రాజయోగమును సాధించు మార్గము లన్నియు విస్తారముగా హఠయోగ ప్రదీపిక అను గ్రంథమందు వ్రాయబడియున్నది. ఇట దాని స్వభావము మాత్రము సంగ్రహముగా జూపబడుచున్నది.

ఆ సాధనరూప హఠయోగము, దాని ఫలరూప *165. రాజయోగము అనువాని సంగ్రహమును శాస్త్ర గురు కృపవలన వ్రాయుచున్నాము.

వానిలో హఠయోగము ఇది యగును:-

*166. నేతి, *167. ధౌతి, *168. గజక్రియ *169. నౌలి, *170. భస్తి *171. త్రాటకము, *172. కపాలభాతి, (భస్త్ర) *173. వజ్రోలి,

---

*165. ఇట హఠయోగముయొక్క ఫలమయినందున జ్ఞానక్రియలు రెంటిచేతను సాధింపబడు రాజయోగము చేకొనబడును.

*166. ఎలుకతోకవంటి అనేక నూలుపోగులచే జేయబడిన త్రాటిని క్రమముగా నాసిక రెండు ద్వారములందును ప్రవేశింపించి పై నోటిద్వారపు మార్గమున నోటినుండి యెత్తుట నేతి యగును.

*167. ధౌతి:- 1. జలధౌతి, 2. సూత్రధౌతి, 3. వస్త్రధౌతి, 4. పవనధౌతి అను భేదములచే ధౌతి క్రియ నాల్గు విధములగును.

1. మిరియాలు తిని కొంచెము వేడిగా నుండు రెండుఅళాకు వేడినీళ్లు త్రాగి పిమ్మట యుక్తిచే నాజలమును బయటికి రప్పించుట జలధౌతి యగును.

2. నూలుచే జేయబడిన ఒకటింపాతిక మూర పొడవుగల త్రాటిని నోటి మూలముగా కడుపువరకు వేసి ఆడించి బయటికి తీయుట సూత్రధౌతి యనబడును.

3. నాల్గులేక అఱుంగుళముల వెడల్పును ఎనిమిది లేక పదునారుమూరల పొడవును గల మఖ్ మల్ లేక జగన్నాధి అనువస్త్రపట్టను నీటియందు తడిపి నోటితో మ్రింగి కడుపున వేసి పిమ్మట నోటికి బైట నుంచబడిన కొనచే ధైర్యముగా నీడ్చి బయటికి వచ్చునట్లు చేయుట యేదియో యది వస్త్రధౌతి యగును.

4. రెండు పాదములమీద గూర్చుండి కంఠమును లేవనెత్తి కొంచెము తెఱచిన నోటితో గాలిని ఈడ్చి లోపల నిండించి మరల ధైర్యముగా విడుచుట పవనధౌతి యగును. (పవనము=వాయువు)

*168. ముందు చెప్పిన జలధౌతి యగును.

*169. నీటిఅలవలె (చుట్టెడు అల) కుడి యెడమభాగముల కడుపును చుట్టుట నౌలి యగును.

*170. గుదమార్గమున నీటిని ఎక్కించి మరల విడుచుట భస్తి యగును.

*171. నేత్రములచే కనుసోగల మధ్యయైనను లేక వేఱుసమీపమందున్న పదార్థము నైనను కన్నీరు పడువఱకు చూచుట త్రాటక మగును.

*172. కమ్మరితిత్తివలె వేగముగా రేచక పూరకములు చేయుట కపాలభాతి యగును.

*173. గుహ్యేంద్రియ మూలమున జలము మొదలగు వానిని ఈడ్చి, విడుచుట వజ్రోలి అగును. దీనినే వజ్రోలిముద్ర యనియు జెప్పుదురు.

(cont...)

*174. సంగ్రప్రక్షాళనము, *175. విపరీతకరణి అను క్రియలు రోగములను; మేధస్సు కఫము, పిత్తము మొదలగు మలములను నివర్తించు మూలమున శరీరకోష్ఠమును శోధించు (శుద్ధిచేయు)ట కొఱకు మొదట సిద్ధిచేయవలయును. వానిలో నేతి మొదలగు ఆఱుక్రియలును మొదట ఉపయోగము. అయితే ఎవని శరీరమందు మేధస్సు కఫము అధికముగా నుండదో వానికాక్రియలు లేక కేవల ప్రాణాయామ అభ్యాసముచేతనే శరీరశోధనయును నాడీశోధనయు గలదు.

కొందఱు నీటియందూరిన కరక్కాయలను తిని గడుపుటచే శరీరశుద్ధిని జేయువారై *176 బిందుదర్శనము మొదలుగా అభ్యాసపూర్వకముగా ప్రాణాయామముయొక్క అభ్యాసమును నారంభించుచున్నారు. వారును సిద్ధిబొందెదరు.

మఱికొందఱు *177 జాలంధరబంధ అభ్యాస మాత్రముచే ప్రాణముమీద బోవునదియైన సిద్ధిని బొందెదరు.

వీర్యస్థానమును శోధించుటకొఱకు వజ్రోలిక్రియయు గావలసిన దగును. సమాధికాలమున శరీరమున మిగిలియుండు మలమును బోకార్చుటచే జాలకాలమువఱకు సమాధి నెలకొని యుండుటవఱకు సంగ్రప్రక్షాళనక్రియయు

---

*174. నోటితో జలమును ద్రాగి మూలద్వారముచే బయట విడుచుట సంగ్రప్రక్షాలన మగును.

*175. భూమియందు తలనుంచి రెండుచేతులతో నడుము పట్టుకొని పాదములను నిరాధారముగానుంచి (తలక్రిందులుగా నుండుట) విపరీతకరణి. దీనినే విపరీతకరణిముద్ర యనియు చెప్పుదురు.

*176. పద్మాసనముచేర్చి షణ్ముఖిముద్రచే రెండు అంగుష్ఠములచే మూయబడిన రెండు చెవులచేతను పదివిధముల నాదములు వినబడుచున్నవి. రెండు చూపుడువ్రేళ్ళచే మూయబడిన నేత్రముల ప్రకాశరూప బిందుదర్శనము గలుగుచున్నది. రెండు నడిమివ్రేళ్ళచే నాసికను రెండు ఉంగరపు వ్రేళ్లచేతను, రెండు చిటికెనవ్రేళ్లచేతను నోరు మూయబడగా కుంభకము కలుగుచున్నది. పిమ్మట రెండుచేతులను విడుచుటచేత నేత్రమున కెదుట కంటినీరు కారువఱకు బిందుదర్శనముచే త్రాటకము కలుగుచున్నది. ఇది బిందుదర్శనాది అభ్యాసము.

*177. పద్మాసనము చేర్చి దవడను గడ్డములను రొమ్మున జేర్చి నాలుకను త్రిప్పి పైనోటి ద్వారమును పొందించి నోటిని బంధించుటచే శ్వాసనిరోధము గలుగుచున్నది. ఇది జాలంధరబంధము.

గావలసినది. కుంభకవృద్ధికొఱకు కపాలభాతియు గావలెను. బహు అన్నమును పాకము చేయు విపరీతకరణితలనుండి స్రవించు అమృతమువంటి పానము చేయుకొఱకు గావలయును.

ప్రాణాయామమున నుపయోగమగు *178. మూలబంధము, *179 .ఉడ్యాణబంధము, *180. జాలంధరబంధము, *181. జిహ్వాబంధము- అనువానిని *182. చిత్తము, *183. పద్మము, *184. మత్స్యేంద్రము, *185. పశ్చిమతానము, *186. మయూరము మొదలగు ఆసనములు, *187. ముద్రలు మొదలగు వానిని అభ్యాసముచే సిద్ధి చేసికొనవలయును.

---

*178. పాదపుగుదికాలును ఆసనముక్రింద అణచి మూలద్వారమును నిరోధించుట మూలబంధ మగును.

179. నాభివఱకు కడుపును లోపలికి ఈడ్చుట ఉద్యాణబంధ మగును.

180. ఇది ముందే చెప్పబడినది.

181. నాలుకను త్రిప్పి పైనోటి ద్వారమున జేర్చుట జిహ్వాబంధ మగును.

182. ఎడమకాలి మడమను ఆసనమునకు క్రింద అణచి కుడికాలి మడమను లింగమునకు పైననుంచి కూర్చుండి శరీరమును దండమువలె నిలిపి చూపును (భ్రూమధ్యమున) నిలుపుట సిద్ధాసనము.

183. కుడుకాలు మడమను ఎడమ తొడక్రింద నుంచి అట్లే ఎడమ మడమను కుడితొడక్రిందనుంచి ఎడమ కుడిచేతులచే ఎడమ కుడిపాదముల పెద్ద (బొటన) వ్రేళ్ళనుబట్టి చూపును నాసికకొనభాగమున నిలుపుట పద్మాసన మగును. ఈ యాసనమును మార్చియు చేయవచ్చును.

184. ఎడమతొడ క్రింద నుంపబడిన కుడిపాద మడమను ఎడమచేత చేపట్టి కుడికాలి మోకాలియందుంచబడిన ఎడమపాదపు అంగుష్ఠమును కుడిచేత బట్టుకొని కూర్చుండుట మత్స్యేంద్రాసన మగును. ఈ యాసనము చేతులు కాళ్ళు మార్చి.యుండియు క్రమముచేతను గలుగును,

185. రెండుపాదములను దండమువలె జాచి రెండుచేతులచే రెండుకాళ్ళ బొటనవ్రేళ్ళను పట్టుకొని నెత్తిని మోకాలిమీద నుంచుట పశ్చిమతాన ఆసన మగును.

186. రెండుచేతులను భూమియందుంచి రెండు మోచేతులను నాభి కిరుప్రక్కల పొందుపఱచి శరీరమును నెమలికి సమానముగా నిరాధారముగా పైకెత్తి నిలుపుట మయూరాసన మగును.

187. ముద్రలు 1. మహాముద్ర, 3. మహాబంధము, 3. మహావేదము, 4. కేసరి, 5. ఉడ్యాణము 6. మూలబంధము, 7. జాలంధరబంధము, 8. విపరీతకరణి, 9. వజ్రోలి, 10. శక్తిచోలనము-

cont...

చెడిన అన్నము, అగ్నిసంగము, స్త్రీ సంగము-త్రోవనడచుట అను నాల్గింటిని హఠయోగి విడువవలెను. ప్రాకారపుగోడచే చుట్టబడినదియు, బావి యుండు నదియు నైన యింటినడుమ నుండు గుహయందు యోగి వాసము చేయ వలయును.

యమ, నియమములు; ముందుచెప్పిన ఆసనము- అను మూటిసిద్ధి పూర్వకముగా ప్రాణాయామము చేయవలెను.

అగర్భము సగర్భమను భేదములచే ప్రాణాయామము రెండువిధములు.

1. ప్రణవపు ఉచ్చారణ లేని ప్రాణాయామము అగర్భ మగును.

2. ప్రణవపు ఉచ్చారణతో గూడిన ప్రాణాయామము సగర్భ మగును.

వానిలో సగర్భ ప్రాణాయామము శ్రేష్ఠము. కావున దానినే చేయవలెను.

మఱియు నాప్రాణాయామము 1. పూరకము 2. కుంభకము, 3. రేచకము అనుభేదములచే మూడువిధములు.

1. మొదట చంద్రనాడిచేతను, పిమ్మట సూర్యనాడిచేతను శ్వాసమును నిండించుట పూరక మనబడును.

2. పూరించిన శ్వాసమును నిలుపుట కుంభక మనబడును,

3. నిల్పిన శ్వాసమును ధైర్యముగా విడుచుట రేచక మనబడును.

వానిలో మాత్రావిశేష నియమము గావలెను. *188 ప్రణవోచ్చారణము మొదలగు కాలములలో,నొకదాని కాలమునకు మాత్ర యనిపేరు. ఎన్ని మాత్రలచే

అనుపదియు హఠయోగముద్ర లగును. వీని లక్షణములు యోగగ్రంథము లందును (హఠయోగ ప్రదీపిక మొదలగువానియందు) ప్రసిద్ధముగా నున్నది. కావున విస్తరభీతిచే ఇట వ్రాయబడలేదు.

*188. ఒక ప్రణవమును ఉచ్చరించుటలో నెంతకాల మగునో అది యొక మాత్ర యగును. అట్లే మొదలగు అనుపదముచే చిటిక వేయుటలో చేతితో మోకాలిని చుట్టుట మొదలగు కాలమును చేకొనబడును.

పూరకము చేయబడుచున్నదో దానికి నాలుగింతలు మాత్రలచే కుంభకము చేయవలయును. పూరకమాత్రలకు రెండింతల మాత్రలచే రేచకము జేయవలయును.

ఉదయము, మధ్యాహ్నము, సాయంత్రము, అర్ధరాత్రి అనునాల్గు కాలముల క్రమముగా అధికమధికముగా ప్రాణాయామము చేయవలెను.

ఈవిధమున ధైర్యముగా అభ్యాసము చేయుచుండిన ఎప్పుడు ఉత్తమ ప్రాణాయామమును పొందుచున్నాడో అప్పుడు ఉదయమున అఱువది ప్రాణాయామములును, మధ్యాహ్నమున నలువది ప్రాణాయామములు; సాయంకాలము, అర్ధరాత్రికాలముల ఇరువదిరువది ప్రాణాయామములను జేయవలయును.

లేక యేకాలములందును సమానముగానే యెనుబది ప్రాణాయామ ములను జేయవలయును. అయితే మొదటి పక్షక్రమము ఉత్తమ మయినది. ఇట్లు పూర్ణ అభ్యాసము కలుగ ఎప్పుడు కుండలిని మేల్కొనుచున్నదో, దానిముఖము దెఱవబడ ప్రాణముమీద బోవుటను పొంది పిమ్మట క్రిందబోయి పిమ్మట మెడవెనుకగా ప్రాణము, మీదబోవుటను జేయుచున్నదో అప్పుడు, మూలబంధము, జాలంధరబంధము జిహ్వాబంధములను దృఢము చేయవలెను. నాలుకకు కవాటమును (మూయ) పొందించవలెను.

ఇట్లు ఎప్పుడు సంపూర్ణ అభ్యాసము కలుగుచున్నదో అప్పుడు సమాధి సిద్ధించుచున్నది. పిమ్మట అభ్యాసదృఢత్వముచేత మనస్సు నిరోధమగు రాజయోగము సహజముగా సిద్ధించుచున్నది. అయితే దీనియందు సమాధిసిద్ధిని పొందిన గురువు సన్నిధి కావలెను.

గురువు లేక స్వతంత్రముగా నీయోగమును జేసినవానికి రోగముచే బొందు లేక మరణము గలిగించు దుఃఖము గలుగును.

అట్లే శ్రద్ధతోగూడిన సామర్థ్యము గల సాధకునియొక్క అపేక్షయు గలదు. ఏలయన అట్టివాడు గాక తక్కినవారిచే నిర్వహింపజాలడు.

ఎవని చిత్తము శాంతమగు నెద్దువలె సంచలనము లేనిదై స్వాధీనమై యున్నదో వానికి శ్రీ అపరోక్షానుభూతియను గ్రంథమున చెప్పబడినట్లు ప్రతిదినము ఘటికలు, ముహూర్తము, జాముపర్యంతము బ్రహ్మాభ్యాస మాత్రముచే నిర్వికల్ప సమాధియగు రాజయోగముయొక్క సిద్ధి కలుగుచున్నది.

ఎవని చిత్తము మదించిన యెద్దువలె మిక్కిలి సంచలనము గలదై స్వాధీనము లేకయున్నదో వానికి దండముచే బలముగా మర్దించిన ఎద్దును ఇంట ప్రవేశింపజేయుటవలె రాజయోగమగు నింట బలాత్కారముగా ప్రవేశింపజేయు కొఱకు ప్రాణనిరోధమగు హఠయోగము కావలెను. కావున శ్రీ ఆదినాథుడు (శ్రీమహాదేవుడు) మత్స్యేంద్రనాథుడు, గోరక్నాథుడు మొదలగువారు స్వతంత్రముగా హఠయోగమును ప్రకటన జేసియున్నారు.

ఈకాలమున అధికారులు లేనందునను, సంప్రదాయమునుండి జారుటవల్లను నీహఠయోగము సాంగోపాంగముగా బొందుట యరుదైనను, ఒక విరక్తపురుషుని యొక్కొక్క *189 అంగపుసిద్ధి గలుగుచున్నది. ఇది సంక్షేపముగా హఠయోగము చెప్పబడినది.

ఇప్పుడు రాజయోగమును జెప్పుచున్నాడు:- 1. జ్ఞానసాధ్యము 2. క్రియాసాధ్యము, 3. జ్ఞానక్రియా ఉభయసాధ్యము-అను భేదములచే రాజయోగము మూడువిధములు. (సాధ్యమువసాధింపబడునది) (ఉభయమువరెండు)

1. శుద్ధచిత్తము గల పురుషుడు శాస్త్రముచేతను, గురుకృపచేతను, బ్రహ్మాత్మైక్య నిశ్చయమగు తత్త్వజ్ఞానమును బొంది, జీవన్ముక్తి విలక్షణానందము యొక్క అనుభవముకొఱకు సకల ప్రవృత్తులను విడిచి, ఏకాంతమగు చోటనుండి బ్రహ్మాకారవృత్తిని అభ్యాసము చేయవలెను. దానివలన సిద్ధించు నిర్వికల్ప సమాధిని జ్ఞానసాధ్య రాజయోగ మందురు. దీనినే సహజ సమాధియనియు జెప్పుదురు.

---

*189. ఆయుక్రియలు అనేక ఆసనములు, ముద్రలు మొదలగు అంగములందు ఒక్కొక్క అంగముయొక్క సిద్ధి కలుగుచున్నది. దానినే పూర్ణముగా నభ్యసించుటచే యోగమంతయు తానే సిద్ధించుచున్నది. ఇది "యోగమునకు గురుయోగమే" అను పతంజలి భగవంతునిచే జేయబడిన యోగసూత్రవ్యాస భాష్యమున జెప్పబడియుండుటచే.

ఇది గీతయొక్క ఆఱవ అధ్యాయమున శ్రీకృష్ణభగవానులచేతను, అపరోక్షానుభూతి యందు శ్రీశంకరాచార్యులవారిచేతను నిరూపణము చేయబడియున్నది. దీని అంగములును అట వ్రాయబడియున్నవి.

దీని విశేష అభ్యాసముచేత రజోగుణ తమోగుణములకు తిరస్కారము గలిగి, సత్త్వగుణ ఆవిర్భావముచేత ఐదవ, ఆఱవ, ఏడవ, జ్ఞానభూమికల పూర్వకముగా వాసనాక్షయమును, మనోనాశమున్ను (రజస్తమోగుణములచే సత్త్వగుణము మూయబడియుండుట యగు మనస్సుయొక్క స్థూలత్వముయొక్క నాశమును) సిద్ధించుచున్నవి.

2. ఇప్పుడు క్రియాసాధ్య రాజయోగమును జెప్పుచున్నాడు:- పదునాలేండ్ల మొదలు ఇరువదేండ్ల వయస్సు గలవాడును, దోషములేని మృదువులగు కేశములతో గూడినవాడును, మంచి చిత్తముతో గూడినవాడును, శుద్ధబుద్ధి గలవాడును; ఆచార్యునికంటె బలమందును, బుద్ధియందును, అధికారమందును తక్కువ యైనవాడును, రోగము లేనివాడును నయి-ఇట్టి తక్కిన గుణములు గలవాడు ఉత్తమ అధికారి యగును.

లేక ఇరువదొక్క యేండ్ల మొదలు ముప్పదియేండ్ల పర్యంతమునైన వయస్సు గలవాడును, అధికదోషములేని మధ్యమ కేశములు గలవాడును, మధ్యమ చిత్తముతో గూడిన వాడును, మధ్యమబుద్ధి గలవాడును; ఆచార్యునికంటె బలమందును, బుద్ధియందును, అధికారమందును సమత గలవాడును; రోగము లేనివాడును నయి-ఇట్టి వేఱుగుణములును గలవాడు మధ్యమ అధికారి యగును.

లేక ముప్పదొక యేండ్ల మొదలు నలువది యేండ్ల పర్యంతము నగు వయస్సు గలవాడును, దోషముతో గూడినవాడును, కఠిన కేశములు గలవాడును, కఠినచిత్తము గలవాడును, శుద్ధిచే తక్కువ యయిన బుద్ధి గలవాడును; ఆచార్యునికంటె బలమందును, బుద్ధియందును, అధికారమందును అధికమయినవాడును, రోగములేని వాడునయి-ఇట్టి ఇతర గుణములును గలవాడు కనిష్ఠ అధికారి యగును.

సంకల్పమును గలిగించు సకల ప్రవృత్తులను విడిచి స్వల్పసాత్త్విక ఆహారము గలవాడై, జితేంద్రియుడై శబ్దము మొదలగు అడ్డములు లేనిదియు, దోమలు మొదలగు జంతువులు లేనిదియు,గాలి ధారాళముగా వచ్చు నదియు నయిన ఏకాంతప్రదేశమున బూరుగప్రత్తి మొదలగు వానిచే నయిన ఆసనము పఱచి, దక్షిణదిక్కును జూచి గూర్చుండి గురువుచే చెప్పబడిన నియమమం దుండువాడై మొదట సమాధి సిద్ధించిన గురువుగారి చేతిక్రియచే ప్రేరేపింపబడిన శక్తిచేతను, పిమ్మట అయస్కాంతము మొదలగు నిమిత్తముచేతను ఏసమాధిని సిద్ధిచేయుచున్నాడో అది క్రియాసాధ్య రాజయోగ మగును. పద్మపురాణమందుండు ఐదవ అధ్యాయరూప కపిలగీతయందు చెప్పియుండు లక్ష్యయోగమున్ను దీనియందణగును.

దీనికి **1.** స్వప్నము, **2.** సుషుప్తి, **3.** కోరబడువస్తువు, జ్ఞానసామర్థ్యమగు ఆంతరజాగ్రత్త **4.** తురీయము మొదలగునవి భూమికలు అగును. నాల్గవ భూమికను పొందుటచే నీ సమాధి (యోగనిద్ర) సిద్ధించుచున్నది. దీనియందు హఠయోగమందువలె శరీరము శవమువంటి దగుచున్నది. అయితే హఠసమాధి యందు నాడియొక్క విస్తృతము పోవుచున్నది. పదియవద్వారమున ప్రాణము స్థిరముగా నుండుటచే ఈ సమాధియందు నాడియొక్క విస్తృతము ఉన్నది. ప్రాణము సూక్ష్మరూపమున ప్రసిద్ధమయి యుండుటవలన ఇది వాని భేద మగును. ఈ సమాధి అజ్ఞులు (అజ్ఞానులు), తత్‌జ్ఞులు (జ్ఞానులు)- రెండు తెగల వారికిని సిద్ధించును. దీనిని అధికముగా నభ్యసించుటవలన చిత్తము అతిశుద్ధము (సాత్త్వికము) అగుచున్నది.

దీనియందు ఒకరికొకరు మరగిన సిద్ధసాధకుల సహవాసము కావలెను. అది లేకయుండిన గొప్పదుఃఖ మయినను లేక ఒకవేళ శరీరమునుండి ప్రాణము బయటవచ్చుట యైనను గలుగును.

సిద్ధిపొందిన గురుసాన్నిధ్యము లేక ఈ రాజయోగము దేనిచే సిద్ధిపొందదో, చేయదగినదియు గాదో అందుచే శాస్త్రములయందు దీనిని స్పష్టముగా

వ్రాయలేదు. ఇందుచేతనే మేమున్ను దీనిని విస్తారముగా జెప్పలేదు. సంగ్రహముగా చెప్పితిమి.

3. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సవికల్పసమాధులు- అను అష్టాంగములును సిద్ధించిన పిమ్మట లయము, విక్షేపము కషాయము, రసాస్వాదము- అనునాల్గు విఘ్నములను విడిచి, లేచు సంస్కారమును జెఱచి, నిరోధసంస్కారమును బయలుపరచు పూర్వక త్రిపుటి భావము లేని బ్రహ్మాకార వృత్తియొక్క స్థితియగు నిర్వికల్పసమాధి జ్ఞానక్రియ ఉభయసాధ్య రాజయోగ మగును. ఈకాలపు మనుష్యులకు ఈరాజయోగము మిక్కిలి దుర్లభమైనను పుణ్యముచే పరిపక్వము పొందిన యోగభ్రష్టుడు ఎవనికైనను కొంచెము కలుగును. దీనిని మిక్కిలి అభ్యసించుటచే క్రమముగా నైదవ, యారవ, యేడవ భూమికల ప్రాప్తి కలుగును.

జీవన్ముక్తి విదేహ ముక్తులన్ననో బ్రహ్మాత్మల యైక్య నిశ్చయమైన తత్త్వజ్ఞానము చేతనే కలుగుచున్నవి. కావున తత్త్వజ్ఞానము కొఱకైనను, జీవన్ముక్తి విదేహముక్తి కొఱకైనను, విద్వాంసుడు చేయవలసినది యొక్కటియు లేదు. అట్లయినను వైరాగ్యము, బోధము, ఉపశమము-అనుమూడును ఒకేచోట నుండుటకు, హేతువుగా జెప్పబడు ఈ యభ్యాస మేదియో యది జీవన్ముక్తి. *190 విలక్షణానందమును గోరు అకృతోపాసకుడగు (జ్ఞానమునకు ముందు

190*నిరావరణమయి, పరిపూర్ణమయి వృత్తితో గూడినదయి యుండిన దేదియో యది విలక్షణానంద మనబడుచున్నది. సుషుప్తియందుండు ఆనందము ఆవరణముతో గూడినదయి యున్నది. విషయమందున్న ఆనందము నిరావరణమయి యున్నదయినను విషయపు ప్రాప్తి క్షణమున నెప్పుడు అంతర్ముఖవృత్తి కలుగుచున్నదో, అప్పుడు దానియందు స్వరూపానంద ప్రతిబింబము పడుచున్నది. కావున పరిపూర్ణము కాదు. అయితే ఏకదేశమందుండునదిగా నున్నందున పరిచ్ఛిన్న మగును. అట్లే పూర్ణానందమో అజ్ఞానియొక్క స్వరూప మగును. అట్లయినను అది నిరావరణమును నెదురుముఖవృత్తితో గూడినదియు గాదు. విదేహముక్తియందున్న నిరావరణ పూర్ణానందము వృత్తితో గూడినది కాదు. వృత్తి లేనిదగును. కావున నిరావరణమున్ను, పరిపూరణమున్ను వృత్తితో గూడినదియు నయిన ఆనందరూపము విలక్షణానంద లక్షణ మగును. దీనియందొక చోటను అతివ్యాప్తి మొదలగు దోషము లేదు.

(cont...)

పూర్ణమగు సగుణ నిర్గుణ ఉపాసనలు లేని) విద్వాంసునకు కర్తవ్య (చేయవలసిన దను) బుద్ధి లేకయే తనయిచ్ఛ చొప్పున చేయదగినది.

124. ముందు చెప్పిన శిష్యునికి హఠయోగపూర్వకముగా రాజయోగమును జేయుటవలన నేమి ఫలము కలిగెనన చెప్పబడుచున్నది.

ముందు చెప్పిన శిష్యుడు జీవించియుండు అవస్థయందు ప్రియముతో గూడిన జీవన్ముక్తియొక్క విలక్షణానందమును అనుభవించెదరు.

మరల ఎప్పుడు ప్రారబ్ధ కర్మమునకును అంతము కలిగెనో అప్పుడు శాస్త్రమున జెప్పబడినట్లు గంగ మొదలగు తీర్థముల తీరమగు పవిత్రదేశమందును, ఉత్తరాయణము మొదలగు పవిత్రకాలములయందును బ్రహ్మధ్యాన పూర్వకముగా దేహమును విడిచెను.

విద్వాంసునికి దేహమును విడుచుటలో నొకదేశము, కాలము మొదలగు వాని అపేక్ష అవశ్యము లేదు. అయినను యోగాభ్యాసముయొక్క ప్రబలత్వముచే వాడు శాస్త్రమందు జెప్పినట్లు దేహమును విడిచెను. కర్తవ్యబుద్ధిచే గాదు.

125. ఇప్పుడు గ్రంథకర్త గ్రంథమును సమాప్తి చేయువాడై గ్రంథముయొక్క ఫలరూప మోక్షమును జెప్పుచున్నాడు:-

ఈ ముందు చెప్పిన విధమగు అద్వైతరసమును త్రాగువానికి శుద్ధ బ్రహ్మముయొక్క ప్రాప్తియగు సుందరముక్తి గలుగును. పిమ్మట దేహధారణయగు జన్మము కలుగదు. ఏలయనగా,

దేనిచేత జన్మమగు గర్భము గల అజ్ఞానము మొదలగు జగత్తు దృష్టియందు లేశమాత్రమయినను లేదో, అనగా జ్ఞానబలముచేత అత్యంతము నివృత్తి యగుచున్నదో, దానిచేత ఆ విదేహముక్తి పొందిన పండితునకు మరల జన్మము కలుగుట లేదు. ఇది యుక్త మగును.

విదేహమోక్షమందు జన్మాదివికార శూన్యమయిన విద్వాంసునకు స్వరూప మెక్కడిది? యన చెప్పుచున్నాడు- విదేహముక్తిని బొందిన విద్వాంసుడు శుద్ధ

సచ్చిదానందమయ స్వప్రకాశ బ్రహ్మరూప మగుచున్నాడు.

1. శంక:- విదేహమోక్షమును బొందిన విద్వాంసునికి జన్మాది వికారముతో గూడిన స్వసంఘాతరూప జగత్తు నివృత్త మయినను ఈశ్వరభావముయొక్క ఉపాధియగు మాయయును; దానిచే ఉపలక్షింపబడిన ఈశ్వరత్వమును; ఆ యీశ్వరునిచే జేయబడిన జగత్తున్ను- అను నీ మూడును మోక్షకాలమునందును మిగులుచున్నవి. కావున విద్వాంసునకు జన్మాదులకు కారణమయిన మాయయును; ఈశ్వరత్వమును; జగత్తును ఉండుటచే మరల జన్మ మొదలగువాని ప్రాప్తి కలుగును. కావున రాగల జన్మము మొదలగు వాని అభావరూప విదేహమోక్షము సిద్ధింపదు.

2. వేఱుశంక:- విదేహ మోక్షకాలమందు సకలానర్థముల నివృత్తియొక్క ముఖ్య స్వరూపముగా నయినను లేక అధిష్ఠాన మయియుండుటచే బాధచే స్వరూపముగా నయిన నుండు విద్వాంసుని ఆత్మరూపబ్రహ్మ మేదియో యది తెలియబడనిదా? లేక తెలియబడినదా?

1. తెలియబడనిదని చెప్పుదమన్నను విదేహముక్తి కాలమందును బ్రహ్మమునందు అజ్ఞాన ముండగా విద్వాంసునకు జన్మ మొదలగువాని అభావము సంభవింపదు.

2. ఆ బ్రహ్మము తెలియబడినదను రెండవ పక్షమును జెప్పబోయిన ఏవస్తువు తెలియబడినదో దానియందు ఘటమందు ఘటత్వమువలె జ్ఞాతత్వరూప ధర్మము అవశ్యముండును, ఆ, జ్ఞాతత్వరూప ధర్మము ఆ బ్రహ్మమునకు, విశేషణమా? లేక ఉపాధియా? యని రెండు వికల్పములు గలవు. వానిలో జ్ఞాతత్వమున బ్రహ్మముయొక్క విశేషణముగా నయినను ఉపాధిగా నయినను జెప్పిన *191 విశేషణ మయినది. *192 ఉపాధియయినను, వర్తమానకాలముననే

---

*191. విశేష్యముయొక్క కార్యసంబంధియై వర్తమాన వ్యావర్తక మేదియో యది విశేషణ మనబడుచున్నది. ఇది విశేషణముయొక్క లక్షణ మగును.

*192. ఉపహితముయొక్క కార్యసంబంధము లేనిదై వర్తమాన వ్యావర్తక మగున దేదియో యది ఉపాధి యనబడుచున్నది. ఇది ఉపాధి యొక్క లక్షణ మగును.

యుండి వేఱుపఱచి యెఱిగించునదియై యుండుటచే, విదేహమోక్ష కాలమందు అంతఃకరణముయొక్క వృత్తియగు జ్ఞానాభావముచే జ్ఞాతత, తాను లేనిదిగా బ్రహ్మము నెఱుగబడనిదే యగును. కావున విద్వాంసునకు విదేహమోక్ష కాలమందు జన్మాది వికారములు లేని అద్వైత బ్రహ్మభావముయొక్క ప్రాప్తి సంభవింపదు.

ఇవి రెండు శంక లగును. వీని సమాధానమిది:- మాయయు దానిచే ఉపలక్షింపబడు నీశ్వరత్వమును, ఈశ్వరునిచే జేయబడిన జగత్తున్ను; మోక్షమునకు హేతువగు జ్ఞానమును నగు నివి యన్నిటిని విడుచుటచే నా విద్వాంసుడు ఉండునట్లే యగుచున్నాడు. అనగా జన్మాది వికారములు లేని జ్ఞాతతచే ఉపలక్షింపబడు అద్వైత బ్రహ్మరూపముగా నిలుచుచున్నాడు.

1. ఇట మాయ, ఈశ్వరత్వము, జగత్తు-అనువానిని విడుచుటవలన అనుటచే ముందుచెప్పిన శంకకు సమాధానము చెప్పబడినది.

2. జ్ఞానమును విడుచుటచే ననుటచే ముందుచెప్పిన రెండవ శంకకు సమాధానము చెప్పబడినది. వానిలో,

1. మొదటి శంకయొక్క సమాధాన రహస్యమిది:-

(1) పదిమందికి రజ్జువునందు సర్పభ్రాంతి కలుగునపుడు ఎవనికి రజ్జువుయొక్క జ్ఞానము కలుగుచున్నదో వాని దృష్టిచే, తనకును నితరులకును భ్రాంతికి విషయమగు సర్పము అత్యంత నివృత్తి యగుచున్నది.

(2) ఎవరికి రజ్జువుయొక్క జ్ఞానము కలుగుట లేదో వారిదృష్టిచే భ్రాంతియొక్క విషయము అంతయు నున్నట్లే యున్నది.

(1) అట్లే ఎవనికి అధిష్ఠాన బ్రహ్మముయొక్క జ్ఞానము కలుగుచున్నదో వానిదృష్టిచే, తనకును నితరులకును భ్రాంతికి విషయమగు మాయయును నీశ్వరత్వమును జగత్తున్ను విడుచుచున్నది.

(2) ఎవరికి అధిష్ఠాన బ్రహ్మముయొక్క జ్ఞానము కలుగలేదో వారియొక్క దృష్టిచే మాయ, ఈశ్వరత్వము, జగము అనునవి స్వభావముగానే అనాదిసిద్ధమయి నెలకొనియున్నవి.

ఇది మొదటి శంకయొక్క సమాధాన రహస్యమిది:-

2. రెండవ శంకకు ముందు చెప్పిన సమాధాన రహస్యమిది.

కాకము వ్రాలియుండు దేవదత్తుని యింటికి కాకము ఉపలక్షణ మగును.

వర్తమానకాలమందును భావికాలమందును ఏది దేని వ్యావర్తకమై (యితరములనుండి వేఱుపఱచి యెఱింగించునది) అగునో అదిదాని యుపలక్షణ మగును.

కాకము వర్తమానకాలమున తనయుకిని గలదై భవిష్యత్కాలమున తన లేమి గలది యైనను ఈకాకము గల యిల్లు అనునదిగా నా దేవదత్తుని యింటిని తక్కిన కాకసంబంధము లేని యిండ్లనుండి వేఱుపఱచి యెఱింగించుచున్నది., కావున నాకాకి దేవదత్తుని యింటియొక్క ఉపలక్షణ మనబడుచున్నది. అట్లే విద్వాంసుని స్వస్వరూప బ్రహ్మము జ్ఞానమునకు విషయమయి యుండుటవలన జ్ఞాత యగుచున్నది. ఆ జ్ఞాతయగు బ్రహ్మముయొక్క జ్ఞాతత్వరూప ధర్మపు కల్పన కలుగుచున్నది. ఆ జ్ఞాతతా రూపధర్మము బ్రహ్మముయొక్క ఉపలక్షణ మగును అని మేము అంగీకరించియున్నాము.

దేనిచే జ్ఞాతత్వరూప ధర్మము వర్తమాన (జీవన్ముక్తి) కాలమందు తనయునికి గలదియై; భావికాలమందు తన లేమి గలది యైనను ఈ విద్వాంసుని స్వరూపరూప బ్రహ్మము జ్ఞాతము (జ్ఞాతత్వరూప ధర్మము) గలదగును.

ఈ విధముచే విద్వాంసుని స్వరూపరూప బ్రహ్మమును, అవిద్వాంసుల స్వరూపరూప అజ్ఞాత (అజ్ఞానముచే మూయబడిన) బ్రహ్మమునుండి వేఱుపఱచి యెఱిగించునదిగా నున్నందున అజ్ఞాతత్వ రూపధర్మము విద్వాంసుల స్వరూపరూప బ్రహ్మపు ఉపలక్షణ మగును. ఆ జ్ఞాతతారూప ఉపలక్షణముతో గూడిన కల్పితముయొక్క నివృత్తిరూప విద్వాంసుల స్వరూపమగు బ్రహ్మమేదియో యది జ్ఞాతతయొక్క యుపలక్షిత మనబడును.

ఈ విధముచే విదేహమోక్షకాలమందు జ్ఞాతత్వరూప ధర్మముయొక్క

అభావము గలదైనను ఈవిద్వాంసుని స్వరూపరూపబ్రహ్మము *194 జ్ఞాతమగును అని యన్యులచే వ్యవహరింపబడుచున్నది. విద్వాంసుల విదేహమోక్షకాలమందు ద్వైతము పొందుట లేదు. కావున మేము చెప్పునదంతయు శ్రేష్ఠ మగును.

తొమ్మిదవ యుపదేశము ముగిసెను. శ్రీ వేదాంత బాలబోధము సమాప్తము.

గరిమ, నీబాలబోధ మగ్రంథరాజ
మవని నేర్పేడు వ్యాసాశ్రమమున, వెలయు
తీర్థపాదులు మలయాళ దేశికులకు,
భక్తిపూర్వక వందనం - బాచరించి
వారియాజ్ఞానుసారంబు - వరుసను గొని
బాలబోధంబు నానొప్పు - భవ్యగ్రంథ
వరుస వే - కుప్పుస్వాములు - ధరను హింది
భాషయందుండు తమిళంబు పరగజేసి
నట్టి యే గ్రంథరాజంబు నయగుణనిధి
సద్గుణాళువు సంపూర్ణ సదయహృదయు
డైన కార్యూరిపుల్లెల - శంకరయ్య
నాయునిం గారు (మరియు) నింటూరి రామ
స్వామి నాయునింగారిసాయమునను
రమణగార్యూరి రామాశ్రమమున వెలయు
సరస శ్రీశివరాజానంద స్వామివారి
సవరణంబున నామూర్తి సార సుకవి
పాపయార్యుని పుత్రుడు- భక్తిరతుడు
నైన కృష్ణయ్య యాంధ్రాను వాదనంబు
జేసె నీయోగ శాస్త్రంబు శివునికరుణ

---

194. శుకులు మొదలగు మహాత్ములు బ్రహ్మజ్ఞాను లయిరి. ఇటు అన్యులందు ప్రసిద్ధిచే జ్ఞానుల స్వరూపరూప బ్రహ్మముయొక్క జ్ఞాతత్వముయొక్క వ్యవహారము కలుగుచున్నది.

యోగిజనులకు బాలప్రయోజనముగ
నుండి యాచంద్రతారార్క మలరుగాత !
సర్వే జనాస్సుఖినో భవంతు
ఓం తత్ సత్.

AHAM BRAHMASMI